చరిత్రకెక్కని చరితార్థులు

1439/193

రచయిత

డాక్టర్ బి. రామరాజు

1850/R

ప్రచురణ:



చరిత్రకెక్కని చరితార్థులు

(విస్మృత కవులు - కృతులు)

Acc. No: 22650

రచయిత

ఆచార్య బి. రామరాజు

ప్రచురణ

ఆచార్య బిరుదురాజు రామరాజుగారి

"Charitrakekkani Charitarthulu" a Collection of research articles written by Prof. B. Rama Raju.

©

928.94813
R.R.m

వెల : రూ. 80.00

1988

ప్రతులకు :-
బి. రామరాజు
1-8-117/2 చిక్కడపల్లి
హైదరాబాదు-500 020

ముద్రణ :
షష్యా ప్రింటర్స్, తిలక్‌నగర్
2-2-1167/6/1, హైదరాబాదు-500 044

ముందుమాట

ఈ గ్రంథకుసుమానికి మూలస్థానమై అది ఈనాడు విరిసి, వాసించడానికి కారణమైన సాహిత్యశాఖ సరిగా అరవైయేండ్లక్రిందట అప్పుడే మొనలెత్తిన రక్తపల్లవం. తెలుగుదేశంలో చిన్నచిన్న గ్రామాలు సంస్కృతి సుహృష్టానికి కాసిన అరముగ్గిన పండ్లు. ఆ ఫలసముదాయంలో వరంగల్ దరిదాపుల్లో ఉన్న రెండు గ్రామాలు ఈ సందర్భంలో పేర్కొనవలసిన గ్రామాలు. ఒకటి దేవునూరు, రెండోది మడికొండ. దేవునూరు గడ్డపైన ఎగిర్చిన తెంజిగురు శ్రీ వి. రామరాజు. మడికొండలో పెదనాన్న శ్రీ రాఘవరాజు పర్యవేక్షణలో ఈ చిగురే కవటాకై, అపూర్వ ఆంధ్రసరస్వతి ముంగిట తోరణపత్రమై రాణించింది ఆరోజుల్లో రాఘవరాజుగారి కుటుంబం జమీందారీ హయాలో నడిచేవి. రామరాజు గారి స్కూలు చదువు మడికొండలోనే ఆరంభమై ఆయ్యవరంగా అక్కడే ముగిసింది.

అప్పటి నైజాము రాజ్యంలో ఇంటర్మీడియట్ చదువు చెప్పే కళాశాలలు మొత్తం నాలుగే ఉండేవి. అందులో ఒకటి గుల్బర్గాలో, రెండోది ఔరంగాబాదులో, మూడవది హనుమకొండలో నాలుగవది హైదరాబాద్ నగరంలో; ఇప్పుడు ఉస్మానియా విశ్వవిద్యాలయ కళాశాలంగా రూపొందిన 'సిటీ కాలేజి'. రామరాజుగారు ప్రైమరీ స్కూలు చదువు ముగించుకుని, హనుమకొండ చేరుకున్నారు. మడికొండలో పుట్టి పెరిగి, ఈనాడు వివిధ రంగాలలో అంతో ఇంతో పేరు మిగుల్చుకున్న పెద్దలు కొందరు, రామరాజుగారికి సన్నిహితులు. అందులో ఒకరు అభినవపోతన బిరుదాంచితులు శ్రీ వానమామలై వరదాచార్యులుగారు ఆయనా, ఆయన సోదరులు మరో ఆయిదుగురూ, పండితకవులు. వరదాచార్యులుగారు పేరు మిక్కిలి కవిత్వనిధి — సౌహార్దమూ సౌజన్యమూ మూర్తీభవించిన మూర్తి. ఆయన కవితలో దురన్వయమూ, దుర్గ్రాహ్యలక్షణమూ లేనట్లే ఆయన పలుకులో కాఠిన్యం లేదు. ముఖంమీద ఎంత నిశితంగా వెదికినా, కాఠిన్యరేఖగానీ. మాత్సర్యచ్ఛాయ కానీ పట్టుకో లేము. మరొకరు శ్రీ కాళోజీ నారాయణరావు. "కాళోజీ అంటారు" — అంటూ, చక్కటి వరంగల్ నుడికారంలో ఆనాన్ని కవిత్వంలో ఉద్బోధించిన ప్రజాకవి కాళోజీ, అన్న గొప్పతనం కాళోజీ గొడవే, ఇంకొకరు డా. పల్లా

దుర్గయ్యగారు. దుర్గయ్యగారు ఉస్మానియా యూనివర్సిటీలో పనిచేసినవారు. కవితా హృదయం ఉన్నవారు. మంచి హాస్యప్రియత్వం ఆయనలో ఉంది. పన్ను కనపడనీయకుండా మాటలలో హాస్యరేఖల్ని విరియించి, తాను నవ్వనట్లే ఉండి ఇతరుల్ని నవ్వించగల నేర్పరి. ఒక్కసారి కలిస్తే పదేపదే ఆయన విసిరిన చెణుకుల్ని ఉస్మానియా తెలుగు కుటుంబంవారిమి మేమంతా నెమరు వేసుకుంటూనే ఉంటాము.

ఇటువంటివాళ్ళతో సాన్నిహిత్యంవల్ల రామరాజుగారికి సాహిత్య సౌగంధ్యం అబ్బింది. బ్రతుకుతున్నది ఏదో సాధించడానికే కాని కేవలం రోజులు గడపడానికి కాదన్న పట్టుదల ఏర్పడింది. హాస్యప్రియత్వం చేకూరింది. ఇంతేకాక, కళాప్రియుల్ని కొందర్ని కూడగట్టుకుని రామరాజుగారు నాటకాలు ఆడడం కూడా అప్పుడే మొదలుపెట్టారు. గయోపాఖ్యానం ఆయనకు నచ్చిన నాటకం. అప్పుడు ఇంటర్ పరీక్షలు, ఏ కాలేజీలో చదివే విద్యార్థి అయినా హైదరాబాద్ సిటీ కాలేజీలోనే వ్రాయవలసి వచ్చేది. తీరా పరీక్షలకు వెళ్ళేనాటికి విద్యార్థికి టైఫాయిడ్ జ్వరం. రామరాజుగారు ఇంటర్మీడియెట్ ఆఖరుపరీక్ష సంస్కృతానికి హాజరుకాలేకపోయారు. అందువల్ల 1046-43 లో ఇంటర్ పూర్తి చెయ్యనందువల్ల ఆ సంవత్సరం రికామీగా ఉండిపోవలసి వచ్చింది. ఆ రోజుల్లో మెట్రిక్‌దాకా చదువుకున్న వాళ్ళకో సౌకర్యం ఉండేది. వాళ్ళు ఒక సంవత్సరం న్యాయశాస్త్రం చదివి, చిరు డిగ్రీ ఒకటి తీసుకొని చిన్న కోర్టుల్లో పని చేసుకోవచ్చు. ఊరికే ఉండడం ఎందుకని రామరాజుగారు 'లా' చదివారు. అంతేకాక, అప్పటి హైదరాబాద్ సివిల్ సర్వీస్ కమిషన్ పరీక్షకు కూర్చుని అందులో సెలక్షన్ తెచ్చుకున్నారు. ఆ సెలక్షన్‌వల్ల తొలిసారిగా ఉద్యోగం, గెజిటెడ్ హోదాలో, జిల్లా పంచాయితీ ఆఫీసరుగా వచ్చింది. దాన్నే అంటిపెట్టుకుని ఉంటే ప్రభుత్వంలో మంచి పదవిలోనికి వచ్చి ఉండేవారు. అప్పటి రామరాజుగారితో పాటు ఎన్నికైన వారే ముఖ్యకార్యదర్శిగా పనిచేసిన బి. యస్. రామన్, ఐ.జి.పి. మహేందర్ రెడ్డి మొదలైనవారు.

ఇక్కడో విషయం చెప్పాలి. ఇంటర్ పూర్తి చేయడానికి, హైదరాబాద్‌లో ఉన్న కాలంలో ఆయనకు బాగా సహాయం చేసినవారు N. K. రావుగారనే ఒక సహృదయుడు. ఆయన ఇల్లు మొజాంజాహీ మార్కెట్ దగ్గర,

అక్కడే సంస్కృతభాషా శిరోమణి శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రిగారు, శ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారు ఉండేవారు. రామరాజుగారు ఆ ప్రదేశానికి రాకపోకలు చేయడంవల్ల ఈ దిగ్గంతులతో పరిచయం ఏర్పడ్డది. అనగా, ఒకవిధంగా ఈయన వకీల్ చదువు సాహిత్యకులతో పరిచయం పెంచుకోగల అనుసంధానవిషయంగా ఏర్పడ్డది అందుకు కారణం పరోక్షంగానైనా సరే, శ్రీ ఎస్. కె. రావుగారు. శ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారికి రామరాజుగారు శిష్యుడు కావడం ఆ రకంగా జరిగింది. ఇంటర్‌మీడియట్ దశలోనే ఆయనదగ్గర ఈ శిష్యుడు బరువైన పాఠాలు చెప్పించుకోవడం జరిగింది. ఆయనకు మిక్కిలి ప్రియమైన విషయం తాళపత్రగ్రంథ సేకరణ, శోధన। అందులో ఆయనకు ఈయన కుడిభుజంగా, శక్తిమంతమైన సాధనంగా, ఉపకరణంగా నిలిచారు. ఈ గ్రంథంలో పరిశీలించిన చరిత్రకెక్కని చరితార్థులంతా ఆ తాళపత్ర గ్రంథాలనుండి ఆవిష్కరింపబడినవారే. ఆ రకంగా, నివురుగప్పిన నిప్పులా లోలోన దాగున్న రామరాజుగారి ప్రతిభను ఉజ్జ్వలం చేసిన స్థానం హైదరాబాదు. హస్తం శ్రీ సురవరం వారిది. ఈ విషయం రాజుగారే ఎప్పుడూ కృతజ్ఞతతో స్మరించుకుంటూ ఉంటారు.

మెల్లిగా ఇంటర్ ఒడ్డునపడి నిజాంకళాశాలలో బి. ఏ. చదువును చదవడం మొదలుపెట్టిన తరువాత, ఈయన ఉత్సాహం బహుముఖాలుగా ప్రతిఫలించింది. హైదరాబాద్ విద్యార్థిసమాఖ్యకు ఈయన అధ్యక్షుడు. శ్రీ బూర్గుల రామకృష్ణారావు, స్వామీ రామానందతీర్థ, శ్రీ కె. వి. రంగారెడ్డి ప్రభృతుల నేతృత్వంలో, ఒక కార్యకర్తగా ఉంటూ, వారితో సాన్నిహిత్యాన్ని పెంపొందించుకున్నారు. అప్పుడు హైదరాబాద్‌ను నిజాం ప్రభుత్వపు శృంఖలాలనుండి తప్పించే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతుండేవి. హైదరాబాద్ విమోచనం కొరకు, డా. మేల్కోటే నాయకత్వంలో గౌలీగూడా చమన్ దగ్గర ఒక సత్యాగ్రహం జరిగింది. అందులో పాల్గొని జైలు ఆతిథ్యం స్వీకరించిన ధైర్యశాలి రామరాజు. ఈయనలో చేపట్టిన పనిని, పిరికిపడకుండా కొనసాగించే ధీరలక్షణాన్ని ఆర్యసమాజం స్థాపించింది. అక్కడ ఉండే క్రమశిక్షణ, నియమయుత జీవనం ఈయనకు చాలా ఇష్టం. దీనికి తోడు చేపట్టిన కార్యాన్ని కొనసాగించడానికి విప్లవాత్మకపంథా అవసరమైనదే అనే అభిప్రాయం లోలోపల ఈయన పెంచుకున్నారు. ఒక విప్లవ వీరుడుగా తన్ను తాను ఊహించుకుని, ఉద్రిక్తకరచర్యల్లో పాల్గొనేవారు.

గూడ్సు బళ్ళు ఆపడం, రైలుపట్టాల ఫిష్ ప్లేట్లు తీయడం ఇట్లాంటివి. పొంగులెత్తే యువకరక్తపు తరకలు చూచి, దేశానికి మొదటిసారి ఎన్నికలు జరుగుతున్నప్పుడు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వజూపింది. కాని ఆయన రాజకీయ జీవితంలోకి తప్పటడుగులు వేయడానికి శ్రీ సురవరంవారు ఒప్పుకోలేదు అందువల్ల రాజాగారి రాజకీయప్రవేశం [illegible]గానే ఆగిపోయింది. కాని ఈ చర్య పుణ్యమా అని శ్రీ మాడపాటి హనుమంతరావుగారు, ఆదిరాజు వీరభద్రరావుగారు వంటివారితో సన్నిహితత్వం లభించింది. 1950 ప్రాంతాలలో రాజాగారు అఖిల భారత జాతీయ విద్యార్థి సంఘం పక్షాన బొంబాయికి ప్రతినిధిగా వెళ్ళి వచ్చారు. ఆ అనుభవం వారిలో కార్యదక్షతనూ వ్యూహరచననూ పెంపొందింపజేసింది.

1950 వరకూ హైదరాబాద్‌లో తెలుగుకు ప్రశస్తిలేని రోజులనవచ్చు. తెలుగులో మాట్లాడడం, వ్రాయడం ఎదుటివాడికి అనవగాహన లక్షణాన్నీ, తెలుగువాడికి ఆత్మహీనత్వ లక్షణాన్నీ పెంచిన కాలం అది. కళాశాలల్లో తెలుగు చెప్పేవారు కారు. చెప్పినా మొక్కుబడికోసం అప్రధానాంశంగా చెప్పేవారు.

ప్రభుత్వాన్ని ఎదిరించి తెలుగువారు తన భాషనూ, సాహిత్యాన్నీ పెంపొందింప చేసుకోవడానికి కంకణం కట్టుకుంటున్న రోజులు. అందుకై శ్రీ కృష్ణదేవరాయ ఆంధ్రభాషానిలయం, తెలంగాణా రచయితల సంఘం, ఆంధ్రసారస్వతపరిషత్తు ముప్పేటగా, ముమ్మరంగా పనిచేస్తున్న రోజులు. ఈ పవిత్రయజ్ఞంలో రామరాజువంటివారు మడమ తిప్పని వీరయోగ్యమైన కార్యదీక్షతో పాలు పంచుకుంటుండేవారు. నిజాం కళాశాలలో ఆంధ్రాభ్యుదయోత్సవాలను సుశిక్షితపద్ధతిలో నడిపిన చరిత్ర రాజాగారిది కాగా, మనోహరమైన వాణిలో తన వాణిని వినిపించి ఆహూత జనాన్ని ముగ్ధులను గావించిన ఘనత శ్రీ నారాయణరెడ్డి గారిది.

ఎం. ఏ. చదువుకు వచ్చినప్పుడు, శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనం గారి సాన్నిధ్యంలో రామరాజుగారికి ప్రత్యక్షశిష్యత్వం ఒనగూడింది. లక్ష్మీరంజనం గారు గోదావరీ తీరంలో పుట్టి, తియ్యని అంతరంగాన్ని పెంచుకున్న మనీషి. ఆయన, ఆ నీరు త్రాగి పెంపుగన్న ఆదికవి నన్నయకువలె, మనసు వెన్న; మాట కొంత వెన్నకంటె గట్టిది. లక్ష్మీరంజనం గారు పట్టుదల

మనిషి. చేపట్టిన కార్యాన్ని సాధించడంలో, ఆయన, అలసట ఎరుగరు. ఎవరికి ఇష్టమో, మరెవరికి అనిష్టమో తాను చేయదలచుకొన్నదాన్ని 'నిర్మొగమాటం'గా వెల్లడించడం ఆయన జీవలక్షణం. లోపల ఒకటి అనుకుని పైకి మరొకరీతిగా ప్రవర్తించే పద్ధతి ఆయనది కాదు. ఆయన, జీవితంలో ఏ కార్యాన్నయినా నిర్వహించడానికి ముఖ్యంగా మూడు అంశాలు ఉండాలనే వారు. అవి ఒకటి, ఏ పని చేయాలనుకున్నామో, దానిమీద ముఖ్యంగా చేసే వారికి చెదిరిపోని ప్రత్యయం ఉండటం. రెండు, అది చేసేవాడికి ఒక్కడికి మాత్రమే ఉపయోగపడేదిగా కాక, చుట్టూ ఉన్నవారికి, సమకాలంవారికి, ఉపయోగించడం. మూడు, ఒక పనిని నిర్వహించడానికి అనువైన కాలాన్ని ఎంచుకోవడం. ఈ త్రిపుటి ఒనగూడిననాడు ఎంత బృహత్తరపథకమైనా సులువుగా నిర్వర్తింపబడుతుందని నమ్మకమే కాక అందుకు దృష్టాంతంగా నిలిచే పనులు చేసినవారు శ్రీ లక్ష్మీరంజనం గారు. అటువంటి పనులలో తలమానికమైన ప్రచురణ మహాభారతానికి వారు తయారుచేసి యిచ్చిన "సంశోధిత ప్రతి." నాలుగైదు వందలతో ఆరంభమైన ఈ పని, కేవలంవారి కార్యదీక్షవలననే కొన్నిలక్షల ప్రచురణగా విస్తరిల్లి, సంపూర్ణమై, ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆంధ్రశాఖకు గర్వకారణమై రూపు దిద్దుకున్నది. అటువంటి లక్ష్మీరంజనంగారికి కూర్పు కుష్కరుడు రామరాజుగారు. ఆయనకార్యదీక్ష శిష్యుడికి కూడా సంక్రమించిందనడంలో అతిశయోక్తిలేదు.

ఒక గ్రంథానికి పీఠిక వ్రాయవలసి వచ్చినప్పుడు, సాధారణంగా గ్రంథగతవిషయవిశ్లేషణ చేయడం పీఠికాకర్తలు చేసేపని. అక్కడ చెప్పవలసిన విషయం, కవినిగురించి అయితుంటే బాగుండేదని నేను ఏ గ్రంథపీఠిక చదివినా అనుకుంటుండేదాన్ని. కవిరచన పాఠకుల ఎదుటే ఉంటుంది. కాని కవిజీవనవిశేషాలూ, ఆత్మవ్యక్తి, అభినివేశం, ఇష్టానిష్టాలు వంటివి ఉండవు. కవి జీవించిన దేశకాల నేపథ్య వివరాలుకూడా ఉండవు.

సమకాలికుల విషయంలో ఈ వివరాలు తెలుస్తాయి నిజమే. మరో వంద సంవత్సరాలకు, ఇటువంటి విషయాలు అక్షర బద్ధం చేయకపోతే,

అప్పటి పాఠకులకి తెలిసే దారి ఉన్నదా ? - గ్రంథస్థ విషయం ముంజేతి కంకణం, అయితే, ఇక దానికి అద్దం ఎందుకని నేను పీఠికను కవి పరిచయంలో పూర్తి చేస్తున్నాను.

ఆఖరుగా ఈ పుస్తకం ఈ రూపుకు రావడానికి ముఖ్యకారణం ఆచార్య బి. రామరాజు షష్టి పూర్తి సన్మాన సంఘ కార్యవర్గం. అందులో ప్రత్యేకించి, ఈ కార్యక్రమాన్ని భుజాలమీద వేసుకొని, భారాన్ని పూర్తిగా వహించి, జయప్రదంగా నిర్వహించడంలో శక్తియుక్తుల్ని చూపించినవారు ప్రధాన కార్యదర్శి డా॥ ఆర్. శ్రీహరిగారు. వారికి అండదండగా ఉండి ధనసేకరణలో శ్రమించిన వారు డా. ఆర్ మాధవరావుగారు. హైదరాబాదు అవతల, ఈ విషయమై శ్రమించినవారు డా. పేర్వారం జగన్నాథంగారు, డా. వల్లపురెడ్డి బుచ్చారెడ్డిగారు. వీరు నలుగురనేమిటి, ఈ కార్యక్రమాన్ని తమ యింటి శుభకార్యంగా భావించి, భారాన్ని భుజాలమీదికి ఎత్తుకున్న ప్రతివారూ నిజానికి; పేరు పేరునా ఇక్కడ స్మరించవలసినవారే—వారందరికీ, ఈ సన్మాన సంఘ అధ్యక్షురాలి హోదాలో నా అభినందనల్ని, కృతజ్ఞతల్ని అందిస్తున్నాను. 11–4–86 నాడు ఆంధ్ర సారస్వత పరిషత్తు భవనాలలో వైభవంగా జరిగిన ఆచార్య బి. రామరాజుగారి షష్టి పూర్తి సన్మాన కార్యక్రమంలో పాల్గొని, సభను విజయవంతం చేసిన శ్రీ యతిరాజారావు, శ్రీ దేవులపల్లి రామానుజరావు, ఆచార్య దివాకర్ల వెంకటావధాని, ఆచార్య సి. నారాయణరెడ్డి, ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావు, ఆచార్య తూమాటి దోణప్ప, శ్రీ కాణోతి సోదరులు, శ్రీ కేశవ పంతుల నరసింహశాస్త్రి, ఆచార్య కె. గోపాలకృష్ణారావు, ఆచార్య ఎమ్. కులశేఖరరావు గారలకు నా కృతజ్ఞతలు.

11-4-1985 నాడు జరిగిన షష్ట్యబ్దపూర్తి సన్మానసభలో ఆచార్య బి. రామరాజు గారిని,
వారి ధర్మపత్ని శ్రీమతి సూర్యదేవిగారిని ఆం. ప్ర. ప్రభుత్వ దేవాదాయ
ధర్మాదాయ శాఖామాత్యులు శ్రీ యతిరాజారావు గారు సన్మానిస్తున్న దృశ్యం

విషయసూచిక

తెలుగు విభాగము

రాజాబహిరీ పామనాయక భూపాలుడు	1- 5
బారిగద్పుల ధర్మయామాత్యుడు	6- 12
శేషభట్టరు సింగరాచార్యులు	13- 19
కొటికెలపూడి వీరరాఘవాచార్యుడు	20- 25
బోయినిపల్లి కుమార వెంకటరాయలు	26- 32
తురుమెళ్ళ రామన	33- 39
అనుగంట్ల కృష్ణప్రధాని	40- 43
పూదూరి కృష్ణయామాత్యుడు	44- 52
లయగ్రాహి గరుడాచలకవి	53- 60
నారగౌడు ముష్టిపల్లి వెంకటభూపాలుడు	61- 66
అక్తాను రామానుజాచార్యుడు	67- 70
సర్వజ్ఞ పద్మనాయకభూపాలుడు	71- 78
ఏదుట్ల శేషాచలుడు	79- 87
పొత్తపి వెంకటామాత్యుడు	88- 90
త్రిలోకభేరి	91- 96
గోపతి లింగకవి	97- 104
నేబతి కృష్ణయామాత్యుడు	105-116
పరశురామపంతుల లింగమూర్తి	117-123
పాల్కురికి సోమనాథుడు	124-132
వేముల రామభట్టు	133-143
కుందావఝ్ఝల గోపాలసూరి	144-149
శివరామ లింగరాజు	150-154

సంస్కృత విభాగము

[illegible]రగంటి లక్ష్మణయజ్వ.	155-163
సారంగు తమ్మయ	164-168
పరశురామపంతుల అనంతరామ పంతులు	169-175
తిట్టకవి లక్ష్మణకవి	176-180
దేవులపల్లి అన్నపూర్ణేశ్వరశర్మ	181-189
అయ్యవారు శాస్త్రి	190-197
పింగళి ముక్తాణిమంత్రి	198-206
చంద్రరట్ల ఈశ్వరప్ప	207-213
భారద్వాజ రామాచార్యులు	214-220
బాలసరస్వతి తిరుమల బుక్కపట్టణం శ్రీనివాసాచార్యులు	221-229
ఆలూరి సూర్యనారాయణ వాజపేయయాజి	230-235
పిల్లలమర్రి వెంకటపతిసూరి	236-240

తెలుగు విభాగము

[illegible]

రాజాబహిరీ
పామనాయక భూపాలుడు

పదునెనిమిదవ శతాబ్దము మధ్యభాగమున సురపుర సంస్థానమును వైభవోపేతముగా పాలించినవాడు రాజాబహిరీ పామనాయక భూపాల బిరుద విరాజితుడైన రాఘవ భూపాలుడు. ఈతడు పీతాంబర నాయక పౌత్రుడు; రమణ భూపాల పుత్రుడు; లక్ష్మమాంబా గర్భవనధి పిచిపుతల్లి రాకా సుధాకరుడు. ఈ సురపురమునకే తరువాత షోరాపురమని పేరు కలిగెను. ప్రస్తుతమిది గుల్బర్గా జిల్లాలో నున్నది (లక్ష్మణరాయ వ్యాసావళి పుట 88). సురపురమును బేడరు (నిర్భయు)లను తెలుగు నాయకులు పరిపాలించిరి. ఈ బేడరులు తొలుత అనాగరికులట. మైసూరునందలి రత్నగిరి దక్షిణ మహారాష్ట్రము వీరియాదిమ నివాసమట. (శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయ రజతోత్సవ సంచిక, పుట 83) ఈ రాజన్యులందు కడపటివాడు బాలుడుగా నున్నప్పుడు కల్నల్ మెడోస్ సంస్థానాధికారిగా నుండి రాజకుమారుడు పెద్దవాడైన తరువాత క్రీ. శ. 1853లో నాతనికి సంస్థానము నప్పగించెనట. ఈ రాజు 1857లో జరిగిన విప్లవమున పాల్గొనుటచే నాతనికి తొలుత మరణదండనము విధింపబడి హైదరాబాదులో బంధింపబడెను. పునర్విచారణమున ఐదేండ్ల కారాగారవాసము విధింపబడి రాయవేలూరునకు పంపబడెను. మార్గమధ్యమున నీ దేశభక్తుడు ఆత్మహత్య గావించుకొనెను. ఈ మహా విప్లవమున బ్రిటిషువారికి ఘన సాహాయ్య మొనర్చిన ఫలితముగా సురపుర సంస్థానము నిజాము సర్కారువారికి దక్కెను. సురపుర సంస్థానాధీశ్వరుల వంశీయులిప్పటికిని కలరట. ఆంధ్రేతిహాస పరిశోధక మండలివారి సంపుటము 18 సంచిక 1, 1940 లో డాక్టరు రాఘవన్‌గారు "సురపుర సంస్థానాధీశ్వరులు మరియు సంస్కృత రచయితలు" అను దీర్ఘమగు వ్యాసమును ప్రకటించినారు. దానిలో నీ సంస్థానమునకు సంబంధించినట్టి యమూల్య విషయములెన్నియో కలవు.

ఇట్టి వంశమున బుట్టిన పామనాయక భూపాలుడు కూడ శత్రు భయంకరుడు; "పరమ భాగవత భక్తి తాత్పర్య నిర్ణయుడు." ఈతని కాలముననే సుప్రసిద్ధ కవి పండితులగు శ్రీమత్తిరుమల బుక్కపట్టణం అణ్ణయ్య దీక్షితుల వారును, శ్రీమన్నిగమాంత దేశికుల యవతారావతారముగా భావింపబడిన శ్రీమత్తిరుమల బుక్కపట్టణం శ్రీనివాస మహాదేశికులవారు నను సోదరులు ధర్మవరమునుండి సురపురమునకు వచ్చి రాజగురువులై యచటనే స్థిరపడిపోయిరి. ఈ అణ్ణయ్య దీక్షితులవారి కుమారులే యావద్భారతమున తమ విజయదుందుభులు మ్రోగించిన కిరీటి వెంకటాచార్యులవారు. ఈ ముగ్గురి చిత్రములును వీరికి సంబంధించిన వివరములును శ్రీ. శే. సురవరం ప్రతాపరెడ్డిగారు సంపాదించిన "గోలకొండ కవుల సంచిక"లో కలవు. పామనాయకుడు కవి పండిత పోషకుడే కాక స్వయముగా పండిత కవి. ఈతడు భార్గవ పురాణమను వైష్ణవ ప్రబంధమును రచించెను.

భార్గవ పురాణము ఎనిమిది ఆశ్వాసముల గ్రంథము. వాగినగిరిలో వెలసిన వేణుగోపాలస్వామి సురపురాధీశ్వరులకు కులదైవతము. భార్గవ పురాణమీ వేణుగోపాలస్వామి కంకితముగా రచింపబడినది. గద్వాల సంస్థానాధీశ్వరులు తమ తాళపత్ర గ్రంథ భాండాగారమును ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారికిచ్చినారు. ఈ భాండాగారమున మరుగుపడియున్న మాణిక్యములందొకటి భార్గవ పురాణము. వైష్ణవ ప్రబంధమగుటచే మత ప్రాశస్త్యమును, మహాకవి నిర్మాణమగుటచే సాహిత్య ప్రాశస్త్యమును, రాజకవి రచనమగుటచే చారిత్రక ప్రాశస్త్యమును ఈ విధముగా మూడు విశిష్టగుణములు గలదీ భార్గవ పురాణము.

భార్గవ పురాణమందలి యితివృత్తము పన్నిద్దరాళ్వారుల చరిత్రము. కవికి స్వప్నమున భగవంతుడు సాక్షాత్కరించి ఏతత్కృతి రచనమునకిట్లు పురికొల్పినాడు:

చ॥ పరమ వివేకశీలురవు బ్రాహ్మణ పోషణ తత్పరుండవై
యరయుట యేను బ్రాహ్మణ ముఖాభివశాప్తి దనర్చుటున్కి నిన్
వరమతిత్రోవ నిచ్చుటకి వచ్చిన వాడను నొక్క సూక్తిర
మ్యరచనచేతు నీ కిపుడు బాలక పామధరాధిపాలకా.

సీ॥ అన్మత్రృభావ మౌనట్టి శ్రీవిష్ణు పురాణంబు తెనుగున రసికులెన్న
కృతి రచియింపించి తత్కర్త కీపూరంకితంబు చేయించిన ధన్యమతివి.
యతియ తన్నిద్దరైనట్టి మద్భక్తుల చరితంబు నాంధ్రభాషా ప్రబంధ
మును జేసి నాశిష్టముగ సమర్పణము గావించినచో పృథివీస్థలమున

సకల పుణ్యతరా(ఫలా)వాప్తి సంఘటించు
నీ కనుచు సురపురవాసుడై కడంగు
దేవుడా కృష్ణమూర్తి యదృశ్యుడౌట
మేలుకని మానసోత్సాహలీల దనర.

"అమృత స్వరూపంబులును, నిరంతరంబులునునగు భగవద్దాస్యలాభ్యులైన యోగీశ్వరుల చరిత్రంబులు" వినగోరిన శౌనకాదులకు సూతుడీ కథలు చెప్పినట్లుగా నున్నది. బదరికాశ్రమమున నారాయణుడు నరునకు వీనిని వినిపించెనని సూతుడీ కథలు శౌనకాదులకు వినిపించును. ప్రథమాశ్వాసమందలి యితివృత్తము భార్గవ పురాణోత్తర ఖండమందలి పంచమాధ్యాయమనియు, రెండవ యాశ్వాసము దశమాధ్యాయమనియు, మూడవ యాశ్వాసము పంచదశాధ్యాయమనియు, చతుర్థాశ్వాసము వింశతితమాధ్యాయమనియు, పంచమాశ్వాసము త్రయోవింశతితమాధ్యాయమనియు, షష్ఠాశ్వాసము ష్టావింశాఅధ్యాయమనియు, సప్తమాశ్వాసము త్రయస్త్రింశాధ్యాయమనియు, అష్టమాశ్వాసము చతుర్వింశాధ్యాయంబనియు కథలు ముగించునప్పుడు ప్రతి యాశ్వాసము చివరన క్రమముగా చెప్పబడినది. ఆశ్వాసాంత గద్యంబులందా యాశ్వాసములందున్న కథాదికములు వరుసగా పేర్కొనబడినవి. కవి విశిష్టాద్వైత సంప్రదాయమునకు చెందినవాడు గనుక మొదటి రెండు పద్యములందు సురపురమున వాగినగిరియందు వెలసిన వేణుగోపాలుని స్తుతియు, అటుతరువాత అనంత, తార్క్ష్య, విష్వక్సేన, పంచాయుధ, ద్వారక సూరుల స్తోత్రములును ఒక్కొక్క పద్యమున వేరు వేరుగా చేసినాడు. తన స్వప్నవృత్తాంతమును ఆస్థానవిద్వాంసులకు వినుపింప వారలు కవిని గొనియాడి అతని వంశావతారమును చెప్పి కృతి రచించి వేణుగోపాలున కంకితమిడుమని ప్రోత్సహింతురు. అటు తరువాత షష్ఠ్యంతములు చెప్పి కథను ప్రారంభించినాడు.

ఆశ్వాసవిద్యాంసులనోట కవి పల్కించిన వంశావతారములవలన సురపురాధీశ్వరుల పరంపర మనకు దెలియవచ్చు చారిత్రక విశేషములందు ఒకటి, రామభక్తుడగు గుహుని వంశమున బుట్టిన వీరి క్రమ మీ విధముగా నున్నది. 1. నరసింహ మహీపాలుడు, 2. పడియరనాయకుడు. 3. కల్ల మహీవల్లభుడు. 4. చిన హనుమ ధరణీకాంతుడు. 5. హావినాయకుడు. 6. పెదసోమనాయకుడు. 7. ఎరసింగ ధరణీధవుడు. 8. మదిరి ధరాధ్యక్షుడు. 9. వీరజంపి నాయకుడు. 10. బలెసోమనాయకుడు. 11. పెదపామ నాయకుడు. 12. దేశాయి చిక్కభూవిభుడు, 13. గడ్డెపెద్ద భూపాలుడు. 14. పెదపామ ధరణీపాలుడు. 15. పీతాంబరావనీపాలుడు. ఈ పీతాంబరావనీపాలునకు "సంతానతరువంచకస్వరూపులగు పామమహీధవ, కృష్ణ భూపాల, రమణధరణీరమణ, వాసుదేవాధిప, మహీవరులను సుతులు గల్గిరి". వీరిలో పెద్దవాడగు పామభూపాలునకు పిడ్డభ్రాదివర, వెంకట క్ష్మాధిపులను తనయు లిరువురుద్భవించిరి. మూడవవాడుగా పేర్కొనబడిన రమణధరణీ రమణునకు లక్ష్మమాంబయందు "రాఘవ భూపాలకాభిధానంబున గల్గినవారి కృతికర్త పామనాయక భూపాలుడు. ఈతడు "దిగంతకీర్తి కాంతామనోహరుడు", "సకలధర్మ ప్రతిపాలకుడు". ఈతని "భుజా ప్రతాప శిఖిశిఖాపరంపరల కవితభూభృన్నికాయంబు శలభనిచయంబు మాడ్కి విలసిల్లె"నట.

ఆశ్వాసాంత గద్యములందు మరికొన్ని చారిత్రక విశేషములు కలవు. చారిత్రక పరిశోధకుల కుపకరించునను తలంపులో కొంత భాగము నుల్లేఖింతును :

"ఇది శ్రీమద్రామ గోపాలకృష్ణ కరుణాకటాక్షలబ్ధ పాండిత్య ధుర్యానపరగావనీమండలాఖండసామ్రాజ్యధౌరేయ సమర్థతాకృత పటహ రణంధణారావ విశ్రుత పతన క్రియా ఢిల్లీశాధీశ దుందుభిధ్వాన కోలాహల హనూమద్ధ్వజాంక కనకదండికాచ్ఛత్ర హీరకలశీకృత నందిపిత ప్రతాప కీర్తిప్రభావ కౌసలవంశజలధిపారావార రాకాసుధాకర పీతాంబర నాయక పౌత్ర రమణ భూపాలకపుత్ర లక్ష్మమాంబా గర్భశుక్తి ముక్తాఫల రాఘవ భూనాయకాభిధాన సౌందర్యకర సుమసాయక లహరీ పామనాయక ప్రణీతంబైన శ్రీ మహాభార్గవ పురాణంబునందు..."

ఈ బేదరు నాయకులు బీజాపూరు, గోల్కొండ నవాబులకు తోడుగా ఔరంగజేబుతో యుద్ధములు చేసినట్లు చరిత్రలు చెప్పుచున్నవి. సురపురమునకు రాజధానిని పూర్వత పూర్వ మీబేదరులకు వాకిన్‌ఖేరా రాజధాని. దీనినే వాగినగిరి యందురు. ఇచటి వేణుగోపాలస్వామి వీరికారాధ్య దైవతము. ఆ దుర్గమును 1704లో ఔరంగజేబు జయించెనట. ఔరంగజేబు మరణానంతరము నాయకులు మరల వాకిన్‌ఖేరాను వశపరచుకొనిరట. చరిత్రములందు గానగు అంశములకును, పై గద్యమందలి "విపరీత పతన క్రియా ఢిల్లికాధీశ" యను మాటకును గల సంబంధమును పరిశోధింపవలయును. ఈ బిరుద మీతని మాత్రాత పామనాయకునిదై యుండవలయును. అతడు ఔరంగజేబు నొక యుద్ధమున నోడించినట్లాధారములు గలవు. గద్యమందలి మరియొక విశేషము కవి తాను కోసలవంశీయుడనని చెప్పుకొనుట. అవతారికలో కవి వంశావతారమును చెప్పినప్పుడుగూడ కోసల కులమని యున్నది. "భవదన్వయంబునకు ఆదిపురుషుండును శౌర్యవిజితగుహుండునునగు గుహుండు రామతారక భక్తిహృదయావహుండగుట తద్వంశం బనేకశాఖా భేదంబుగా గాదుకొన నందలి కోసల కులంబునందు నరసింహ మహీపాలుండు" అన్నించినట్లుగా నున్నది.

పామనాయక భూపాలుని కవిత్వమునకు మచ్చుగా నొక్క పద్యము నుదాహరించి ఈ పరిచయ వ్యాసమును ముగింతును.

మ॥ పర్వతత్వార్థ పరిష్క్రియాధిరతి కుంఠత్వాంధ్య భూమంతతే
శ్వర నద్వైష్ణవతా విధాయి కరుణాంతర్వృత్తపాదార్య సా
దరలీలా చిరచిద్విశిష్టమత సిద్ధాంత స్ఫురద్వర్తనాం
తరవిద్యోది(ది)త దివ్యవిగ్రహ సముద్యత్సాదరానుగ్రహా.

ఇట్టి గ్రంథములు మరుగునపడిపోవుట విధి వైపరీత్యము.

(గోలకొండ పత్రిక 28-11-1950)

బారిగడ్పుల
ధర్మయామాత్యుడు

చరిత్రకెక్కని చరితార్థులందు ధర్మయామాత్యుడొకడు. ఈతని కృతి "నృసింహ పురాణము." ఆరాశ్వాసముల గ్రంథమిది. కవికాలమిదమిత్థముగా తెలియదు. ఈ తాళపత్ర గ్రంథము గద్వాల సంస్థానము వారిచ్చినది. మొదటికమ్మ, చివరికమ్మ రెండును లేకపోవుట విచారకరము. చివరి కమ్మ వలన కనీసము ప్రతి వ్రాయబడిన తేదీయైనను తెలిసియుండును. ఉన్న గ్రంథముకూడ మిక్కిలి శిథిలావస్థలో నున్నది. గ్రంథపరిస్థితిని బట్టియు, లిపినిబట్టియు కనీసము 250 ఏండ్లకు పూర్వపు గ్రంథమని యూహింపవచ్చును. పోయిన మొదటికమ్మలో ఇష్టదేవతా స్తోత్రాదికము లుండియుండును. రెండవకమ్మ ఆంజనేయ స్తోత్రముతో ప్రారంభమైనది. అటుదరువాత మూడు పద్యములందు పూర్వ గీర్వాణాంధ్ర భాషా కవుల నుతియున్నది. ఆ పద్యము లిట్లున్నవి.

క॥ మనమున నే భజియింపుదు । ననయము వాల్మీకి వ్యాసు ననిమిష[illegible]
ఘనసుర వంద్యులను న । న్ననిమాన్యుల హరికథానుమోదితమతులన్.

ఉ॥ చారు మనః ప్రమోదమున సంస్కృత కావ్యము[illegible]
ధీర మయూరు, బాణు, జయదేవుని చోరుని గాళిదాసునిన్
భారవి మాఘు బిల్హణుని భైరవునిన్ శివభద్రునిన్ హరిన్
సూరిమితో నుతింతు మదిగోరిన కోర్కెకను గ్రహింపగన్.

క॥ తగ నంధ్రభాష నేర్పరు । లగు నన్నయ భట్టు, తిక్కనాహ్వయు భీమున్,
సుగుణుని బమ్మెర పోతన । నాగిభాస్కరు రంగనాథు నొనరదలంతున్.

పూర్వకవి సమాదరణమున సాధారణముగా కవిత్రయమును పేర్కొనుట పరిపాటి. కాని ఈ ధర్మయామాత్యుడు తాను నృసింహపురాణమును

రచించువాడైనను ఎట్టి ప్రగడను పేర్కొనక పోవుట వింతగానున్నది. అటు తరువాత కుకవి నిరాకరణంబు రెండు పద్యములందున్నది. వాని తరువాత వచన భాగమిట్లున్నది.

"అని యిష్టదేవతా ప్రార్థనంబును సుకవివందనంబును కుకవినిందనంబునుం గావించి యొక్క ప్రబంధంబు సేయంబూని సువిభూషితుండైన మా యిష్టదైవంబైన బారిగదుపుల నారసింహుని పాదారవిందంబులు నాడెందంబునం బొందుపరచి యొక్క రమ్యస్థలంబున ధ్యానారూఢుండనై యున్న సమయంబున"—

ఈ బారిగదుపుల ఆటప్రోలు సంస్థానమందలి దివ్యస్థలము. కవి తన కులగోత్రాదులు చెప్పుకొన్నచోట ఇంటిపేరు చెప్పుకొనకున్నను, బారిగదుపుల గ్రామనివాసి యగుటచేతను, బారిగదుపుల నృసింహస్వామి యిలువేల్పు తనుకను, ఇంటి పేరుకూడ బారిగదుపులవారనియే యుండునని యూహించి నేనే కవి పేరునకుముందు బారిగదుపుల పదము చేర్చినాను. పై వచనము తరువాత తన యెదుట సాక్షాత్కరించిన బారిగదుపుల నృసింహుని వర్ణించు రెండు సీసపద్యములు గలవు. వాని తరువాత మరియొక వచనమిట్లున్నది.

"మరియు సద్దేవదేవుని శ్రీపాద సందర్శనానుభవుండనై మేనం బులకాంకురంబులు నిగుడ నానేర్చు విధంబుల సన్నుతించి మదీప్సితంబు విన్నవించిన నన్నుం గరుణార్ద్రదృష్టి న్నిరీక్షించి దరహసితవదనుండై యిట్లనియె. నీ యిష్టం బెరుంగుదు. మున్ను నీవు ద్విపద రూపంబుగా జేయించి నాకు సమర్పించిన నృసింహపురాణం బంగీకరించితినని మరియు నిట్లనియె."

ఈ ద్విపద నృసింహ పురాణ మేమైనదో తెలియరాదు. వాఙ్మయ చరిత్రములందు దీనిపేరు కూడ కానవచ్చుటలేదు. "ద్విపద రూపంబుగా జేయించి" యనుటచే నీ ద్విపద కృతికర్త ధర్మయామాత్యుడో మరి యేకవియో సరిగా చెప్పలేము. పై వచనము తరువాత భగవదాజ్ఞ మరిరెండు పద్యములం దీటుగా గలదు.

క॥ వినుమెరిగించెద నే నీ, కనకుని గరుణించినాడ సాక్షాత్కారం
బున మిమ్ము బ్రోతునేని, ట్లనుదినమును సంతసిల్లు మని కడిమి మెయిన్

క॥ ఒగి నరసింహపురాణం, బగణితమతి వచనకావ్యమై తుచిలరగం
దగ రచియింపుము శంకరి, ఆగరి ప్రవర్తిల్లుచుండు శాశ్వతముగుచున్.

ఈ రెండవ పద్యమున నీ కృతిని వచనకావ్యమనినాడు. వచనశబ్దమున కీనాటి యర్థము వేరు. పూర్వ మీశబ్దమునకు మరికొంత విశాలమైన పరిధి యుండెడిది.

ధర్మయామాత్యుడు భగవదాజ్ఞను తన తండ్రి తెలిగింప నాతడు కొడుకుతో నిట్లనును.

క॥ పరగ మన భాగ్యమున శ్రీ। ధరునార్త శరణ్యు దలిముదంబున మనలం
గరుణించి యిచట బ్రబలిన। తెరగే నెరిగింతు వినుము ధీరవిచారా.

సీ॥ ప్రబలముగ తొల్లి కశ్యపబ్రహ్మ మౌని
మహితుడై (కదిలము) గౌతమీ మధ్యదేశ
మునను తపమతి నిష్ఠతో మొనసి చేయ
వరదుడై చక్రి వేడుము వరములనిన.

ఉ॥ సన్నుతుల్ సేయుచును సంయమిచంద్రుడు విన్నవించె నో
పన్నగతల్ప ఆర్తజనబాంధవ సద్గుణశాలి లేని నీ
విన్నగభూమి నిల్వుమిది యిష్టము నా కనినం బ్రియంబుతో
వెన్నుడు నిల్చి మౌనికిని పేర్మి ఘనంప బ్రసన్నచిత్తుడై.

వ॥ అప్పరమాత్ముండిట్లని యానతిచ్చె. మునీంద్రా యీ స్థానంబు చిరకాలంబున నుండియు పుణ్యప్రదేశంబుగావున కార్యంబున దలదాద్రియు ఈ స్థలంబు కలియుగంబున కాశ్యపల్లు నా బరగునని యానతిచ్చి యీ స్థలంబున వసియించియున్న యద్దేవదేవుని దివ్యమూర్తిని నా చిత్తంబున నిల్పి సుఖాశయుసుండనై యున్న అప్పుండరీకాక్షుండు నా స్వప్నంబున సాక్షాత్కరించి కశ్యపుడు నన్నచట నుండగోరెను నీవును కాశ్యపగోత్రజనితుడవు కనుక నీ గిరిగహ్వరంబున దారిగడుపుల నరసింహమూర్తి పేరుతో వెలసెదను కోవెల గట్టించి పూజింపుమని చెప్పిన ప్రకారంబుగా నాతడు (కృతికర్త తండ్రి) ఆ చోటును సాధించి కోవెలగట్టించె. ఆకోవెల యందే పన్నిద్దరాళ్వారులును భాష్యకారులును గొలుచుచుండ స్వామివారు వేంచేసి మనల బ్రోచుచున్నారు కనుక నీవా పరమాత్మునకీ ప్రబంధము నంకితము సేయుమని పుత్రునకుపదేశించి పుణ్యతీర్థాటనాభిలాషియై కాశికిన్" అనినట్లును తదాజ్ఞననుసరించి ధర్మయామాత్యుడు దారిగడుపుల నృసింహున

సంక్షిప్తముగా దీనిని రచించినట్లును గలదు. ధర్మయామాత్యుడీ పట్టున తన గురువంశాదికమును పేర్కొనినాడు.

గురువుల వంశక్రమమిట్లున్నది. శ్రీ వత్సగోత్రజులగు నల్లాన్ చక్రవర్తులవారి కోవలో 1. చిట్టాచార్యులు 2. ధర్మాచార్యులు 3. రంగాచార్యులు నను మూడు తరములవారు రంగాచార్యులకు 1. ధర్మనాచార్యులు 2. చిట్టయాచార్యులు 3. నరసింహాచార్యులు 4. చింతామణి 5. ఘంటాచార్యులు ననువారు జన్మించిరి. పెద్దవారైన ధర్మనాచార్యులవారి కుమారుడు రంగాచార్యులు కృతికర్తకు గురువు. ఈ గురువులవారి గురువు శఠగోప జియ్యలని పేరు గాంచిన నరసయాచార్యులట. ఈ శఠగోపజియ్యలకు శ్రీమత్పరాంకుశ జియ్యలు గురువులట. ఇట్టి గురువుల యనుగ్రహమునకు పాత్రులైన తన వంశావతారమును గూడ కవి విపులముగా వర్ణించి యున్నారు. కాశ్యపగోత్రజులైన తన తాత ముత్తాతలలో 1. అనంతరాజు 2. కృష్ణుడు 3. తిరుమలమంత్రి 4. తిమ్మమంత్రి (కృతికర్త తండ్రి) మున్నగువారల గూర్చియు వారి సద్గుణములగూర్చియు చెప్పినాడు. తన తండ్రియైన తిమ్మమంత్రి కిరువురు భార్యలు. 1. కొండమాంబ (ఈమె రంగరాజు తిమ్మప్రధాని పుత్రికయట) 2 నరసమాంబ. కొండమాంబకు ఇరుగురు కూతుండ్రు మరియు రంగమంత్రి, ధర్మయ (కృతికర్త) యను నిరువురు కుమారులు. నరసమాంబకు ముగ్గురు కూతుండ్రు మరియు కొండప్ప యను కుమారుడును కలిగిరి. వంశావతార వర్ణనము తరువాత షష్ఠ్యంతములు చెప్పి కథాప్రారంభమును నైమిశారణ్యవర్ణనముతో దొరకొనినారు.

ఇది పేరునకు నృసింహపురాణము గాని ఇందు జయ విజయులెత్తిన మూడు జన్మంబుల కథలును గలవు. ఆశ్వాసాంతగద్యములం దాయా ఆశ్వాసములందున్న విషయములు క్లుప్తముగా చెప్పబడినవి. గ్రంథస్థవిషయ మంతయు తెలియును గనుక దాని నిట నుట్టంకించుచున్నాను.

ప్రథమాశ్వాసము :-

I "ఇది శ్రీ వారిగురువుల నృసింహ వరప్రసాద కాశ్యపగోత్ర పవిత్ర తిమ్మనామాత్య పుత్ర రంగనాహ్వయ సహోదర ధర్మయ నామధేయ ప్రణీతంబైన శ్రీ నృసింహపురాణంబను మహాప్రబంధంబునందు నైమి

కారణ్య వర్ణనంబును, శౌనకాదిమునుల మహత్త్వంబును, నారదాగమనంబును, శౌనకాదిమునులకు నారదుండు భక్తి విజ్ఞాన ప్రకారం బెఱింగించుటయు, చతుర్వ్యూహ ప్రకారంబును, శ్రీహరి మహత్త్వంబును, సనకసనందనాదులగు యోగీశ్వరులు శ్రీహరి ద్వారపాలకులగు జయవిజయుల శపించుటయు, వారల కజనార్దనుండు ప్రత్యక్షం బగుటయు, బ్రాహ్మణ ప్రశంసయు, జయవిజయులు జన్మంబులకుం బాల్పడుటయు, నను కథలుంగల ప్రథమాశ్వాసము.

II ఇది....శ్రీ నరసింహ పురాణంబను మహాపుణ్య కథయందు నారదు జన్మంబును, సువర్ణోపాఖ్యానంబును, సముద్రమథనంబును, అంబరీషోపాఖ్యానంబును, అందుం జక్రభీతి జెందివరచిన దుర్వాసుండు క్రమ్మర నంబరీషు మరుగుసొచ్చి బ్రదుకుటయు, కార్తవీర్యార్జునుని జన్మంబును, శ్రీహరిమూర్తియైన పరశురాము జన్మంబును, కార్తవీర్యార్జునుని వధయును, సుదర్శనోపాఖ్యానంబును, సుదర్శనుండు వేటకు వెళ్లుటయు, నందు మాలినీకన్యం బరిగ్రహించి క్రమ్మరిపురికి విజయం చేయుటయు, నారాజోత్తము......యవ్వరదరాజు నుద్దేశించి తపంబు సేయుటయు, వరలబ్ధుండై తిరుగం బురంబు ప్రవేశం బగుటయు, చంద్రవర్మ జయవిజయుల జన్మంబును, సుదర్శనుండు చంద్రవర్మకు పట్టాభిషేకంబు చేసి తపంబునకుం జనుటయు, జయవిజయులత్యుగ్ర తపంబున శ్రీమన్నారాయణదేవుని మెప్పించి యవ్వరంబు గనుటయు నను కథలుంగల ద్వితీయాశ్వాసము.

I. ఇది...శ్రీ నృసింహపురాణంబునందు కశ్యపదితి సంవాదంబును, హిరణ్యకశిపు హిరణ్యాక్షుల జననంబును, వారల దిగ్విజయంబును, శ్రీహరి వారాహరూపంబును, హిరణ్యాక్ష వధయును, అయ్యసుర పట్టణంబు ఇంద్రుండు దాడి వెట్టంజనుటయు, కల్యాణదేవిం జెరవట్టుకొని ఇంద్రుడు క్రమ్మరి దివంబునకుం జనుటయు, నమ్మగువను నారదుండు విడిపించి క్రమ్మరి పురంబున కనుపుటయు, హిరణ్యకశిపుని మాహాత్మ్యంబునకు మెచ్చి వారి పితామహులు ప్రత్యక్షం బగుటయు, లబ్ధవరుండై హిరణ్యకశిపుండు తన పురంబునకు గ్రమ్మరి వచ్చుటయు, నయ్యసురేంద్రుని దిగ్విజయంబును, త్రిదివంబాక్ర

మించుటయు, ప్రహ్లాదు జన్మప్రకారంబును, సట్యాలు విద్యాభ్యాస ప్రకారంబును, ప్రహ్లాదులద్దానవేంద్రు నెదుట విష్ణుప్రశంస చేయుటయు, అద్దానికిం గనలి అట్యాలుని తెగటార్చుటయు, ప్రహ్లాద హిరణ్యకశిపు సంవాదంబును, నను కథలుంగల తృతీయాశ్వాసము.

V. ఇది...శ్రీనృసింహ పురాణంబునందు, ప్రహ్లాద హిరణ్యకశిపు సంవాదంబును, స్తంభోద్భవంబును, నృసింహావతారంబును, హిరణ్యకశిపువధయును, మృత్యుంజయుండు శరభావతారంబున వచ్చి యణంగుటయును, నృసింహుని స్తుతియును, ప్రహ్లాదుని రాజ్యాభిషేకంబును, దానవకోటిరం(బైన) చంద్రరేఖను ప్రహ్లాదుడు ధరించుటయు, క్రమంబునం బల్నియుక్తుండై ప్రహ్లాదుం డసురలోకంబునకు దండయాత్ర చని యమరుల నందరం దోలి స్వర్గంబు నాక్రమించి యేలుటయు(......) ప్రబోధితుండై హరిమీద దాడి చనుటయు, శ్రీహరి మాయవలన నద్దానవసైన్యం బంతయు తమలోదారు కెరలి పోరి మృతిం బొందుటయు, ప్రహ్లాదునకు శ్రీహరి ప్రత్యక్షంబగుటయు, అతని యనుగ్రహంబువలన నేలత్సైన్యంబు మరల బ్రతుకుటయు, ఇంద్రదైత్యేంద్రుల స్నేహంబును, ప్రహ్లాదుండు తొల్లింటట్ల నృసింహ భక్తి పరాయణుండై తన పురంబునకేతెంచి రాజ్యంబున వసించుటయు నను కథలుంగలిగి యొప్పు నృసింహ పురాణంబునందు చతుర్థాశ్వాసము.

V ఇది...శ్రీ నృసింహ పురాణంబునందు రావణ కుంభకర్ణాదుల జన్మప్రకారంబును, వారలు సేయు అద్భుత పరాక్రమంబును, రామ లక్ష్మణ భరత శత్రుఘ్నుల జన్మప్రకారంబును, విశ్వామిత్ర యజ్ఞ రక్షణంబును, అహల్యా శాపవిమోచనంబును, వైష్ణవ పినాక గాండీవంబుల జన్మంబును, ధనుర్భంగంబును, త్రిపుర విజయాఖ్యానంబును, సీతా వివాహంబును, అయోధ్యా ప్రవేశంబును, పట్టాభిషేక విఘ్నంబును, వనవాస గమనంబును, ఖరదూషణాది రాక్షస విదారణంబును, సీతా హరణంబును, వాలి సుగ్రీవ జన్మప్రకారంబును, వాలి నిగ్రహంబును, సుగ్రీవ రక్షణంబును, దండయాత్రయు, సముద్రబంధనంబును, రావణ కుంభకర్ణాది రాక్షస సంహారంబును, సీతా సమేతంబుగా పుష్పకారూఢుడై రామచంద్రుడయోధ్యా ప్రవేశంబును, పట్టాభిషేకంబును

ధ ర్మ యా మా త్యు డు

రాఘవుండు తన మొదటి సెలవునకు జనుటయు నను కథలుంగల పంచమాశ్వాసము.

"ఇది...శ్రీనృసింహ పురాణంబునందు దేవకీ వసుదేవుల వివాహంబును, ...కనలి కంసుండు దేవకిని వధియింప గమకింప వసుదేవ ప్రార్థితుండై విడిచి పుచ్చుటయును, బల కృష్ణుల జన్మప్రకారంబును, వారలుచేయు అద్భుత పరాక్రమంబును, కంసవధయును, జరాసంధాది శత్రువుల అలజడికి మధురాపురంబు విసర్జించుటయు, ప్రజాసమేతంబుగా బల కృష్ణులు ద్వారకా ప్రవేశం బగుటయు, రుక్మిణీ కల్యాణంబును, రుద్రుని తపోమాహాత్మ్యంబును, మన్మథుని జన్మ ప్రకారంబును, జాంబవతీ సత్యభామా కాళిందీ మిత్రవిందా నాగ్నజితీ భద్రా లక్షణల వివాహప్రకారంబును, నరకాసుర వధయును, కృష్ణుడు షోడశ సహస్ర దివ్యకాంతామణులం బరిణయం బగుటయు, స్వర్గ గమనంబును, పారిజాతాపహరణంబును, బాణాసుర యుద్ధంబును, ధర్మరాజ రాజసూయ ప్రారంభంబును, జరాసంధ వధయు, శిశుపాల వధయును, పౌండ్రక సాల్వ దంతవక్త్రాది ఖలవిదారణంబును, కుచేలోపాఖ్యానంబును, హరిహరుల వీర్యవిశేష తారతమ్యంబులును, ధ్రువోపాఖ్యానంబును, భృగుమహామునిత్రయ...తారతమ్యంబులరసి క్రమ్మరి మునుల కేర్పరించిన యమ్మునులందరు శ్రీవల్లభుండొక్కరుండే దైవంబని భావించు......"

చివర కమ్మపోవుటచే నాకమ్మయందున్న భాగముకూడ మనకు దక్కకుండ పోయినది. ఈ నృసింహపురాణపు మరియొక ప్రతి లభించిననే శిథిలపూరణము సాధ్యముకాదు.

(గోలకొండ పత్రిక 7-12-1960)

శేషభట్టరు సింగరాచార్యులు

గద్వాల, వనపర్తి మున్నగు సంస్థానాధీశ్వరులవలెనే జటప్రోలు సంస్థానాధిపతులగు సురభివారును పండిత కవిపోషణమునకు ప్రసిద్ధికెక్కిన వారు. ఈ సంస్థానము మిక్కిలి ప్రాచీనమైనది. మొదట కాకతి సామ్రాజ్యమునకును, తరువాత విజయనగర సామ్రాజ్యమునకును, ఆటు తరువాత గోలకొండ సుల్తానులకును నిది సామంత మండలముగా నుండినది. శ్రీ. శే. వెల్లాల సదాశివశాస్త్రిగారు "జటప్రోలు రాజులవంశ చరిత్రము"ను రచించినారు. అందులో 21వ తరమునకు చెందినట్లుగా చెప్పబడిన చిన్న మాధవరావు భూపాలుని యాస్థాన పండిత కవియే ఈ శేషభట్టరు సింగరాచార్యులు. ఈతని కృతి "శూద్ర ధర్మోత్పల ద్యోతిని స్మృతి కౌముది" యను ధర్మశాస్త్ర గ్రంథము. దీనికి సంస్కృతమున మూలము మదనపాల విరచితము. ఈ మదనపాలుడు పదునాల్గవ శతాబ్దముత్తర భాగమున నున్నవాడు. శేషభట్టరు సింగరాచార్యులు చినమాధవ రాయల కాలమువాడు కనుక నీరాజు కాలమిద మిత్థముగా తెల్పుకొన్నచో కవికాలముకూడ తెలిసికొనవచ్చును. చంద్రికా పరిణయమను ప్రౌఢప్రబంధమును రచించిన సురభి మాధవరాయల కనిష్ఠ పుత్రుడగు నరసింగరాయల కుమారుడే చినమాధవరాయలు. ఈతడు 1181 ఫసలీలో నిజాము వారిచే సన్నదు పొందినట్లును, ఈతని కుమారుడు బారిగడుపులరావు 1281 ఫసలీలో నిజాముబారిచే సన్నదు పొందినట్లును సురభి వారి వంశచరిత్రమున గలదు. తండ్రి కొడుకుల మధ్యన నూటముప్పది యేండ్ల యంతరముండునా? ఇది యచ్చు పొరపాటనుకొందును. బారిగడుపుల రావు సన్నదు పొందినది 1181 ఫసలీలో కాబోలును. చిన మాధవరావు సన్నదు పొందినది క్రీ. శ. 1742 అగుచున్నది. అనగా తదాస్థాన

విద్వాంసుడగు సింగరాచార్యులుకూడ పదునెనిమిదవ శతాబ్దము పూర్వార్ధమునను ఉత్తరార్ధమునను ఉండినవా డనుకొనవచ్చును.

ఈ తాళపత్ర గ్రంథము గద్వాల సంస్థానాధీశ్వరులు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారికిచ్చిన కానుక. గ్రంథము మిక్కిలి శిథిలావస్థలో నున్నది. ఈ గ్రంథమునకున్న పీఠిక యమూల్యమైనది. సురభివారి చరిత్రమును దెలిసికొనుటకే కాక సమకాలీన చరిత్రమును దెలిసికొనుటకు గూడ ఈ ధర్మశాస్త్ర గ్రంథపీఠిక మిక్కిలి యుపకరించును. తాను రచింప దొరకొన్నది ధర్మశాస్త్రము గనుకను, అందులోను అనువాదము గనుకను, కవితాకళనుగాని తన శక్తి సామర్థ్యములనుగాని సమగ్రముగా ప్రదర్శించుటకు నవకాశముండదనుకొని కాబోలు సింగరాచార్యుడీ గ్రంథమునకు దీర్ఘమైన పీఠికను కూర్చినాడు. సురభిరాజుల వంశావళిని విపులముగా వర్ణించినాడు. సామాన్యముగా ప్రబంధములందు కానవచ్చు పురవర్ణనము చాతుర్వర్ణ్య వర్ణనము చతురంగ బలముల వర్ణనము మున్నగు వానిని కూడ అవకాశము కల్పించుకొని పీఠికలో చేర్చినాడు.

గ్రంథము సంస్కృత శ్లోకములో నారంభమైనది. ఆ శ్లోకముగూడ కొంత శిథిలమైనది.

శ్లో॥ శ్రీరాజ శేఖరః పాయాత......ర్మ తవాన్వితః।
శ్రీ మన్మాధవ రాజేంద్రం పంటవల్లి పురాధిపం॥

శా॥ శ్రీరామా పరిరంభ (జృ)ంభణమునం జెన్నొందు వక్షంబునన్
దారంబూనని తారహారము మహోద్యల్లీలలం దాల్చి లో
గారూఢిం దగు సింగపట్టణ నృసింహస్వామి ప్రోచుం దయం
సూరీంద్రావనశీలునిన్ సురభివంశ్యున్ మాధవోర్వీశ్వరున్.

తరువాత పద్యములందు లక్ష్మి, శివ, పార్వతి, వృషాకపి (శ్లేష) వృషాకపాయి (శ్లేష), బ్రహ్మ, సరస్వతి, విఘ్నేశ్వర, ఆంజనేయాదులను మాధవరాయలకు సకలసంపద లొసగుటకై క్రమముగా ప్రార్థించినాడు. ఈస్తోత్రములందు పూర్వులైన ప్రౌఢప్రబంధ రచయితల గడుసుపోకలన్నియు గనుపించును. అటు తరువాత పూర్వకవి స్తుతి సుకవి వందనము కుకవి నింద యొనర్చినాడు. ఆపైన నొక వచన పీఠికగా నున్నది.

"అని యివ్విధంబున నిష్టదేవతారాధనంబును, సుకవి స్తోత్రంబును కుకవినిరాకరణంబును గావించి వివిధ (కవి?) పుంగవానందకంబయిన యొక్క మహాప్రబంధంబు వినిర్మింపబూనియున్న సమయంబున"...... ధర్మశాస్త్రగ్రంథానుసారముగూడ మహాప్రబంధనిర్మాణమునిదే చెప్పినాడితడు. ఇచ్చట మాధవరాయల కునికిపట్టగు పంటవెల్లి పురవర్ణనము చాల విపులముగా నున్నది. పూర్వపు పంటవెల్లి ఈనాడు పెంట్లెల్లిగా మారిపోయినది. సురభివారికి ప్రస్తుతము రాజధానిగానున్న కొల్లాపురమున కివల ఐదు మైళ్ళ దూరమున నున్నదీ గ్రామము. ఈ పురవర్ణనమును సాకుగాగొని సింగరాచార్యులు ప్రబంధములోని వర్ణనములను చాలవరకిట సాధించినాడు. ఈ పురాధినేతయగు మాధవరాయలను, అతని గుణగణములను వర్ణించు వట్ల పలుపోకలు పోయినాడు. ఉదా॥

క॥ నరసింగ మాధవేంద్రుని
స్థిరతర సత్కీర్తి చెలగ దిశలన్ మిగులన్
కరిభిద్ధర గిరిభిచ్ఛర
కరిభిద్వర శైలతుల్య కాంతి స్ఫురణన్.

మాధవరాయల గురువుల ప్రసక్తి ఈ సందర్భమున నిట్లున్నది.

సీ॥ వేదవేదాంతార్థవేత్తయై మిక్కిలి
విశ్రుతబుధజనవినుతి గనుచు
గురు భట్టభద్రుడౌ నర(సిం)హ యజ్వకు
ఘనత కెక్కిన యగ్రతనయు డగుచు
మహితమై విలసిల్లు మంత్రసారజ్ఞుడై
మహిలోన సతతంబు మాన్యుడగుచు
పావనశీలయౌ భాగీరథీనామ
పద్మగంధికి ప్రాణభర్తయగుచు

నలరుచున్నట్టి యలస్వామి (యార్య ? యప్ప ?) గురుని
పాదనీరేరుహంబులు భక్తితోడ
చెలగి భజియించు నేవేళ చిత్తమునను
సురభి నరసింహ మాధవ ధరణి విభుడు.

మాధవరాయలను వర్ణించు సందర్భమున నొకచో "బిజ్జల నారసింహ పృథివీ పతికిన్ సఖుఁడై గుణాఢ్యుఁడై" యని కలదు. అనర్ఘ రాఘవము నాంధ్రీకరించిన బిజ్జల తిమ్మభూపాలుడు తన వంశావతారమును చెప్పిన సందర్భమున ఐదు తరముల పూర్వమువారినేకాక తన పుత్రపౌత్రులను కూడ పేర్కొన్నాడు. అందులో తిమ్మభూపాలుని ద్వితీయ భార్యయగు గౌరమాంబ కగ్రసుతుడు నరసింహ నాముడొకడు మాత్రమే యున్నాడు. ఈ నారసింహ ప్రభువే మాధవరాయలకు స్నేహితుడై యుండునని నే నూహించుచున్నాను.

ఇచట నొక దీర్ఘమైన వచనమున మాధవరాయల బిరుదములు సభా విశేషములు విపులముగా వర్ణించినాడు. సభాసదులైన పండితులు మాధవ రాయలతో పూర్వులగు సురభివంశీయుల సాహిత్య సేవ నిట్లుగణింతురు.

సీ॥ సరి నిజాంకంబుగా నిర్మింపజేసె సన్మతి భర్తృహరి ముదిమల్ల నృపతి
కృష్ణవిజయ నామకృతికర్త లానయ్యె భూరిమున్మడిమల్ల భూవిభుండు
ప్రౌఢ(హా)చంద్రికాపరిణయంబనుకృతి రచియించె మాధవరాయశౌరి
మేలిమా నక్షత్ర ఖేలవర్ణియొనర్చె హిరణాద్రి నరసింగ మేదినీంద్రు

రసభ భవదీయ వంశధరాధిపతులు
విశ్వవిఖ్యాతి గనిరిట్లు వేడ్కతోడ
అటుల నీవును శ్రీ మాధవావనీంద్ర
కృతి వినిర్మింప జేయుము కీర్తికెక్క.

అప్పుడు మాధవరాయలు సింగరాచార్యులను కృతి నిర్మింపుమని కోరును. ఈ సందర్భమున కవి తన్నుగూర్చిన వివరములను మాధవరాయల నోట పలికించినాడు. కవి రామభక్తుడనియు, శేషభట్టరు వంశము కౌండిన్య గోత్రమువాడనియు, వెంకటార్య పుత్రుడనియు తెలియజేయు నొక సీస పద్యము గలదు. కవి తాతముత్తాలను చెప్పుకొనలేదెందుకో! అటు తరువాత మరి మూడు నాల్గు పద్యములున్నవి. వానివలన సింగరార్యుడు గడియకు నూరు పద్యములను గ్రక్కున చెరుగుదు లాడునట్లు చెప్పగలవాడనియు, ఏకైకదినప్రబంధనిర్మాణచతురుడనియు తెలియుచున్నది. ఇటనొక దీర్ఘవచన మింతను కవినిగూర్చిన వివరములను ప్రస్తుత గ్రంథమునుగూర్చిన విశేషము లను చెప్పునట్టిది కలదు.

"మరియును నిదిగాక శ్రీ కేశవ విలాసాది ప్రబంధంబు లనేకంబులు రచియించి విబుధసంస్తుతుడు గాంచి విద్యాధనరాన్యపుత్రపౌత్రాది వితత సమృద్ధుల విభూతి వహించిరివి నీవెంత ధన్యుండవని వచియించి యంతట లోకోపకారంబుగా శ్రీ రాయమదనపాల విరచిత శూద్రధర్మతత్వలోకోక్తిసి న్మృతికౌముది యను గీర్వాణమహాగ్రంథంబునందు మనుస్మృత్యాది స్మృతి శ్లోకంబుల కాపస్తంబ సూత్రాది (సూ)త్రంబులకు బహుపురాణేతిహాస శ్లోకంబులకు పద్యంబు లదిగాక గ్రంథకార గ్రంథంబున కాక కొన్నిచోట్ల పద్యంబు లొకకొన్ని చోట్ల వచనంబులు మేధాతిథి ప్రభృతులచేత వచియింప బడిన శ్లోక వ్యాఖ్యానంబులకు ప్రయోగంబునకు వచనంబులునై విలసిల్లునట్లుగా కూచా మొదలైన ఏకద్వర్ణంబుల యందొకటైనా విడిచిపెట్టక విద్వజ్జనంబు లౌనని యభినుతించునట్ల సర్వంబును సత్కృ(కృ)తి)గా నాంధ్రభాషను నిర్మింపు" మనియు "ధారిగడపల నృసింహస్వామి కంకితంబు గావింపు" మనియు తాంబూలమిచ్చినట్లు గలదు.

ఇచ్చటినుండి సురభివంశావతార వర్ణనము కలదు. ఇది సుమారరువది పద్యములందున్నది. సర్వజ్ఞ సింగభూపాలుడు మొదలుకొని సురభివారి వంశచరిత్రము విపులముగా చంద్రికాపరిణయములో నున్నటులే కలదు. ఇందనేక చారిత్రక విషయములును గలవు. ఈ మాధవరాయల తండ్రియగు నరసింగరావునుగూర్చి

"హరుల సామజముల నవరంగ పాచ్చావు
(హొ)సగంగ నెవ్వని కొసగె మిగుల" అని

యున్నది. నరసింగరాయలు ఢిల్లీపాదుషాయగు ఔరంగజేబుచే సత్కృతు డైనట్లు దీనివలన దెలియుచున్నది.

"సురభివారి వంశ చరిత్రము"న నీ నరసింగరాయలకు మాధవరాయ డొకడే పుత్రుడున్నట్లు వ్రాయబడినది. కాని ఈ గ్రంథమువలన మాధవ రాయలకన్న పెద్దవాడగు తిరిసింగరాయ డొకడుండినట్లు తెలియుచున్నది. ఒక సీసమాలికలో కాకతీయులనాటినుండి సురభివంశప్రాభవ మగ్గడింప బడినది. ఆ సీసమాలికలోని కొన్ని పాదము లుదాహరింతును.

"కాకతీయ నృపాల పునరాజ్య సంస్థాపనాచార్య పదబిరుదాంకుడగుచు
పద్మనాయకులకు ప్రఖ్యాతిగావించె శ్రీరావు సర్వజ్ఞ సింగనృపతి

రాజిల్లు (స)ద్రాయ రాజ్యవర ప్రౌఢి భూవనమాత్రైక పూజ్యులగుచు
రమణ సాహసవృత్తి రణములు గుడిపిరి నేలుగా మేటి వెల్గోటివారు
ఇల గోలుకొండలో నిభరాము శహవర్గ విభ్రుత వీరాధి వీరులగుచు
అనమాన దర్పుల నారూఢికెక్కుచు రంజిల్లె......ఈ రాఘవుడు
రాజాధిరాజా వరంగ శాహోదత్త గజఘోటక స్తోమకలితులగుచు
నాంధ్రభూపతులలో నారూఢికెక్కెను జట్ప్రోలి నరసింగజనవిభుండు

ఈ సీసమాలిక తరువాత మరిమూడు నాల్గు పద్యములందు మాధవ రాయలను నాశీర్వదించుటయు, భగవంతుని మాధవరాయల కైశ్వర్యము నిచ్చుటకు వేడుకొనుటయు కలదు. ఆటుగరువాత షష్ఠ్యంతములు చెప్పి గ్రంథమారంభించినాడు. ఆశ్వాసాంతగద్యములం దాయా ఆశ్వాసములందున్న విషయములకు సంగ్రహముగా సూటంకించినాడు. ప్రథమాశ్వాసాంత గద్య మిట్లున్నది.

"ఇది శ్రీమదుజ్జ్వల సీతారామ చంద్రాంఘ్రి సరోరుహ సేవా మరంద పానమత్త మిళిందాయమాన మానస మహా దివ్య చరపర శరస్నిరద నారదా భ్రధునీ శుభ్ర సరసీరుహ సమానకీర్తి నికరోల్లస త్పంటలవెల్లి శ్రీ సురభి మాధవరాయ భూవరేంద్ర ప్రదత్త ప్రకట సకల సౌభాగ్య సాంద్రాశేష విశేష గుణోల్లసత్పేషభట్టరు వేంకటార్య తనూభవచంద్ర శ్రీ సింగరార్యకవి ప్రణీతంబైన శూద్ర ధర్మోత్పల చ్యోతిసీ స్మృతికౌముదియను మహా సత్కృతి యందు శూద్రునకు గర్భాధానాది సంస్కార విషయాధికారానధికార చింతా నిరూపణంబును సగ్న్యగ్ని భావచింతా నిరూపణంబును, సంధ్యావందనాధికారా భావ నిరూపణంబును, దీక్షాధికారంబును, బ్రహ్మజ్ఞాన నిరూపణంబును, వివాహ భేద వివరణంబును, వివాహేతి కర్తవ్యతా ప్రతిపాదనంబును, వివాహ నిరూపణంబును, నామసంస్కారాది నిరూపణంబును, ధర్మనిరూపణంబును నన్నది ప్రథమాశ్వాసము"—

దీనిక్రింద "విక్రమ సం॥ ఆషాఢ శు॥ ౨ భానువారం రెండుఝాముల వేళకు వ్రాసినది" అని కలదు. ఇది క్రీ. శ. 13-7-1760 తో సరిపడును. ఇది స్వయముగా కవి వ్రాసిన తేదియైనను కావచ్చును లేదా యనతికాలము

నకే వెలువడిన రెండవప్రతి వ్రాయబడిన తేదియైనను కావచ్చును. ద్వితీయాశ్వాసమందున్న విషయములివి.

"శూద్రాశుచి నిరూపణంబును, శూద్రాశుచి పద్ధతియు, నేకోద్దిష్ట విహితావిహిత నిర్ణయంబు నేకోద్దిష్ట శ్రాద్ధ పద్ధతియు, సపిండీకరణ పద్ధతియు, పార్వణ శ్రాద్ధ విధానంబును............................"

తృతీయాశ్వాసమందున్న విషయము లివి.

"బ్రాహ్మముహూర్తాదారభ్య (శౌచ) విధ్యాదిక నిరూపణంబును, దంతధావనవిధియును, దంతధావన పూర్వక ప్రాతస్స్నాన విధినిరూపణంబును, శూద్రమాధ్యాహ్నిక స్నానవిధి ప్రకారంబును, శూద్రబ్రహ్మ యజ్ఞపూర్వక తర్పణాదిక విధానంబును, శ్రాద్ధపద్ధతియును, భోజన పద్ధతియును, శయనాది నియమ ప్రకారంబునన్నది"—

ధర్మశాస్త్ర గ్రంథమందలి వచనము లానాటి వ్యావహారిక భాషకు చక్కని యుదాహరణములు. పీఠిక ఆనాటి సాంఘిక చారిత్రక విషయములకు దర్పణము.

(గోలకొండ పత్రిక 14-12-1960)

కొటికెలపూడి
వీరరాఘవాచార్యుడు

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారికి గద్వాల సంస్థానాధీశ్వరు లిచ్చిన యమూల్య తాళపత్ర గ్రంథములందెన్నియో యముద్రిత గ్రంథములు కలవు. వానిలో "నవీనం ద్రోణపర్వం" ఒకటి. ఇది 118 తాళపత్రములం దున్నది. 118వ తాళపత్రమొక వైపుననే వ్రాయబడియున్నది. రెండవ ప్రక్కన నేమియును లేదు. మొదటిప్రక్కన గ్రంథము ముగింపుగాక మధ్యలో నాగిపోయినట్లున్నది. అనగా ప్రతి వ్రాసినవారెవరో అంతవరకే వ్రాసి తక్కినది వ్రాయక విడిచినట్లున్నది. ఈ ద్రోణపర్వము ప్రారంభమున అనగా మొదటి కమ్మ ఎడమభాగము చివరన "ధర్మవరం కరణం రామయ్య గారు చెప్పినది నవీనం ద్రోణపర్వం" అని కలదు. అగస్త్యభ్రాతవలె ఈ కరణం రామయ్యగారెవరాయని చాలకాలము మథనపడితిని. రామయ్యకు గారు యని భావించినచో నది యగస్త్యభ్రాతవంటిదేయగును. అట్లుగాక గారయగు రామయ్య యనుకొన్న బాగుండుననుకొందును. ఈ రామయ్యగారు ధర్మవరం గ్రామమునందుండు కరణమో లేదా యా గ్రామ కరణమో తెలియదు. మీదు మిక్కిలి ధర్మవరం అనునది యింటిపేరో అంతకన్నను తెలియదు. ఇన్నిటి కన్న ముఖ్యసమస్య మరియొకటి గలదు. ఈ ద్రోణపర్వము రామయ్యగారు చెప్పినదట. చెప్పుటయనగా కవిత్వము చెప్పుటయనియా లేదా పూర్వులు చెప్పినదానిని వినిపించుటయనియా యని కొంత తికమకపడితిని. చివరకు ఈ కరణం రామయ్యగారు కవి గాదనియు కేవలము వాచకుడు అనగా వినిపించినవాడు చెప్పినవాడు అనియే నిర్ణయించుకొంటిని. ఈ ప్రతిలో గ్రంథకర్త పేరెచ్చటను లేకున్నను దీని రచయిత గద్వాల సోమభూపాలు సంస్థానమున నుండిన కొటికెలపూడి వీరరాఘవాచార్యుడని నా యభిప్రాయము. నేనిట్లని ప్రాయపడుటకు కొన్ని కారణములు గలవు.

కొటికెలపూడి వీరరాఘవకవి రచించిన యథాశ్లోకతాత్పర్యభారతోద్యోగ పర్వమును గద్వాల సంస్థానాధీశ్వరులు శా. శ. 1821లో ముద్రింపించినారు. ఈ సంస్థానాధీశ్వరుల కులవేల్పగు పూదూరి చెన్నకేశవస్వామి కీగ్రంథమంకితము. స్వామి కంకితముగా రచింపుమని పెదసోమ భూపాలుడు కోరుటచే నిట్లు జరిగినది. తిక్కనామాత్యుడు తన భారతమున ప్రతి యాశ్వాస ప్రారంభమునందును హరిహరనాథుని సంబోధించి వ్రాసినట్లే వీరరాఘవుడును పూదూరి చెన్నకేశవుని ప్రతియాశ్వాసము ప్రారంభమున సంబోధించినాడు. ఇది ముద్రితమైన యుద్యోగపర్వమును జూచిన వారికి తెలియును. (ఈ నెల "భారతి"లో శ్రీ కేతవరపు వెంకట రామకోటిశాస్త్రిగారీ కవిని గూర్చియు నుద్యోగ పర్వమును గూర్చియు వ్రాసియున్నారు.) ప్రస్తుతము లభించిన ద్రోణపర్వముగూడ పూదూరి చెన్నకేశవదేవుని సంబోధించియే ప్రారంభమైనది. మొదటి పద్య మీరీతిగా నున్నది.

క॥ శ్రీ వరకౌస్తుభరత్న, శ్రీ వత్స స్ఫురిత వక్ష శ్రితజనరక్షా
పావన వనమాలాంచద్గ్రీవా పూదూరి చెన్నకేశవదేవా.

కనుకనే కొటికెలపూడి వీరరాఘవ కవియే ఈ ద్రోణపర్వమునకు గూడ కర్తయని భావించితిని. మరియొకకవి యీ ద్రోణపర్వమును పూదూరి చెన్నకేశవునకే యంకితముగా రచియించి యుండరాదా యని సంశయము కలుగవచ్చును. మరియొక కవియైనచో గ్రంథమునకు నవతారికాదులను రచించియుండును. అందులో తన విషయమును కృతి విషయమును, కృతి స్వామి విషయమును చెప్పియుండును. అట్టిదేమియును లేక అనుబంధముగా వచ్చు దానికివలె ఒకేపద్యము సంబుద్ధిగా చెప్పియుండుటచేత నీకృతి కొటికెలపూడి వీరరాఘవ కవిదేయని తెలుచున్నది. ఈ పద్యము తరువాత మరియొక పద్యమిట్లున్నది :

క॥ శ్రీ మత్పారాశర్య కృ। పామహిమ రచింతు ద్రోణపర్వ ముభయభా
షామార్మికసూరిజన, స్తోమము లుప్పొంగ నాంధ్రమూర్తి నిపుణతన్.

ఈ రెండు పద్యముల తరువాత ద్రోణపర్వ మారంభమైనది.

గీ॥ భావము తెలంగ సేనాధిపత్యమంది
బలము వ్యూహముగా దీర్చి ప్రధన కాంక్ష

బలియుఁడైనట్టి వీరనూభవులతోన
అమ్మహారథి యాచార్యతపుడు వెడలె" నని

సంజయుడు రణరంగ వార్తలు ధృతరాష్ట్రునకు వినిపించుటలో నిది ప్రారంభమగును. కనుక ద్రోణపర్వమునకు ముందుండు పర్వములలో నేదో కథ రచనోద్యోగారులు కవి చెప్పుకొన్నవాడగుటచేతనే ఈ గ్రంథమున వాని ప్రసక్తిలేదు. పూర్వ పర్వములకిది యనుబంధమని భావింపవచ్చును.

ఇక నీ కవి కాలమును గూర్చియు, భారత రచనోద్యోగమును గూర్చియు పరిశీలింతము. కీ. శే. సురవరం ప్రతాపరెడ్డిగారు సంపాదించిన "గోలకొండ కవుల సంచిక" (పుటలు 409-410) లో నీ కవి "150 సంవత్సరముల క్రిందట" అనగా పదునెనిమిదవ శతాబ్దము చివర కాలమున నున్నట్లుగా చెప్పబడినది. ఇది పొరపాటు. ఇంతియకాక "కవి వివరములు తెలియవు; గ్రంథము గద్వాల సంస్థానమునందు లభించును" అని కూడ కలదు. రెడ్డిగారీగ్రంథ పీఠికను చూచి యుండినచో కవి కాలమును గూర్చియు కవి విషయమును గూర్చియు సరిగా తెల్పి యుండెడువారే. వారీ గ్రంథమును చూచియుండరు. ఈ భారత రచనమునకు ప్రోత్సహించిన వారు గద్వాలసీమ సోమభూపాలుడనియు, అతడు ఒక్కమాంబా పెద్ద విభుల సంతానమనియు, కందనవోలు ప్రాంతముల కేలికయగు వీరారెడ్డి అరసిభార్య లిమ్మాంబల కూతురు లక్ష్మాంబయనియు, ఆమెను పెండ్లియాడి పెద్దారెడ్డి ఇల్లటపల్లుడై రాజ్యాధికారియయ్యెననియు నీ యుద్యోగ పర్వమువలన తెలియుచున్నది. ఈ సోమభూపాలునకే పెద్ద సోమ భూపాలుడనియు సోమనాద్రి, శోభనాద్రియనియు పేరులు కలవు. ఇతడే గద్వాల నిర్మాత మరియు మహాశూరుడు. కర్నూలు నవాబునే కాక నిజాం నవాబును కూడ ఓడించినవాడు. ఇతని గూర్చి కథలు గాథలనేకములు తెలంగాణమున ప్రచారమున గలవు. ఈ సోమనాద్రి క్రీ.శ. 1663-1712 సంవత్సరముల మధ్యనుండినవాడని శ్రీమారేమండ రామారావుగారు కాకతీయ సంచికలో (పుట 262) వ్రాసియున్నారు. శ్రీనిడుదవోలు సుందరేశ్వరరావుగారు గద్వాల చినసోమ భూపాలవిరచిత రతిరహస్యము పీఠికలో గూడ ఇంచుమించుగా నిదే కాలమును సూచించినారు. కనుక తదాస్థానకవియగు వీరరాఘవుడు కూడ పదునేడవ శతాబ్దాంతముననుండినవాడే యగును

ఉద్యోగపర్వమున కవి తన వంశావళికమునిట్లు తెలుపుకొనెను. శాండిల్య గోత్రము కొటికెలపూడి వంశమున సూరకవి జన్మించెను. ఈ సూరకవినుండి వంశావతారమీరీతిగా నున్నది:

సీ॥ వరమొందె నతడేడుతరము లాక్ష్మియ సం
తతి విద్యలు ఫలింప తపసుచేత
నా సూర కవియె రాయలదేవు నభ పూజ
దాల్చె నతడు మా తాత తండ్రి
యిభరాము ధూవిభు నభ జయశ్రీల జె
లంగె మా తాత శ్రీరంగశాయి
యతనికి ప్రతిబింబమై యట్ల మా తండ్రి
రంగకవీంద్రుండు ప్రౌఢి కెంచె
భూమి నభినవ తిక్కన సోమయాజు
లనెడు పేరొందినాడ రామాంఘ్రియుగ న
మాశ్రయత వీరరాఘవాహ్వయుడ ప్రతిభ
నొందె యాజుష సాంప్రదాయుండ నేను.

ఈ పద్యము తరువాత భారత రచనోద్యోగ మొక వచనమం దీరీతిగా చెప్ప బడినది:

"ఉద్యోగ పర్వంబు తెనుంగింప నుద్యోగించితిని. ఇమ్మహాభారతంబు మున్ను నన్నయ భట్టారకుండు మూడు పర్వంబులు తెనుగించె. అరణ్య పర్వశేషంబు గొంత యఱ్ఱనార్యుండు రచించె. విరాట పర్వంబు మొదలుకొని పదేను పర్వంబులు తిక్కన సోమయాజులు నిర్మించిరి. వీరందరు వేదవ్యాస ప్రోక్తంబులైన మూలశ్లోకంబు లన్నియు దెనిగించిన బహుగ్రంథ విస్తరంబగు; లిఖింప బఠింప వినం దరంబు గాకుండు; లేఖనపఠనాదులు మిగుల గలుగ కుండునను తలంపున సపాదశతసహస్రశ్లోకసంఖ్యాతమైన భారత సంహిత యందలి కథాసారాంశంబులు సంగ్రహించి కబ్బంబును రచియించి లేని పర్వంబునం గల మూలశ్లోకంబులం గల యర్థంబంతయు నాకు దెలిసి నంతయును దెనుంగు కబ్బంబునను బ్రసంగింప గడంగితి"—

అటు తరువాత గద్వాల పురవర్ణనము, సోమభూపాలుని వంశావతారము, అతని దినచర్య, కేశవ స్వామికి ప్రతినిధిగా సోమభూపాలుడు రాజ్యము

చేయుట, ఆతని భగవద్భాగవత కైంకర్యము మున్నుగాగల విశేషములు విపులముగా వర్ణింపబడినవి. అటుపై మరల కొన్ని విశేషములు కవిని గూర్చియు, భారత రచనము గూర్చియు తెల్పునట్టివి కలవు. "అమ్మహాను భావుని (సోమభూపాలుని) ప్రభావంబును, శ్రీ కేశవస్వామి ప్రభావంబును విని వినికొండ సంస్థానంబుననుండి నేనును గద్వాల పురంబునకు వచ్చి యద్దేవునిన్ దర్శనుండనైన యానుకృతోల్లాసుం డగు తెరంగునం బొరగాంచి యా జగత్ప్రభువునకును గొన్నికల్పంబులు రచియించి వినిపించిన విని యా నృపాగ్రణి నా కవిత్వ నైపుణికి మెచ్చి నీకవిత్వంబు తిక్కన సోమయాజుల కవిత్వంబునకు దీటగు శ్రీ కేశవస్వామి యనుమతి నీకు నూతన తిక్కన సోమయాజులనియెడు పట్టానంగెద. తిక్కన సోమయాజులు భారతంబంతయు సంగ్రహించి రచించినవారగుట నీవు భీష్మపర్వంబునం దద్రచిత శేష గ్రంథంబునెల్ల దెనుగించి తత్పూర్వ గ్రంథంబునందే పూరింపవలయు నిట్లని శ్రీ కేశవుండానతిచ్చిన వాడనిన నతని కద్దేవుండు భావికార్యంబులెల్ల దెలుపు చుండెడు పొలుపు మునుపు విన్నవాడనగుటంజేసి తదాజ్ఞ వ్యతిక్రమింపనోపక భీష్మపర్వంబుగైకొని నాకు దోచినట్ల కొంత పూర్వరచిత శేషగ్రంథంబు తెను గించి పూర్వోత్తర గ్రంథంబుల నడుమనడుమ సందర్భించి యందే పూరించిన విని యానందించి నీ విప్పురంబునందే నిరంతరంబు నివసింపుమనిన నేనును గ్రమ్మర దేశంబునకున్ జని యా ప్రమాణంబులను [illegible] గూర్చు కొని మరల వచ్చెదనన నాకు దగిన సత్కారంబు [illegible] శ్రీ కేశవదేవు సము ఖమున మరలవచ్చెదనని పల్కించి [illegible] నేనును నిజదేశంబునకేగి కార్యోపాధి వశంబునం గొన్నిమాసంబులు రాకయున్న మున్ను నేనానతిచ్చిన మతి యతిక్రమించిన నా నృపతి మద్దేశంబునకు మదీయ భాగినేయుం బనిచి పిలిపించిన నేనును దగిన పరిజనంబులతో గదలి ప్రయాణంబుల వెండియు గద్వాలపురంబు ప్రవేశించి..." నట్లును సోమభూపాలుడు కవిని ఆదరించి తనగురువులతో చెప్పి ఆగురువులవారిచే నుద్యోగపర్వమాద్యరచనకై యను మతి నిప్పించినట్లును కవి చెప్పుకొనెను.

భగవంతుడు కూడ కవికి స్వప్నమున సాక్షాత్కరించి యందులకై ప్రోత్సహించి.

"ఈ కార్యము యుక్తమేనియు నగమ్యము మిక్కిలి వ్యాసవాక్యతా
త్పర్యమటంటి వేని నరలంబు మదీయనకు వసింపునా

చార్యులు దెల్పువారది నిజంబుగ సంశయమైనచోట చా
తుర్యము పేర్మి నీకయిన దోచు మరిన్సరికించ మర్త్యవరా"

అని యనుగ్రహించెనట.

పైన పేర్కొనబడిన విషయముల నన్నిటిని సాకల్యముగా పరిశీలించినచో నీ కొటికెలపూడి వీరరాఘవాచార్యు లుద్యోగపర్వ మొక్కటియేగాక భారతమం దనేకపర్వములు రచించినట్లు తెలియుచున్నది. కనుకనే ఈ ద్రోణపర్వముగూడ నీతడే రచించినట్లు భావింపనైనది. ప్రకృతము లభించిన ద్రోణపర్వము సంపూర్ణము గాలేదు. సంపూర్ణముగా రచింపబడలేదో లేక ప్రతివ్రాసికొన్నవాడు పూర్తిగా వ్రాసికొనలేదో తెలియదు. రెండు కవులలో నున్న విషయము కొలదియే. అభిమన్యునిచే లక్ష్మణకుమారుడు హతుడగుటయు నటుపైన మరికొన్ని పద్యములుగల వృత్తాంతముమాత్ర మిందులో గలదు. తిక్కనగారి భారతమున నభిమన్యువధ మున్నగు విషయములు ద్వితీయాశ్వాసమున గలవు. కాని యీ నవీన ద్రోణపర్వమునం దొక్క యాశ్వాసమైనను పూర్తిగా లేదు. సంస్కృత మూలములో బోల్చినచో నీరహస్యము బయటపడగలదు. ఒక్క యాశ్వాసమైనను పూర్తిగా నున్నచో నాశ్వాసాంత గద్యము వలన పెక్కుసమస్యలు విడిపోయియుండును.

ద్రోణపర్వమునందలి కవిత్వ మారయుటకై రెండుమూడు పద్యము లుదాహరింతును. ద్రోణుని మరణవార్తవిని ధృతరాష్ట్రుడు దుఃఖించుచు పలికిన మాటలివి:

క॥ వననిధి యింకిన తెరగున, కనక మహీధరము పెడగదలిన రీతిన్
దినమణి వ్రాలినకైవడి, ధనురాచార్యుండు పడుట దాకురు నెటులన్.

గీ॥ గర్వదుర్వారజనరిరసాంకశీలు
దళిసపుణ ధార్మికావన ప్రవరబుద్ధి
శత్రుసంతాపనుండగు చాపగురుడు
విడిచె రారాజుకొరకు జీవితము సకట.

ఆ॥ వె॥ మందభాగ్యులైన మనవారి విజయాశ
యేమహాత్ము నాశ్రయించియుండె
బుద్ధిబలముచేత బుధగురు కవి నమ
దరదు నమరనిహరుడౌట యెట్లు?

(గోలకొండ పత్రిక 21-12-1960)

బోయినిపల్లి
కుమార వెంకటరాయలు

కవిరాజుల చరిత్రములేకాదు, రాజకవుల చరిత్రములును కాలగర్భమున మటుమాయమై పోయినవి. కవి పండితులను పోషించుటేకాక సప్త సంతానప్రతిష్ఠ లొనర్చిన రాజకవి బోయినపల్లి కుమార వెంకటరాయలు. ఇతడొక పద్మనాయక ప్రభువు, పానుగల్లు దుర్గాధిపతి. ఇతని తల్లి రామాంబ, తండ్రి వెంకటరాయలు. ఇంటిపేరు బోయినిపల్లివారు, వీరిది పెన్నాలగోత్రము. కుమార వెంకటరాయలు పదునేడవ శతాబ్దము మధ్య భాగమందుండినవాడు. ఇతని కృతి "ద్రౌపదీ కల్యాణ"మను నైదాశ్వాసముల మహాప్రబంధము. ఈ గ్రంథముకూడ గద్వాల సంస్థానాధీశ్వరులు ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ వారికిచ్చినట్టిదే.

ద్రౌపదీకల్యాణము తిరుపతి వేంకటేశ్వరస్వామి కంకితముగా రచింపబడినది కనుక ప్రారంభ పద్యమిట్లున్నది.

శా॥ శ్రీవత్సాంకము భూమి భామయను దృష్టిం జేష్టలం దత్సమీ
హావృత్తిన్ దన దివ్యకౌస్తుభమణీ చ్ఛాయన్నిరోధించి లీ
లావైముఖ్యము దోపకుండ నలమేల్మంగం బరీరంభ సౌ
ఖ్యావిర్భూతి నలర్చు వెంకటనగార్యుండు మమ్మేలుతన్.

రెండవ పద్యమున నిలువేల్పగు నరసింహస్వామి స్తోత్రము కలదు. ఆటుతరువాత శివ, బ్రహ్మ, లక్ష్మి, పార్వతి, సరస్వతి, విష్వక్సేన ద్వారశాఖ్యాదులు, రామానుజుల ప్రార్థనము లొక్కొక్క పద్యమున గలవు. పదునొకండవది సీస పద్యము. అందు తమ యాచార్యులను కవి యీ రీతిగా పొగడినాడు.

సీ॥ శ్రీతుల కద్వయవాది మతి నిరూపించియు
ద్వయవాది ధర్మసంధాతయయ్యె
సౌరానుమత కులాచారంబు గాంచియు
శమిత సారకుల ప్రచారుడయ్యె
భాగవత స్నేహభావంబు దాల్చియు
వివిధ భాగవత విద్వేషియయ్యె
పరమతత్త్వ రహస్య పరిశీలుడయ్యు వి
వర్జిత పరమతత్త్వ గతివెలసె

గీ॥ ధరణి నేఘనుడా సముద్రాల తిరుమ
లార్య దౌహిత్ర వేంకటాచార్య సూను
కోనపాచార్యవరసూనుకీనగురుల
ప్రస్తుతించెద ననితరభక్తియుక్తి.

పన్నెండవ పద్యమున తండ్రిని, 13వ పద్యమున వాల్మీకి వ్యాసులను, 14వ పద్యమున కాళిదాసాది సంస్కృత కవులను, 15వ పద్యమున కవిత్రయమును, 16 వ పద్యమున పోతన, భాస్కర, శ్రీనాథ, పెద్దనాదులగు ప్రాచీన కవులను కీర్తించినాడు. 17 వ పద్యమున కుకవి పరామర్శ గలదు. 18 వ పద్యమున సందరు కవులు సాధారణముగా "అని యిష్టదేవతా వందనంబును" అని చెప్పు వచన భాగమందలి విషయమున్నది. అనగా మొదటి 17 పద్యములందలి విషయము సంగ్రహింపబడినది. అటుతరువాత "మదీయావాసరాజధానిం జెప్పెద"నని యొక సీసమున పానగంటి దుర్గమును వర్ణించినాడు. (దీనికే పెదపానుగల్లని పేరు) ఈ పానుగల్లు వర్ణనము మరి నాలుగు పద్యములందటులే సాగిపోయినది. ఇట్లుండగా శరదాగమమును, తదవసరంబున దుర్గా, సరస్వతి, లక్ష్మీపూజలు చేసి హరికథాగోష్ఠినుండి తాను రచింప దొరకొన్న గ్రంథమునకు కృతికి నాయకుడెవరాయని యాలోచించు నొక రాత్రి నాల్గవ జామున

"కలుషములీనెడు కేలు గలమేలు నెలమేలు నలమేలుమంగ యుంగలను వెనయ"గా వెంకటేశ్వరుడు స్వప్నసాక్షాత్కారమొసర్చి తనకంకితముగా కృతి రచింపుమని యానతిచ్చెను. మరునాడు కవి తన స్వప్నమును దలం

చుచు చెలులు, చుట్టములు, సామంతులు, మంత్రులు మున్నగుగాగల వారితోఁ గొలువై యుండును.

చ॥ కొలువయియుండి డెందమునకుం దొలునాటి నిశాంతవేళ నా
కల గననైన వెంకటనగప్రభువాగమ్మృతంబు గ్రొంజతుక్
గొలువగ నానుచో మయి గగుర్పొడవం బరవాళ్ళ బంపి బో
ర్వెలి నరసింహ నామ సుకవిం బిలిపించిరి నంచెలంచెలన్.

చ॥ ఉరుగక నారసింహ కవి యూడిగపుం బుధుతల్ ప్రియోక్తులన్
బడి బడిపోయి పిల్వ మదుపాంతము జేరగ నేగుదెంచె వెం
బడి నడతెంచు లేఖకులు పాతకు లుత్తపదార్థ గౌరవం
బడుగుచు రాగ నానభను నల్లన నుల్లము పల్లవింపగన్॥ —

(ఈ బోరవెల్లి గద్వాలకు సమీపమందున్నది).

ఈ రీతిగా వచ్చిన బోరవెల్లి నరసింహకవి కుమారవెంకటరాయలను దీవించి, యాతని గుణగణములను, సభాసదులను పొగడును. అందులో మొదటి (42) పద్యమిట్లున్నది:

సీ॥ గోప గోపక గోప గోపనక్ నలువొందు
నీ దయోదయ భోగ నియతికలన
రాజ రాజప రాజ రాజజాల్ జాలుకన
నీ నిదాన ధనాది నిధన నిధుల
ధర్మ ధర్మజ ధర్మ ధర్మముల్ ములుసూప
వరయ నీ కమన నత్య బులిగతుల
రామ రామా రామ రామమూర్తులతుల
నీ బల ధర్మార్థ నిశ్చయములు
గీ॥ గండభేరుండ గండర గండ చండ
సమర నిశ్శంక బిరుదాంక నదకలంక
పద వికంకట వెంకట ప్రభుకులాధి
నాయక కుమార వెంకటరాయ ధీర.

ఈరీతిగా స్తోత్రము చేయు బోరవెల్లి నారసింహ కవినిగూర్చి కుమార వెంకటరాయలు,

శా॥ ఆర్వేలాన్వయగేయ రాయసము మల్లామాత్య సూర్యాన్వవా
ఘోర్వీదేవ మత స్వతంత్ర కపిగోత్రోద్భూత దత్తాహ్వయాం
తర్వాణీ ప్రియ సూను కృష్ణవిదుషే (బుధా) త్కృప్రోత్పుండ్రైన యా
బోర్వెల్లిపుర నారసింహ కవి సంబోధించి యిట్లంటోగిన్ (46)

సీ॥ మీ తాత తాతకు భ్రాతృజసూతి గ
దా రాయసము మల్లసూరి చంద్ర
భాను చరిత్ర మొప్పగజెప్పె మీ తాత
రత్నన్న కల్పశాస్త్ర ప్రవీణు
డతని సుతుండు కృష్ణప యయాతి చరిత్ర
మిశ్రకావ్య మొసర్చె మీ జనకుడు
చేసిరిపేవు దశ,ఆశాశ్వలంపురి
నృహరి దయోదయా మహిత కలిత

గీ॥ కృతి యతనికంకితముగ బండితుల మతుల
నెనయు సౌవర్ణకాఖ్యాన మనగ నొకటి
యుభయభాషా విశేషోక్తియు (...శిథిలము...)
సిద్ధముగ సాంప్రదాయ ప్రసిద్ధి గనుచు॥ (47) స్తుతించును.

పై రెండు పద్యములందు బోరవెల్లి నారసింహ కవి తండ్రి తాతల పేరులును వారి వారి రచనములును దెలియుచున్నవి. ఈ గ్రంథములన్నియు నేమైపోయినవో? తరువాత పద్య మిట్లున్నది;

చ॥ అరమరలేక ధీనముదయాతిరయాహృదయాంతరుండనై
యెరుకమతిన్ సుబోధ గురుడే గురుడే వరుడే యటంచు నిన్
గరము ప్రియంబొనర్ప భువి నాక వినాయ వినాకృతిన్ శుభా
కర కవితల్ గడించెదవుగా యవుగా నవుగామ నెప్పెరన్. (48)

దీనివలన కుమార వెంకటరాయలకు బోరవెల్లి నారసింహకవి గురు స్థానీయు డని తెలియుచున్నది.

కవి తన స్వప్నవృత్తాంతమును నారసింహ కవికి చెప్ప నారతు సంతోషములో కుమార వెంకటరాయల వైభవమెన్నుచు కృతి రచనమునకు

ప్రోత్సహించును. అంత గురువును నమస్కరించి "త్రిభువనంగ సంగతానంద లింగి నెనంగ ద్రౌపదీ కల్యాణ కథా కథన వ్యాసంగంబు నంగీకరించి" తన వంశావతార వర్ణనమునకు నుపక్రమించెను.

పెన్నాల గోత్రము గల బోయినపల్లి పద్మనాయక కులమున "వైరి రాజిత నిజసిత చ్ఛత్ర చిత్ర, గండభేరుండ బిరుదాంక మండనాభిరామ సామవహ్నత వైరి రావణుండు" రామవమానాయకు డుద్భవించెను. అతని భార్య అబ్బమ్మ. వీరి సంతానము అప్పన. అప్పన భార్య ధర్మాంబ. వీరి సంతానము 1. రామరాయలు (ఇతని రాజధాని కోవెలకొండ) 2. తిమ్మ రాయలు 3. కోననాయకుడు. ఈ కోననాయకుని భార్య కృష్ణమ్మ. ఈమె వె(లి)జాల మాధవరాయ నృపతి కూతురు. కోననాయకునకు కృష్ణమ్మయందు 1. అప్ప, 2. మాద, 3. తిమ్మ, 4. వెంకట నృపాలురను నలుగురు పుత్రులు ఉదయించిరి.

"వెలగి రానల్ప రాయప శ్రీయు నెనగ
జిష్ణుగతి సర్వలోకము స్థితి వహించి
కుతుబుషా దత్త బిరుదాంక కుతుకమతులు
మెతుకు గిరి దుర్గమున కధిపతులు నగుచు"

కుతుబ్‌షాహీలచే సత్కృతులైన వీరి తరువాతి తరమువారగుటచే ఏతత్కృతికర్త పదునేడవ శతాబ్దమునకు చెందినవారని నిశ్చయముగా చెప్ప వచ్చును. మెతుకు దుర్గము మొదట పద్మనాయకుల వశమునుండి తరువాత ఒడ్డకైవసమైనది. కవి కాలమునాటికది వెలమల యధీనమందుండెను.

పై నలువురన్నదమ్ములలో మూడవవారగు తిమ్మనాయకుడు విఖ్యాత సాహిత్య బిరుదాంకుడు కొండవీట నుండువాడట. ఈతని కుమారుడు వల్లభ రాయుడు. నలువురిలో కనిష్ఠుడగు వెంకట రాయలు పెద పానుగల్లు దుర్గాధిపతి; కృష్ణవేణీ జలక్రీడనా వినోదనా బిరుద విఖ్యాతుడు. ఈ వెంకట రాయల కిరువురు భార్యలు. 1. రామాంబ. 2. నరసాంబ. వెంకటరాయలకు రామాంబ వలన నిరువురు కుమారులు గలిగిరి. జ్యేష్ఠుడు కోననాయకుడు (భార్య యామాంబ). కనిష్ఠుడు ద్రౌపదీ కల్యాణ రచయిత యగు కుమార వెంకట రాయలు. ఈతని భార్య మాదవి. కవి తన పెదతండ్రులు, వారి

భార్యలు, వారి వారి సంతానములను గూర్చి విపులముగా వ్రాసియున్నారు. ఆటుతరువాత మరికొన్ని పద్యములందు కృతిపతియగు వెంకటేశ్వరస్వామి స్తోత్రము కలదు. తరువాత షష్ఠ్యంతములు చెప్పి "అభ్యుదయ పరంపరాభి వృద్ధ్యంకుర నవరసాలంకారాంకితంబుగా నా రచియింపంబూనిన ద్రౌపదీ కల్యాణంబను మహాప్రబంధంబునకుం గథా ప్రారంభం బెట్టిదనిన" అని కావ్యమును ప్రారంభించినారు.—

ప్రతి యాశ్వాసము చివరనుండు పద్యముల దు వివిధవృత్తములను గర్భ కవిత్వము, బంధ కవిత్వము మున్నగు చిత్రములను గూడ ప్రదర్శించినారు.

ప్రథమాశ్వాసాంత గద్యమీరీతిగా నున్నది:

"ఇది శ్రీ మద్వేంకటేశ్వర ప్రసాదోపలక్షిత లక్ష్మీకళా విలాసమాన సకల సుకవిజన తేగీయమాన పెన్నాలగోత్ర పవిత్ర బోయినిపల్లి కలశ పారావార కైరవమిత్ర రామమాంబా గర్భనిర్భర శుక్తి ముక్తాఫలాకార యనవద్య విద్యావిశంకట వెంకటరాయకుమార గండభేరుండ బిరుదాభిధేయ కుమార వెంకటరాయ ప్రణీతంబైన ద్రౌపదీకల్యాణంబను మహా ప్రబంధంబునందు ప్రథమాశ్వాసము."

ఐదాశ్వాసముల గ్రంథము సంపూర్ణమైన తరువాత ఆశ్వాసాంత గద్యము ముగిసిన తరువాత సాధారణముగా వ్రాయసకాండ్రు వ్రాసెడు పద్యములు వ్రాయబడియున్నవి. వాని తరువాత మరి రెండు పద్యములు కలవు. వానిలో చివరి పద్య మీ విధముగా గలదు (౨౩౪ వ కమ్మ)

సీ॥ కుశల వృత్తిగ్రాహకుండ వీవైయుండ
 కుశలవృత్తిగ్రాహకుండనైతి
సర్వాత్మ నలదృష్టశాలి వీవైయుండ
 సర్వాత్మనల దృష్టశాలినైతి
ఆగావదేశ విఖ్యాతివీవైయుండ
 ఆగావదేశ విఖ్యాతినైతి
గణుతింప నాయకాగ్రణివి నీవై యుండ
 గణుతింప నాయకాగ్రణినె యైతి

గీ॥ తద్గుణముగాదె నాకు నిదానమైన
కరుణ చేపట్టి తిరిగాక మరి సమర్థు
లర్థినెంతైన దీనికెంతర్థమీయ
వచ్చు వెంకటరాయ భావజ్ఞమూర్తి.

ఈ పద్యము వ్రాయసకానిది గాక స్వయముగా కుమార వెంకట రాయలు కృతికర్తయగు వెంకటేశ్వరస్వామి నుద్దేశించి చెప్పినదై యుండును. ఇట్టి భక్తులను కవి పండిత పోషకులును నగు ప్రభువుల కావ్యములుగూర్చి మరుగుపడి పోవుట విచారకరము. ఇప్పటి వంశీయులెవరైన కలరో లేరో, ఉన్నచో వారైనను దీనిని ప్రకటించిన బాగుండును.

పంచమాశ్వాసాంతమున గల ఒక పద్యముతో ముగింతును.

మ॥ "అరులంతై యలంకమై ప్రభు ననూనాకర్షమై వర్ణమై
యతిపాపవహమై శుభావహమునై యాచంద్రతారార్క సు
స్థిరమై యుండెదుగాక వెంకట నగాధిస్వామి యుష్మద్గుణాం
కిత మేతత్కృతి యాశ్రితస్ కవిజనాంగీకార సారోన్నతిన్."

(గోలకొండపత్రిక 28-12-1960)

తురుమిళ్ళ రామన

ఆంధ్ర వాఙ్మయ చరిత్రమున సువర్ణ యుగముగా పరిగణింపబడు ప్రబంధ యుగమునకు చెందియు మరుగువడిన మాణిక్యములందీ తురుమిళ్ళ రామన యొకరు. శేషధర్మములను ప్రబంధములుగా కూర్చినవారియందీత దగ్రగణ్యుడు. శేషధర్మములను తామరపల్లి తిమ్మయ్య పధాని, వెణుతురుపల్లి విశ్వనాధకవి, కొడిచెర్ల శ్రీనివాసకవి, కానాల నరసింహకవి మున్నగు ప్రాచీన కవులును, చెరలువాడ సుందర రామశాస్త్రి, అల్లమరాజు సుబ్రహ్మణ్యకవి, నోరి గురులింగశాస్త్రి, యస్. కతకోపాచారి వంటి అర్వాచీన కవులును చేపట్టిరి. ఈ కవులందరకన్న తురుమిళ్ళ రామన ప్రాచీనుడని తోచుచున్నది. చెన్నపురి ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారమందు కూడ తురుమిళ్ళ రామన రచించిన శేషధర్మము ప్రతి యున్నట్లు ఆంధ్ర వాఙ్మయ సూచివలన తెలియనగును. కొడిచెర్ల శ్రీనివాసకవి మరియు కానాల నరసింహకవి విరచిత శేషధర్మములు ముద్రితములో యముద్రితములో తెలియదు కాని తక్కిన పైవారి గ్రంథములు మాత్రము ముద్రింపబడినటుల ఆంధ్ర వాఙ్మయసూచియందు గలదు. తురుమిళ్ళ రామనకవి శేషధర్మము కూడ అముద్రితమే. ఈ కవి కాలము గూర్చి ఇదమిత్థముగా తెలియకున్నను గ్రంథపీఠికలోని విషయములనుబట్టి ఈతడు పదునారవ శతాబ్దము వాడని యూహించుచున్నాను. వనపర్తి సంస్థానాధీశ్వరు లాంధ్రసారస్వతపరిషత్తు వారికిచ్చిన తాళపత్ర గ్రంథ భాండాగారమందీ గ్రంథము కలదు. పీఠికాదులందున్న విషయములను క్లుప్తముగా తెలియజేయుటే నాయుద్దేశము.

ప్రారంభ పద్య మిట్లున్నది.

"శ్రీ మించన్ నరసోదయుండయి మహాసింహాసనారూఢుడై
ధామస్ఫూర్తి నెసంగి తమ్ములకు సత్యాసంధ సంధాయుడై
ప్రేమన్ ఆక్రమునేలు శాశ్వరహరున్ శ్రీరామ ధాత్రీశధా
వామేయప్రథమానుడై యలరు పద్మాధీశ్వరున్ గొల్చెదన్"—
ఆశ్వాసాంత గద్యమిట్లున్నది.

“ఇది శ్రీరామభద్రపదద్వంద్వకృపాకటాక్షవీక్షాలబ్ధ నరస కవితావిభ్రామ సంతవరవంశ సుధాంభోనిధానసుధాధామ, మనీషానిర్జితభోగిరాజ నాగరాజా మాత్యతనూజ, నకలవిద్వజ్జనతేగియమాన సద్గుణసాంద్ర, తురుమిళ్ళ రామన కవీంద్ర ప్రణీతంబైన హరివంశోక్త శేషధర్మంబులందు సర్వంబును అష్టమా శ్వాసము.”

ఈ శేషధర్మ ప్రబంధము శ్రీరామచంద్రున కంకితంబుగా రచింపబడి నది. మొదటి పద్యమును పైన నుట్టంకించినాను. రెండవ పద్యమున శ్రీరాము వర్ధాంగియగు సీతాదేవి ప్రార్థనమున్నది. ఆటు తరువాత భరత, లక్ష్మణ, శత్రుఘ్న, ఆంజనేయాదుల స్తోత్రము లున్నవి. ఆటు తరువాత గురుస్తుతి కలదు. ఈ గురుస్తుతి పద్యము కవికాల నిర్ణయమునకు తోడ్పడునను నభి ప్రాయముతో దాని నుదాహరించుచున్నాను.

సీ॥ ప్రతి దినానేక హిరణ్యదానోత్సాహమున బొల్చు ననఘవర్ధనకరుండు
నకలపుణ్యజనేష్టనంధాయకాధిక ప్రౌఢిమించిన యదర్పకగురుండు
కర్ణ నంహ్యర్జున ఘనయశోన్కరచర్య దనరు ననుగ్ర సుదర్శనుండు
గురుతరానంతన గోత్రోదయస్ఫూర్తి యెనగ గాంచిన యనంత్యరథధరుండు

భరణి నేదేశకాఖావతంస మట్టి
దాన నిరహారి శ్రీమనత్పుల విధాన
కుశలు భట్టరు రఘునాథ గురువరాలి
దాన నరవిష్ణుమూర్తి గీర్తనమొనర్తు.

ఈ పద్యమువలన తురుమిళ్ళ రామనకవి రఘునాథ భట్టరాచార్యుల శిష్యుడని తెలియుచున్నది. కంచెర్ల గోపన్నకూడ దాశరథి శతకమున ఒకా ొక రఘునాథ భట్టరాచార్యుల కంకితించినాడు.

గురుస్తుతి తరువాత సంస్కృత కవులగు ప్రాచేతస, బాణ, కాళిదాస భవభూతి. శివభద్ర, మాఘ, దండి, హర్ష, శుక్లాణ, బిల్హణ, భారవి, మయూ రులను, తెలుగు కవులగు కవిత్రయము వారిని, తెలుగు లాక్షణికులగు ల్లంకి తాతమనీషి, భీము, ననంతు, చిత్రకవి పెద్దనలను తలపోసినాడు. వ్యనులో కుదిరికకై కవులను ముందువారిని వెనుకను వెనుకవారిని ముందు ను పేర్కొనినను వెల్లంకి తాతంబట్టు, చిత్రకవి పెద్దనలను ఈ కవి ర్కొనుటచే వారికి సీతడు తరువాతివాడని మనము తెల్సుకొనుటకు వీలగు

దున్నది. ఈ కవి తనకు కవితారచనమున తోడ్పడిన కవిమిత్రునకు కృతజ్ఞత ఈపద్యమున దెల్పుకొనినాడు.

ఉ॥ చిత్తమునం దలంచి నుతిచేసెద మత్కృతికిన్ సహాయము
దృత్తరమైత్రి జేసిన మహామహు సత్కవులెంచ పద్ధర
ర్మోత్తర ముఖ్య సత్కృతు లనూనదమత్కృతి హీరజేయు స
ద్వృత్తము భద్రిరాజు కులధుర్యుని తమ్మనసూరి వర్యునిన్.

తురుమెళ్ళ రామనకవితోపాటు ఈతని మిత్రుడు భద్రిరాజు తమ్మన సూరి గూడ మరుగుపడిన మాణిక్యమే.

ఇష్టదైవమగు శ్రీరామచంద్రుడు స్వప్నమున సాక్షాత్కరించి కృతి రచింప ప్రేరేపించినట్లుగా నీకవి చెప్పుచున్నాడు.

సీ॥ వెడద కన్నులవాడు వేల్పురా రతనంబు నిద్దంపుమై నిగనిగలవాడు
మందహాసమువాడు మందారశాఖికాశోభమాయత భుజాయుగమువాడు
మెరుగు చెక్కులవాడు మేలిపున్నమ చందమామగేరెడు ముద్దుమోమువాడు
మణికిరీటమువాడు మహనీయ ముక్తాసరంబులుగల పేరురంబువాడు
తళుకు బంగరు వ్రాల దువ్వలువవాడు
జనకనందన చెంగట దనరువాడు
రమ్యభక్తానువర్తి శ్రీరామమూర్తి
యలర సాక్షాత్కరించి యిట్లనుచు బల్కె.

క॥ తురుమెళ్ళ కులాంబుధి పూ
ర్ణ రజన్యధినాథ రామన సుధీంద్ర భో!
హరివంశ శేషధర్మము
లురుమతి తెనుగించు భాగ్య మొదవెన్నికున్.

చ॥ వినవిన నింపునించు కృతి విశ్రుతనిర్మలధర్మమర్మముల్
కనలగజేయు ఘోరతర కల్మషజాతలతాలవిత్రమై
తనరు సమీప్సితార్థ ఫలదాయకమై తగు శేషధర్మ పా
వన చరితంబు తన్మహిమ వాక్పతికైన గణింపశక్యమే.

ఉ॥ భారతముఖ్యసంహితలు భాగవతాదిపురాణముల్ వచ
శ్శ్రీ రహిమీరగా తెనుగుజేసిన పూర్వకవీశ్వరుల్ దమో

దారకటాక్షవీక్ష నను ధన్యునిగా నొనరింపజూచియో
దారు రచింపరైరి వసుధాస్థలి తెన్గుగ శేషధర్మముల్.

పోతనగారివలెనే తురుమిళ్ల రామనకవి తనకన్న పూర్వులీ గ్రంథమును తెనుగు చేయకపోవుట తనను ధన్యుని చేయుటకే యని తలంచినాడు. మిక్కిలి ఔచిత్యమువలన శేషధర్మములు రచించిన తామరపల్లి తిమ్మయ ప్రధాని మరియు వెణుతురువల్లి విశ్వనాథకవి వంటి ప్రాచీనులుకూడ తురుమిళ్ళ రామన కవికి తరువాతివారేయని తెలియుచున్నది. శేషధర్మమును రచించుటకు తానే మొదటివాడనని కంఠోక్తిగా చెప్పుకొనినాడు గదా।

తన స్వప్నవృత్తాంతమును కవి విద్వత్కవి బంధు సందోహమునకు వినిపించును. వారాతని ప్రోత్సహించి ఆతనిపూర్వుల నభివర్ణింతురు. కవి వంశావతార సాలుధసందోహము నోట వినుపించి యౌచిత్యమును పాటించినాడు. కవివంశవృక్ష మీదిగా నున్నది.

గౌతముడు (గోత్రకర్త)

తిమ్మనచివుడు (భార్యయెల్లమ)

రామనమంత్రి (భార్య బుక్కాంబిక-లింగరాజు తనయ)

1. పెద్దయెల్లయ 2. చినయెల్లయ 3. చిట్టన 4. తమ్మరాజు 5. పెదయక్కలయ్య
6. చినయక్కలయ్య 7. నాగమంత్రి 8. లోకయ 9. అప్పన్న 10. తిమ్మరాజ
11. లింగన 12. లోకన్న
(భార్యగోపమ్మ-పొలుకంపల్లె తిమ్మనపుత్రి)

1. చిట్టనమంత్రి (భార్య ఎర్రమ్మగొట్టిపాటి మల్లనబిడ్డ)
శేషాద్రి

2. పావన్న (భార్య లక్షమ్మ మద్దిరాల గంగార్యునిబిడ్డ)

3. రామనమంత్రి (కృతికర్త) (భార్య వెంగమాంబ అనంతపురపు ఎల్లమంత్రిబిడ్డ)

కవినిగూర్చిన వివరములు తెలియజేయునట్టి మరిమూడు సీసపద్యము లున్నవి. వీనిలో నాతని ప్రభువును గూర్చియు, అతని యుద్యోగమును గూర్చియు, అతడు చేసిన పుణ్యకార్యములను గూర్చియు వివరము లనేకము లున్నవి.

సీ॥ కూర్చినాడవు చాల కుంభినీజనులెంచ ధర్మసామగ్రియే ధనముగాగ
పేర్చినాడవు జాంద పేటికాంతరమున పటుకీర్తి కర్పూరఫలకరాశి
చేర్చినాడవు స్వాంతసింహాసనంబున గట్టిగా రఘుకుల పట్టభద్రు
నేర్చినాడవు బంధుసరార్థిపాథోరుహామిత్రుండవై యలరజేయ

ధన్యుడవు నీవు వర్ణింపదరమె నిన్ను
రామభద్రదయాలబ్ధి రామభద్ర
అనఘనుత పుణ్య నందవరాగ్రగణ్య
మహిత గుణసాంద్ర రామయామాత్య చంద్ర.

సీ॥ తన అగణ్యనిసర్గఘనకీర్తిలతకు దిగ్దంతిదంతము లుపఘ్నములుగాగ
తన దీవ్యమానప్రతాపంబు పరిపంధిలలవనాలికి దవానలముగాగ
తన సమున్నతతీవ్రతరహారి జయరమాతరుణికి కేలిసౌధంబుగాగ
తన నిరంతరదానధౌరేయహస్తంబు సకలార్థులకు కల్పశాఖిగాగ

దనరు వేముల పురవరాధ్యక్షుడగు
కూనపులి చిన్ననాయక క్షోణిపతికి
కార్యనిర్వాహకర్తవై గౌరవమున
ప్రబలి తౌరౌర తురమిళ్ళ రామధీర.

ఈపద్యమువలన తురుమిళ్ళ రామకవి వేములపురపాలకుడగు కూనపులి చిన్ననాయకునకు కార్యనిర్వాహకర్త యని తెలియుచున్నది. వేముల కడప మండలము పులివెందుల తాలూకాలో నున్నది. కూ.పులివారి వంశ వృక్షము, ఇంపల్లి కొండపార్యుని ద్విపద భాగవతమున నున్నట్లు విద్వాన్ శ్రీ పళ్ళె వేంకటరామిరెడ్డిగారనుచున్నారు. ఇదియు నముద్రితమే. చిన్న నాయకుని కాల మెదమిత్థముగా తెల్సుకొన్నచో తురుమిళ్ళ రామన కాలము గూడ సరిగా తెలియగలదు. ద్విపద భాగవతము శ్రీ రెడ్డిగారిచెంత గలదట. దీనిలో ననేక చారిత్రకాంశములున్నవట. మరియొక సీసపద్యమున రామకవి చేసిన పుణ్యకార్యము లిట్లువర్ణింపబడినవి.

సీ॥ గరిమ మీరకుమార్ళకాల్వ దీపాలాధీశ్వర శ్రీ వేంకటేశ్వరునకు
చేయించినాడవు చెలువమై కనువట్ట పల్లకి యొక్కటి భక్తిమీర
నిలిపి నాడవు స్వర్ణనిర్మితకలశంబు తద్భవనోపరి స్థలమునందు
చెన్నొందగ వెల్పుల చెన్ననాయనికి గోవాళ చేయించి సర్వత్ర కవచ

భవ్యపీతాంబరాదికాభరణములు స
మర్పణము సేసితివి పీటికన్నిటికిని
శేఖరంబుగ కృతిచేసి శ్రీరఘూర్వ
హునకు రామయామాత్య నీవొనగు మనిరి.

పైపద్యమునగల కుమార్ళ కాల్వ కడపమండలము రాయచోటి తాలూకాలో నున్నది. వేల్పుల పులివెందుల తాలూకాలో నున్నది. ప్రాచీన గ్రంథములందును శాసనములందును ఈనాటి కాల్వ, కాలువ శబ్దములు "కాల్వ"గా నుండునని శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగా రనుచున్నారు. రాయచోటి తాలూకాలోనున్న కుమార్ళకాల్వయే తురిమెళ్ళ రామన పేర్కొన్న కుమార్ళ కాల్వ.

పై సీసపద్యము తరువాత "అనిసనేసు సంతోష శ్రీ సమాశ్రిత హృదయాబ్జుండనై మత్కృతికి నుభాలంకృతియగు శ్రీ రఘుపతి చరితం బభివర్ణించెద" నని చెప్పి శ్రీ రామచంద్రచరిత్రము నభివర్ణించి షష్ఠ్యంతములు చెప్పి "సముచితంబుగా నా యొనర్పంబూనిన శేషధర్మంబను మహాప్రబంధమునకు కథాక్రమం బెట్టిదనిన" అని కథాప్రారంభ మొనర్చినాడు. గ్రంథమంతయు 208 కమ్మలలో చక్కనివ్రాతలో ఏమాత్రమును శిథిలము గాక భద్రముగానున్నది.

తురిమెళ్ళ రామన చిత్రబంధ కవిత్వములందుగూడ దిట్టవలె నున్నాడు. ఆశ్వాసాంతములందిట్టి పద్యములు కాననగును. నాలుగవయాశ్వాసము చివరన భుజంగప్రయాతవృత్తగర్భితస్రగ్విణీవృత్త మిట్లున్నది.

"రాజమానోదయా రమ్యతేజోహరీ
యాజితూనిర్భయా యాత్మనానాహరీ
భ్రాజితారాతిశయా ప్రముదవాటీ హరీ
రాజితారాన్వయా రావణారీహరీ"-

దీనితర్వాత

“ఈ వృత్తములో గురునున్న హరిశబ్దము మొదలునుంచి చదివితే పలంగప్రయాతవృత్తమవునా” అనియు కలదు. పైవృత్తమునగల అక్షరము నాటి మామిళ్ళపల్లెకు సంస్కృతీకరణమై యుండును. మామిళ్ళపల్లె కరప త్ర్యేన్నేపను సమీపమున గలదు.

పంచమాశ్వాసాంతమునగల ఖడ్గబంధములో నీ కవి పరిచయము లగింతును.

సుగంధివృత్తము.

“ధీరవార సారసార్క దప్పసేవ్య దవ్యరా
దారిలోగ్ర పంక్తి కంత దత్తజాభివర్తితా
ధారహార తారతావదార సద్గుణాస్పదా
దారుణాఘమేఘ మారుతా గతావనవ్రతా”

(గోలకొండ పత్రిక 4-1-196)

ఇనుగంట్ల కృష్ణప్రధాని

తెలుగు వాఙ్మయము మధికముగా ప్రభువుల దోహదమున వర్ధిల్లినది. కవులకు జీవనోపాధియు, ఇహసౌఖ్యములును, పోషకులకు శాశ్వతకీర్తులును, పుణ్యమును ఈ విధముగా ఉభయతారకమునైనది రాజాశ్రయము. ఆంధ్ర వాఙ్మయమున నెవ్వరిని ఆశ్రయింపకయే వర్ధిల్లిన భాగముగూడ కొంతగలదు. వీరిని ఆశ్రయింపని కవులు తమ్ముగూర్చి విపులముగా చెప్పుకొన్నవా రరుదు. అందులో భగవంతున కంకితముగా గ్రంథములు రచించినవారు తమ్ముగూర్చి చాలా తక్కువగా చెప్పుకొన్నారు. వీరిలో కొందరి కాలమునుగూర్చి కాని, యూరుపేరులగూర్చిగాని, పుట్టుపూర్వములగూర్చి కాని సరిగా తెలియదు. ఇట్టి కోవకు చెందిన వారిలో మన ఇనుగంట్ల కృష్ణప్రధాని యొకరు. ఈతడే కాలమువాడో తెలియదు. ఈతడు "ధర్మరాజాశ్వమేధ"మను నైదాశ్వాసముల ద్విపద కావ్యమును వ్రాసినాడు. గ్రంథమున చివరకమ్మలు కొన్ని పోయినవి. ౨౦౧ కమ్మలలో మిగిలిన గ్రంథముకూడ మిక్కిలి జీర్ణదశలో నున్నది. ఇది శ్రీరంగపతి చరిత్రము.

ఆశ్వాసాంతభాగము వలన కవి కులగోత్రములు, తండ్రిపేరు గురువుపేరు గ్రామనామములు మాత్రము తెలియవచ్చుచున్నవి.

"ఆని సమావర్తకు నఖిలకర్తకును, ఘన నగోద్ధర్తకు కలుషహర్తకును
హతశలంభున కాహ్వతాకబంధునకు, నతిదయాసింధునకాప్తబంధునకు
శతకోటి కందర్ప సన్నిభాకృతికి, అతదైత్య వితతికి శ్రీరంగపతికి
అంకితంబుగ నాశ్వలాయనసూత్ర, సంకలిత శ్రమ సహిత వర్తనుడు
ఘనపు నందపు(రా)గ్రహారనివాసు, డినుగంట్లసోమమంత్రీంద్రనందనుడు
తిరుమల వెంకటేశ దివ్య, చరణ సేవనుడు కృష్ణప్రధానుండు
అర్మిలి రచియించి యర్పించినట్టి, ధర్మరాజాశ్వమేధవిధాన మనెడు
సుందరంబగు కథామాత్రమందెన్న, నందంబుగా ప్రథమాశ్వాసమయ్యె"

పై ద్విపద పంక్తులవలన కవి ఆశ్వలాయన సూత్రుడనియు, నందరాగ్రహారనివాసియనియు, అనుగంట్ల సోమమంత్రికుమారుడనియు, తిరుమల వెంకట దేశికుని శిష్యుడనియు తెలియుచున్నది. కవిని గూర్చి యీ గ్రంథమువలన తెలియనగు విశేషము లింతకెక్కుడు లేవు. ఈ నంద పురాగ్రహార మెచ్చటగలదో తెలియదు. అనుగంటి వెంకన్న అగ్రహారము, నందపురి వలన అను గ్రామములు గజపతి నగరం తాలూకా విశాఖపట్టణము జిల్లాలో నున్నట్లు మద్రాసు ప్రెసిడెన్సీ గ్రామనామముల పట్టికవలన తెలియుచున్నది. మన కృష్ణప్రభాసకు వీనితో సంబంధమున్నదో లేదో! ఈ గ్రంథము గద్వాల సంస్థానాధీశ్వరు లాంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారికిచ్చినది. కనుక మహబూబునగరం మండల మందే గ్రామములున్నవో తెలియదు. కవికి గురువులైన తిరుమల వంశీయులు మాత్రము గద్వాల యందుండినట్లు తెలియును. (గద్వాల నేలిన చిన సోమభూపాలుని కాలమున నార్గురు కవులు కలిసి యథాశ్లోక తాత్పర్య రామాయణము నాంధ్రమున వ్రాసిరి. ఆ యార్గురిలో తిరుమల కృష్ణాచార్యులొకరు.)

గ్రంథప్రారంభము శ్రీ రంగనాయకస్వామిస్తోత్రముతో ప్రారంభమైనది.

"శ్రీలక్ష్మియనుమించు చెలువువహించు, నీలమేఘస్ఫూర్తినెంచుమూర్తి
కావేరి నడుమ భక్తజనావళిత్రోవ, తాపేరి కొనియున్న ధర్మానువర్తి
అనుపమ శంఖచక్రాదినమస్త, ఘనసాధనంబుల గనువట్టు ధీరు
వ్రజవ మంత్రాన్వర ప్రాభవోన్నతుల, ప్రణుతికెక్కిన పరా(త్ప)రు
మహోదారు..........
పరమాత్మునచ్యుతు పద్మాక్షునక్ష్య, పరిపూర్ణు నక్షరు భవరోగవైద్యు
వేయి శిరంబుల వేయి నేత్రముల, వేయిపాదంబుల వెలయు సత్పురుషు
శతధృతి సంధాయి సకల సంస్థాయి, ప్రీతపుణ్య ఫలదాయి శ్రీరంగశాయి
పాదసరోజముల్ భక్తిసేవించి, ఆదేవదేవుని నాత్మలో నుంచి"

శ్రీ రంగనాయక స్తోత్రము తరువాత లక్ష్మీ నరసన్వతులను, విష్వక్సేనుని స్తుతించినాడు. ఆటుతరువాత "గురుసుతుడగు కంతుగురు గురుభక్తి, గురుతైన వెంకటగురుని కీర్తించి" కావ్యమును గూర్చి యిట్లు తెలిపి యున్నాడు.

"శ్రీహరి చర్యల సృష్టిలో సుజన, మోహనమైన జైమిని భారతమౌ
ధర్మ మర్మములకు దావలమైన, ధర్మరాజాశ్వమేధ విధానమును
దేవకీ సుతుకృప ద్విపద కావ్యంబు, గావింతు తత్కథాక్రమ మెట్టిదనిన"

అని కథా ప్రారంభ మొనరించినారు.

"జనమేజయుడు మున్ను సర్పయాగంబు, ఘనతెన్న నొనరించి సమ్మదిరగోష్ఠి
అంత భారతకథ నతిభక్తి వినుచు, సంతోషచిత్తుడై జైమిని జూచి
ఓముని పుంగవ ఉత్తమమహిమ, చే మహిస్థలి సర్వసిద్ధియై యొప్ప
ధర్మజు నశ్వమేధ విధానమెల్ల, నిర్మలోక్తుల నాకు నెమ్మితో నిచ్చ
వినిపింపు వినుల విందుగాననిన, మునివల్లభుని సమ్మతి నిరీక్షించి
నైమిశారణ్యంబునను తొల్లినాడు, నామోదమున శౌనకాదిమౌనులకు
విమలవాక్యంబుల వివరించినట్టి, క్రమమాత్మనూహించి కథకు చిట్టనిదియె"
అని యశ్వమేధకథను వినుపించును.

కృష్ణ ప్రధాని కవిత్వమంతయు సరసముగా నిటులే యున్నది. వ్యాసుడు ధర్మరాజునకు హయమేధ క్రమము నీరీతిగా తెల్పును.

"అనిదారయైన యీహయమేధ విధము, వసుధేశ తెల్పెద వసుసతో వినుము
ఆది దీక్ష వహించి ఆదివతో కర్త, వేదశాస్త్రపురాణవిద్యానుభవులు
పరమవివేకసంపన్నులాచార, పరులు శ్రీహరిపాదభక్తి భావనులు
ప్రవిమలమతులైన బ్రాహ్మణోత్తముల, వివరింప నిరువదివేల బుర్విజుల
ఒప్పుగా రావించి యొక్కరొక్కరికి, తప్పక కనకరత్న సమేతమైన
ఒక రథ మొకగజ మొకజవనాశ్వ, మొకదాయవు సువర్ణమొక సహస్రంబు
ధేనుపుల్ వేర్వ సంధిల్ల నేమమున, దానంబులర్పించి తదనంతరమున
ఒక్క కర్ణమునల్పు ఒరవెల్ల తెలుపు, మిక్కిలి నాజువుగా మెరకను పెరుపు
పలు గుత్తమగు తోక బంగారురేక, గలిగి కల్యాణలక్షణముల చాల
వర్తనకెక్కు నశ్వము చైత్రశుద్ధ, పౌర్ణమినాడు సద్భక్తి పూజించి
నలలితమణిగణోజ్జ్వల భూషణములు, చెలువుమీరగ ధరించి మనోహరముగ
కన ఫేరి లిఖిత పద్యము దానిసుదుటి, కనక పత్రిక వ్రాసి జైకొనికట్టి
ఒకయేడు తిరియింప సుర్విపై విడిచి, అకలంక మతి దాని వరసి రక్షింప
తన సహోదరులైన తనుజన్ములైన, సనుపగావలయు నందరిగిన గుణుని

పుడమి నెచ్చోట విజ్ఞాత్రమెల్ల హయము, విడుచునప్పు డెల్ల వెనకుద్ధిపరచి
అంతలోపల హోమ మందు సేయించి, వింతగా నర్పించి వేదోక్తసరణి
భూసురవర్యులకుసుభూరిదానములు, గోసహస్రంబు గ్రక్కుననొసంగుచును
ప్రోవగా నాత్రోవ భూవరుల్ గనిని, చేవచేబట్టిన చెక్కొని హయము
విడిపించగావలె విడిపించ కున్న, తదయశ పుణ్యమంతయు వారిచే
గాన ప్రయాస మీ క్రతువు జేయంగ, ఓనరపాల యిట్టుచితమార్గమున
గావించు మును శతక్రతువు లింద్రుండు, గావించె నీగతి గానలేరయ్యె
నని సనిస్తరముగా నానతి యిచ్చి, తన యోగశక్తి సంతర్హితుండయ్యె"

(గోలకొండ పత్రిక 11–1–1951)

పూడూరి కృష్ణయామాత్యుడు

మన ప్రస్థానత్రయమున బహుళ ప్రచారముగలది భగవద్గీత. భారత దేశమందేగాక విదేశములందుగూడ భగవద్గీతల కధికాదరము గలదు. భగవద్గీతలయందు సర్వమతముల సారమున్నది. ప్రాచీన కాలము నుండియు నేటివరకును అనంతములగు వ్యాఖ్యానములు భగవద్గీతపై బయలుదేరుచున్నవి. తద్వారా ఒక్కొక్కరొక్కొక్క పరమార్థమేదియో సాధించుచునే యున్నారు. వ్యాఖ్యానములేగాక భగవద్గీతల నన్నిభాషలవారును తమ తమ భాషలలోని కనువదించుకొన్నారు. ఒక భాషలో నొక్కరి యనువాదముతో నది యాగిపోలేదు. తెలుగులో రామాయణమునకు వలెనే భగవద్గీతకును పెక్కు లనువాదములు వెలసినవి. పద్యములుగా పాటలుగా ద్విపదలుగా వచనములుగా భగవద్గీతలు తెనుగులో ఎందరో వ్రాసినారు. అట్టివారిలో పూడూరి కృష్ణయామాత్యుడొకడు. ఈతని కృతి భగవద్గీతార్థదర్పణము. ఇది [illegible] కమ్మలందున్నది.

భగవద్గీతార్థ దర్పణము పదునేడధ్యాయముల గ్రంథము. భగవద్గీత ప్రథమాధ్యాయము విడిచి తక్కిన వానికాంధ్రమున సరళ సుందరముగా నున్న యనువాదమిది. ఈ తాళపత్ర గ్రంథము కొంత శిథిలమైనది. చిట్ట చివర గద్యమిట్లున్నది.

"ఇది శ్రీమద్యోగానందగురువర కరుణాపాత్ర వాసుదేవ ద్వాదశాక్షరీ మంత్రరాజ విద్యానుష్ఠానపవిత్ర కౌండిన్యసగోత్ర పూడూరి కొండయామాత్యపుత్ర కృష్ణయ నామధేయ ప్రణీతంబైన శ్రీ భగవద్గీతార్థ దర్పణంబు నందు పరమార్థ నిర్ణయంబను అష్టాదశాధ్యాయము" —

ఆటు తరువాత భగవద్గీత పఠనము వలన గలుగు ఫలమొక పద్యమున చెప్పబడినది. ఆ పద్యము చాల భాగము శిథిలమైనది. ఆ పద్యము తరువాత

"శ్రీ శా(లివాహన) శకాబ్దంబులు ౧౬౬౪ అగు దుందుభినామ సంవత్సర భాద్రపద శుద్ధ ౧౦ వరకు గ్రంథ సమాప్తం. వాసుదేవార్పణమస్తు" అని కలదు. ఈ తేది ప్రతి వ్రాసిన తేదియో లేక న్యాయముగా గ్రంథకర్త గ్రంథమును ముగించిన తేదియో తెలియదు. గ్రంథకర్తయే వ్రాసిన తేది యనుకొన్నచో నీ పూదూరి కృష్ణయామాత్యుడు పదునెనిమిదవ శతాబ్దము పూర్వార్ధమున నుండినట్లు మనము భావింపవచ్చును. గ్రంథకర్త ఇంతకన్న మిక్కిలి తన్నుగూర్చి యీ గ్రంథమున వ్రాసికొనలేదు.

పూదూరి కృష్ణయామాత్యుడు తాను యోగానందగురువర శిష్యుడనని చెప్పుకొన్నాడు. ఈ యోగానంద గురువును మరియు యోగానంద అవధూతయు నొకరగుదురో కారో తెలియదు. యోగానంద అవధూత "గురు శిష్య సంవాదము" మరియు "ఆత్మైక్య బోధము" అను ద్విపద గ్రంథములకు కర్త. ఇవియును అముద్రితములే. వీని ప్రతులు తెలంగాణమున నన్ని మండలములందును లభించుచున్నవి. లక్ష్మణరాయ పరిశోధకమండలి వారి కడను, గద్వాలవారు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారికిచ్చిన గ్రంథములందును, నా చెంతను గల తాళపత్ర గ్రంథములందును ఒక్కొక్క దానికి రెండు మూడు ప్రతులున్నవి. యోగానంద గురుడును యోగానంద అవధూతయు నొకరేయని నేనూహించుచున్నాను. అట్లైనచో పూదూరి కృష్ణయామాత్యుని కాలము మరికొంత వెనుకకు పోవును. ఏలన శ్రీ. శే. చాగంటి శేషయ్యగారు తమ కవి తరంగిణి (సంపుటము 10 పుట 201)లో యోగానందావధూత 16వ శతాబ్ద ముత్తరార్ధమునందుండినట్లు నిర్ణయించినారు. కనుక పూదూరి కృష్ణయామాత్యుడు 16వ శతాబ్దముత్తరార్ధమునందును 17వ శతాబ్దము పూర్వార్ధమునందును ఉండి యుండవలెను. అప్పుడు పైన పేర్కొనబడిన తాళపత్ర గ్రంథాంతమునందున్న తేది ప్రతి వ్రాసిన తేదియై యుండవలెను. పూదూరు గద్వాలకు సమీపమునందున్న చారిత్రక ప్రదేశము. చాలుక జైనమునకును తరువాత శైవ వైష్ణవములకును ఆకరమైన చోటిది. ప్రాచీన జైనశిల్పము లిప్పటికిని పూదూరి దిబ్బలందు కానవగును. కృష్ణయామాత్యుడు పూదూరు వాడైనచో నాతని గురువగు యోగానందుడు గూడ

తెలంగాణమువారై యుండవలెను. కనుకనే యోగానందానుభూత రచితమౌ లగు ద్విపద వేదాంతగ్రంథము ప్రతులు తెలంగాణ మందిప్పటికిని అధికముగా లభించుచున్నవి. ఇతరములగు నాధారములు లభించునరకు పూతూరి కృష్ణయామాత్యునిగూర్చి యింతకన్న నెక్కుడుగా చెప్పుటకు వీలులేదు.

గ్రంథమిట్లు ప్రారంభమైనది.

శా॥ (......శిథిలము....)ంద మహిమన్ జిన్మాత్రమై నిత్య శో
భానందమ్మగుచే త్రిమూర్తి కలనన్ భాసిల్లు బ్రహ్మంబు నెం
తే సమ్మోదమునం భజించి గురుభక్తిన్ నేకృతార్థుండనై
వ్యాసుంగొల్చి సరస్వతిన్ దలచెదన్ భవ్యార్థ సంసిద్ధికిన్"

ఈ పద్యము తరువాత వెంటనే

వ॥ "అని యిష్టదేవతాభివందనంబు గావించి శ్రీభగవద్గీతాశాస్త్రం బాంధ్ర భాష రచియించుటలాని రెండవ అధ్యాయంబు మొదలుగా భగవంతుండర్జునునకు తత్త్వోపదేశంబొసంగె గావున సాంఖ్యయోగంబు ప్రారంభింపబడియె నది యెట్లనిన" — అను మాటలతో సాంఖ్యయోగము ప్రారంభించినారు.

సాధారణముగా కవులందరును తమ తమ గ్రంథములకేవో పీఠికలు కూర్చెదరు. కాని యీ కృష్ణయామాత్యుడొకే యొక పద్యమును, పైన పేర్కొనబడిన వచన భాగమును రచించి పీఠికను ముగించినారు. ఇది చాల చిత్రముగా నున్నది. వేదాంత మీతని మ్రింగి వేసినట్లున్నది. ఇంతటి విరాగి చరిత్రను మనకు లభించుట కష్టమే. మొదటి యధ్యాయమేల తెనిగింపలేదో పై గద్యభాగమున చెప్పినారు. రెండవ అధ్యాయము మొదలుగా తత్త్వోప దేశము కనుక అటనుండియే గ్రంథము ప్రారంభమైనది. విషాదయోగము విడిచిపెట్టబడినది.

క॥ ఉదితాశ్రు పూర్ణనేత్రుడు
సదయహృదయుడై గిరీటి సమ్మదమెదలో
వదలుచు శోకం బందగ
పదిలంబుగ శౌరి పల్కె బాసురఫణితిన్.

పై పద్యము సాంఖ్యయోగమునందలి "తం తథా కృపయావిష్టమ్" అను శ్లోకమునకు సరళానువాదము. ఆటు తరువాతి మూడు శ్లోకముల భావ మొక సీస పద్యమున తెలుపబడినది.

సీ॥ ఏమి కారణమున నీ సంకటం బంది
మోహచిత్తంబున మునిగె దీవు
ఆర్యసేవితము ధర్మావహము(ం) గాని
వృత్తి సత్కీర్తి నుద్వృత్తి నడచు
నట్టి భయంబు నీ వందుగ యుక్తంబె
హృదయదౌర్బల్యంబు వదలుమింక
లెమ్ము వేవేగ బలుపమ్ము గైకొనుమన్న
యర్జునుం డను కృష్ణ యుడలు నాకు

గీ॥ దోరమె అన్యాయకార్య మీయెడ ప్రసక్త
మగుటగాని కారర్యమేనంది కాదు
యుపరతుడనైతి నింక నీ యుద్ధమందు
వినుము దేవ నీ కివ్విధు విన్నవింతు.

"కథం భీష్మ" మను శ్లోకములు మొదలగు వానినిట్లాంధ్రీకరించినారు.

క॥ పూజాపాత్రుల సుతపో
వ్యాజచరిత్రుల గురువుల భవ్యాత్ములనే
నోటన్ భీష్మ ద్రోణుల
నాటిన్ బాణహతి నొంప నలరుదు నెటులన్.

క॥ పరలోక విరుద్ధంబగు
గురువధ మొనరించుకంటె గురియగు శ్రేయ
స్కర మీ జగమున భైక్ష
చరణంబున సంచరింప నస్మత మనఘా.

ఉ॥ భోగము లర్థకామములు బొల్పగు రక్తవిలేపనంబు లౌ
నా గురుమిత్ర హంతనయి యట్టిదినే భుజియింపనేర సు
ద్వేగమునిన్ విధర్మగతి విశ్రుతమౌ సమరప్రకాశతో
ద్యోగము లూనగా జయము నోజ బరాజయ మెట్టులుందునో.

సీ॥ రాష్ట్రరాష్ట్రులు నన్ను దగ జయించిన వారి
నే జయించిన వాడు నిపుణబుద్ధి
అధికంబటంచునే నరి దలపోయనే
హేతువుచే నన్ను నెలమి వారి
హింసించి బ్రతుకుట కిచ్చయింపను కుల
క్షయదోషపరిభూతకలన మల్ప్య
దావమే గదినుండు బరమేష్ఠ్యని బ్రదన
న్నని నన్ను శిక్షించి యనఘ నిర్గ

గీ॥ యంబు దెలియంగ (జెప్పు) మహానుభావ
నేనరి యొనర్తు నింద్రియ నికర శోష
ణంబు శోకంబు నేరీతి నలిననేత్ర
యవనయుంచు టుపాయమ్ము నానతిమ్ము. (౧వ కమ్మ)

స్థితప్రజ్ఞుని లక్షణములు భగవంతు డర్జునునకు చెప్పు సందర్భమున గల పద్యము లీటిరుగా నున్నవి. (౨వ కమ్మ రెండవ ప్రక్క)

తరువోజ॥ వినుము చిత్తస్థిత వివిధ కామంబులెపుడు నమ్రగంబు నెడలంగజేయు
తన పరమానంద ధన్యరూపమున తాన సంతృప్తుడైదగ విషయముల
జనియించు నభిలాష నడలంగనోపు నెవ్వడేనియు
బ్రాజ్ఞుడి లక్షణమున
దనరియాత్మ ( ) మహాస్థిరి దాల్పునపుడే స్థితప్రజ్ఞుడని చెప్పబడును.

క॥ శోకము జెందిన చిత్తప
మాకులతన్ దొలగి సుఖము లందిన స్పృహయున్
లేక భయ ప్రియ కోపో
ద్రేకముడిగి నతడె మునియు స్థిరబుద్ధియగున్

గీ॥ పుత్ర మిత్రాదికం బందు బొనగ స్నేహ
రహితుడై (యను)కూల సంగ్రహ (సుఖ)ంబు
నొందునపుడు సంతుష్టియు జెంది యుంత
కశుభ మొందిన ద్వేషిగా కలుగ నెవడు.

వ॥ ఉదాసీనుడై భాషింపుచుండు నతనికి ప్రజ్ఞ ప్రతిష్ఠితంబగు.

ఆ॥వె॥ ఎప్పుడేని యోగి యింద్రియంబుల విష
యముల వలన దిగిచి యుంచు నట్టి
మనమున కూర్మ మంగకములు ముడుచుచు నుండు
నట్లు నపుడె యాతని క(మ)రు దృఢత.

(౫౮ శ్లో) వ॥ విను మింద్రియములకు విషయంబులందు స్వప్రవృత్తి స్థితప్రజ్ఞునకు లక్షణం బయ్యెననిన జడులకు నాతురుల కుపవాస పరులకు విషయాప్రవృత్తియు సమంబగునం చేని యదినిజంబు రాగవిరహితంబు గానేర దదెట్లనిన

తరువోజ॥ తగు నింద్రియముల చేతను విషయాళి నాహరించుట
(నిరా)హారి యనంగ
నగునట్టి దేహికి నల విషయానుభవము నివర్తించు పిదప నంతెకాని
అగురాత్తునఖిలాపయదల దయాత్మఁజూచి దృఢ ప్రజ్ఞకోవిదుం డైన
నిమజ్జనకున ౙెరనివర్తించు నింద్రియనియమంబు లెనయక యున్న

క॥ స్థిరమగు ప్రజ్ఞాకలనం
బిరవొందదు సాధనేచ్ఛ నెనయునపుర త
ద్ధురుతరయత్నము జేయుట
పరమావశ్యకము సుమ్ము పాండవ వర్యా.

చ॥ వినుము వివేకియైన దగ విస్రుతయత్నము మోక్షమందగా
పనుపడ జేయుచో మనము బాయక నింద్రియసంఘ ముద్ధతిన్
ఎనసి బలంబు పేర్మి హరియించును క్షోభమొనర్చు గాన వా
ని నియమనంబునన్ బరమనిష్ఠయు మత్పరతానుభవ్యమున్

వ॥ అట్టి యోగికి గల్గుంగావున.

గీ॥ ఎవ్వని కఠినములగు నీ యింద్రియంబు
లతని కల బ్రజ్ఞయందు సుస్థితి నిజంబు
మనము నియమింపకుండిన మలయు విషయ
సంగమము దానివలన సంజనితమగును.

క॥ కామము తజ్జన్యంబగు
వేమారుం గ్రోధమందు వెలయున్ మోహం

దా మోహము స్మృతి విభ్రమ
మై మెలగున్ బుద్ధినాశమగుటో దానన్.

వ॥ అని చెప్పి విషయాభిముఖ స్వభావంబులగు నింద్రియంబులు నిరోధింప నశక్యంబగుట నివి దుష్పరిహార్యంబులు గావున స్థిర ప్రజ్ఞత్వం బెట్లగు నంటేని.

ఉ॥ రాగము ద్వేషముంబొరసిరాక నడంచి (   ) దర్పహీనతన్
దాగగు నింద్రియంబులను బన్నరగా విషయవ్రజంబులన్
భోగముసేంతి యైనను మనోవశవర్తులు గాన శాంతి ని
ర్యాగతి నొందుచుండు స్వ(వ)శాత్ముడు భారతవంశవర్ధనా

వ॥ అట్టి చిత్తప్రసాదంబున నేమి ఫలం బంటేని

ఆ॥వె॥ చిత్త శాంతిగల్గు సిద్ధయోగికి సర్వ
దుఃఖహాని ఫలము దొరకొనంగ
జాలియుండునా ప్రసన్నచిత్తుని బుద్ధి
వేగ సుస్థిరత్వ వృత్తిచెందు.

వ॥ స్థిర ప్రజ్ఞత్వంబునకు సాధనంబు గల్గుట వ్యతిరేక ముఖంబుగా దెల్పెడి యభిప్రాయంబున నిట్లనియె.

సీ॥ అవశీకృతేంద్రియుండగువానికా గురు
శాస్త్రోపదేశ సంజనిత యాత్మ
విషయయా ప్రజ్ఞయు వివరింప నుదయింప
దట్టివానికి ధ్యానమది నిలువదు
లక్ష్యయంచా ధ్యాన మలవడదేని యె
ట్లంగి శాంతియుగల్గు బరమశాంతి
నందక మోక్షసదానందసుఖమెట్లు
సిద్ధించు పార్థ వశీకృతములు

గీ॥ గానివై యింద్రియంబులు గరిమ విషయ
ములయందేచ్ఛ జరింప నందుల నొకటిన
గూర్చి మనమేగు నది(యెహో కుటిల వృత్తి
బురుషు) ప్రజ్ఞ హరించు విస్ఫూర్తి ననఘ.

వ॥ ఇంద్రియం బొక్కటియె విషయ (   ) ముక్తంబై యీ రీతిం జేయు నింద్రియ గణంబువలననేమి చెప్ప నదెట్లంటేని కర్ణధారుండు ప్రమత్తుండైన వాయువుచే సముద్రంబున నావ యెందేని భ్రమించు చందం బగునని తాత్పర్య.........యిట్లనియె.

గీ॥ ఎవని యింద్రియంబు లీ విషయంబుల
వలన నిగ్రహించు వలను గాంచు
నతని కట్టె ప్రజ్ఞ యలవడు వైరిని
గ్రహుడ పెట్టిదెంత కార్యమనఘ.

వ॥ ఈ స్థిరి నొందుమని మరియు లోకంబున నొక్కడు ప్రసుప్తుండునుం బోలె దర్శనాదివ్యాపారశూన్యుండై నిరంతరంబు నిగృహీతేంద్రియుండై యుండుంబు గావున ఈలక్షణంబు సంభావితంబు అంటేని చెప్పెద.

తరువోజ॥ అమరు నీ సర్వభూతావళులకును నిశలోలు నయ్యాత్మనిష్ఠయజ్ఞాన
తమముచే దగనావృతములై సచిత్తములుగల జనులకింపుగ దర్శనాది
కములైన వ్యవహార గతులు లేవగుట యాత్మనిష్ఠారూపమందు
నమ్మునియు
సుమతి జితేంద్రియస్ఫూర్తి మేల్కనుచునుండు భూతముల
కెట్లుండునంటేని

ఆ॥ వె॥ ఎట్టి విషయజాత మెనసిన నిష్ఠయం
దెల్ల భూతములు సమిద్ధబాగ
రమున దెలిసియుండు రహి పార్థ వినుమిట్టి
విషయనిష్ఠ మునికి నెలయు నిశయు.

వ॥ అట్టి నిశయందాత్మతత్త్వంబు గను మునికి దర్శనాది వ్యాపారంబు లేదు. బ్రహ్మజ్ఞుండున్మీలితాక్షుండైన అతనికి బ్రహ్మంబంద దృష్టి యుండు. విషయదృష్టి లేకుండు గావున తల్లక్షణంబు నంభవించు నట్లయినను విషయ దృష్ట్యభావంబున (నిత)ంబెట్లు విషయంబులను అనుభవించు నంటేని చెప్పెద.

చ॥ సకలనదీజలంబులను సాగర మెప్పుడు బూర్ణమయ్యు దా
ప్రకటముగాని యామ్యగతి బాయకయుండగ నంబువుల్ మరిన్

సుకరముగాగ నందఁగ జొచ్చిన నీ విషయంబు లమ్మునిన్
వికలమనస్కుఁ జేయవు వినిశ్చిత భోగములందె సేనియున్.

వ॥ మరియు భోగంబులచే నవిక్రియమానుండై యంతర్దృష్టిగల్గు యోగిని గురించి విషయంబులు ప్రారబ్ధకర్మానుభవ యోగ్యంబులగుచుం బ్రవేశించు నతండు కైవల్యం బందుచుండుగాన భోగకామనాశీలుండుఁ గాఁడు గావున.

క॥ కామంబులెల్ల దొలఁగియు
ధీమహితా నిస్పృహుండు ధృతి నిర్మమతా
సేముఁడు నిరహంకారుం
డై మహితసుఖంబు శాంతినంది చెలంగున్.

తరువోజ॥ ఇదియె బ్రహ్మజ్ఞానసహిత నిష్ఠసుస్మ భగవదారాధన
ప్రకటిత వృత్తి
మది నిర్మలంబగు మహిపార్థ పురుషుదెవదేని యాస్థితినెనసిన మోహ
మది బాయు క్షణమాత్రమంత కాలమున నీ జ్ఞాన నిష్ఠ
దా నిరవుకొల్పిసను
వరలక వరమునిర్వాణంబునొందు సాంఖ్యయోగంబిది
జరపు మీనసము.

ఇంద్రవజ్ర॥ ఈ సాంఖ్యయోగంబున నింద్రసూనున్
ధీసంస్తుతిన్ బూన్చిన దేవదేవున్
శ్రీ సక్త పాదాబ్జుని దివ్యరూపున్
నే సంస్తుతిన్ జేసెద నిర్మలాత్మున్.

గద్య: ఇది శ్రీమద్యోగానందగురువర కరుణాపాత్ర వాసుదేవధ్యానాసక్తి మంత్రరాజ విద్యానుష్ఠానపవిత్ర కౌండిన్యసగోత్ర పూదూరి కోదండ యామాత్యపుత్ర కృష్ణయనామధేయ ప్రణీతంబైన శ్రీ భగవద్గీతార్థ దర్పణంబునందు సాంఖ్యయోగంబను ద్వితీయాధ్యాయంబు. శ్రీమద్యోగానంద గురవేనమః శ్రీ వేదవ్యాసాయనమః.

పై పద్యములవలన నిది కేవల మనువాదముకాక, టీకాప్రాయమైన యనువాదమని తెలియనగును.

(గోలకొండ పత్రిక 26-1-1961)

లయగ్రాహి గరుడాచలకవి

రామాయణేతివృత్త మాధారముగా నాంధ్రవాఙ్మయమున వెలువడిన రచనము లత్యధికములు. తెలుగులో మరియే యితివృత్తమునకును నింతటి ప్రచారము కలుగలేదు, అది శ్రీరామచంద్రమహిమయో లేదా వాల్మీకిముని కలము బలమో, మరి తెలుగువారి భక్తి కలిమియో కాని రామాయణ కథ సంపూర్ణముగనో లేదా అందలి ఘట్టములో ఇతివృత్తముగా గొని పలువురు కవులు ప్రాచీనకాలమునుండి నేటివరకును వివిధసాహిత్యప్రక్రియలందు వెలయించుచున్నారు. ఈ విధముగా వెలువడిన గ్రంథములందు సగమునకన్న నెక్కు డముద్రితములు. అట్టివానిలో కౌసలేయచరిత్రమను మహాప్రబంధ మొకటి.

ఇది యైదాశ్వాసముల కావ్యము. దీనికి కర్త లయగ్రాహి గరుడాచల (గరుడాద్రి) కవియను చరిత్రకెక్కని చరితార్థుడు.

గరుడాచలకవి బోరవెల్లి సంస్థానమందుండినవాడు. బోరవెల్లి సంస్థానాధీశ్వరులు పాకనాటి రెడ్లు. వీరిది మిడమిళ్ళగోత్రము. ఇంటిపేరు ముష్టిపల్లి వారు. గద్వాల సంస్థానాధిపతులకును వీరికిని సన్నిహితమైన బాంధవ్య మున్నది. ఈ రెండు సంస్థానములవారి ఇంటిపేరును, గోత్రములును సమానము. ఒకప్పుడు స్వతంత్రముగా నుండిన బోరవెల్లి సంస్థానము ఎప్పుడో గద్వాల సంస్థానమున లీనమైపోయినది. కౌసలేయచరిత్రము బోరవెల్లి యాస్థానాధీశ్వరుల కిలువేల్పగు శ్రీకేశవస్వామి కంకితముగా రచింపబడినను కవి పోషకులు సంస్థానాధీశ్వరులు కనుక వారి చరిత్రము గూడ ఇందు విపులముగా వర్ణింపబడినది. ఈ చరిత్రము కవి కాలమును నిర్ణయించును. గ్రంథస్థాధారములనుబట్టి లయగ్రాహి గరుడాద్రికవి యించుమించుగా గద్వాల పెదసోమభూపాలునకు సమకాలీనుడు.

గ్రంథ ప్రారంభమున నున్న పద్యము.

ఉ॥ శ్రీ విలసిల్లు దోర్వేలి పురిన్ తెలిదీవిని నిల్పువైఖరిన్
భావము రంజిలన్ నిలిచి భాసిలు కేశవదేవురాత్మవ
శోభితాలయంబునను కూర్మిన నిల్చిన రీతి నిల్పురన్
శ్రీవనితాశిరోమణిని శ్రీగిరియమ్మ గృహాంతరంబునన్.

రెండవ పద్యమున లక్ష్మీదేవియు, మూడవ పద్యమున పోల్కంటి సోమేశ్వరుడును (ఇతడు కూడ దోరువేల్లిరెడ్డి రాజులకు ఇలువేలుపు), నాలుగవ పద్యమున పార్వతియు, ఐదవ పద్యమున బ్రహ్మయు, ఆరవ పద్యమున సరస్వతియు ఏడవ పద్యమున విఘ్నేశ్వరుడును స్తుతింపబడినారు. ఎనిమిదవ పద్యమున "భారత రామాయణముల్ రచించిన మునీంద్రశ్రేష్ఠులన్, పుణ్యులన్" నుతించినారు. తొమ్మిదవ పద్యమున గీర్వాణభాషాకవుల స్తోత్రమున్నది. ఈ సీస పద్యమున నాలుగవ పెద్దపాదమున మురారిని గూర్చి యిట్లున్నది: "కవి సన్నుతోజ్జ్వలజగన్నాటకోద్వృత్తి పేరెన్నవలరు మురారిగొలుచు" మురారి విరచిత నాటకములందు మనకు లభించినదొక్కటి యనర్ఘరాఘవమే. జగన్నాటకమను రూపకమును గూడ మురారి రచించి యుండవచ్చును. శేషాచలుడను కవి జగన్నాటకమును ప్రబంధముగా రచించెను. ఇది ప్రబోధచంద్రోదయము వలె వేదాంతపరమైనది. ఇది యముద్రితము. మన పూర్వకవులు సంస్కృత నాటకములను ప్రబంధములుగా సంతరించుట మనమెరుగుదుము. శేషాచలకవి విరచిత జగన్నాటక ప్రబంధమిట్టి తెగకు చెందినదేమో! ఇది నాయూహ మాత్రము గరుడాచలకవి యుద్దేశమింతకు మురారి "జగన్నాటక" కర్తయని యౌనో కాదో! పదియవ పద్యమున తెలుగు కవులను స్తుతించినాడు. అందులో కవిత్రయమువారు, పోతన, భాస్కర, రంగనాథ, నూరన, పెద్దన, తిమ్మనార్యులున్నారు.

అటు తరువాత 11 నుండి 18 వరకుగల పద్యములలో కవి తన పూర్వులను గూర్చి చెప్పుకొనినాడు. వారిలో మొదటివాడు మాధవకవి. అతడు కృష్ణదేవరాయలవారిచే సత్కారము బొందినవాడట. అతని గూర్చిన పద్యమిట్లున్నది.

ఉ॥ మాధవశక్తియుక్తు ఘనమానితవిత్వగుణుండు కృష్ణరా
యాధిపదత్త సద్గజవరాదిమహాబహుమానశాలి గం

గాధరకీర్తిసాంద్రుడు ఆగత్యకవిచంద్రుడు మత్కవీంద్రుడౌ
మాధవు దస్మదాదులకు మాన్యుడుగాదె తలంచి చూచినన్

శ్రీకృష్ణదేవరాయలంతవానిచే నిట్లు సత్కరింపబడిన మాధవకవి సననలేమైపోయినవో। ఈ మాధవకవికి ముగ్గురు పుత్రులు 1. భైరవుడు 2. రామభద్రుడు 3. చందప్ప. ఈ సోదరత్రితయమున మధ్యముడగు రామభద్రుని కుమారుడు రామన్న. కనిష్ఠుడగు చందప్ప కుమారులు 1. తిమ్మయ్య 2. కృష్ణయ్య 3. రామన్నలు. ఆటు తరువాత నొక పద్యమిట్లున్నది.

క॥ అతతగుణి రామన్నకు
భూతలమున గలిగినట్టి పుత్రుల దలతున్
మాతాతల నారాయణ
సీతాపతులన్ నృసింహ సేవానురులన్.

పై పద్యమున చెప్పబడిన కృతికర్త తాతలగు నారాయణ సీతాపతులు రామన్న కుమారులట. పైన రామభద్రుని కుమారుడు రామన్న యొకడును చందప్ప కుమారులందు కనిష్ఠుడగు రామన్న యొకడును గలరు. ఈ యిరువురు రామన్నలును అన్నదమ్ముల కుమారులు. వీరిలో కవిగారి ముత్తాత ఏ రామన్నయో స్పష్టముగా లేదు. సీతాపతి (కవితాత) కుమారులు ముగ్గురు; 1. సంజీవి 2. వెంకటయ్య 3. నృసింహకవి. వీరిలో కనిష్ఠుడగు నృసింహకవియే కౌసలేయచరిత్ర కృతికర్తయగు లయగ్రాహి గరుడాద్రి కవి జనకుడు. ఈ విధముగా కవి యారు పద్యములందు ఆరుతరముల తన పూర్వులను స్మరించినాడు. వీరిలో దాదాపుగా అందరును కవులే; అందరును చరిత్రకెక్కనివారే. పదునేడవ పద్యమున గురువును స్తుతించినాడు.

శా॥ శ్రీగంధద్రవ శీతలాత్మకుని కాశీసేతు మధ్యావనీ
భాగఖ్యాతివిరాజమానుని మహాభాష్యాదిషట్ఛాస్త్రవి
ద్యాగారున్ నరసింహ సత్కవి కుమారాగ్రేసరున్ బ్రోవ్వెలీ
యోగానంద కవీంద్రు మద్గురువరేణ్యున్ భక్తి సేవించెదన్"

కృతికర్తకు గురువైన ఈ యోగానంద కవీంద్రుడెవరు? కృతికర్తకు అగ్రజుడగునేమో! ఇరువురి తండ్రిపేరులును సమానములు. దీనిపై పద్యమున తండ్రుల గూర్చి,

క॥ సీతాపతి తనయులవి
ఖ్యాతుల సంజీవి వెంకటాఖ్యుల సుకవి
వ్రాతస్తుత కవితాఘను
మాతంౘ్రి నృసింహకవిని మాటికి దలతున్"

అని చెప్పినారు. కనుక నృసింహకవి కుమారాగ్రేసరుడు యోగానంద కవీంద్రుడు గరుడాద్రికవి తన్నయుడగునని యూహించుచున్నాను. ఈ సంబంధము విడిచి యోగానందుని గూర్చి కొంత విచారింతము. ఈ వ్యాసమునకు పూర్వము వ్యాసము పూదూరి కృష్ణయామాత్యుని గూర్చి. పూదూరు బోరవెల్లికి సమీపమందున్నది. పూదూరు కృష్ణయామాత్యుడు తన "భగవద్గీతార్థ దర్పణము" చివర గద్యములందు తాను "శ్రీమద్యోగానందగురువరకరుణాపాత్రుడు" నని తెలిపెను. ఈ యోగానంద గురుడే "గురుశిష్యసంవాదము" "ఆత్మైకత్వ బోధము" వంటి ద్వైత వేదాంతగ్రంథములకు కర్తయగు యోగానంద అవధూతయై యుండునని ఊహచేసితిని. అది యెట్లున్నను పూదూరి కృష్ణయామాత్యుని గురువగు యోగానందుడును లయగ్రాహి గరుడాచలకవి గురువగు యోగానంద కవీంద్రుడును ఒకరేయని నిశ్చయముగా భావింపవచ్చును. ఏలన పూదూరి కృష్ణయామాత్యుడును లయగ్రాహి గరుడాచల కవియును సమకాలీనులు. వీరు మిక్కిలి ఏకప్రదేశమునకు చెందినవారు. ఇక యోగానందావధూతయు యోగానంద గురుడును ఒకరగుదురో కారో! ఒకరే కావచ్చునని యింతకు పూర్వపు వ్యాసమున సూహించితిని. కాని యిప్పుడు కొంత సంశయము కలుగుచున్నది. కారణమేమన నీ యోగానంద గురుడు కాశీసేతు మధ్యావనీ భాగఖ్యాతి విరాజమానుడట, మహాభాష్యాదిషట్శాస్త్ర విద్యాగారుండట; కవీంద్రుడట. యోగానందావధూత విరచితములగు "గురుశిష్య సంవాదము" "ఆత్మైకత్వ బోధము"లందు వేదాంత మున్నదే కాని ప్రౌఢిమ, పాండిత్యము లంతగా కానరావు. కనుకనే యిప్పుడీ సందేహము బాధించుచున్నది. ఇది భావిపరిశోధనలవలన తేలనగు విషయము. ఇంతటిలో ఇష్టదేవతాప్రార్థనమును పూర్వకవిస్తుతియు, కవివంశావతారమును, గురుస్తుతియు ముగిసినవి. ఇక మిగిలినది సంప్రదాయ ప్రకారముగా కుకవినింద, అది యిట్లున్నది.

చ॥ ఘనసవరత్న సంఘములు గల్గిన దొంతులు ద్రోయ ధుక్కృతె
ల్లనువగు సత్కవీశ్వర మహారచనా వచన ప్రచారతల్

మెనయు మహాప్రబంధములు ముష్కరదుష్కవి కేమిసేయ దీ
రును మరివాని సుద్ది కరరో చెదరో వివరించి చూడగన్.

అటుతరువాత నొక పుణ్యదినమున కవికి బోరవెల్లి కేశవస్వామి స్వప్నమున సాక్షాత్కరించి.

"బాలక నా గృహంబెపుడు బాయక విద్యలు నేర్పినావు దూ
పాలనకాంతరాళముల పండితు లౌనన సత్కవిత్వ ము
ద్వేలవచోవిజృంభణల వేగముగా రచియింప నేర్తువౌ
మేలు భళీ భవద్గుణము మెచ్చి వరం బొసగంగ వచ్చితిన్" అని

కౌసలేయ చరిత్రమును గనకు అంకితముగా నొనంగుమని యాదేశించును. ఏలన తనకు మందిరము గట్టించిన గిరియమ్మ తనపై కృతి విరచింపజేయ సంకల్పించినదట.

క॥ గిరియమ్మ నాకు మెచ్చగ
కరణము గట్టించి యొక్క సత్కృతి నాపై
విరచింప జేయవలెనని
కరసురుగ దలచినది జగద్ధిత మిదియున్. ౨౪.

ఉ॥ ఈ కృతియే మదంకిత మహీనమతిన్ రచియింపజేయు మం
చా కమలాక్షియౌ గిరియమాంబకు నే కలలో వచించెదన్
జోకగ నీ కభీష్టములు జొప్పడు శ్రీ నరసింహమూర్తినై
నీకియువేలుపై తగిన నీరజనాభుడ నేనె బాలకా"—

స్వప్నమునుండి మేల్కాంచి గరుడాద్రికవి కృష్ణవేటికిం జని కాల్యంబులు దీర్చుకొని పెద్దలకు తన స్వప్నమును విన్నవించి యున్నయెడ గిరియమాంబారాణి యాజ్ఞవచ్చును. కవి యాస్థానమునకేగును. భగవదాజ్ఞ ప్రకారమే గిరియమ్మ కృతి నర్పింప భగవంతున కంకితమిదుమని కవిని సత్కరించును. కవి వల్లెయని గిరియమ్మ వంశావతారమును వర్ణించును. దీనిలో బోరవెల్లి గద్వాల సంస్థానముల చరిత్రములు, నీములు ఆయా పాలకులొనర్చిన ఘనకార్యములు సప్తసంతానప్రతిష్ఠలు మున్నగునవి విపులముగా వర్ణింపబడినవి. ఈ చరిత్రమంతయును ౩౩ నుండి ౭౦ వరకు గల ౩౮ పద్యములందు విపులముగానున్నది.

బోరవెల్లివారి చరిత్రమిట్లున్నది. శ్రీమన్నారాయణుని పాదపద్మమున గంగ జనించెను. ఆ గంగకు వెలమవంశము కలిగెను, అట్టి ప్రసిద్ధాన్వయమున శ్రీ కేశవస్వామి సేవాపరాధీనుడును, కీర్తిశాలియు, రిపుభయంకరుడును బిరిమిళ్ళ గోత్రజుండును నగు నల్లభూపాలుడు జన్మించెను. అతడు మల్లాంబను, తిమ్మాంబను వివాహమాడెను. మల్లాంబ వలన నల్లారెడ్డికి పెద సోమవిభుడు చిన సోమవిభుడునను కుమారు లిరువురు జన్మించిరి. పెద సోమభూపాలుని భార్యలచ్చమ్మ. రణార్జున బిరుదాంకితుడగు చిన సోమవిభుడు గిరియమ్మను పెండ్లియాడెను. ఈ గిరియమ్మ గద్వాల ప్రభువును, బక్కమాంబా పుత్రుండును, దయారైల కందనూల్పుర జనగానిపల్లె భండారాత్మకూరు రహో బలము రాగలమట్టి శివపర్త్య సంచేల సీమల సాధించినవాడును నగు సోమనాద్రికి లింగాంబయందు జన్మించినది. అనగా గిరియమ్మ గద్వాల సంస్థానమునకు మూలపురుషుడగు పెద సోమనాద్రి కూతురు. ఈ పట్టున సోమనాద్రి గుణగణములును, అతని భార్య లింగాంబ యొనర్చిన పుణ్యకార్యములును విపులముగా చెప్పబడినవి. ఆటు తరువాత వారి సంతానమగు గిరియమ్మ గుణగణములును ఆమె యొనర్చిన పుణ్యకార్యములును వర్ణింపబడినవి. ఈ గిరియమ్మయే మన గరుడాద్రికవిని సత్కరించి ఏతత్కృతి కేశవాంకితము చేయుటకు పురికొల్పినది.

గద్వాల పెద సోమభూపాలుడు క్రీ. శ. 1663-1712 ప్రాంతము లందుండినవాడని చారిత్రికుల నిర్ణయము. తనుశలయగ్రాహి గరుడాద్రి కవి కూడ ఇంచుమించుగా నిదేకాలమందున్నవాడని మనము భావించవలెను.

గిరియమ్మ గద్వాల పెద సోమభూపాలుని కూతురనియు బోర్వెల్లి చిన సోమభూపాలుని భార్యయనియు తెలిసికొంటిమి. గద్వాల మరియు బోరవెల్లి వారి దొకే గోత్రము. ఇంటిపేరుకూడ ఒకటియే. ఈ సగోత్ర వివాహమెట్లు తటస్థించినదో!

గిరియమ్మ యొనర్చిన పుణ్య కార్యములను వర్ణించు పద్యములందు రెండింటి నుట్టంకింతును.

సీ॥ కట్టించె కేశవాగారంబు భూమిపై బరగు కుబేర పుష్పకమనంగ
సేవించె నారామ సేతుశాతమధ్య దివ్యస్థలంబులు తెగువ మీర

వేయించె వనములర్విని చైత్రరథనందనోద్యానములరీతి హృద్యముగను
చదివించె విద్యార్థిజనుల కన్నములెట్టి వేదశాస్త్ర పురాణవిద్యలెల్ల

జన్నము లొనర్పఁజేసె నిర్జరగణంబు
గూరిచి యొనరింప విప్రసంఘముల చేత
ననుచు ప్రజలెన్న వర్ధిల్లె ననుదినంబు
పరమసద్గుణనిధురుంట గిరియమాంబ (౬౬)

ఇక గిరియమ్మ నెలకొల్పిన యన్న సత్రములగూర్చి గమనింపుడు.

ఉ॥ పుత్రక యెందుబోయితివి? బోర్వెలిలో గిరియమ్మ పెట్టు న
న్నసత్రములో భుజించుటకు. సత్రవిశేషము లేమి? చూడు నా
గాత్రము. ప్రాపితో సుధ? ఆగణ్ణపులందరు ప్రా(వ)త్రావు సే
చిత్రము నేనటంచును వచించును బ్రహ్మకు నారదుండటన్ (౬౭)

దీని తరువాత మరి మూడు పద్యములుగూడ గిరియమ్మను వర్ణించునవి కలవు. అటుతరువాత రెండు పద్యములందు కేశవస్వామిని స్తుతించి షష్ఠ్యంతములు చెప్పినారు. అటుపైన,

"అంకితంబుగా నాయొనర్పం బూనిన కౌసలేయ చరిత్రంబను మహాప్రబంధంబునకు కథా ప్రారంభం బెట్టిదనిన" యని

ఉ॥ శ్రీనిలయాగ్రణస్థితి ధరించి గురూన్నత రీతిచే సుధ
ర్మానఘ భోగభాగ్యము లహర్నిశ మీయగనోపి సౌధరో
భాసిరపద్యనిర్జరశుభక్రియ లూని యసాధ్యమై యయో
ధ్యానగరంబు పొల్పు వసుధన్ వసుధాను నియుక్తి స్వర్గమై.

యని యాయోధ్యానగర వర్ణనముతో ప్రారంభించినారు. ఆశ్వాసాంత గద్యమిట్లున్నది.

"ఇతి శ్రీమదహోబల నృసింహ కరుణా కటాక్ష లబ్ధోభయ భాషా నిరంకుశ లయగ్రాహి సీతాపతి పౌత్ర నృసింహకవి పుత్ర హారితసగోత్ర పవిత్ర గరుడాచల కవీంద్ర ప్రణీతంబైన కౌసలేయచరిత్రంబను మహాప్రబంధంబునందు పంచమాశ్వాసము"—

గ్రంథము వ్రాయబడిన లిపి యొక తీరుగను ఆఖ్యానాంత గద్యము లన్నియు వ్రాయబడిన లిపి మరియొక తీరుగను ఉన్నవి; కొన్ని ఆఖ్యానముల చివరన గద్యము వ్రాయబడక స్థలము విడువబడియున్నది. ఒక గద్యమున "అష్టవిధభాషాకవిత్వసంపన్న సారస్వతాభినందిత"యను విశేషణ మధికముగా నున్నది. గ్రంథముకూడ మూలమునకు ప్రతియేకాని అసలు గ్రంథకర్త వ్రాసిన ప్రతిగాదని భావించుట కవకాశమున్నది. అచ్చటచ్చట మిక్కిలి శిథిలమై పోయినది.

బోర్వెల్లి యాస్థానమున గిరియమ్మ కాలమున గరుడాద్రికవి కౌనలేయ చరిత్రమును, ఆమె దత్తపుత్రుడు వెంకటపతి కాలమున చింతలపల్లి ఛాయాపతి యను కవి రాఘవాభ్యుదయమను మహాప్రబంధమును శేషాచలస్వామి కంకితముగా రచించిరి. రాఘవాభ్యుదయమున గల బోర్వెల్లి సంస్థానవిశేషములు చింతపల్లి ఛాయాపతినిగూర్చి వ్రాసినప్పుడు 30-11-1960 నాటి గోలకొండ పత్రికలో తెలిపియుంటిని. జిజ్ఞాసువులు గమనింతురుగాక.

(గోలకొండ పత్రిక 8-2-1961)

నాడగౌడు ముష్టిపల్లి వెంకట భూపాలుడు

గద్వాల సంస్థానమునందలి ముఖ్యగ్రామములలో రాజోలి యొకటి. ప్రస్తుతమది "రాజోళి"యని పిలువబడుచున్నది. ఇది తుంగభద్రాతీరమున గలదు. తుంగభద్ర యిట రెండు పాయలుగా ప్రవహించును. రెండుపాయల మధ్యన నొక లంక యేర్పడినది. శిథిలములగు కోటలు, రాజ ప్రాసాదములు రాజవోలు పూర్వవైభవమును మూగసోను పట్టియైనను చెప్పక చెప్పుచున్నవి. దుర్గమధ్యమున వీరనారాయణస్వామి యాలయమును, గ్రామమునకు రెండు మైళ్ళ దూరమున నదియొడ్డున రామేశ్వరాలయమును, ఆ యాలయము ముంగిట చాళుక్య భూలోకమల్లుని శాసనమును ఉన్నట్లు శ్రీ మారేమండ రామారావుగారు తెలుపుచున్నారు (కాకతీయ సంచిక పుట 271)

పాకనాటివారును, మిరిమిళ్ళ గోత్రజులును, ముష్టిపల్లి యింటిపేరుగా గలవారును నగు రెడ్లు, రాజవోలు రాజధానిగా ఈ ప్రాంతములను పాలించిరి. వీరికి నాడగౌడు, దేశాయి బిరుదములున్నవి. గద్వాల రెడ్డి ప్రభువులును వీరును జ్ఞాతులు. ఈ పాలకులు మొదట గద్వాలవారికి లోబడి యుండిరో లేక స్వతంత్రముగా నుండిరో తెలియరాదు కాని తరువాత తరువాత మాత్ర మీ ప్రాంతములన్నియు గద్వాల సంస్థానములో చేరి పోయినవి. ఈ రాజవోలు పాలకులలో నాడగౌడు వెంకట భూపాలుడొకడు. ఇతడు గొప్ప భక్తుడు. మరియు ననేక గ్రంథములకు కర్త. దివ్యదేశమహాత్మ్యదీపిక యను ద్విపదకావ్యమొకటి తాళపత్రములపై గలదు. ఇది నూట యెనిమిది దివ్యస్థలములను తన్మాహాత్మ్యములను తెలుపు ద్విపద గ్రంథము. గ్రంథాంతమున గల ద్విపదలవలన కృతికర్తయు, కృతిభర్తయు, వారి వివరములును కృతికి సంబంధించిన విశేషములును తెలియనగును.

"అని చెప్పి శ్రీ వెంకటాధిప పేర - వనజ నేత్రుని పేర వరదుని పేర
రాజిలు తుంగభద్రాతీరమందు - నాజిమౌ రాజవోల్నగరావతంస

రమణ వైకుంఠ నారాయణు పేర - మధురలో నన్నేలు మాధవు పేర
నయముగాను జనార్దనస్వామి పేర - జయమిచ్చినట్టి కేశవదేవు పేర
ప్రేమనంకిత మొనరించి ప్రోల్కంటి - సోమేశకరుణారసోదయావాప్త
భోగభాగ్యోదయుల్ ముష్టిపల్యాంక - సాగరచంద్రులు సద్గుణసాంద్రు
లుదయించి రంపులో సుక్షీణాననదయుడిమ్మడియెల్లణపాలురలరు
కులము తప్పులు దిద్దుకొను పాక నాటి - కులములో మిడిగొ(మి?)క్ష
గోత్రుడై నాక
గౌరుదేశాయన గణుతికెక్కి - ప్రోదయై సకలభూములకీర్తి గాంచె
ఆ పితు సనుజన్ముడౌ చినరెడ్డి - దేవి లక్ష్మాంబ ప్రథిత గుణాలంబ
ధర (వెలసె) సకల ధర్మస్వరూప - గరిమచే నాసాధ్వి గనియె లక్ష్మి కు
మారానుగుణరూపసహితు కుమారు - ధీరు చిన్న పితు నుద్ధిపిలో దారు
స్థానుండు వివాహమయ్యె మురముల - శ్లాఘనీయ కృపావలంబను లింగ
మాంబ నారంభతు లర్థి నన్ గాంచి - రంబుజోదరపదధ్యానపారీణు
శ్రీ వెంకటేశభూతికటాక్షలబ్ధ - పావనకవితానుభావుని గౌర
నామ వెంకటదాసు నయము దీపింప - ధీమంతులెల్లనెంతే నంతసింప
మున్ను నే చేసిన పుణ్యఫలమున - వెన్నున కిచ్చితి ద్విపద గావించి
దివ్యదేశమహాత్మ్యదీపికాభావ్య - మవ్యయసౌఖ్యదమై రాజసభల
స్థాపిన సంపెంగపోలిమిదాల్చి - యాచంద్రతారార్కమై యొప్పుగాత"

పై ద్విపదలవలన నీ కృతి రాజవోలి కేశవస్వామి కంకితముగా రచింపబడినదని తెలియును గద్వాల, వారూరు మున్నగు సంస్థానాధీశ్వరులవలె రాజవోలిపాలకులకుగూడ ప్రోల్గంటి సోమేశ్వరుడార ఇలువేలుపనియు తెలియుచున్నది. గ్రంథకర్త వంశావతార మిట్లున్నది.

ముష్టిపల్లి ఇమ్మడి యెల్లారెడ్డి సోదరుడు
చినరెడ్డి
(భార్య లక్ష్మాంబ)
|
పిన విభుడు
(భార్య లింగాంబ)
|
వెంకట భూపాలుడు
(కృతికర్త)

ఈ కృతికర్త కాల మిదమిత్థముగా చెప్పుట కెట్టి యాధారములును గానరావు. కృతికర్త తాను అంబుజోదరపదధ్యానపారీణు డననియు, శ్రీ వేంకటేశభూరికటాక్షలబ్ధపావనకవితానుభావుడ ననియు, నాదగౌరదననియు చెప్పుకొన్నాడు. గ్రంథమంతయు సరళమైన భాషలో భగవన్మహిమలు, ఆయా దివ్యప్రదేశముల మాహాత్మ్యము లుట్టంకించుచు నడచినది. అడుగడుగునను కృతికర్తగుగల భగవద్భక్తి మనకు గోచరించుచుండును. కర్త తనను చివరకు వెంకటదాసుగా చెప్పుకొన్నాడు.

పై కృతియేకాక వెంకటభూపాలుడు మరికొన్ని కృతులు రచించెను. ఆ కృతులలో నింత విపులముగా వంశావళియాదు మున్నగు వివరములు లేకున్నను పేరునుబట్టియే ఆ గ్రంథములుకూడ వెంకటభూపాల రచితములని భావించుచున్నాను. అట్టివానిలో మొదటిది రాజవోలి వేంకటేశ్వర శతకము. ఇది శిథిలావస్థలోనున్నది. ఇందులో మొత్తము ౧౦౮ పద్యము లున్నవి. అన్నియు కందపద్యములు. ఇది శ్రీ రాజవోలి వేంకటేశ్వరస్వామి కంకితము.

క॥ శ్రీ రమణీ ప్రాణేశ్వర
వారిజ లోచన మురారి......నమ
స్కారమిదె రాజవోలి వి
హారునివలె కరుణ వెంకటాచలరమణా.

చివర పద్యమిట్లున్నది.

క॥ నరహరి యెప్పుడు రాలా
నిరతము మదినమ్మినాడ నీ దాసుని నన్
మరువకుము రాజవోలీ
హరి లీలను కరుణ వెంకటాచలరమణా.

ఈ శతకమందలి మొదటి ౫౬ పద్యములు "ర" ప్రాసములో నున్నవి. ౫౭ నుండి ౭౬ వరకు "న" ప్రాసములో నున్నవి. ౭౭ నుండి ౮౬ వరకు "ల" ప్రాసము. ౮౭ నుండి ౧౦౫ వరకు బిందుపూర్వక రకార ప్రాసము. చివర మూడు పద్యములు మరల "ర" ప్రాసములో గలవు. వీనిలో కవి పేరు ఎచ్చటను లేదు.

ఈ శతకము ముగియుటతోడనే ఈతాళపత్ర గ్రంథమందే ఎనిమిదవ కమ్మనుండి "రాఘవోలి వెంకటేశ్వరకీర్తనము" లారంభమైనవి. ఈ కీర్తనము లందు వేంకటరాయగౌర భూపాలుడనియు, గౌరేంద్రుడనియు, గౌర భూపాలు డనియు, గౌర భూపతియనియు, వేంకటదాసనియు పేరుండుటనుబట్టి రాఘవోలి వేంకటేశ్వర శతకకర్తయు, రాఘవోలి వేంకటేశ్వర కీర్తనలకర్తయు నొక్కరగుదురని భావించుచున్నాను. ఈ కీర్తనలు రెండు సంపుటము లందున్నవి. మొదటి సంపుటములో రాఘవోలి శతకము తరువాత ౧ నుండి ౧౫౫౭ వరకున్న కీర్తనలు గలవు. పత్రసంఖ్య ౭౬తో నాగిపోయినది. అటుపై కమ్మలకు సంఖ్యలేదు. వాని ప్రతి కీర్తన ప్రారంభమున రాగతాళము లును. కీర్తన తరువాత దాని సంఖ్యయు గలవు. రెండవ సంపుటమున నీ రాఘవోలి వేంకటేశ్వర కీర్తనలు ౧౫౫౧ నుండి ౩౪౭౬ వరకు గలవు. మొదటి సంపుటమందు ౧౫౫౭ వరకు కీర్తనలున్నవంటిని. మొదటి సంపుట మందలి ౧౫౫౧, మరియు ౧౫౫౭ కీర్తనలును రెండవ సంపుటమందలి ఆ సంఖ్యలుగల కీర్తనలును ఒకటిగావు. వేర్వేరుగా నున్నవి. అది యొక చిక్కు సమస్య. సంఖ్య వేయుటలో వ్రాయసకాని పొరపాటు దొరలినదో లేక రెండవ సంపుటము కీర్తనలు వానిపూర్వపు క్రమసంఖ్యయు వేరో తెలియదు. ఏది యెట్లైనను ఈ మూడు వేల నాలుగువందల డెబ్బదియారు కీర్తనలు రచించినది మాత్రము వెంకటరెడ్డియనియే నా మతము. పేరునకివి వెంకటేశ్వర కీర్తనలుగాని వీనిలో నంతయు వైష్ణవమే లేదు. ఈ కీర్తనలందు కొన్ని శివపరముగా కూడ కలవు. ముష్టిపల్లి రెడ్లు మొదట ప్రోల్గంటి సోమేశ్వరుని భక్తులు, తరువాత వైష్ణవమును స్వీకరించినారు. ఐనను శివకేశవులను సమానముగా నారాధించినవారీ రెడ్లు.

మొదటి కీర్తన యిట్లున్నది.

మారువరాగం - ఆదితాళం

రామరామ నీవు నమ్మిన దాసుల రక్షించగ నిక యెవరున్నారు
స్వామి వరాకు............ పై నేమి నేరములు గల్గిననైనా,

ప॥ నే చేసిన పాపంబులన్నియును నీపై పరిహారములు కాయుగనూ
వాచకముల నీ దివ్యనామములు వర్ణన చేసెద దాపుదాపుముని ౧

నేమములో మీ పాదధ్యానము నిరతము నా హృదయమునందు
ప్రేమనిల్వగా సేయుము వేడుక సామజవరదా శ్రీనివాసహరి ౨
రాజవోలి కేశవుడగు వేంకటరాయ గౌర భూపాలకుని
తేజము మీరగ సేవ పరునిగా పూజితముగ దయచేసి యేలితివి ౩

ఈ భూపాలునికి శాత్రవులవలన నెట్టి యాపదలు కలిగినవో కాని యొక కీర్తనములో "రణజయమిచ్చి శాత్రవుల మర్దించి" తన్ను గాపాడవలసినదని పరాత్పరుని వేడుకొన్నాడు. ఆ కీర్తనమిది.

తోడిరాగం-ఆటతాళం

ఘోరంపు సంసార వలల (తగిలి?) మిమ్ము చేరనేరనైతిగా ఓరంగా
ఏ రీతినను దయజూచి రక్షించెదో కారుణ్యము మీరగా ఓరంగా
కాయము నిత్యముగాదని మీపాదకమలములభక్తితోను ఓరంగా
ధీయుక్తి పూజలు సేయుచు మదిలోన తెలివినొందనేరకా ఓరంగా
పాయని కామాదిశత్రువర్గములచే బద్ధుడనైయున్నాను ఓరంగా
యేయేడ కాపాడు భారమే మీది నన్నేలుము మరువకను ఓరంగా ౧

నారాయణయను నాలుగక్షరములు నాలుక నుంచలేనూ ఓరంగా
తారణగురువులు ఆనతిచ్చు యోగసారము ఎంచలేనూ ఓరంగా
ద్వారకావాసములైన మీపాదములపైన చిత్తముంచనూ ఓరంగా
క్షీరాబ్ధిశయనా నామనవాలకించి నీసేవపరుని జేయవే ఓరంగా ౨

ప్రణుతింపగా నెల్లచోట నిండియుండు బ్రహ్మము నీ రూపమూ ఓరంగా
రణజయమిచ్చి శాత్రవుల మర్దించినన్ రక్షించుమని వేడితే ఓరంగా
గణనోన్నత నాదగౌర గౌర భూకాంతుని నెల్లప్పుడు ఓరంగా
అణిమాదులొసగు వెంకటరాజవోలి విహార శ్రీ చెన్నరాయా ఓరంగా ౩

ఈ కీర్తనల మధ్యన కొన్ని ద్విపదలు కూడ కలవు. ౨౧౮ కీర్తనల తరువాత "ద్విపదలు" అను శీర్షికనుంచి.

"శ్రీ రామచంద్ర యాశ్రిత సన్మునీంద్ర, కారుణ్య సాంద్ర భాస్కరవంశచంద్ర" యని మూడు కమ్మల నిండుగా ద్విపద పంక్తులున్నవి. పదేసి ఇరువదేసి

ద్విపద పంక్తులకు కలిపి కీర్తనల క్రమము ననుసరించి సంఖ్యలుగూడ వేయబడినవి. ౨౧౯, ౨౨౦, ౨౨౧ సంఖ్యలలో నున్నవి ద్విపదలే.

౧౯౨ వ సంఖ్యగల కీర్తనము శివపరముగా నున్నది.

తోడిరాగం-త్రిపుటతాళం

మరచేవేలర నన్నూ, కోరిచేరితిర నిన్నూ
మరచేవేలర నన్ను, మరువవద్దుర నన్ను పరవతాల మల్లేశ్వరా॥

చ॥ రజతాచలనివాసా యెపుడు నిన్ను భజియింతు సద్విలాసా
భుజగేంద్రహార సకల భువనాధార భక్తవరదా ౧
గజచర్మాంబరధారా సకలముని స్తోత్ర
నిజముగ వరము——ద్విజరాజశేఖరా యేరా దిగ్విజయమియరా ౨
ఆనందకరమైన రాజవోలి హరి
పూనిక వెంకటేశుని మానుగ సఖుడైన మల్లేశ్వరా దాసునినన్నేలరా ౩

ఇన్నివేల కీర్తనములు రచించిన పరమభక్తాగ్రేసరుడైన ఈ ప్రభువు ఆంధ్ర వాగ్గేయకారుల శ్రేణిలో చేరదగినవారని నామనవి.

కీర్తనములున్న ఈ రెండు తాళపత్ర సంపుటములు గూడ మిక్కిలి శిథిలావస్థలో నున్నవి. అక్కడక్కడ ఇప్పటికే చాల భాగము క్రిమిదష్టము. కొలది దినములలో గ్రంథములు నుసియైపోవునను భయముగలదు. ఇంత గేయ సంపదను సంతరించియు ఊరుపేరులు లేక మరుగుపడిపోవుచున్నదీ ప్రభువు చరిత్రము. గ్రంథముల పరిస్థితినిబట్టి ఈ రచయిత పదునేడవ శతాబ్దము చివరనో లేదా పదునెనిమిదవ శతాబ్దము పూర్వార్ధముననో ఉండి యుండునని ఊహించుచున్నాను.

(గోలకొండపత్రిక 1–3–1961)

ఆత్తాను రామానుజాచార్యుడు

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారికి గద్వాల వారిచ్చిన తాళపత్ర గ్రంథములందొక గ్రంథము మిక్కిలి శిథిలావస్థలో నున్నది. అది బాగుగా క్రిమిదష్టమైనది. దానిలో మొత్తము మూడు కృతులున్నవి. 1. శ్రీ రుక్మిణీ కురవంజి, 2. సారంగధర చరిత్ర - యక్షగానము, 3. కృష్ణార్జున సంవాదము — ద్విపద. ఈ మూడింటిలో చివరికృతి నాదిండ్ల గోపమంత్రి కృతము మరియు ముద్రితము. తక్కిన రెండు కృతులును నముద్రితములు.

శ్రీ రుక్మిణీ కురవంజిని రచించినది ఆత్తాను రామానుజాచార్యులు. ఈ కృతికర్త దేశకాలములు తెలిసికొనుటకెట్టి యాధారములును గానరావు. ఈ కృతి మొత్తము 24 తాళపత్రములందున్నది. మొదటి కమ్మ నగమునకు విరిగిపోవుటేగాక బాగా చిల్లులు పడినది. మిగిలిన మొదటి భాగము నగము కమ్మ ఇట్లారంభమైనది.

మాళవి॥ శ్రీ కరంబై (అది)లక్ష్మీ జీవితేశ్వరు డురమునా......

ఇట్టి ప్రారంభమునుబట్టి ఈ రచనము ప్రాచీన యక్షగానములకును ప్రాచీన కొరవంజి రచనముల తెగకును చెందినదని భావింపవచ్చును. విరిగిపోయిన మొదటి కమ్మలో ఇష్టదేవతాప్రార్థనము పూర్వకవిస్తుతి మున్నగునవి యుండియుండును. రెండవ కమ్మలో కవి తన్నుగూర్చి చెప్పుకొనినారు. రెండవ కమ్మ ఇట్లారంభమైనది.

"...మ్రొక్కి మునిగ్రామ వాసుడగు మూర్తిగలయట్టి
వనధియగు పెంద్రాజు వంశపావనుడ
ఆత్తాను సంబంధమైనట్టివాడ
ఆత్తాను రామానుజార్య సాహ్వయుడ
కరమొప్ప రుక్మిణీ కల్యాణ (న) రతి
కరమర్థిలో యక్షగానంబురీతి

కొరవంజి జేసెద కూర్మితో నను
ధరణిపై మదిలోన దలచిన యంత
శ్రీరంగనాథుండు శ్రీపారిజాత
వారిధిగంభీరు వైభవాకారు
నా మదిలో నిల్చి నన్ను కరుణించి
కామితార్థము లొసగు ఘనత పెంపొంది
వరకావ్య శుభవాక్కు వాణి నాయందు
వదనతో అమృతప్రవాహమై (వేడ్క) నేడు 1
ఇచ్చిన సంతోష మింపుతో సొంపు
అచ్చతెలుగున కృతి ఆరంభమగుచు
ఆనందభరితుడై అమృతాబ్ధిగురియు
గురుతుగా శ్రీ మదనగోపాలునకును
కొరవంజి జేసెద కుంభిని వెలయ
దివ్యాంశ రుక్మిణీ దేవి తా.........
....
నరణి తేటగ వినుడి సంతోష మొదవ
కరమర్థి కొరవంజి క్రమము మెట్టెదనిన.

పై ద్విపదలవలన కృతికర్త మునిగ్రామ వాసుడనియు, పెంద్రాణ వంశపావనుడనియు, ఆత్తాను (శ్రీ వైష్ణవాచార్యపీఠమువారు) వారితో సంబంధము గలవాడనియు, పేరు ఆత్తాను రామానుజాచార్యుడనియు, మదన గోపాలస్వామి కీకృతి అంకితముగా రచింపబడినదనియు మాత్రము తెలియు చున్నది. ఇంతకన్న నెక్కుడు విషయము లీగ్రంథమువలన తెలియరావు. ఈ మునిగ్రామ మెచ్చటిదో. మనదేశమున నెన్నియో మునిపల్లెలున్నవి. ఓరుగల్లు మండలమున, మహబూబునగరం మండలమున, గుంటూరు మండలమున మునిపల్లెలున్నట్లు నేనెరుగుదును. పెంద్రాణ ఇంటిపేరా లేక కులము పేరా? ఇంటి పేరైనచో మరల ఆత్తాను అను ఉపనామ మెందులకు? పెంద్రాణ కృతికర్త తండ్రి పేరో తాత పేరో కావలెను.

గ్రంథాంతమున కృతి భర్తయగు భగవంతుని స్తోత్రము కలదు. అటుపై ఫలశ్రుతి మున్నగునవి చెప్పి ముగించినారు.

(అటవ కమ్మ)
అని యిట్లు కొరవంజి హరుషాబ్ధి...., అనిశంబు శుభమంది అభివృద్ధిగాను
(పరమ) పావని రా(మ) పతిపేరగాంచి, వరదరాజుల పేర వనజాక్షు పేర
నరహరి శ్రీ జగన్నాయకుల పేర, పురజింపగా అష్టభుజస్వామి పేర
గురుడుగా శ్రీ మదన గోపాలునికి, పరిపిగా కొరవంజి విన్నవించితిని
కరమర్థి లక్ష్మీకాంతు(ని) కృపను, గరిమతో నావాక్య ఘన పుష్పమాల
చేసితి నానేర్పు చేతనైనట్లు, వాసిగా నీ కృతిపై భవంబునను
భూచక్రమందు సంపూర్ణ కళలందు, ఆ చంద్రతారార్కమగుచు వర్ధిల్ల
వికసంబుగా చదువు విన్నవారలకు, ఆయురారోగ్యంబు ఐశ్వర్యపదము
శ్రీ జయలక్ష్మి సిరులిచ్చునింట, హాయిగ వసియించు భాగ్యముల్ ( )నాడు
ఎన్నాళ్ళు మేరువు ఎన్నాళ్ళు జలధి, ఎన్నాళ్ళు తారలు ఎన్నాళ్ళు...
ఎన్నాళ్ళు దినమణి ఎన్నాళ్ళు...., ఎన్నాళ్ళు బ్రహ్మాండమెన్నాళ్లనిలుచు
అన్నాళ్ళు ఈ కృతి యభివృద్ధి బొందు—

ఈ కురవంజిలో జంపె, సువ్వాలలు, మంగళారతులు, ద్విపదలు, ధవళములు మున్నగు తిరుతిరుల గేయములు గలవు. ఇందున్న భాషలో "మెత్తనముగ తలబాలునూ, మత్తాగ బోసిరి మునులూ" అని కలదు. మెత్తనము, మట్టసముగా మారినది. ఈమాటలు తెలంగాణాయందు మహబూబు నగరం మండలమున నధిక ప్రచారమందున్నవి. (రాయలసీమలో వాడుక యందుండుట అందరెరిగిన విషయమే) కనుక ఈ కవి మహబూబునగరం మండలమువా డనుకొందును.

ఈతని వచనశైలి దెలియుటకై యొక యుదాహరణము. ప్రారంభమున నుదాహరించిన ద్విపద తరువాత వచన మిది.

"ఇట్లు——— కైన భూలోకమందు, జంబూద్వీపమున విదర్భ దేశంబున, కుండినా పురిపట్టణంబు గలదు, అందునగల సకలసౌభాగ్య లల సంపన్నుండగు భీష్మకుండను రాజేంద్ర పట్టభద్రుండు సకలగుణసంపన్నుండై రాజ్యంబేలు సమయంబున అతండు సంతానంబు వడసె"—

రుక్మిణీ శ్రీకృష్ణుల వివాహసందర్భమున కొల్లములు దంచినప్పటి "సువ్వాల" గలదు.

కూరిమితో బంగారు కుందెనాలో కొలుచు నించి
గారవించి నదులు రోకండ్లు దంచుచూ
సువ్విరంగనాథ సువ్వి సువ్వి వెంకటేశ సువ్వి.

సువ్వి కృష్ణరాయ సువ్వి సువ్విలాలె
రామ రావె చంద్రవదన రమణి రావె చంద్రవదన
కోమలాంగు లెల్ల రారె కొట్నమందుకూ
అనుచు పేరటాండ్ల బిలిచి హర్షమున పసుపులిచ్చి
వినుతి నొనల కుంకుమలను ఘనత బెట్టిరీ
కొలది దంస్తు(?) పట్టులమర కొంగు బంగారు మెరయ
జిలుగువన్నె చంద్రకావి చీరలిచ్చిరీ
కుసుమపువ్వు చాయరంగు కుందనంపు పూత మెరయ
పసుపుపట్టు రవికెలెల్ల పంచియిచ్చిరీ
అంత ముత్తయిదువలును హర్షమున నుప్పొంగుకొనుచు
కాంతుడేరి పాటబాడ రంతులొదనూ
వేదవేదాంత కృష్ణ ఆదివాసుదేవ కృష్ణ
నాదావినోది కృష్ణ నాథ కృష్ణా
వన్నె నన్నసూది పచ్చ గన్నెరాలు కృష్ణభోగి
నన్న రాజనాలు జీలకర్ర దంపుచూ
ఉబ్బి నిక్కి అంగలాచి ఉవిదలెల్ల చెమట జార
గబ్బిగుబ్బ లదరగాను కలయదంచిరీ
యెంచి పెండ్లి మోపు యింటి——
పంచగతుల జేరి వాయించ దొణగిరీ॥—

గ్రంథమంతటను వ్రాయసకాని తప్పు లధికముగా గలవు. అవి వ్రాయసకాని తప్పులో లేదా ఆనాటి వ్యావహారికపు శైలియో తెలియరాదు. సకల అనుచోట సకళ అనియు, "ఉ" చోట "వు" వాడుటయు, చంద్రుడు లోని "ద" కారము ఎత్వముతో నుండుటయు, చేయగా అనుటకు శాయగా అనుటయు, సిరులకు శిరులును, ఉకారాంతముల తరువాత యదాగమములును కలవు.

ఒకే సంపుటమందుగల మూడు వివిధగ్రంథముల కాలమును బట్టియు, గ్రంథపరిస్థితిని, ప్రక్రియనుబట్టియు నీ ఆత్రాను రామానుజాచార్యుడు పదునారవ శతాబ్ది కిటీవలివాడు కాడని భావించుచున్నాను.

(గోలకొండ పత్రిక ౧-౮-1961)

సర్వజ్ఞ పద్మనాయక భూపాలుడు

అత్తాను రామానుజాచార్యుని "శ్రీరుక్మిణీ కురవంజి" తరువాత అదే తాళపత్ర సంపుటమున "సారంగధర చరిత్ర-యక్షగానము" గలదు. ఇది 25వ కమ్మ నుండి 54వ కమ్మవరకు మొత్తము 30 కమ్మలలో నున్నది. దీనికి కర్త సర్వజ్ఞ బిరుదాంకితుడగు ఒకానొక పద్మనాయకకుల భూపాలుడు. అతని పేరీ గ్రంథమున లేదు. కేవలము బిరుదు, కులము మరియు పదవులు మాత్రమున్నవి, తల్లిపేరు స్పష్టముగాను, తండ్రిపేరు అస్పష్టముగాను, రాజధాని పేరు స్పష్టాస్పష్టముగను నున్నవి. గురువు పేరన్నిటికన్నను కష్టముగా నున్నది.

రాచకొండ నేలిన రేచెర్లపద్మనాయకులందు రెండవ సింగభూపాలునకును మరియు మూడవ సింగభూపాలునకును సర్వజ్ఞబిరుదము లున్నట్లు మన మెరుగుదుము. ఈ వంశములో తక్కినవారికీ బిరుదమున్నదో లేదో తెలియదు, సారంగధర యక్షగానకర్త ఈ యిరువురు సింగభూపాలురందొకరు కావచ్చును కాకపోవచ్చును, లేదా వీరికన్న పూర్వుడైనను కావచ్చును. ఈ తాళపత్ర గ్రంథము మిక్కిలి జీర్ణావస్థలో నున్నది. కొన్ని కొన్ని పంక్తులసలే చదువ రాకున్నవి. వ్రాత తప్పులు కూడ కుప్పలు తెప్పలుగా నున్నవి. కంటవత్తిడి కొని కొన్ని వారములీ గ్రంథమును పరిశీలించుట జరిగినది. ప్రత్యక్షరమును జాగ్రత్తగా చదివితిని. ప్రాచీనతర యక్షగానములందిది యొకటి యనుటకు సందేహ మిసుమంతయును లేదు.

దీని ప్రారంభమిట్లున్నది.

అటతాళపు రేకులు

శ్రీ విధుని బూజించి వాక్పతి......। యెపుడు। సవని...పార్వతీ
శ్వరు ప్రస్తుతింతున్ 1
విష్ణురా(జాదు) మ్రొక్కి....వాగ్వతి నిర్విఘ్నముగ శ్రీయక్ష...(?)
వేడుకొందున్ 2

వ్యాస(భ)ట్టార్య(గ) వాల్మీకి గొలిచి ।(మది)లో। అఘగ బ్రహ్మాది
మునులకు నాంజనేయు.... ౩
పూని దత్తిల చరణకోహల శృంగవాటి ।...ల। గానశాస్త్ర ప్రబంధ
కర్తల కరుణ వరసి ౪
తివిరి బాణమయూరులను చిత్తమున నిలిపి తక్కిన కవివరేణ్యులకెల్ల
ద(.) . యు. మొనంగ॥

పై యటతాళపు రేకులందు మొదటి చరణమున త్రిమూర్తులను, రెండవ చరణమున విఘ్నేశ్వరుని మరియు నెవరినో వేడికొన్నారు. మూడవ చరణమున వ్యాసవాల్మీకులను గొలిచినారు. ఆ చరణముననే శుగబ్రహ్మదులను(?) స్మరించినారు. ఈతడు శుకుడో మరియెవరో? ఆటు తరువాత ఆంజనేయుని స్మరించినారు. ఆంజనేయుడు పూర్వభరతాచార్యులందొకడు కదా? ఆంజనేయుడిచట భరతాచార్యుడుగ స్మరింపబడినాడో కాక దైవతముగా స్మరింపబడినాడో తెలియదు. నాల్గవ చరణమున దత్తిలాది భరతాచార్యులు స్మరింపబడినారు. "దత్తిల" తరువాత "చరణ"యని కలదు. తరువాత "కోహల"యో కోమలయో సరిగా తెలియరాకున్నది. కోహలుడని భావించుచున్నాను. కోహలుడొక భరతాచార్యుడని ప్రసిద్ధమే కదా। ఐదవ చరణమున కేవలము బాణమయూరుల నామములు మాత్రము పేర్కొనబడినవి. కాళిదాసాది మహాకవుల యూసేలేదు. రెండవ సర్వజ్ఞ సింగభూపాలుడు రసార్ణవ సుధాకర, సంగీత సుధాకరములకు కర్త. ఒకవేళ ఆ సర్వజ్ఞుడే ఈతడగునో యేమో। కానిచో దత్తిల, కోహల, ఆంజనేయాది గానశాస్త్ర ప్రబంధకర్తల స్మరణమెందులకుండును?

ఇష్టదేవతాస్తోత్రాదికములున్నట్టి ఈ యటతాళపు రేకుల తరువాత ॥ద్విపద॥ అని వ్రాసి "రాచబెగుంట్ల వీరభద్రా" యని యున్నది. నిజమునకిది ద్విపదగా చేరినదికాదు. దీని తరువాతనే ద్విపద అని వ్రాయవలసి యుండెను. ఈ రాచబెగుంట్ల యెచ్చటిదో తెలియదు. ద్విపదపంక్తులందలి తప్పులు దిద్దక ఉన్నదున్నట్లుగా పేర్కొనుచున్నాను.

అంద్దర సితంగి అఖిసుడిచేసి-యుంద్దిరావరుచేత యుంద్ధరు మెచ్చ
కవి(.) మహాలక్ష్మీకరు భక్తి(చే)కి-భువి కావ్యులను మెచ్చె పూజ్యుడై సభల

మించ్చి(న)కవి మహామేటి నం(సా)రి-అంచ్చితగమపులాణతిక సహసా
పీఠాదినంగ్గితవి (ద్యావి)నోది-వాణి వివేకది వరచ్చక్రవర్తి
సహజ విక్రమకీర్తి సర్వజ్ఞమూర్తి-బహుమాన పురుషుండ్డు పద్మనాయకుడు
కడునొప్పసౌరంగ్గికరదిగంత్తముల-పురమీశ్వరులు మెచ్చబుధులుచెరియింప
నరసులుగొనియాడ ఆణలౌననగ-నరనవదోర్ద్కీత (క?) తావదద్వివట
వి (ప్ప)త్తవర (భా)షా........దవాగ్వి (గ్వు)ర్త-వృత్తి బంధంబుల
వినసింపుగాగ
చెప్పెను ధరలోన చిరకీర్తి వెలయ-అప్పణ్య చరిత రానది యెట్టిదనిన"

ఈ ద్విపదపంక్తుల తరువాత రాజమహేంద్రవర పట్టణము-అచటి రాజరాజనరేంద్రుని వర్ణనముతో వచనము ప్రారంభమైనది. ఇచటినుండి 64వ కమ్మ మొదటివైపువరకును సారంగధర చరిత్రము (సారంగధరునకు సిద్ధుని మహిమచే నరుకబడిన కాలుసేతులు మరలవచ్చుటనుకనున్న శుభాంతమైన కథ యంతయు) కలదు. రెండవవైపున గ్రంథాంతమందుండు ద్విపద పంక్తులును ఫలశ్రుతియును గలవు.

"........................—శ్రీకరంబుగ (..)నృపచెంద్రునకును
దాచతుదేవి గారాయిసుతుడు-ఆచారమణి భట్టరయ్య శ్రీపార
పంకజభ్రమరా..న్న వాడు
మానగుణాడ్యు దుమారలేశ్వరుడు-నానార్థకల్ప (...)యక్రియ లమర
రచియించె చిరకీర్తి...రుచులు వెలయ...చెరితమది విన్నసుతసులకెల్ల"

...

॥వచనము॥ — "ధనకనకవస్తువాహనసమృద్ధి వరశి॥ (..) మోక్షల గుణసంతానమున వరలు నిత్యమై విజయలక్ష్మి గలిగి॥.......లక్ష్మి పరిపూర్ణమై సంపదల మిన్నంద్ది సంతోషము యుల్లకాలము గలిగి॥ దంపతులు (...) తురు దుర్గకలు లేక శరహరమై సఫలమై॥ అస్థానజయమై॥ మన్నన ప్రభావమై॥ సురికెక్కుదురు॥ భూపతులు నరలందు॥ ఆయురారోగ్యములు అందందు శుభములు పాయక అనిశంబు చెందుగాన పా....... (శిథిలము) ...."

కథా ప్రారంభమునకు పూర్వమును, కథాంతము తరువాతనుగల ద్విపద పంక్తులను పైన నుదాహరించితిని. సారంగధరచరిత్ర యక్షగానమును రచించిన ఈ కృతికర్త చరిత్రమంతయు నీ ద్విపదల సాహాయ్యముననే తెలిసి కొనవలయును. ఇంతకన్న మిక్కిలి మనకు ఉపకరించు వస్తువు ఈ గ్రంథ మున కానరాదు.

కథాప్రారంభమునకు పూర్వమున్న ద్విపదపంక్తు లాధారముగా నీ కృతికర్త ఆగమపురాణేతిహాసములందేకాక వీణాదిసంగీత విద్యావినోది, వాణీవిలాసాదివరచక్రవర్తి, సహజవిక్రమకీర్తి, సర్వజ్ఞమూర్తి, పద్మనాయ కుడు. రేచెర్ల ద్వితీయ తృతీయ సింగమ నాయకులకు సర్వజ్ఞ బిరుదము లున్నవి. ఈ కృతికర్తకూడ సర్వజ్ఞుడు. పై యిరువురు సింగమనాయకులం దితడొకడగు ననుకొందమన్న కథాంతమున నున్న ద్విపదపంక్తులందున్న తలిదండ్రుల పేర్లు కుదురకున్నవి. సర్వజ్ఞ బిరుదాంచితుడైన మాధవ సింగ భూపాలుడు భోగినీదండకము ననుసరించి పోతమాంబాలసద్గర్భసంజాతుడు మరియు కుమారాన్నపోతావనీనాథసూనుడు. రెండవ సింగభూపాలకుడన్నచో ఎఱదాచానేనికిని పోచమదేవులకును ప్రథమ పుత్రుడని వెలుగోటివారి వంశావళి సాక్ష్యమిచ్చుచున్నది. ఇక మన కృతికర్త తలిదండ్రులనుగూర్చి విచారింతము. ఇతడు "కాచమదేవికి గారాలుసుతుడు" పైన పేర్కొనబడిన ఇరువురు సింగభూపాలుర తల్లులపేర్లు పోచములు. పోచమ యనుటకు మారుగా కాచమ యన్నారేమో యనుకొందమన్న కాచమ - గారాలు అని యతిస్థాన మున ప్రయోగమున్నది. తండ్రిపేరైనను మన దురదృష్టమున సరిగా లభింప దాయెను. "శ్రీకరంబుగ (...) నృపచంద్రునకును" అని కలదు. కొన్ని శాసనములందువలె మనకెచ్చట యవసరమో అచ్చటనే ఈ గ్రంథము శిథిల ముగా నున్నది. క్రిమిదష్టములైన ఈ రెండక్షరములను "దెన" యనిగాని "బిన్న" యనిగాని చదువుటకు వీలున్నది. దాచానాయుడనియు దేచానాయు డనియు ఎఱ్ఱదాచానాయనికి మారుపేరులు. "దేచ" శబ్దము మన గ్రంథమున శిథిలమై "దెన"గా నగుపడుచున్నదేమో యనుకొందమన్న పోచమ - కాచ మలకు పొంతి పడుచున్నది. కనుక తల్లిదండ్రులపేర్ల సాయమున నీకృతి కర్త చరిత్రమును సింగభూపాలద్వితయమునకు ముడిపెట్టజాలకున్నాము. మొదటి సింగభూపాలునకుగూడ సర్వజ్ఞబిరుదముండెనో లేదో? ఉన్నట్లింత

పరకేమియు సాక్ష్యము గానరాదు. అసలు మన చారిత్రకు లీ బిరుదమును ద్వితీయతృతీయసింగమనాయకు లందొకరికే ఈయవలయు ననుచున్నారు. మనకిష్టము వచ్చిన వారికెల్ల బిరుదులిచ్చుటకు పీఠాధిపతులు కారు గదా!

కాచమదేవికి గారాబు సుతుడనని చెప్పుకొనిన కృతికర్త తన గురువును స్మరించి మనకు కొంత మేలుచేసినాడు. "ఆచారమణి భట్టరయ్య శ్రీపాద పంకజ"ము లీతడారాధించినాడట. ఆచార్యమణి యనుటకు మారుగా ఆచారమణియని వ్రాయసకాడు వ్రాసియుండును. ఈ భట్టరుల వారెవరు? కోరుకొండకు వేంచేసిన పరాశరభట్టరులే ఈ భట్టరయ్య యని నేనూహించుచున్నాను. కథాంతరమందలి యీ ద్విపదలలో కవి తనను గూర్చి మరియొక విషయమును చెప్పినాడు. కృతికర్త "మానగుణాఢ్యు డుమాచలేశ్వరుడు". ఈ యుమాచల మెచ్చటిది? ఇది యాతని రాజధాని కావలెనుగదా! రాచకొండ చేరిన పద్మనాయకులకు మొదటిరాజధాని ఆమనగల్లు, దీనినే "అమ్మనగల్లు" అందురు. ఉమాచలమనునది అమ్మనగల్లుకు సంస్కృతీకరణమా? అటులైనచో నీ యక్షగానము పుట్టుక రాచకొండదుర్గము పుట్టుకకన్న ముందునకు పోవును. ఉమాచలమునుగూర్చి మరియొక యూహ. శ్రీశైలమున కుత్తర ద్వారమగు ఉమామహేశ్వరమే ఉమాచలము కావచ్చును. ఆచటి కొండను ఉమాగిరి యందురట. కొండపైనను క్రిందను శివాలయము లున్నవట. కొండ క్రిందనున్న దేవాలయమే ఉమామహేశ్వరదేవాలయము. అచట కాకతి రుద్రమదేవికాలపు శాసనమున్నట్లును, రేచెర్ల మాధవేంద్రుడు వేయించిన (శకవర్షములు 1298 ఫాల్గుణము క్రీ. శ. 1376) శాసనమున్నట్లును పూజ్యులు శ్రీ ఆదిరాజు వీరభద్రరావుగారు తెలుపుచున్నారు. (సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశము 2వ సంపుటము పుట 248) ఈ శాసనము కీ. శే. వెల్లాల సదాశివ శాస్త్రి మరియు అవధానము శేషశాస్త్రి గారలు రచించిన వెలుగోటివారి వంశ చరిత్రము అనుబంధమున (పుటలు 81-86) ప్రకటింపబడినది. ఈ మాధవ నృపాలుడే రేచెర్లవంశమున నాలవతరమువాడగు మాదానేడు. ఈతడు మొదటి సింగమనాయనికి పుత్రుడు మరియు అనపోతానేనికి తమ్ముడు. ఈ యిరువురు సోదరుల పరాక్రమాతిశయములు విజయములు వెలుగోటివార వంశావళిలో విపులముగా వర్ణింపబడినవి. "రాచయ సింగభూపతి సుతుండైన మేదినీరూపనారాయణ సింగమాంబాగర్భశుక్త్యైకరయ రేచెర్లవంశ ముక్తాఫ

సుధాకరుం డైన శ్రీ మాధవేంద్రుండు దేవరకొండప్రాంతమందుల న్వనామాంకితమైన మాధవపురమందు ప్రాజ్యరాజ్యోపవిష్టుం డై" ఈ శాసనము వేయించినట్లు తెలియుచున్నది. వెలమరాజ్యము ప్రారంభమున మాధవనృపతికి ఉమాచలము సమీపమున గల మాధవపురము రాజధాని. రాజ్యము పెరిగిన తరువాత అన్నయగు అనపోతానాయునికి రాచకొండయును, తమ్ముడగు మాధవనృపతికి దేవరకొండయును రాజధానులైనవి. మాధవనృపతి మాధవపురమును తానే పొందించి తన రాజధానిగా నిర్ణయించుకొనెను. ఇతని పూర్వులకు బహుశః ఉమాచలమే అనగా ఉమామహేశ్వరమే రాజధాని కావలయునుగదా! పైన నుదాహరించిన ప్రబలకారణము లాధారముగా నుమామహేశ్వరమునే యుమాచలముగా భావించుట సమంజసమని నా యభిప్రాయము. ఏతీరుగా జూచినను మన కృతికర్త మాధవనృపాలునికి పూర్వుడే కావలయును. మాధవనృపాలుని తండ్రి మొదటి సింగమనీడని మనవిచేసితిని. ఇతడే మన యక్షగాన రచయిత కావలెను. ఇతనికి కూడ సర్వజ్ఞబిరుదముండవలయును. ఈవిధముగా రేచర్లవంశమున ముగ్గురు సింగభూపాలురకును సర్వజ్ఞబిరుదమున్నట్లు భావింపవలెను. ఈవిధముగా నీ యక్షగానము పుట్టుక పదునాల్గవ శతాబ్దము మధ్యభాగమునకు పోవుచున్నది. ఈ యూహయంతయు నిదివరకుదాహరించిన ద్విపదపంక్తు లాధారముగా చేసినది. నిజానిజములు చారిత్రకపరిశోధకులు తేల్చవలెను.

ఇక సారంగధరకథనుగూర్చి విచారింతము. ఆంధ్రభారతమును వ్రాయించిన కీర్తితోపాటు రాజరాజనరేంద్రునకు కొడుకు కాలుసేతులు నరికించిన యపకీర్తియు తెలుగువా రంటగట్టినారు. చంద్రవంశమున జన్మించుటచే గాబోలు రాజరాజునకీ యశస్సుతోపాటు కళంకమును తప్పదయ్యెను. చారిత్రకులిది యసత్యమన్నను సారంగధరుని దిబ్బలు, చిత్రాంగి మేడలు రాజమహేంద్రవరమున శాశ్వతత్వమును గడించుకొన్నవి. గౌరన మంత్రి చిత్రాంగి సారంగధరుల వృత్తాంతము మాళవదేశమున జరిగినట్లు వ్రాసెను. రాజమహేంద్రుడు మాళవదేశమునకు రాజని గౌరన మంత్రి స్పష్టముగా వ్రాసెను. చేమకూర వెంకటరాజు పొరపడి రాజమహేంద్రుడును రాజరాజనరేంద్రుడును ఒకడేయని తోచునట్లు వ్రాసెను. ఇక కాకునూరి యప్పకవిమాత్ర మీకథయంతయు రాజమహేంద్రవరమున

రాజనరేంద్రుని యంతఃపురమున జరిగినట్లే బాహాటముగా వ్రాసెను. మనము ప్రాచీనుడనుకొనుచున్న ఈ యక్షగానకర్తయగు "సర్వజ్ఞుడు" కూడ రాజమహేంద్రవరపురమున జరిగినట్లే ఈ కథను చిత్రించినాడు. నేనూహించినట్లు గౌరనకు పూర్వుడో లేదా సమకాలికుడో కావలసిన ఈ సర్వజ్ఞుడు గౌరనవలెగాక అప్పకవివలె వ్రాయుట నా యూహకు మిక్కిలి బాధకముగా నున్నది.

కథాప్రారంభమునకు పూర్వమున నున్న ద్విపదఖండముల నిదివర కుట్టంకించితిని. వాని తరువాత వచన మిట్లున్నది.

"॥వచనం॥ భూలోకమందు పట్టణశ్రేష్ఠమైన రాజమహేంద్రవరము। ఆ రాజమహేంద్రవర పురమేలు రాజా రాజనరేంద్రుడు। ఆ రాజనరేంద్రునకు పట్టపుదేవులు పెద్ద పెండ్లాము రత్నాంగి చిన్న పెండ్లాము మోహపుదేవి చిత్రాంగిన్ని అయివుండగాను ఆ పెద్దపెండ్లాము రత్నాంగికి బిడ్డలు లేక పెద్దకాలము పెక్కు నోములు నోచి (కన్న) కుమారుండు సర్వలక్షణ సంపన్నుండైన సారంగధరుండు అతని గుణకథనాలు విన నౌదరింపురా"—

సారంగధరుని రూపగుణసంపదలు తరువాత వచ్చు అటతాళపు రేకులందు బాగుగా వర్ణింపబడినవి.

సారంగధరుడు ఎగిరిన పావురము చిత్రాంగి మేడలోనికి పోయినప్పు డచటికి పోవచ్చునో లేదో యని సారంగధరు డాలోచించు సందర్భమున నిట్లున్నది:

జంపె రేకులు:—

"ప్రేమతో పక్షి మాపినతల్లినగరా। (అ) మేడప్రైవాలె (ఆ)ట లోయి
చిన్నమా యనిపోయి ప్రియమునను గొంతా। మన్నింపు...గోరుత....సునో।
అటుగాక సవతి కొడుకని నన్ను గిడుక। కుటిలా ప్రియై పలుకకుండునో
ఇట్టియెడ పావురము నిడి(చి)లియు నేని। ఇట్టునో మదికరుల బట్టునో
యిట్లు వెరవక యిల్లు చొచ్చిననంచు। (.)ట్టుగా పతికేమి చెప్పునో
వలనెరిగి యీ పావురము దేనుపాయంబు। ఘనులని చెప్పరే...రారా॥"

సారంగధరుని నేరమును విచారించి శిక్షవిధించినప్పటి వచనమిట్లున్నది

"అంతట ధర్మానసమువారి అనుమతానచేశి కొదువలినని మోహ (భారతి?)కి తాత్పర్యంబులు వినిచి వీరు పాపభుర్మంతు చిత్రాంగి యింటికి నడిచిన కాళ్లున్ను పట్టుకొన్న చేతులున్ను అర్ధరాత్రి సమయమపుడు అడివిలోకి కొంపోయి నరికిరంతసిన తల(వ)రులవారు వచ్చి సారంగధరునిలో యేమను చున్నారు వినవౌధరించుడా"—

తలవరులమాట లుత్కళికలందు చెప్పబడినవి.

"పుణ్యకులపావనుడగా పుట్టవించి పరగిన సుగుణోజ్వల నట్టనుడ
రాసుతుడ నిన్నూ
చంపుమని మీ తండ్రి పుత్రిక నర్వరమునా యిచ్చియు పంపినాడిది
చూడుమా భూపాలతనయా
పన్నుగా తలిదండ్రులెయెడ భక్తిచేసి పుండెడి అన్న నీకిపాప మిటువలె
నట్టె తండ్రీ
భక్తితో భరుచయ్యన కలిభక్తిచేసి కొలువగా భోక్తలేదే మాకు నీకును వో
పుణ్యపురుషా
యిట్టి యనుకరెహ మిటవలె బుట్టియుపుడు లలిమిని కట్టుమన నెట్లాడెనో
ఘనుడ నిన్నూ
గాన రాజనరేంద్రునానతి గడువరాదు నిర్దయు పూని చంపగ వలదొకో
వో ఘనుడ నిన్నూ
అయ్య యిదిగో రాజు మనసు లరకొమాచి పోయిరి దయ్యనను నయనంబు
గావలె నట్టనుండా"—

నర్వజ్ఞాని శైలియు నీ యక్షగాన నరణియు తెలిసికొనుటకు నింతవరకుద్ధరించి యుదాహరింపబడిన భాగములు చాలుననుకొందును.

నేనూహించినట్లిది ప్రాచీనతమయక్షగానముగునో కాదో ఈ నర్వజ్ఞుడు రేచెర్ల వంశజుడగునో కాదో పెద్దలు మరియు పరిశోధకులు నిర్ణయించవలెను.

(గోలకొండ పత్రిక 17-3-1961)

ఏదుట్ల శేషాచలుడు

గద్వాల సంస్థానాధీశ్వరు లాంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ వారికిచ్చిన యమూల్య గ్రంథములందు జగన్నాటక మొకటి. ఈ మహాకావ్యమునకు కర్త యేదుట్ల శేషాచలుడు. లయగ్రాహి గరుడాచల కవిని గూర్చి వ్రాసినప్పు డాతడు పూర్వకవిస్తుతిలో మురారిని స్మరించిన సందర్భమున జగన్నాటక మను మాట ప్రసక్తి వచ్చియుండెను. జగన్నాటకమనునది మనకు లభింపని మురారి రచనములందొకటియై యుండునని యూహించితిని. కాని నాయూహ నిజమైనది కాదు. శేషాచలుడు రచించినది ఆంధ్రీకరణము గాదు. ఇది యీతని స్వతంత్రకావ్యమే. అనువాదమైనచో నీతడు దాననువాదము చేసినట్లు చెప్పకొనవలెనుగదా। అట్టి ప్రసక్తి యేమియు నీ గ్రంథమున గానరాదు.

శేషాచలుడు సంగీతసాహిత్యభరతశాస్త్రాదినకళాప్రవీణుడు. కౌండిన్యసగోత్రుడు, చెన్నయ పండితుని పౌత్రుడు మరియు నాగేశ్వర (నాగభూషణ) పండితుని పుత్రుడు. వనపర్తి సంస్థానములో, వనపర్తి చెంత గల జిల్లా గణపుర నివాసి. ఈతని పూర్వీకులు ఏదుట్లనుండి జిల్లాగణపురము నకు వచ్చియుందురు. కనుకనే వీరి యింటి పేరు ఏదుట్ల వారైనది. ఏదుట్ల గ్రామము జటప్రోలు సంస్థానములోనిది. పూర్వకవి సంస్తుతిలో నీతడు పింగళి సూరనార్యునికూడ స్మరించుటచే నీతడు సూరనార్యుని తరువాత నున్న వాడనుట నిశ్చయము.

ఈ తాళపత్రగ్రంథమున రెండు కృతులున్నవి. మొదటిది జగన్నాటకమను వైరాగ్యానముల కావ్యము ౧౩౦ కమ్మలందున్నది. అటు తరువాత దారిగర్భుల నృసింహశతకము మరియొకకృతి యున్నది. దారిగర్భుల నృసింహస్వామి సింగవట్టణమున నున్న జటప్రోలు సంస్థానాధీశ్వరుల యిలువేలుపు. ఈ దైవతమును గూర్చి యిదివరకు దారిగరుపుం

ధర్మయామాత్యునిగూర్చి వ్రాసిన వ్యాసమందును, శేషభట్టరు సింగరాచార్యులగూర్చి వ్రాసిన వ్యాసమందును, కొలదిగ ప్రస్తావించి యుంటిని. శేషాచలుని పైరెండు కృతులును నొకే తాళపత్ర గ్రంథమందుండుటచే నివి మూలప్రతి గాబోలునని నాయూహ. ఈ గ్రంథము మిక్కిలి జీర్ణావస్థలో నున్నది. చాల భాగము శిథిలమై పోయినది.

ఆగన్నాటకము ప్రారంభమున గల పద్యము

శా॥ శ్రీ సీతాననమండలంబున వర శ్రీగంధమున్ బూసి (సా)
ధ్యానంబౌ తన విశ్వరూపము కరున్ భద్రంబుగా వ్రాసి యో
హోసాక్షి (బ్ర)హ్మ కారమయ్యెనని సర్మోక్తుల్ వచారింపుచున్
హాసక్రీడలు సల్పు రాఘవుడు కృత్యాదిన్ కృపన్ బ్రోవుతన్.

రెండవ పద్యమున సీతాదేవిని, మూడు నాల్గు పద్యములందు శివపార్వతులను, ఐదు ఆరు పద్యములందు బ్రహ్మ సరస్వతులను, ఏడు ఎనిమిది పద్యములందు విఘ్నేశ్వరుని, తొమ్మిదవ పద్యమున నాంజనేయుని, పదియవ పద్యమున ననంతుని, పదునొకొండవ పద్యమున నవగ్రహములను, పండ్రెండవ పద్యమున నష్టదిక్పాలురను, పదమూడవ పద్యమున గురుదేవుని, పదునాల్గవ పద్యమున మునిజనమును, పదునేనవ పద్యమున ధ్రువుని స్తుతించినాడు. ఈ దేవతాధికస్తోత్రపద్ధతియం దీతనొక క్రొత్త విధానము నవలంబించినట్లు తెలియుచున్నది. నవగ్రహములను, అష్టదిక్పాలురను, 48గురు మునులను, ధ్రువుని పూర్వాంధ్రకవులు స్తుతించి యుండలేదు. ఈ స్తోత్రాదిక మీతని కావ్యార్థమునకు సూచికగా భావింపవలెను. ఆంజనేయ స్తోత్రమిట్లున్నది.

సీ॥ ఏ మహాసత్త్వుండు రామకార్యంబున గిరులెల్ల నచ్చనగిల్లజేసె
ఏ బలప్రఖ్యాతు డేడువారాసులు గొల్వలరీతి లంఘనము జేసె
ఏ సింహవిక్రముం డెలమి రక్షఃకుంజరాలి సిగలరీతి నణచిపుచ్చె
ఏ మహనమకాయు డింద్రారి ఖండించు వేళ తారలు కటి వ్రేల బెరగె

దారగిరి చాలనక్రియాదక్షశక్తి
పాత సౌమిత్రి జీవమే ప్రభుడొసంగె
నట్టి గుణవంతు ధీమంతు నధికకాంతు
ప్రకట జయవంతు హనుమంతు బ్రస్తుతింతు. (౯)

దేవతాస్తోత్రము తరువాత పూర్వకవు లందరివలె నీతడుగూడ సుకవి ప్రశంసయు, కుకవి నిందయు చేసినాడు. అటుపైన తన వంశావతారమును చెప్పుకొనినాడు. గురుస్తోత్ర సందర్భమున తన గురువు పేరు సూచింపలేదు. కేవలము గురుదేవుడనినాడు.

గీ॥ అమర మంత్రోపదేశంబు విమలతయును
పద్యాజనవర్ధనంబును బుధసమీప
వర్తనము కావ్యచింత యభ్యయనివాన
మరదు శ్రీ గురుదేవు నే నభినుతింతు.

గురువు పేరు కంఠోక్తిగా చెప్పకుండుటగూడ ఈ కవి యాధ్యాత్మిక దృష్టిని మరియు నీ జగన్నాటక కావ్య ప్రత్యేకతను చాటుచున్నది. పదునైదు పద్యములందీ కవి వంశావతారమున్నది. దాని ననుసరించి శేషాచల కవి వంశ మిట్లున్నది.

- ఎట్టయ (కౌండిన్యసగోత్రము) (భార్య వెంకమాంబ)
  - గంగయ
  - కుందన (భార్య లింగాంబ)
    - తిమ్మయ్య
    - చెన్నుభట్లు (భార్య కాయమ్మ)
      - నాగభూషణుడు (భార్య సుబ్బమాంబ)
        - శేషాచలుడు (కృతికర్త)
      - మల్లయ్య
      - కుందయ
      - లింగయ్య
    - ఘట్టయ్య
    - బుద్ధయ్య
    - కాయన్న
    - అచ్చయ్య

తాత ముత్తాతలను చెప్పినచోట వారి గ్రామనామము ప్రసక్తి లేదు. కాని తండ్రుల తరమును చెప్పునప్పుడు వారు "తిల్లాగణపురమందిరు" అని చెప్పినారు. కనుకనే వీరిపూర్వులు మొదట ఏదుట్లలో నుండియుందురనియు తరువాత గణపురమునకు వచ్చియుందురనియు నూహించితిని. వంశావతార వర్ణనమందు చివరన తననుగూర్చి కవి చెప్పుకొన్న పద్యమీరీతిగా నున్నది.

మ॥ వర కౌండిన్యకులోద్భవుండ గురుసేవాప్రీతుడన్ చెన్నయ
స్థిర సత్పుత్రుడ నాగనార్యసుతుడన్ శేషాచలాఖ్యాతిచే
నరయన్ భూమి సురాశిషంబులను మేలైయుండు నేదుట్ల స
ద్వర వంశార్చకుడన్ సమస్తజననాథశ్రేణి సంపూజ్యుడన్.

ఈ పద్యము తరువాతగల వచనమునుబట్టి మనమీతని గ్రంథప్రణాళిక నవగతము చేసికొనవచ్చును. ఆ వచన మచ్చటచ్చట శిథిలముగానున్నను దాని నుదాహరించుచున్నాను.

"వ॥ ఇట్టియే నాబాల్య ప్రభృతి శ్రీరామచంద్ర చరణారవింద మకరంద బిందు కందళిత రసాస్వాదన కౌతూహల శంభద్భ్రమద్భ్రమర డింభాయమాన మానసుండనై యొక్కనాడు సుఖశయ్యాతలంబున నిద్దుర జెందియున్న నరుణోదయ సమయంబున స్వప్నంబునందు నర్ధ (నారీశ్వ?) రుండును తద్దక్షిణ భాగంబున నొక్క శ్రీ వైష్ణవుండును తత్పురో భాగంబున సకలభూషా విశేషాలంకారిణియై విభూతి సిందూర రేఖాంచిత ఫాలఫలకయునై శిరంబున కిరీటంబు బెట్టి (చేర) వేణువునూని, వైశాఖ స్థా(న) కంబున నిలిచి(...)లంబు నలుపుచున్నొక దివ్యశక్తియు నన్నిట శివుడున్నాడని (.) తంబుగ్గడించిన నర్ధనారీశ్వరుండు హా రేరామ గోవిందాయని యంత నుడువులు నుడువుచున్న యవసరంబున నపూర్వ వర్తనంబిది యేమొకోయని స్వప్న జాగ్ర (.) దుండనై తద్దక్షిణ భాగ నివా(సి) శ్రీవైష్ణవ చక్రవర్తి నడిగిన నతడు జగన్నాటకం బిటువంటిదే యని యానతిచ్చిన దిగ్గున మేల్కొనిన యనంతరంబు(న) నీ గ్రంథ సరణి (.........) గలిగె నా శ్రీవైష్ణవసార్వభౌము(డు)ను శ్రీరామస్వామి యని పెద్దలానతిచ్చిరి గావున నస్మద్వంశ పరంపరా నుష్ఠానాధిదేవత యతండే కావున తదంకితంబుగా ప్రబంధంబు సేయం

బూనిన నతండు హృత్పద్మ కర్ణికాస్థాన నివాసుండై యిట్లు పలికింప దొడంగె"—

దీని తరువాత షష్ఠ్యంతములున్నవి. అటు తరువాత భాగమిట్లున్నది.

"వ॥ సాష్టాంగ దండ ప్రణామం బాచరించి

ఉ॥ ఈ మ(హి) గద్య పద్యముల నింపె (నలా)రు కృతుల్ తెలుంగ నే
నామహనీయ కావ్యము(న) కంజలి జేసి నుతించి మ్రొక్కి శ్రీ
రామపదారవింద మకరందముతో (తుల)దూ(గుని,..)
.........ముల గూర్చిరి కృతిర (సై)క (ని)ష్ఠచే"—

పై పద్యమున శేషాచలుని కృతికి మూలమేదైన సూచింపబడినదో లేదో తెలియదు. అటుపై కథారంభమైనది.

"వ॥ అభ్యుదయ పరంపరాభివృద్ధిగా నాయొనర్పం బూనిన భరత శాస్త్రీ ధ్యాత్మ విద్యానుసారంబైన జగన్నాటకంబునకు కథా సూత్రంబెట్టిదనిన

ఉ॥ శ్రీమదనంతుడాద్య(డును) సే(వి)తు డచ్యుతు డాఢ్య తద్వయం
బై మహనీయతేజమున నాదియునంతము లేక స్వప్రకా
శామిత (మై)న యిచ్ఛను మహత్వము సేయుటకై నిరంతర
ప్రేమను ప్రొద్దు లిచ్చుటకు వేరొక్కని కల్పన (గా) నొనర్చె దాన్.

ఉ॥ మేటి(గ విశ్వ)రూపుడు నమేయగుణుండగునట్టి బ్రహ్మతం
బాటము (పి) ర (నా) వ్యగ నక్షత్రము (....)టకై లసర్చెసి
నాటక మాటకుండగిన (నా) తెపులైనటువంటి వస్తువుల్
దీటు కానంగజేసె నటధీరత నా (- -) దంబు నొందగన్.

క॥ పటిగల తాండవ మనగా
కడువడి లాస్యంబనంగ ఘనముగుని తెం
దడరించిపి (. .) దగి (.)
నరలక (సామా(జి)కులు సంపాదించెన్.

క॥ పరతాండవ నటనమునకు
పురుషుడువలె లాస్యనృత్యమునకు చతురయై

సరసిజయుగు సలిగావలె
నిర (పుగ) నీ యిచ్చ (....) ములు జూచెన్"—

ఇట్లు చూచినంత నొక సువ్యక్త మిథునం బావిర్భవించుటయు వారి వలన సకలసామాజికోత్పత్తి గలుగుటయు సమస్తసృష్టియు క్రమముగా చెప్పబడినవి. ఆశ్వాసము ముగియుననగా నొక వచనమిట్లున్నది.

"వ॥ అని పలికి విదూషకుండు విశ్వేశ్వరునకు దండప్రణామంబు లాచరించి పతాకతల సంశ్లిష్టంబైన అంజలి(హారంబు) నిటలతటంబున ఘటియించి సామాజిక స్తవంబు సేయందలంచి"—

ఈ సామాజిక స్తవము స్రగ్విణి, పంచచామరము, వనమయూరము భుజంగప్రయాతము, దోదకము, మత్తకోకిల, వృత్తములందున్నది. వాని తరువాత

"వ॥ ఇట్లు సమస్తదేవగానస్తవంబులు సేయుచున్న యవసరంబున సూత్రధారుండు సమయోచితంబైన జగన్నాటకం(బునకు) నాదికారణంబైన పాత్రము వచ్చుట యోగ్యంబైన గీతంబుగ్గడించుమనిన మహాప్రసాదంబని విదూషకుండిట్లని తలంచె"—అని కలదు.

అటుపైనొకచూర్ణికయు, ఆశ్వాసాంతపద్యములునుగలవు. ఆశ్వాసాంత గద్యములం దాయా ఆశ్వాసములందున్న కథాంశము లన్నియు క్లుప్తముగా చెప్పబడినవి.

I ఇది శ్రీమద్రామచంద్ర కరుణాకటాక్షవీక్షణలబ్ధ కవితాపాత్ర, ఆపస్తంబసూత్ర కౌండిన్యసగోత్ర పవిత్ర యేదుట్ల చెన్నయాభిధాన పౌత్ర, నాగేశ్వరాంతర్యాజి పుత్ర, సంగీతసాహిత్యభరతశాస్త్రాది సకలకళాప్రవీణ, విద్వజ్జనవిధేయ, శేషాచల నామధేయ ప్రణీతంబైన జగన్నాటకంబను మహాకావ్యంబునందు అనుక్రమణికయు సత్స్వరూపుడైన పరబ్రహ్మయందు జీవప్రకృత్యాది జననంబును, నతండు వినోదార్థంబుగా భరతశాస్త్రానురూపాధ్యాత్మవిద్యానుసారంబుగా ప్రపంచనాటకంబారంభించుటయు తత్పురతంబునందు వివిధాండంబులు బుట్టి వికసించిన తద్భూతశక్తి త్రిమూర్తు లన్యోన్య పరిగ్రహసామర్థ్యంబున నాట్య సామాజిక సంపత్తి నా పరబ్రహ్మనిదేశంబున

నిరూపితులై నిలుచుటయు తత్పరమేశ్వరుండు సభాసదనంబు గల్పించి పేరోగలంబు (న్న) సమయంబున మార్దంగికాది సామాజిక జనంబు నతనిం బ్రశంసించుటయు బుద్ధి విదూషకుండు మనస్సూత్రధారి యనుమతంబున విప్రమాత్యకాగమన సూచనంబు సేయుటయు నను కథలు గల ప్రథమాశ్వాసము".—

II "......విప్రమాత్యకాగమనంబును, ఆయ(.........)ంబు వాచికాభినయంబున తెప్ప (.......) దను గమ్యమానులైన విప్రులు వేద శ్రౌతజ్యోతిషసాముద్రికశకునన్యాయసాహిత్యవైద్యాదివిద్యలు ప్రసంగించుటయు, క. (.......) రాల్చి ఆంగికాభినయంబు (........) యుంచుటయు, తత్పురోభాగంబున చతురంగబలసమేతులై రాజమంత్రులు చనుదెంచి తమ తమ .... టయు .... నాట్యాభినయంబులు సలుపుటయు, మాగధులు స్తోత్రంబులు చేయుటయు, వైశ్యమాత్యక యేతెంచి యాహార్యంబున నభినయించుటయు తద్వ్యవహారగోత్రమాతుల కన్యకావివాహనిర్ణయంబులును, శూద్రమాత్యక చనుదెంచి సాత్వికంబున నభినయించి....వర్ణభేదంబులు దెలుపుటయు, (స)కల శక్తిప్రకారంబు సేయుటయు నను కథలుంగల ద్వితీయాశ్వాసము.

III "..........మహాకావ్యంబునందు నహంకారుండను మనుకారియను భార్యతో సమేతుండై వచ్చి తన ప్రభావంబు వక్కాణించుటయు, మోహుం డేతెంచి తన స్థితి చెప్పుటయు, (కా)మాగమనంబును (ర)తి వర్ణనంబును, లోభుండు తృష్ణయను పత్నితోడం గూడి చనుదెంచి తన నడక చెప్పుటయు క్రోధుండు హింసయను మహిషీసహితంబుగా మద మత్సరులం గూడివచ్చి తన ప్రభావంబు రూపించుటయు గాణాపత్య బౌద్ధ జైన చార్వాక శాక్తేయు లేతెంచి తమ స్థితులు నడపుటయు, శైవ వైష్ణవ సంవాదంబుచే యుద్ధంబగుటయు, సుమతియను సాధ్వీ సమేతంబుగా వివేకుం డరుదెంచి తర్కాలహంబు మాన్పుటయు నను కథలుం గల తృతీయాశ్వాసము".—

V "........... ద్వైతవిశిష్టాద్వైతాద్వైతులేతెంచి భేద, భేదా భేదా భేదంబులచేత బ్రహ్మస్వరూపంబు నిరూపించుటయు నను కథలుంగల చతుర్థాశ్వాసము".—

V "..........జగన్నాటకంబను మహాకావ్యంబునందు విరాడ్విగ్రహుం డహంకార భార్యయైన మమ..........శాంతిని వానికిచ్చి పెండ్లిచేసి నిరహంకారుండని పేరుపెట్టుటయు, శాంతి పరిణయంబును,...... నొందుటయు, చంద్రవాయు మన్మథాద్యుపాలంభనంబును, (..) పూజా విధానంబును, శాంతి గర్భంబును, జ్ఞానదేవుండు జ(నియించి) జగన్నాటకంబునకు వచ్చుటయు, జ్ఞానోపదేశంబును (..)ద భూమీశు నితిహాసంబు దెలుపుటయు, ఉదయాస్తమయవర్ణనంబును, శాంతినిరహంకార జ్ఞానదేవులు జనులకు సంశయపరిచ్ఛేదంబుగా పలుకుటయు సకలజనులు సర్వరమపురుషుని నుతి సలుపుటయు నను కథలుంగల పంచమాశ్వాసము"—

పైనుదాహరించిన ఆశ్వాసాంతగద్యములవలన జగన్నాటక ప్రబంధ కథా ప్రణాళిక మనకు స్పష్టముగా గోచరించును. ప్రబోధ చంద్రోదయము వంటివానిలో మనకీ జగన్నాటకము చివరి మూడాశ్వాసములలోని కథ కొంత కానుపించునుగాని మొదటి రెండాశ్వాసములలోని వృత్తాంతము మాత్ర మీ గ్రంథము వైశిష్ట్యముగా భావింపవలెను.

శేషాచలుని రెండవకృతి తారిగదుపుల నృసింహ శతకము. ఈ శతక మంతయు సీసపద్యములం దున్నది. నృసింహస్వామి నాపాదమస్తకము వర్ణించు పద్యములును, స్వామి వైభవమును వర్ణించు పద్యములును షోడశోప చారపూజావద్యములు (కాలోలు)ను, దశావతార పద్యములును శుభవిధముగా నృసింహస్వామి పరముగా నున్నదీ శతకము. అన్ని పద్యములకును ఎత్తుగీతి చివర రెండు పాదములు మకుటమొకే విధముగా నున్నది.

"ప్రీతి నను బ్రోవు దయతోను యాతుధాన

గణ కరటిసింహ సింగపట్టణ నృసింహ" యనునదీ మకుటము. ఈ శతకము కూడ మిక్కిలి శిథిలముగా నుండుటచే పద్యము లెక్కువగా నెత్తి వ్రాయజాలనైతిని. మచ్చునకై యొకపద్య ముదాహరింతును. ఇది షోడశోప చార పద్యములందొకటి కాలోలును. దీని సంఖ్య ౩౭.

సీ॥ ప్రాగ్గిరి పీఠను బాలాతపచ్ఛర సాంద్రదీధితినెల్ల నమయజేసి

కమలకైరవషండకర్ణికాంతస్థమా షహ్వోది కాంతుల గప్పిపుచ్చి

పదియారు వన్నెల బరగి సువర్ణమౌ బంగారు చాయల పాటినొంది
దిననాథుఁ డస్తమించిన వేళ సెలంగు సాంధ్య రాగంబుల నవురు నవిరి

యలరి పీతాభ్రమై చెలువమరుచున్న
వస్త్రయుగ్మంబు నొసగెద వసుమతీశ
ప్రీతి నన్నుఁ బ్రోవు దయతోను యాతురాన
గండకరటిసింహ సింగపట్టణ నృసింహ"—

ఈ రెండు కృతుల తరువాత రెండు మూడు తాటియాకులు వ్రాయనివి కలవు. వానిలో నొకదానిపై మూడు పద్యములున్నవి. ఇవి పై కృతులకు సంబంధించినవి కాకపోయినను వాని నిట నుదాహరింతును.

"మురంబుపీర నీవు నేను ముందె చెల్మి చేసినా
మిరేలపాటి మీరు వాడమింతు వేములందు రీ
పు దా(...)జెలంగెరా(...)లు బెట్టినట్లనే
ఆదేమి వింతలయ్య నమ్మినట్టి వారి చెంగటన్"—

క॥ కాయలు గూరలువలె నా
రాయణపుర సతుల గోర రాగా పైపై
టీయెర దెలిసెనుగద నీ
మాయలుగల ధర్మవరన మంచిది కృష్ణా.

గీ॥ వెలదిలోలు వెల్లివిరియంగ నిన్ను దా
నమర వాడిరేల యంచె పొమ్ము
మెత్తుకోలు దిన్నెలిట్ట పల్లూరకై
యేల సీకు దాని నేలు కృష్ణా"—

పైకంద పద్యమున నున్న నారాయణపుర మెచ్చటిదో! నారాయణపురములు మన దేశమున ప్రతి మండలమునను గలవు, కాని కృష్ణుడెచ్చటెచ్చట గలదో తెలియదు.

ఏదుట్ల శేషాచలుడు పింగళి సూరన తరువాతి వాడనుట నిశ్చయమైనను ఏ కాలమువాడో ఇదమిత్థముగా తెలియుటలేదు. ఐనను ఇంగన్నాటక వస్తువునుబట్టి ఈ మహాకవి త్రికాలములకును చెందినవాడని మనవి చేయుచున్నాను.

(గోలకొండ పత్రిక 25-8-1961)

పొత్తపి వెంకటరామామాత్యుడు

శంకరదాస శతకకవి. కృతిపేరు "నూటయెనిమిది దివ్యతిరుపతుల సుబ్బరాయ శతకము". కవిత్వమంత గొప్పది కాకపోయినను పరిశోధకులకు, చారిత్రకులకు తెలియుటకై దీనిని వ్రాయుచున్నాను. ఈ కవి కాలము శతక మూలాధారముగా తెలిసికొనుటకు వీలులేదు. ఈతడు రాయలసీమవాడై యుండునని నాయూహ. అందు కాధారము శతకప్రారంభమున నున్న మొదటి పద్యము. పద్యములన్నియు సీసములు. మకుటము ఎత్తుగీతిలోని చివర రెండు పాదములు.

"మహిత రోపాయ ధూర్జటి మతవిధేయ
సూర్యశతకోటినిభకాయ సుబ్బరాయ"

ప్రారంభపద్యమిట్లున్నది.

సీ॥ శ్రీరామచంద్రుల సేవించి యశ్వత్థ నారాయణుని వేర్పుమీర దలచి
పెన్నజాటూరి పురి చెన్నరాయలనెంచి ఆంజనేయుల భక్తి నభినుతించి
వ.అగిరి నృసింహు వర్ణించి యాలూరికోన రంగేశుని గొలిచి విష్ణు
రాజనే ప్రొద్దును రమణతో పూజించి పలుకులతోడని ప్రస్తుతించి
వేర్పు హొన్నూరి రాయని వినుతిచేసి
నిన్ను మదిలోన నుతిచేతు నన్ను బ్రోవు
మహిత రోపాయ ధూర్జటి మతవిధేయ
సూర్యశతకోటినిభకాయ సుబ్బరాయ.

పై పద్యములోని ప్రదేశము లన్నియు అనంతపురము మండలము లోనివి, కనుక నీకవి యనంతపుర మండలవాసియై యుండును.

2 నుండి 108 వరకున్న పద్యములందు నూట యెనిమిది దివ్యతిరుపతు లందు అచటి దేవతలను వర్ణింపబడినారు. 109 వ పద్యములో కవి తన్ను గూర్చి యీ విధముగా చెప్పుకొన్నారు :

సీ॥ సుదిరాత్మ్రుడగు పెరమల్కి వెంగనకేను పౌత్రుండ హరితసగోత్రజుండ
అనఘ పొత్తపి చెన్నయార్యు సూనుండ మహితకాత్రిరుద మానధనుడ
కామమాంబను పనసాధ్వివరగర్భ జలధిచంద్రుడ మహానరస గుణుడ
సిరిమించు రాయలచెర్వు యల్వారుడ(?) ఘనుడ వెంకటనామకవివరుండ

ధర్మచరితుండ నిరతాన్నదాతననుచు
నీకు మ్రొక్కెద నన్ బ్రోవు లోకవంద్య
మహిత రోషాయ ధూర్జటి మతవిధేయ
సూర్య శతకోటి నిభకాయ సుబ్బరాయ

ఈ పద్యమువలన నీ కవి తాతపేరు వెంగనయనియు తండ్రిపేరు చెన్నయ యనియు తల్లిపేరు కామమ్మ యనియు తెలియుచున్నది. పొత్తపి కడప మండలములోనిది. ఈ కవి పూర్వులు పొత్తపినుండి యనంతపుర మండలమునకు పోయి స్థిరపడి యుండుటచే వీరికి పొత్తపి యనునది ఇంటి పేరుగా వాడుకలోకి వచ్చియుండును. తాతగారి పేరునకు ముందున్న పెరమల్కి యనునది పొత్తపికి సమీపమందున్న గ్రామమట. కవి పేరునకు ముందున్న "రాయల చెర్వు యల్వారుడ" అనగా నేమో నాకు తెలియరా దయ్యెను. తాతపేరునకు ముందున్నది పెరమల్కి యను గ్రామము, తండ్రిపేరునకు ముందున్నది పొత్తపి యను గ్రామము, తన పేరునకు ముందున్నది రాయలచెర్వు అను గ్రామము; ఈ విధముగా నీ ముగ్గురి పేరులకు ముందు మూడూళ్ళ పేర్లున్నవి. మూడుతరములవారు మూడు చెరువుల నీళ్ళు త్రాగినట్లున్నారు. చిట్టచివరకు రాయలచెర్వులో స్థిరపడి పోయినారో లేదో!

చిట్టచివరనున్న (110) పద్యమున కృతిరచనమునకై తన్ను ప్రోత్స హించినవారినిగూర్చి యీ విధముగా చెప్పినాడు.

సీ॥ శ్రీమించు చినరెడ్డి సింధునవ్యాంకుండు విమలాత్ముడగు రంగవిభుతనయుడు
ఘనుడు చిన్నాగమ్మ గర్భోదయుండగు చినసుంకిరెడ్డి నా జేర జేరి

మేదిని నూటయెన్మిది దివ్యతిరుపతుల్ వరుసలో వర్ణించి వాంఛమీర
సుబ్బరాయని పేర సురుచిరంబుగ శతకము రచించుమటంచు ఘనత మెరయ

పలికినను నేను మీపేర భక్తి నంటి
శతముగ జేసితి నను చాల దయతో బ్రోవు
మహిత గోపాయ ధూర్జటి మత విధేయ
సూర్య శతకోటినిభకాయ సుబ్బరాయ

ఈ కవి శైలి తెలియుటకై రెండు పద్యముల నుదాహరింతును.

సీ॥ వినయ భక్తిస్థానమున భుక్తినొసగెడు దేవుని నెదనుంచి దిగులుమాని
సారంగముల రెంటి సారంగమున గూర్చి సారంగధరు జూచి నరసుడగుచు
పండువెన్నెలలోని పండువెన్నెలగాంచి పండువెన్నెలగల బయలుబట్టి
పరితాపమందక పరితాపమును దీర్చి పరితాపహరు గురు బ్రస్తుతించి

జ్ఞానమార్గంబు తెలిసిన మానవుండు
అధికుడన మించి సత్ప్రథమందకున్న
మహితగోపాయ ధూర్జటి మతవిధేయ
సూర్యశతకోటినిభకాయ సుబ్బరాయ. (౮౮)

ఈ క్రింది పద్యము శత్యావతార దశకమని యున్నది.

సీ॥ శ్రీసుదర్శనంబున చెన్నొందు గుణనాథు నే పేర ధాత్రిలో నెన్నికొనుచు,
అలమచ్చెమై నీటి కెరుకెక్కవలెగాని మూపున పెనుగొండ మోపరాదు
ఘోణియై మున్నెను గోరాడవలె గాని దిగులొందగా గోరు తెరువరాదు
తీసర నాక్కటి తిరియగావలె గాని తెంపున నృపతుల ద్రుంపరాదు

కట్టవలెగాని రోకట గొట్టరాదు
దండవలెగొని కత్తి మెండొడ్డరాదు
మహిత గోపాయ ధూర్జటి మతవిధేయ
సూర్య శతకోటి నిభకాయ సుబ్బరాయ (౮౯)

ఈ భక్తకవివరుచయ మింతటితో ముగింతును.

(గోలకొండ పత్రిక 29–3–1931)

త్రిలోకభేది

విధివిలాసమెట్టిదోగాని కాలగర్భమున కనుమరుగైన కృతులును తక్కువ జీవితములను ఎన్నియో గలవు. కాలప్రవాహమున కెదురీది నిల్చిన కృతులు కొన్నియే. కతమ గ్రంథము ఉత్తమములైనను నామరూపాదులు తెలియరానివి కొన్ని; నామమాత్రావశిష్టములు కొన్ని, జీర్ణావస్థలోనున్నవి మరికొన్నియు గలవు ఇట్లున్నవానిలోగూడ చరిత్రమున కెక్కనివి వేనవేలు. ఆయా గ్రంథములతోపాటు వాని కర్తలకుగూడ సరియే గతిపట్టినదని వేరుగా చెప్పనక్కరలేదు. ఇట్టి చరిత్ర కెక్కని చరితార్థులం దొకరు త్రిలోకభేది యను కవి. త్రిలోకభేది యనునది నామకరణమునాడు తలిదండ్రులు పెట్టిన పేరోలేదా నీత ధార్మికుడైన పిమ్మట అతడుకొన్న బిరుదనామమో తెలియదు. మరియును నీత డే యూరివాడో, ఎప్పటివాడో సరిగా తెలియదు. ఇతని రచనము 'సకలధర్మసారము'. ఇది హరివంశాంతర్గతము. సకలధర్మసారమని యొకచోటను సకలధర్మసారాయమని మరియొకచోటను ఈ గ్రంథమందే రెండు విధములుగా పేర్కొనబడిన దీక్షలి. ఇది వ్యాఖ్యాన మూల గ్రంథము. ఈ తాళపత్ర గ్రంథము ఉస్మానియా విశ్వవిద్యాలయము సంస్కృత అకాడమీ గ్రంథాలయమున శిథిలావస్థలో నున్నది. ఈ కవి దేశకాలాదులు కనుగొందమన్న దీనికి పీఠిక లేదు. లేకపోగా కవి వ్రాయ లేదని కాదు. ప్రతి వ్రాసికొన్న మహానుభావు డద్దానిని వ్రాయలేదు. ఇపుడా అతనికి లభించిన మాతృకలోగూడ పీఠిక మాయమైయుండును.

మొదటి కమ్మ ప్రారంభమున "శ్రీ వెంకటరమణా" యని వ్రాయక కాదు శ్రీకారము చుట్టినాడు. ఆతరువాత "అంకితంబుగా నా యొనర్పం బూనిన సకల ధర్మసారాయంబునకు కథాక్రమం బెట్టిదనిన" అను వచనముతో గ్రంథమారంభమైనది. అందుచేత అంకితము గొన్నవాని చరిత్ర మంతయును నీ పీఠికకు తోడుపోయినది. కవి యచ్చపు శైవనియోగి కాగా ప్రతిని వ్రాసికొన్నవాడు శుద్ధవైష్ణవనియోగి. కనుక నీగ్రంథ మెందరో

మెంతరి చేతులలో నలిగినదో ఏయేదశల ననుభవించినదో తెలియదు. అందుచే పీఠిక లేకుండఁబోయినది. ఇక మిగిలిన గ్రంథమాధారముగా నీ కవి దేశకాలాదుల నూహించుటకు బ్రయత్నింతును.

పీఠిక లుప్తమైనందులకు, ఆశ్వాసాంతపద్యములును గద్యయునుమాత్ర మదృష్టవశమున కొంత శిథిలముగానైనను కొనయూపిరితో నిల్చినవి. కిరులో మేలనునది యుట్టిదకాలోలు. కవి తన తాతతండ్రులను గూర్చియు తన్ను గూర్చియు వ్రాసికొన్న ఆశ్వాసాంతగద్య మీదిరుగా నున్నది.

"ఇది శ్రీమన్మృదుమరాంతావరప్రసార నవరసానుబంధబంధుర ప్రబంధనిబంధనాయకీధురీణ సకలవిద్యాప్రవీణ గౌతమగోత్ర పవిత్రచారిత్ర గౌరనామాత్యపౌత్ర రామయమంత్రిపుత్ర సకలజనస్తోత్ర సంభావిత త్రిలోకభేది *ప్రణీతంబైన హరివంశంబునందు సకలధర్మసారాయంబునందు"—అటులైనాయా ఆశ్వాసములందలి విషయముల అనుక్రమణిక గలదు.

శ్రీనాథునకు సమకాలీనుడును, హరిశ్చంద్రోపాఖ్యానము, నవనాథచరిత్రము, లక్షణదీపికాద్యనేకకృతినిర్మాతయునగు గౌరనమంత్రి ఆంధ్రలోకమున కీపరికే పరిచితుడు. మన త్రిలోకభేది ఈ గౌరనామాత్యునకు మనుమడై యుండునని నే నూహించుచున్నాను. గౌరనామాత్యుని కాలము క్రీ. శ. 1385–1445 అని ఆంధ్రకవితరంగిణికారుల నిర్ణయము. గౌరనకు మనుమడు గనుక త్రిలోకభేది క్రీ. శ. 1468 ప్రాంతములం దుండియుండును. త్రిలోకభేది తాత ఈ గౌరనయే యేల కావలయును? వేరొకడు కాగూడదా యను ప్రశ్న యుదయించును. ఇరువురి గోత్రము లొకటే యగుటయును, ఇరువురును శైవసంప్రదాయమునకు చెందినవారగుటయును, ఇరువురును తెలంగాణమున వర్ధిల్లియుండుటయును వారు తాతమనుమలను నా యూహకు కారణములు. ప్రసిద్ధుడగు నీ గౌరనామాత్యునకు రామయమంత్రి యను కుమారుడుండిన ట్లితరాధారములతో ధ్రువపడినచో నా యూహ నిజమగును. వెల్నాటివీరుల కథలందు "కోళ్ళపోట్లాట-గోవుయుద్ధము" మున్నగువానిని రచించిన మల్లనగూడ గౌరయామాత్యపౌత్రుడు మరియు రామయమంత్రిపుత్రుడు. ఈ మల్లనయు మన త్రిలోకభేదియు నన్నదమ్ములనుకొండ

* సంపాదిత యుని మరియొక ఆశ్వాసాంతగద్యము.

ఉన్నచో వీరి గోత్రములు వేరువేరుగా నున్నవి. మల్లనది కౌండిన్యగోత్రము. త్రిలోకభేదిది గౌతమగోత్రము. కనుక హరిశ్చంద్రోపాఖ్యానాద్యనేకగ్రంథకర్తయగు గౌరనామాత్యుడే త్రిలోకభేదికి తాతయని భావించుట యిప్పటికి తగును.

శ్రీరంగమహత్త్వమును రచించిన భైరవకవి గూడ గౌతమగోత్రుడు మరియు గౌరనామాత్యపుత్రుడు. కీ. శే. మానవల్లి రామకృష్ణకవిగారి భైరవుడు ప్రసిద్ధుడగు గౌరన(హరిశ్చంద్రోపాఖ్యానాది గ్రంథకర్త) పుత్రుడే యనిరి. అట్లయినచో నీ భైరవుడు మన త్రిలోకభేదికి పితృవ్యుడగును. భైరవకవి గద్యమిట్లున్నది.

"ఇది శ్రీమద్భ్రమరాంబా వరప్రసాదలబ్ధసిద్ధసారస్వతవిలాసగౌరవ గౌరనామాత్యపుత్ర సుధీవిధేయ భైరవ నామధేయ ప్రణీతంబైన శ్రీరంగ మహత్త్వంబను పురాణకథయందు ప్రథమాశ్వాసము"—

గౌరన, భైరవుడు, త్రిలోకభేది వీరల గద్యములందు కొన్ని పోలికలు గానవచ్చుచున్నవి. వీరందరును "భ్రమరాంబావరప్రసాదలబ్ధ" కవితా సంపన్నులు. కనుక వీరొకే కుటుంబమువారని యూహించుట కిదియును తోడ్పడుచున్నది.

ఈ గ్రంథపు పీఠిక పోయినదని తొలుతనే మనవిచేసితిని. దానిలో కృతిపతి మరియు కృతికర్తలనుగూర్చిన విపులమైన చరిత్రముండియుండును. ఈ గ్రంథమునకు వేరొకప్రతి పీఠికతో లభించిననేగాని యాలోటు తీరదు. ఆశ్వాసాంతపద్యములును, ఆశ్వాసాంతగద్యములును కొన్ని దక్కియుండుటవలన నీ కృతిపతి పేరుమాత్రము తెలిసికొనవచ్చును. ప్రథమాశ్వాసాంతమున కృతిపతినిగూర్చిన పద్యము లెత్తివ్రాయుటకు వ్రాయసకాడొక పద్యము వ్రాయదగిన స్థలములో కొంతభాగ మూరక విడిచిపెట్టి చివర భాగమిట్లు వ్రాసినాడు: "భోగసంస్థిత, త్ర్యరము వప్త్ర జనపాలసేవిత శివ్యధీమణీ!" కనుక నీ "సకల ధర్మసారము"నకు కృతిపతి శివ్వమంత్రియని తెలియుచున్నది. ఈ యవశేషము తరువాత నొక కందపద్యము మరియొక పంచచామరమును గలవు. వానిలో నీ శివ్వమంత్రి శివపూజాధౌరంధర్యమును, జంగమారాధనయు, కీర్తిప్రాభవములును ఈ రీతిగా వర్ణింపబడినవి.

"శివపూజా పరిపూర్ణా
స్తవ జంగమపాదపద్మసం సేవక న
ద్వివర విహార మహామహ
కవిజనసన్మిత్ర రాఘవనస్మిత్రా."

"సదా సదాశివార్చనాది సారసాత్త్వతేజ దు
ర్మదా మదాది నాగసింహ మానుతస్థురస్థిరా
స్వదాస్వదాను దానకర్ణ పారిజాత జాత సం
పదా పదాశ్రితానలోక పావనాంగా సంహృదా."

ద్వితీయాశ్వాసాంతమున కృతిపతిని సంబోధించు పద్యమిట్లున్నది :

శ్రీ మల్లికార్జునాశ్రిత
ప్రేమాతిశయానురాగ వృత్తిజన సు
త్రామ కరుణాపయోనిధి
సీమాంతర జయవిహార శివ్వగ ధీరా.

తృతీయాశ్వాసారంభమందలి పద్య మీ తీరుగా నున్నది.

శ్రీ పార్వతీ కళత్ర
శ్రీ పాదయుగప్రవర్తిత సేవా సక్త
ద్వివయశోన్నతచతురా
శైవగుణానంద ధీర శివ్వగధీరా.

ఈ పద్యములవలన నీ శివ్వమంత్రి యసాధారణుడని తెలియుచున్నది. తృతీయాశ్వాసాంతమున నొక మత్తేభము, ఒక కందము, మరియొక మాలినిలో నీ శివ్వగధీరుని గుణకీర్తన మున్నది. మాలినిలో తృతీయ పాదమును, చతుర్థ పాదమున మొదటి సగమును లుప్తములు. మిగిలిన రెండవ సగమున కృతిపతి తల్లిపే రున్నది.

"వర వితరణ హారా వార్ధిగంభీర ధీరా
పరమకుశల విచారా బంధుమందారసారా
....
..............మల్లమాంబా కుమారా.

దీనివలన నీ శివ్వమంత్రి తల్లిపేరు మల్లమాంబ యని తెలియనగును. తక్కిన ఆశ్వాసాంతపద్యములవలన తెలియనగు చారిత్రకాంశములు లేవు. కనుక వానిని విడువనైనది.

'సకలధర్మసారము'నకు కృతిపతియగు నీ శివ్వాధీమణి యెవరు? ఆత డెవరోకాని కనీసమొక రాజునొద్ద మంత్రిపదవియందైన నుండియుండును. ప్రసిద్ధుడగు గౌరనామాత్యుని పెదతండ్రి యున్నగువారు రాచకొండ రాజ్యమున మంత్రులుగా నుండుట తెలిసినవిషయమే. ఈ శివ్వాధీమణికూడ రాచకొండ సంస్థానమునకు చెందినవాడై యుండును. ఆతనికి త్రిలోకభేది తనకృతి నంకితమిచ్చియుండును. పీఠిక దక్కకుండుటచే నీ శివ్వాధీమణి చరిత్రము ప్రకృత మింతకన్న నెక్కుడు తెలియరాదు.

గ్రంథమందలి యితివృత్త మాశ్వాసాంతగద్యము లందలి యనుక్రమణిక వలన దెలిసికొనవచ్చును. ఈ "సకలధర్మసార" మన్నది హరివంశాంతర్గతము.

ప్రథమాశ్వాసమున "శౌనకాదిమునులు సూతుం జూచి ధర్మప్రశ్న చేయుటయు, ఆతడు సకలధర్మసారంబులు జనమేజయుండు వైశంపాయను నడిగెనని చెప్పుటయు, శ్రీకృష్ణుండు పాండవులున్న కామ్యకవనంబునకు ఋషులతోగూడి వచ్చుటయును, విష్ణుభక్తిప్రభావంబు ధర్మరాజునకు గాంగేయుండు దెలుపుటయును, భగవంతుడు ధర్మనందనునకు భూదానమహత్వంబును, గోదానమహత్వంబును, అన్నదానమహత్వంబును జెప్పుటయు నను కథలు" గలవు.

ద్వితీయాశ్వాసమున, "సం(లు?)దాన మహత్వంబును, కన్యాదాన ఫలంబును, సర్వవ్రతమహత్వంబును, విదియ (?) దానప్రభావంబును, త(టా)క దేవాలయవనప్రతిష్ఠాఫలంబును, భగవత్ప్రశంసయు, భగవత్పూజా ఫలంబును" నను కథలు గలవు.

తృతీయాశ్వాసమున, "నానావిధవస్త్రద్రవ్యకుసుమగంధదానఫలంబులును, రాష్ట్రరత్నదానఫలంబులు" గలవు.

చతుర్థాశ్వాసమున, "పాండవులకు సకల ధర్మంబులు దెలుపుటయు, వారి సన్నిధికి దూత యేతెంచుటయు కృష్ణుండు ద్వారక కేగుటయు నను కథలు" గలవు.

గ్రంథప్రతి వ్రాసికొన్న వ్రాయసకాడు చిట్టచివరన తన యూరు పేరులను, వ్రాసికొన్న తేదియు ఇచ్చియున్నారు. ఆ వివరములీ విధముగా నున్నది.

"పార్థివనామ సంవత్సర పుష్య బ. ౧౩ స్థిరవారం వరకు మార్క రాజు వెంకటేశం సకలధర్మసారాయం ప్రతిలో వున్న క్రమాన వ్రాసినాను. తప్పులు వుంటే పెద్దలయినవారు చూచి కోపం చాయక సమఖూర్చవలెను. శ్రీమతే రామానుజాయ నమః. శ్రీ పరాశరభట్టరు తిరువడిగళే శరణం.

పెద్దలయ్యినవారు ప్రేమతో జూచియు
దిద్దరయ్య మీరు తిట్టబోక
వద్దు కాయకురయ్య జాగేలరా మొగిలి
గిద్దె రంగధామ కీర్తిధామా"

వ్రాయసకాడగు వెంకటేశం వైష్ణవ నియోగియని రామానుజులకు పరాశర భట్టరు (గురువు) ను తలచుట చెప్పక చెప్పుచున్నది. ఇతని గ్రామము బహుశా మొగిలిగిద్దె కానోపు. ఈ గ్రామము మహబూబ్‌నగరం మండలము షాద్‌నగరం తాలూకాలో నున్నది. ప్రతి వ్రాసిన తేది క్రీ. శ. 3-1-1840 తేదికి సరిపడుచున్నది. అనగా గ్రంథము పుట్టిన తరువాత దాదాపు ఇన్నూరేండ్లకు వ్రాయబడిన దీ ప్రతి.

(ఉదయభాను, డిసెంబరు 1961)

గోపతి లింగకవి

తెలుగు వీరశైవవాఙ్మయమునకు తెలంగాణమే పుట్టినిల్లు. పాల్కురికి సోమనాథుని నాటినుండి నేటివరకును వీరశైవవాఙ్మయసృష్టి యిచట జరుగుచునే యున్నది. తెలంగాణమున వర్ధిల్లిన వీరశైవకవులందు గోపతి లింగకవి యొకడు. ఈతని కాలము నిర్దిష్టముగా తెలియకున్నను నీతడు స్మరించిన కవులను బట్టి గోపతి లింగకవి మధ్యయుగమునకు చెందినవాడని యూహింపవచ్చును. ఈతని కృతిభర్త మెదకు మండలమువాడు. కనుక నీతడుగూడ మెదకు మండలమువాడై యుండునని భావింపవచ్చును

గోపతి లింగకవి బహుగ్రంథనిర్మాత. కాని ప్రస్తుతము రెండు కృతులు మాత్రము లభ్యములు. ఈ రెంటిలో "చెన్నబసవ పురాణము" సమగ్రముగను, "అఖండజ్ఞాన మనఃప్రబోధ వచనకావ్య ప్రబంధ" మసమగ్రముగను ఉస్మానియా విశ్వవిద్యాలయమువారి సంస్కృత అకాడమీ తాళపత్ర గ్రంథములం దున్నవి.

గోపతి లింగకవి జంగమమతము వీరశైవాచార్యులకు శిష్యుడు. ఈతని యింటి పేరు గుమ్మావారు. తాత పేరు శివరామలింగము. మల్లమాంబా శివరామలింగదంపతుల సంతానపంచకమున పాపయలింగ మొకడు. లింగమాంబా పాపయలింగము దంపతుల వరపుత్రుడు మన గోపతిలింగకవి.

"శివదేవియు మజ్జననియు
శివదేవుడు దండ్రి సుప్రసిద్ధముగాగన్
శివభక్తులు బంధువులును
శివకుల జనితుండ నిరతశివగోత్రుండన్."

అని చెప్పుకొనునంత వీరమాహేశ్వరాచారసంపన్నుడీ గోపతిలింగకవి. కవి చెన్నబసవపురాణమునకు విపులతరమైన పీఠికను వెలయించినాడు. మొదటి యెనిమిది పద్యములందు శివస్తుతియు, తరువాత గురుస్తుతియు, నూతన

పురాతన ప్రమథగణముల స్తుతియును గలవు. ఆటుతరువాత పూర్వకవి సంస్మరణమున నొక పద్యములో పాల్కురికి సోమనాథుని స్తుతియున్నది. రెండవ పద్య మీ రీతిగా నున్నది—

ఉ. ధామితపుణ్యమూర్తి పిడువర్తి మనున్ బనవేశ తత్పరున్
సోమయలింగమాదియగు, శూలికపీంద్రుల గార్లపాటి చి(?)
ధీమణి లక్ష్మణాహ్వయుని దివ్యపదాంబుజముల్ మదిన్ సదా
నేను మెలర్పగొల్తు నుతిజేయుచు ప్రొమెక్కెర సార్వకాలమున్."

దీనిలో పిడువర్తి బసవన్న, అతని కుమారుడు సోమయలింగము (పిడుపర్తి సోమనాథుడు—పద్య బసవపురాణకర్త), గార్లపాటి లక్ష్మయ్య (ఏగంటివ్వారి వచనముల కర్త) మున్నగువారు స్మరింపబడుటచే గోపతిలింగకవి పదునారవ శతాబ్దాంతమునకో లేదా పదునేడవ శతాబ్దారంభమునకో ఉండి యుండునని యూహింపవచ్చును.

కవి తన గురుపరంపరను గూర్చి చెప్పిన పద్యము లనన్వితములుగా నున్నవి.

సీ. సర్వేశు రంగదీశ్వర గురుస్వామి శ్రీకరసుతుడు చినమల్లి రాద్యునుండో
నమ్మహాగురుపుత్రు లభివాననంబులోయన సంగడీశుండు ఘనుడు వీర
నాథుండు మల్లయ్య శ్రీరి చినమల్లన్నయును వీరదేశికుండనగ బుధిని
సకలరాజన్యమ స్తకకిరీటన్యస్త వికచపదాంభోజయుగట దగుచు
దనరు సద్దేశికుల నూనులనగ వీన
నాథుడును విశ్వనాథు డౌనసగ భక్త
జనుల శివరాజయోగీంద్రు డనగ నాగ
(లి)ంగమన ప్రోవి రెలమి నెన్నంగ బుధిని.

ఆ. వె. అట్టి దేశికేంద్రు లమిత కృపాసాంద్రు
లలరని నమ్ము బ్రోచు గురులు వారి
శ్రీకరాంఘ్రి శిష్యశిష్య ప్రశిష్యుంద
లింగమాంఘ్రిసేవకుండ.

గురుపరంపర తరువాత తన తాతతండ్రులను గూర్చి చెప్పి ప్రబంధ రచనోద్యోగమును చెప్పినారు. సత్ప్రబంధము రచింప నుద్దేశించిన సమయమున శ్రీగిరీశ్వరుడు జంగమాకృతి నేతెంచి యిట్లనును.

క. సురుచిర గ్రంథము లారును
వరుస నవ మొకటి తెల్పు పదనంబులను
స్థిర శతకము లైదును శ్రీ
కర కేదారేశు నోము కథయును మరియున్.

వ. మంగళాష్టకంబులును విఘ్నేశ్వర వీరేశ్వర మల్లేశ్వర రామేశ్వరాష్టకంబులును, శారద పదంబులును, జాజరపదంబులును నివి మొదలుగాగల కృతులును మత్కృతంబుగా భక్తమాహేశ్వరానందకరంబుగా జెప్పినార వప్పుడు,

క. నీకు ప్రియంబుగ నీకృతి
మా కంకితముగ నొనర్చు మది దలచితివా
మాకు ప్రియంబగు భక్తుని
కాకాంక్ష రచింపు మాకు నగును కుమారా.

సీ. బసవలింగంబు శ్రీ పదపద్మమకరంద రససుధావార్ధి మరాళ మనగ
బసవపదధ్యానసకలవిలాంతరంగుండు బసవాంశజనితప్రభావు డనగ
బసవలింగమచరణభవరుహార్చితభక్తి రసపరిపూర్ణవారాశి యనగ
బసవాదిప్రమథగణ విసరాంచితధ్యాన వశమానసప్రవృత్తి యనగ

వెలయు కాసాల నగబద్ధ విమలభక్తి
పరుడు గావున తద్భక్తవరుని గురుని
కరసరోజాతజనితశ్రీకరుని సతత
పరహితౌదార్యమతుని సద్భక్తి హితుని.

ఆ. వె. కలర జెప్పవలయు నమలాత్మ దలసె హృ
త్కమల కర్ణికాంతరమున దాయ
కెలమినుండు మతని కీప్రబంధము జెప్ప
వలయు నంకితముగ వరకుమార.

ఈశ్వరుని సందేశము ననుసరించి గోపతిలింగకవి యటులే చేయదలచెను. కవికి తన తండ్రియు స్వప్నమున సాక్షాత్కరించి యటులే చేయుమనెను. కవి

కృతనిశ్చయుడై యుండగా తమ్మడివల్లె సిద్దయ్య యను నొక మాహేశ్వరుడు వచ్చి కృతికర్తయగు కాసాల వరలబ్ధ వీరమాహేశ్వరాచార సంపదను గ్రంథములను వంశావళిని పేర్కొనును. వానిలో మొదటి పద్య మిట్లున్నది.

సీ. మహి నతివమూర్తి తమ్మడివల్లె సిద్దయ్య దేవరాదిగ జంగమావలియును
కరుణాకరనము దిల్కగ మమ్ము వీక్షించి వినుము గోపతి లింగ విప్రవరాంగ
శరణోపకారుండు శరణుండు కాసాల వరలబ్ధ భక్తిప్రభావు తతని
తనమానసమగు చెన్నబసవ పౌరాణ మాపుణ్యరోగ శివలింగమూర్తికి(?)
నర్పితంబుగాగ సగురుమూర్తికి
వెలయ వాంగిలేరు వీరునకును
శివుని దేవరాను సిద్దేశ్వరున కంకి
తముగ జెప్పవలయు నమలహృదయ.

కాసాల వరలబ్ధ చిరుతొండన కులజుడట. అతని తమ్ముడు గట్టివల్లి బసవ లింగము. అతడుకూడ తనయన్నగారిని కొనియాడి చెన్నబసవపురాణమునకు కృతిపతినిగా జేయవలయునని కవిని కోరెను. దీని తరువాత మాహేశ్వర పీఠిక యను శీర్షికతో వీరమాహేశ్వర ప్రచార ప్రభావ మభివర్ణింపబడినది. శివపారమ్యమును స్థాపించు నీ పీఠికలో పూర్వకవుల యొక్కయు శ్రుతిస్మృతి పురాణాదుల యొక్కయు వాక్యము లుట్టంకింపబడినవి. అథర్వణవేదము, జాబాలోపనిషత్, ముండకోపనిషత్, బ్రహ్మాండపురాణము, స్కాందపురాణము, విష్ణుపురాణము, వీరాగమము, విశ్వాగమము, రహస్యము, ప్రభులింగలీల (తెలుగు పద్యము మరియు ద్విపదలు) చివరకు వేమన పద్యములనుండిగూడ నుదాహరణము లున్నవి. వేమన పద్యమిది.

క. మేకలు కరుపులు ననగా
ప్రాకటముగ నొక్కకోరి వర్ణంబెక్కెన్
ఆ కోతు లగతితము నన
కోకో యని యొక్క నక్క గూసెర వేమా.

పైపద్యము వేమన శతకకారుడగు రెడ్డివేమనదేయైనచో మన గోపతి లింగకవి వేమనకు తరువాతివా డగును.

ఈ వర్ణనములందే పుళోరిగ పట్టణాధీశ్వరుడగు శివలింగ దేశికుడును, గౌరవరిగ భగిగొరుడును వారి శిష్యపరంపరయు వర్ణింపబడినారు. అటుపై

కల్వగూరు (మెదకుమండలము) సీమయు, నందు సంగారెడ్డిపేటయు వర్ణింప బడినవి. కృతిభర్తయగు కాసాల వరబణ్ణ సంగారెడ్డిపేట నివాసి.

అతని వంశావతార మిట్లున్నది:

రేవణ్ణ (భార్య రామాయమ్మ)
|
వీరణ్ణ (భార్య నాగమాంబ)
|
వరబణ్ణ (భార్యలు పెదవీరమ్మ చినవీరమ్మలు)

ఈ వరబణ్ణయే చెన్నబసవపురాణమునకు కృతిభర్త. అతడును, అతని భార్యలును రాంగిలేరు వీరేశ్వరస్వామి భక్తులట. ఈ రాంగిలేరు సిద్ధక్షేత్ర వర్ణనము గూడ నిందులో గలదు. అటు తరువాత తన ప్రబంధమహిమను వర్ణింపబోవుచు చెప్పిన గద్యభాగ మిట్లున్నది:

"అని శ్రద్ధానుపూర్వకముగా, అభ్యుదయపరంపరాభివృద్ధిగా, ననంత జన్మభవహరంబుగా, మదీయవాక్పావనంబుగా, నగణితసుకృత ఫలదాయకంబుగా, భోగమోక్ష వరప్రదంబుగా, పురోగ శివలింగ ప్రాచార్య మాహేశ్వరాంకితంబుగా, నా యొనర్పం బూనిన సమస్త వేదాగమ పౌరాణేతిహాససారంబగు, సకల భక్తమాహేశ్వర ముఖముకురంబగు శ్రీ చెన్నబసవ పురాణంబను మహాప్రబంధ ప్రారంభం బెయ్యది యనిన" —

అటుపై చెన్నబసవని మహిమలు వర్ణింపబడినవి. ఆ వర్ణనములు, మహిమలు, ఉత్సాహము, మత్తకోకిలము, తరల, మున్నగు వృత్తములందును గలవు. వీనికి పూర్వము కవి చెన్నబసవపురాణరచనమునకు తానసమర్థుడ ననియు అది మహాసాహసకార్యమనియు తన వినయమును చాటుకొన్నాడు. తాను కన్నడభాషలో నున్న చెన్నబసవపురాణము ననుసరించి దీనిని రచించి నట్లు చెప్పుకొనుటచే తెలుగులో నితడే మొదటిసారిగా చెన్నబసవపురాణమును పద్యకృతిగా రచించినట్లు మనము భావింపవలయును. అత్తలూరి పాపకవి చెన్నబసవపురాణ మీత డెరుగడన్నమాట.

తరల. అలర శివకవివరులు మును కర్ణాట భాషల నేర్పడన్
బలికి రీశ్వరభక్తివరసంపాదనీయముగా మదన్

తలప నందుల నూత్నలోనర నిదానముగ హొందించి నే
ర్పులను బిక్కటిలింగ శివకవి పుంగవుల్ ముదమందగాన్.

గీ. కలయ భవ్యన్న భావల గన్నతల్లి
తెలివి తేటతెనుంగున తెల్లమిగను
శివకవీంద్రులు నిది సుప్రసిద్ధమనగ
నవరసజ్ఞులు నిది నాటెమోనన రచింతు.

చెన్నబసవని మహిమలు వర్ణించి అటుపై కలశాద్రి వర్ణనములో కథాప్రారంభమునకు గడంగినారు.

గోపతిలింగకవి విరచిత చెన్నబసవపురాణాశ్వాసాంతగద్యము లిట్లున్నవి:

"ఇతి శ్రీగిరి మల్లికార్జునదేవర దివ్యశ్రీకరుణాకలిత వరప్రసాద లబ్ధ కవితావిచిత్ర పావయలింగనామార్యపుత్ర గోపతిలింగనామధేయప్రణీతంబైన సకలభక్తమాహేశ్వరనికరముఖముకురంబగు, సుకరశైవసిద్ధాంతరహస్య ప్రకరంబగు, వికసితభక్తి సుధారసపూరపారావారంబగు, ప్రకటిత శ్రీ చెన్నబసవపురాణంబను మహాప్రబంధమునందు ప్రథమాశ్వాసము." —

ఈ చెన్నబసవపురాణము ఐదాశ్వాసముల ప్రబంధము. ౧౮౮ తాటియాకులపై నున్నది.

పంచమాశ్వాసాంతమునకు పూర్వము, పురాతన నూతన శివశరణుల స్తోత్రములున్నవి. వానికి పూర్వమొక పద్య మిట్లున్నది :

క. ప్రసరించె సోమనాథుడు
బసవాదుల మహిమ చెన్నబసవపురాణం
బసలార ద్విపదకావ్యము
నసమమతి రచియించె భక్తవరులు నుతింపన్."

ఈ సోమనాథుని ద్విపద చెన్నబసవపురాణ మేమైనదో తెలియరాదు.

ఈ తాళపత్ర గ్రంథప్రతిని వ్రాసినవారు గోపతిలింగకవి కుమారుడే. చిట్టచివరన "తుమ్మ్మ గోపతిలింగం కొమారుడు మల్లయ్య వ్రాసిన చెంన్న బసవపురాణం" అని యున్నది.

వ్రాయసకాడు ఆకున కమ్మమీద ప్రథమాశ్వాసాంత గద్యము ముగించిన తరువాత నిట్లు వ్రాసికొన్నాడు.

"సురాభాండేశ్వరం పుస్తకం పని వున్నాది యింట్లో పెద్దగూట్లె పైదపు దంచ్చిత్రె (సంచిలో?) వున్నాదిబత్యాంతి (బత్యవానిని) తోలించినాం అగత్యంగ పంపించేది" —

తోలించినామనునది తెలంగాణ ప్రయోగము. ఇది ప్రాచీనకాలమందును వ్యవహారమున నున్నట్లు దీనివలన తెలియుచున్నది.

ఈ గోపతిలింగకవి రెండవకృతి "అఖండజ్ఞానమనఃప్రబోధవచన కావ్యప్రబంధము" కేవల మూరుకమ్మలపై వ్రాయబడి యసమగ్రముగా నున్నది. పీఠికగూడ పూర్తిగాలేదు. ఆదిలో శివస్తోత్రము, అంగడీశ్వరుడగు తన గురుస్తుతియు, తలిదండ్రుల స్తుతియు పురాతనాధునాతనభక్తగణముల స్తుతియు జేసి "సకలవేదాగమశాస్త్రపౌరాణ రహస్యసారంబైన, షట్స్థలాతీతంబైన, అవాఙ్మానసగోచరంబైన, సమస్తతత్త్వాంతరంబైన, వీరమాహేశ్వర ప్రభావ ప్రసిద్ధసిద్ధాంతంబైన పరమశివతత్త్వసుధారసపారావారంబైన నిష్ప్రపంచనిరవ యనిర్గుణ నిరాశ నిత్య నిరంజానంద్య (?) మహాలింగ సంగావధానంబగు, ఖండ సద్వైద్వైతరహితంబగు, నఖండజ్ఞానమనఃప్రబోధ ప్రబంధ విరచితోద్యోగ సంరంభితుండై" యుండగా నొక మాహేశ్వరుడు వచ్చి దీనిని తన గురువున కంకితంబుగా నిమ్మని కోరును. కవి అందుల కియకొని యా గురుస్తుతి చేయును. ఆ గురువు తోటమఠమున కధిపతియట. అతని గూర్చిన పద్యమిట్లున్నది :

గీ. తోట మఠమున నమిత సంతోషమునను
సంతతానందమయ వచ్చుకాంత భగిని
మన గురుస్వామి భువి భక్తగణము వేలు
కొనుచు దిగ్దేశముల పూజ గొనుచునుండె.

అటుతరువాత కొలనుపాక సోమేశ్వరస్వామి వర్ణనము గలదు. కొలనుపాక వర్ణనముగల పద్యములలో నీ గ్రంథ మసమగ్రముగా ముగిసినది. ఆ పద్యము లొకటి రెండు—

మ. అమరుల్ పాదపముల్ ఖగంబులును నిత్యానందసింధుల్ పురిన్
అమరున్ గోవులు కామధేనువులు పుణ్యక్షేత్ర సద్వర్ణనం
బమరేంద్రాద్య దిశాధ్యక్షాదుల కటాక్షం బన్నపూర్ణాంబికా
శ్రీమదాధీశునకున్ సుఖావహము సామ్రాజ్యైక కల్పితమున్."

చ. కమలహితుండు తారలును గాలి సుధాకరుడున్ గ్రహంబులున్
అమరులు నాకసేంద్రులు మహాభయమంద పురంబు చుట్టునన్
గమిగొని భైరవుల్ ప్రహరి గాచుచు దా విహరింపుచుందు ర
క్ష్య.మల.విరోధినాశ వరకంఠములున్ మదిలో దలంపుచున్."

(ఈ కవి విరచితములగు తక్కిన కృతు లేమైపోయినవో తెలియదు.

(ఉదయభాను, జనవరి 1962)

నేబతి కృష్ణయామాత్యుడు

గోలుకొండనగరిలో పుట్టి సుమారు నాలుగువందలేండ్లుగా మరుగున పడియుండి ఇన్నాళ్ళకు కన్నులు జిగేలు మనిపించిన కవివరహీరము నేబతి కృష్ణయామాత్యుడు. అతడు కేవలము కవికవుడే కాదు, అమాత్యశబ్దమాతని యెడ సార్థకము. కవియై, కవిపోషకుడై, మంత్రియై, మహమ్మదీయ సుల్తానుల సభాలంకారమై, భగవద్భాగవతకైంకర్యధురీణుడై విరాజిల్లిన నేబతి కృష్ణమంత్రి చరిత్ర యిన్నాళ్ళు మరుగున పడియుండుట విధివిలాసము. కృష్ణమంత్రి తండ్రి కమలయామాత్యుడు, తల్లి కొండాంబ. వీరిది కౌండిన్యస గోత్రము. గోలుకొండకు సమీపమున గల సిద్ధలూరు జన్మస్థలము. సిద్ధలూరునకు సమీపమునగల అనంతగిరిలో వెలసిన శ్రీ నరసింహస్వామి యిలువేలుపు. మహమ్మదుషాహి అని తెలుగు కవులు పేర్కొను మహమ్మదు ఖులీ ఖుతుబ్షా (1580-1612) ప్రధానమంత్రిలలో నొకడై, అతని యాస్థాన కవులందుగూడ నొకడై, మిత్రుడై "రాజనీతి రత్నాకర" మనునారాశ్వాసముల కావ్యమును వ్రాసినవా డీ కృష్ణయామాత్యుడు.[1]

'రాజనీతి రత్నాకరము' ౧౪౫ తాటాకుల గ్రంథము. అది ఉస్మానియా విశ్వవిద్యాలయము సంస్కృత అకాడమీ లిఖితపుస్తకభాండాగారమం దున్నది. దీనిని తొలుత కనుగొన్నవారు శ్రీ. శే. కురుగంటి సీతారామయ్యగారు.[2] పరిష్కరించు తలంపుతో నెత్తి వ్రాసికొన్నవారు శ్రీ కోరా రామకృష్ణశాస్త్రిగారు. నేబతి కృష్ణయామాత్యుడు పంచతంత్రమును ఆంధ్రత్వముద్రలో వైష్ణవప్రబంధముగా దిద్ది తీర్చి 'రాజనీతి రత్నాకరము'ను వెలయించినారు.

రాజనీతిరత్నాకరము పీఠిక మిక్కిలి విలువైనది. సమకాలీన రాజకీయ చరిత్రముతోపాటు సమకాలీన సాహిత్యచరిత్రమును గూడ రాజనీతిరత్నాకర పీఠిక మన మన కందించుచున్నది. గురుస్తుతి సందర్భమున గల పద్యములవలన

---

1. వివరములకై చూడుడు. "కుతుబ్షాహీ సుల్తానులు-ఆంధ్రసంస్కృతి" పుటలు 97-112 ప్రచురణ : ఇదారా-అద్బియాతె-ఉర్దూ, 1962.

2. చూడుడు. ఆంధ్రభాగవతోపన్యాసములు. పుటలు 21-22. ఆంధ్ర సారస్వత పరిషత్తు, 1957.

కృష్ణమంత్రి గురువు కందాళ రంగాచార్యులని తెలియుచున్నది. అటు తరువాత పద్యములో కందాళ అప్పగారు స్మరింపబడినారు. ఈ కందాళ అప్పగారును వైజయంతీ విలాసకర్తయగు సారంగు తమ్మయగురువగు కందాళ అప్పగారును ఒక్కరై యుందురు. సమకాలీనులగు ఆచారపురుషులను స్మరించువట్ల కృష్ణయామాత్యుడు అష్టభాషాకవిత్వవిద్యాధురీణుడును, పరాశరభట్టరాన్వయపయోబ్ధిచంద్రుడును, ముడుంబ శింగరాచార్యతనయుడునగు, శ్రీ సాధుభట్టరార్యులను స్మరించినాడు. ఇంతవరకు చరిత్రమున కెక్కని మరియొక మహాకవిని గూర్చి కృష్ణమంత్రి పరిచయము చేసియున్నాడు. ఆ మహాకవి మరింగంటి వెంకట జగన్నాథాచార్యుడు. అతడు గురుమూర్ధన్యుడట. శతవధాన విఖ్యాతుడట. ద్రావిడామ్నాయ తత్త్వరసజ్ఞుడట. సంస్కృతాంధ్ర రచనాదక్షుడట. హయగ్రీవకంధరసంలబ్ధసువర్ణవృష్టియుతుడట, కర్ణాటక్షమాభృత్సభాంతరపూజ్యుడట. ఇంతటి మహాకవి కృతులేమైపోయినవో తెలియదు. మరింగంటి వెంకట జగన్నాథార్యుల తరువాత ఆంధ్రభాషానిరోష్ఠ్య మహాప్రబంధరాజరచనాధురీణుడును, కర్ణాటరాయలబ్ధ కవిసార్వభౌమ కల్యాణబిరుదశాలియునగు మరింగంటి సింగరాచార్యులను స్మరించినాడు. ఈ మరింగంటి సింగరాచార్యులు చరిత్రమున కెక్కిన మహాకవి. వింశతి ప్రబంధనిర్మాత. దశరథరాజనందన చరిత్రము, నిరోష్ఠ్య సీతాకల్యాణము మున్నగు నీతని రచనము లాంధ్రసారస్వతలోకమున కిపుడే పరిచితములు. కృష్ణమంత్రి కూడ సామాన్యకవి కాదు; తన కవితాప్రౌఢవాదుల నీతడు తన గురువుకోట నీవిధముగా పలికించియున్నాడు:—

సీ. స్వర్ధునీవీచికాసంఘాతఘుమఘుమ స్వర్ఘోషముల మించి నీటు గెలిచి
వాణ్యాభినీహారపవనజాత కాంచనాంగద ఝుళంఝుళరావగతుల దెగడి
నిర్ఝరద్రుమజాలనిస్సరన్మకరంద ధమధమన్నాద సంతతుల గేరి
కాంచీనిరంతరసీకాంచీలతాఘంటికా మణఃఘణరవక్రమము మించి

గీ. వెలసె భవదీయనరసోక్తి విరచితానవద్యగద్య సుపద్య కావ్యప్రబంధ
దండకోదాహరణకవితానిగుంభనములు కృష్ణప్రధానేంద్రనవరవీంద్ర. 1-33

చ. వరుసను తొండుమల్లియల బంతులటోయన జాజులోయనన్
విరిసిరవాదిపువ్వులన వెన్నెలలో కుముదంబులోయనన్
సరసిజకర్ణికాకృతుల చల్లనిలావుల పిక్క టిల్లుచున్
నెరసె భవత్కవిత్వములు నేటలి కృష్ణకవీంద్రచంద్రా! 1-34

క. కోనమచే పీవల్లభ గానకళాలోల సకలకవిబాంధవ ర
త్నానిధి వైష్ణవకల్పక ధీనిధి కమలేంద్రు నేలటిప్రభు కృష్ణా। 1-65

గీ. సరస చౌరాసిదుర్గరక్షాధురీణుడైన మహమదుశాహసుల్తాను కిపు
గలప్రధానివిహితుడవుకవివరుడవుధీర శ్రీకృష్ణకొండమాంబాసుపుత్ర! 1-36

పైవానిలో 83, 84 పద్యములవలన కృష్ణమంత్రి కవిత్వపటుత్వమును, 65వ పద్యమువలన కృష్ణమంత్రి భార్యపేరు కోనమ యనియు, అతడు గానకళాలోలుడనియు, సకలకవిబాంధవ రత్నానిధియనియు, వైష్ణవకల్పకమనియు, ధీనిధియనియు, తండ్రి కమలేంద్రుడనియు తెలియుచున్నది. 36వ పద్యము రాజకీయ, సాహిత్య చరిత్రములకు మిక్కిలి ముఖ్యమైనది. చతుర్థపాదమున కృష్ణమంత్రి అనని కొండమాంబ పేర్కొనబడినది.

కృష్ణమంత్రి 84 దుర్గముల కేలికయగు మహమదుశాహు సుల్తానునకు ప్రధాని, హితుడు, మరియు కవివరుడట. మహమ్మదుశాహుసుల్తా నాంధ్రవాఙ్మయమున కీవరకే పరిచితుడు. సారంగు తమ్మయ తన వైజయంతీ విలాసమున నీ మహమ్మదు శాహినే 'ఎనుబదినాల్గు దుర్గముల నేలిన యేలిక'గా వర్ణించియున్నాడు. కీ. శే. కందుకూరి వీరేశలింగంపంతులుగారును మరియు కీ. శే. చాగంటి శేషయ్య గారును సారంగు తమ్మయ కాలమును గూర్చియు, మహమ్మదు శాహును గూర్చియు భిన్నాభిప్రాయములను ప్రకటించియున్నారు. అన్నాళ్ళే సమస్య సుపరిష్కృతము గాకయుండెను. నేలటి కృష్ణమంత్రివలన ఆన్నాళ్ళకీ చిక్కుసమస్య శాశ్వతముగా పరిష్కరింపబడినది. మహమ్మదుషా అనునది ఖుతుబ్షాహీ సుల్తానులందెదవవాడైన మహమ్మదు ఖులీఖుతుబ్షాకు (1580-1612) తెలుగువారు పెట్టిన పేరని తెలియుచున్నది. ఏలన నేలటి కృష్ణమంత్రి కొలిచినది మహమ్మదు శాహిసుల్తానును. కృష్ణమంత్రి తండ్రి కొలిచినది ఇబ్రాహీం ఖులీఖుతుబ్షాను. తండ్రి కొడుకులు కొలిచినది మరల తండ్రికొడుకులగు సుల్తానులే కావలయును గదా. ఇబ్రాహీం ఖులీఖుతుబ్షాను ఆంధ్రవాఙ్మయమున మల్కిభరాముడనియు ఇభరాముడనియు అందురు.

తనతండ్రియగు కమలప్రధానిని వర్ణించుచు నేలటి కృష్ణమంత్రి చెప్పిన పద్యమిట్లున్నది.

సీ. మలకిభరామక్ష్మానాథ చంద్రుండు మెచ్చగా సత్కీర్తి హెచ్చినాడు
పానుగంటివర పట్టణాధ్యక్షుడై మించుగా ప్రజల పోషించినాడు

వసుధ నేకాదశీ వల్లభుడై ద్వాదశీ చూరకారుడై వెలగినాడు
కలనైన బొంకెరుంగక సత్యవాక్య ప్రతిష్ఠచే సిరుల వర్ధిల్లినాడు
సరస సంగీత మహిమల వరకవిత్వ లీల నాదిమునుకవుల బోలినాడు
తెలియ నచిపేంద్ర మాద్రుతే యలఘు విభవధారి నేబది కమల ప్రధానశౌరి.

కనుక కమలమంత్రి కొలిచిన మలికిభరామ క్షమానాథ చంద్రుని కుమారుడును, కృష్ణమంత్రిచే కొలువబడిన మహమ్మదుశాహు సుల్తానును, మహమ్మదు కులీ ఖుతుబ్షాయే కావలెను. మరియు సారంగు తమ్మయవలెనే కృష్ణమంత్రియు మహమ్మదు శాహిని 84 దుర్గముల కధిపతిగా వర్ణించినాడు. ఆ 84 దుర్గము లెవ్వియో చారిత్రకులు తేల్పవలెను. పై పద్యములో కమలమంత్రికున్న ఏకాదశీవల్లభ, ద్వాదశీచూరకా యను రెండు బిరుదముల యర్థము నాకు తెలియరాలేదు. ఇవి యాతని విశిష్టాద్వైతమతసంప్రదాయమునకు చెందినవో యేమో తెలియదు. కృష్ణమంత్రి నవపురుషాంతరములనుండి తన వంశావతారమును దానిలోని శాఖోపశాఖలను విపులముగా వర్ణించియున్నాడు. ఇతర శాఖలను విడిచి కేవలము కృష్ణమంత్రి పూర్వుల క్రమ మిట్లుండును.

కౌండిన్యమౌని
- 1. అన్నమరాజు
  - 2. నాగరాజు
    - 3. అనంతప్రధాని
      - నాగేంద్రమంత్రి
      - 4. రామమంత్రి
        - 5. సిరియనంతుడు
          - 6. కమలనామాత్యుడు
            - 7. కృష్ణయామాత్యుడు (కృతికర్త)
            - నరసమంత్రి
        - తిరుమలేంద్రుడు
      - లక్ష్మణార్యుడు
      - సూరనామాత్యుడు
  - బసవరాజు
  - అనంతరాజు

పై వంశావతారమున రెండవ తరమునకు చెందిన నాగరాజు బెదరకోట సులుతానుశహా సముఖమున నేలటిపని యుద్ధరించినవారట. అప్పటి నుండియు తమ ఇంటిపేరు నేలటివారైనట్లు కవి చెప్పియున్నాడు. నాగరాజు అశ్వపతి సులుతాని దక్షిణభుజాదండమై విలసిల్లెనట. నేలటి యనునది నియాబత్ అను పదమునకు తెలుగు రూపము. నియాబత్ పదమునకు రాయబారి యనియు స్థానాపతి యనియు రెండర్థములు కలవు. నాగరాజు బహ్మనీ సుల్తానుల స్థానాపతియై యుండునని నా యూహ. ఈ విధముగా కృష్ణయామాత్యుని యమాత్యపదవి నరుమంత్రపు సిరి కాదనియు, ఆరేడు పురుషాంతరములనుండి యాతని పూర్వులు రాజకీయముగా గొప్ప పదవు లలంకరించినవారనియు తెలియుచున్నది. తండ్రియగు కమలమంత్రి పెనుగంటి పట్టాధ్యక్షుడట. అనగా పెనుగల్లు దుర్గాధిపతి యని యర్థము కాబోలు. తన తండ్రి సిద్ధలూరులో సప్తసంతానప్రతిష్ఠ యొనర్చినట్లు వర్ణించియున్నాడు. తమ్ముడగు నరస మంత్రియు "చెలిమి మహమ్మదు షాహు సుల్తాను సన్ముఖమున అనులెన్న బొందలినాడు" బమ్మెర పోతనార్యుడు మత్కులవరేణ్యుడనియును స్మరించినాడు. పీఠికాగతములగు నితరవిషయము లన్నియు విస్తరభీతిచే విడిచి, కేవలము ముఖ్యమైన వానినే పేర్కొంటిని.

నేలటి కృష్ణయామాత్యుడు విశిష్టాద్వైత సంప్రదాయమునకు చెందిన నియోగి. కనుక రాజనీతిరత్నాకరమును గూడ ఆ సంప్రదాయము ప్రకారముగనే దిద్ది తీర్చినాడు. మొదటి పద్యమున శ్రీ మహావిష్ణువును, రెండవ పద్యమున శ్రీ మహాలక్ష్మిని, మూడు నాలుగు పద్యములందు అనంత గరుడ విష్వక్సేనాదులను మరియు పూర్వాచార్యులను స్మరించినాడు. రాజనీతి రత్నాకరము కృష్ణమంత్రి తన ఇలువేలుపగు అనంతగిరి శ్రీ నరసింహున కంకితముగా రచించెను. పీఠికలో నీ యనంతగిరి నరసింహస్వామి సన్నిధిని మోహనాంగులు జరపు సేవావిధానంబు శృంగార తరంగ సంగీత విద్యావధానంబుల పెక్కురీతులను వర్ణించియున్నాడు. చివరన షష్ఠ్యంతములు చెప్పి కథాప్రారంభమునకు గడిగినాడు.

కృష్ణ మంత్రికి తనకన్న సుమారు నూరేండ్లు ముందుగా దూబగుంట నారాయణ కవి రచించిన పంచతంత్రము తెలియునట్లున్నది. ఏలన పీఠికలో కవి,

గీ. ధీరతఁ దొల్లిటి కవులు ప్రబంధ కర్తలయ్యు నీ రాజనీతి రత్నాకరంబు
నేయకుందురె(రు?)నన్ను నేఁడేయుసుకృతికలనసీకృతిరచింపఁగలిగెగాక

యని చెప్పియున్నాడు. ఈ పద్యమునకు ముందున్న పద్య మిట్లున్నది.

క. వరరాజనీతి రత్నాకర మీకృతి, వరిత విష్ణుకథ, నాథుడు శ్రీ
నరసింహుఁడట ధీ బంగరువునకున్ బరిమళంబు గలుగుటగాదే.

దీనివలన కృష్ణమంత్రి దీనిని వైష్ణవప్రబంధముగా రచించినాడని తెలియును. కనుకనే శ్రీరంగము వర్ణనముతో కావ్య మారంభమైనది.

కథాప్రారంభమునఁగల పద్యమిది.

గీ. ఇందిరాసుందరీ కేళిమందిరంబు, నిఖిలనీ సౌరభాగతేందిందిరంబు
ధరణీ కాంతావరాబ్జనూపురము దనరు, రమ్యపథివాకరంబు శ్రీరంగపురము.

శ్రీరంగపుర మీ విధముగా నిరువది గద్యపద్యములందు ప్రబంధోచితముగా వర్ణింపబడినది. పురవర్ణనము, చాతుర్వర్ణ్య వర్ణనము, చతురంగబలముల వర్ణనము, వారవిలాసినుల వర్ణనము లన్నియు ప్రౌఢముగా శబ్దాలంకారమయములుగా నున్నవి. శ్రీరంగనగరము చుట్టునున్న యగడ్తను వర్ణించు పద్యమిది.

సీ. ఉబ్బు సౌఖ్యములనొంద నౌర్వుతో రాపాడు జడధిస్తుతెవ్వను ఉడుకుటోరు
తమ్ములవగవాని తల్ప్రి రత్నసిమూక కడుపులో నిడుకొన్న కలకదారి
గ్రుడ్డుచునుండు కోకల కెట్టుబట్టువా ధరివినపాది కొండాటకాడు
వచ్చినవారిచే వడుసుళ్ళబడి మొరపెట్టు నూరక చుట్టిచుట్టి తిరుగు
నలనముద్రుండు నాకునీడగునెయనుచు, తన తరంగఘుమంఘుమీకారవాట్ట
హాసములచే గయాళించునట్ల దనరు, నగదిరస్ఫూర్తి నమ్మహానగరిపరిఖ.

ఈ సందర్భముననే శ్రీరంగమందలి వారకాంతలను వర్ణించిన సీసపద్యము తరువాత నచటి యౌవనాంగుల బొంగరములాట నీ విధముగా వర్ణించినాడు.

కం. బంగరు బొంగరముల నృపపుంగవు నవులరర నఖులు బుచ్చుకొని పఠిన్
థింగురని మోయ సౌధప్రాంగణముల యౌవనాంగు లాడుదు రెపుడున్.

శ్రీరంగపురవర్ణనమైన పిమ్మట తదధిపుఁడగు సుదర్శన చక్రవర్తి వర్ణనము నాల్గు పద్యములందున్నది. సుదర్శనుడు వైష్ణవుడుగా చిత్రింపబడినాడు.

ఆతని యాస్థాన వర్ణనము కడుదీర్ఘముగా సాగినది. అదియు పదునారవ శతాబ్దపు దర్బారుల వర్ణనము వలె నున్నది. విష్ణుశర్మ సభాప్రవేశ మొనర్చిన సమయమున సుదర్శన చక్రవర్తి "తనరంగ శ్రీమద్రామాయణ మహాకావ్యంబునకు ననేకార్థంబు పుట్టి కర్ణపర్వంబుగా శ్రీ వైష్ణవస్వాములు వినుపింప సంతోషించు" చుండెను. సుదర్శనుడు విష్ణుశర్మకు తన కుమారుల నప్పగింప నాతడు "రాకుమారకులారా వినుడు. మిత్రభేదంబన, సుహృల్లాభంబన, సంధివిగ్రహంబన, లబ్ధనాశంబన, అసంప్రేక్ష్యకారిత్వంబన బరగునివి పంచతంత్రంబులు, అందు ప్రథమతంత్రంబగు మిత్రభేదం బన్నది యెరింగించెద" అని కథలు చెప్పుట ప్రారంభించును.

మిత్రభేద మెరింగించుపట్ల ప్రారంభమున కాంచీపురము వర్ణనమును శ్రీ వరదరాజస్వామి వర్ణనమును గలవు. అచ్చటి బేహార విష్ణువర్ధనుడు వరదరాజస్వామికి గోపురప్రాకారమంటపంబు లనేకంబులు గట్టి పరమభాగవత కైంకర్యధురుద్యుక్తుడైనవాడుగా వర్ణింపబడినాడు. అతడు నందనసంజీవకాహ్వయములు గల వృషభములను బూన్చిన బండిపై బేహారమునకు బయలుదేరును. అతడు కొన్నాళ్ళు ప్రయాణముచేసి వెంకటనామశైల ప్రాంతమునకు వచ్చెను. అప్పుడు విష్ణువర్ధనుడు

గీ. కాంచిమాకాంచికాపురి కంచెజాడ, కన్నులపండువై యున్న దెన్నసనుచు
దిగువతిరుపతి యందు మాళిగల విడిసి, నటకొండకునరిగె నానందమునకి.

ఆళ్వారుతీర్థమున స్నానమాడి తిరుమణి తిరుచూర్ణములు ధరించి పన్నిద్దరాళ్వారుల ప్రస్తుతించి గోవిందరాజుల గొలిచి చూడుకొడుత్తనాచ్చియారుకు వందనము చేసి, అలిపిరి గోపురము కడచి, ఆయా విగ్రహముల నటుసరించి స్వామి పుష్కరిణిలో స్నానమాడి నీరదిరుగని చింతను వర్ణించి గరుడస్తంభమునకు ప్రదక్షిణ మొనర్చి అటుపై వెంకటేశ్వరస్వామిని దర్శించి బహుద్రవ్య మర్పించును. వెంకటేశ్వరస్వామి విష్ణువర్ధనుని భక్తికి మెచ్చి కన్నుల పొడకట్టి "నీవు తెచ్చిన సంజీవక వృషభంబుల నాకు సమర్పించరా" యని కోరును. విష్ణువర్ధనుడు సంజీవకమును స్వామికి సమర్పించి దిగువతిరుపతిలో బేరము చేయుచుండును. ఇది ఇట్లుండ సంజీవకుని వర్ణనము.

క. దినదినము నరవపిళ్ళలు, పసువరగా నానవాల పాసెపుముద్దల్
దినిపింప వృషభ మెచ్చెన్, మినమినమని మేనిచాయ మించులు గాపగ

సీ. కోనేటి తీర్థంబు గ్రోలి వచ్చుటలచే వేంకటేశముఖాబ్జ వీక్షణమున
సతతవైష్ణవదివ్యసల్లాపకథలచే ద్రవిడప్రబంధార్థగతుల చేత
శ్రీ భాగవతభుక్తశేషంబు గొనుటచే సజ్జనోత్తమ వికస్వర్శనమున
కల్యాణరామసంగతి జరించుటచే వివిధపుణ్యాశ్రమ విహరణముల
గాంచెను జ్ఞానవిభవంబు గాంచె యుక్తి, గాంచె రామాయణాదిభాగవతపురాణ
వేదవేదాంతశాస్త్రార్థవిశదబుద్ధి, ధీర సంజీవకుడు కళాప్రౌఢిమమున.

ఈ విధముగా పంచతంత్రముపై వైష్ణవముద్రయు మరియు నాంధ్రత్వ ముద్రయు సొత్తైన రాజనీతిరత్నాకరమును వెలయించినాడీ గోలకొండ నియోగి మంత్రి.

నేలటూరి కృష్ణమంత్రి తన యాశ్వాసాంతగద్యములం దాయా యాశ్వాసములందలి విషయమును క్లుప్తముగా నిచ్చియున్నాడు. ఆ శ్వాసాంతగద్యము లీ తీరుగా నున్నవి :

I ఇది శ్రీ మదనంతసంతత కృపాకటాక్షసంప్రాప్త సరసవిద్యానిధాన రామానుజాచార్యకథానుసంధానమానస కౌండిన్యగోత్రపవిత్ర నేలటూరి కమలేంద్రు పుత్ర పరమభాగవతకైంకర్యధుర్య కృష్ణయామాత్య ప్రణీతంబైన రాజనీతిరత్నాకరంబున మిత్రభేదంబునందు పురవర్ణనయును, రాజవర్ణనయును, రాజాస్థాన శృంగార వర్ణనయు, కాంచిరా వెంకటప్రభావంబును, కరటక దమనక సంహారంబును, నూతివివరంబున మర్కటంబు చిక్కు పడుటయు, జంబుకంబు వెరవు దీరుటయును, పింగళక సంజీవక మైత్రి గలుగుటయు నన్నది ప్రథమాశ్వాసము.

II ఇది శ్రీ......రాజనీతిరత్నాకరంబునందు మిత్రభేదంబున సంజీవకుం డొనర్చు పారుపత్తెంబునకు దమనకుండు విరోధించుటయును, మేష యుద్ధంబుచే జంబుకంబు గెడయుటయును, ఆషాఢభూతిగాడనువాడు [illegible] విశ్వాసంబు చూపి కురుపసొమ్మపహరించుటయు, వాయస కాకోదరోపాఖ్యానంబును, శశకం బుపాయాంతరంబుచే కంఠీరవంబును బడగొట్టుటయును, దమనకుండు పింగళకు నొద్దకు కొండెంబు చెప్ప వచ్చుటయు నన్నది ద్వితీయాశ్వాసము.

III ఇది శ్రీ......రాజనీతిరత్నాకరంబను మహాప్రబంధంబునందు మిత్రభేదంబను ప్రథమతంత్రంబున దమనక పింగళక సిం[illegible]బును, డిండిభుండు వచ్చుటచే మంత్రివిసర్జన గెరయుటయును, దమనకు సంజీవక నయవివాదంబును, సింహంబు లోటిపెటను నమ్మించి ద్రోహంబు సేయుటయు, టిట్టిభటిట్టిభీ సంవాదంబును, కూర్మంబు యష్టి విడిచి పెట్టుటయు, అనాగత విధాతయు నుత్పన్నమతియును భవిష్యంతును, మత్స్యత్రయవిచారంబును, గోపికాంగన జారద్వయంబు మోసపుచ్చుటయు, క్షీరాబ్ధివర్ణనయు, శ్వేత ద్వీపవర్ణనంబును, శ్రీమన్నారాయణుండు గరుడవాహనారూఢుండై టిట్టిభకి ప్రసన్నుండై సముద్రుని చేత గ్రుడ్లు నిప్పించుటయు, దమనకుండు సంజీవకునితో యుద్ధక్రమంబు చెప్పుటయు, మర్కటంబునకు (సూ)చి ముఖను పక్షి బుద్ధిచెప్పబోయి గెరయుటయు, సుబుద్ధి దుర్బుద్ధి సం(వాదం)బును, బకదంభకుల నొకముంగిస రక్షించుటయును, లోహార్థంబు ఇద్దరు కొట్లు పోరి తగవున చె(గుట)యును, సంజీవక పింగళకులు పోర శ్రీ వెంకటేశ్వరుండు ప్రసన్నుండై సంజీవకుని రక్షించుటయు నన్నది తృతీయాశ్వాసము.

IV ఇది శ్రీ......రాజనీతిరత్నాకరంబను మహాప్రబంధంబునందు సుహృల్లాభంబను ద్వితీయతంత్రంబున లఘుపతనకుండు రాగా గని కాల్మలి... పై నిల్చుటయును, జాలరివాడు వచ్చి క్రింద వలయొడ్డిన చిత్రగ్రీవాది కపోతంబులు వచ్చి చిక్కుబడుటయును, అవి భీతిల్లి వాని నెత్తుకొని యెగసి చని హిరణ్యకునిచే బంధనంబులు విడిపించుకొనుటయు, వాయస మూషక స్నేహంబును, మందరంబు మూషకంబుతో నిష్టమైత్రి గావించుటయును, మూషకంబు తన పూర్వ వృత్తాంతంబు చెప్పుటయును, సారంగంబు వచ్చి మందరాదులతోలత సఖిత్వంబొనర్చుటయును, వేటకాని యురుల హరిణంబు తగులుపడుటయు, నెమక వచ్చిన యెలుకకు తొల్లిటి నిర్బంధంబు చెప్పుటయు, చెంచువాడు తనుదెంచుచో నవియు దొరకకుండిన కూర్మంబును బట్టుకొనుటయు, నా ముగ్గురు నుపాయంబున కమఠంబును సాధించుటయు, నలుగురు గూడి సంతోషచిత్తులై శ్రీరంగ దివ్యభూషణుల న్థ(లం) బొనర్చుకొని యుండుటయు నన్నది చతుర్థాశ్వాసము.

V ఇది శ్రీ......రాజనీతిరత్నాకరంబను మహా ప్రబంధంబునందు మేఘవర్ణుం డరిందమునిచేత తరుముడువడి పోవుటయు, సకలపక్షులు గూబ యొకగూబను పట్టంబు గట్టగా నొక వృద్ధవాయసంబు వచ్చి విఘ్నంబు సేయుటయు, వ్యపదేశంబుచేత శశకంబు గజంబులం బోగొట్టుటయు, శశక పింజలుల యన్యోన్య వాదంబులచే మార్జాలంబు గెడయుటయు, బ్రాహ్మణుండు ధూర్తులచేత వంచింపబడి ఆయ్యజంబు విడిచిపెట్టుటయు, యజ్ఞపశు పదార్థంబు భక్షించి విఘ్నంబు సేయుటయు, రథకారుని భార్య యన్యపురుషుని గూడి ప్రియుని సంతోషపెట్టుటయు, గౌతము ప్రభావంబున మూషిక కన్యయై మునుపటి రూపంబు గైకొనుటయు, కపటోపాయమైత్రిచే చిరంజీవి గద్గదస్వరంబున శరణొందిన నా యరిందము ముందు తన ప్రధానులతో విచారంబు గావించుటయు, సార్థవాహుండన్న నైక్యంబు చేరున ధుపకారంబు సేయుటయు, ఒక్క బ్రాహ్మణునకు చోరరాక్షసులు హితవు చెప్పుటయు, రథకారుండు తన భార్య విటునిం గలయం జూచి క్రోధంబు మాని ఆయువతి వాక్యంబులకు సంతసించుటయు, అరిందమాదుల గిరిప్రదేశంబుల నుంచి చిరంజీవి మేఘవర్ణునిం గూడి అరిందమ మునీంద్ర తత్ప్రధానిపంచకంబుల నిర్జించుటయు, కృష్ణసర్పంబు జాలపాదాదిమండూకంబుల భక్షించుటయు, తత్ప్రధానివలన వాయసాధీశ్వరుండు నిశ్చింతుండై పుత్రమిత్రకళత్రసహితులతో రాజ్యంబు సేయుచు సుఖం బనుభవించుచున్నది సంధివిగ్రహంబను తృతీయతంత్రంబు పంచమాశ్వాసము.

VI ఇది శ్రీ......రాజనీతిరత్నాకరంబను మహాప్రబంధమునందు చతుర్థ తంత్రంబను లబ్ధనాశనంబున బలివదనుండు శింశుమారునితో సఖ్యంబు గావించుటయు, అతండు కపటోపాయంబు దలంచికొని కుటుంబవృత్తాంతంబు కపీంద్రుండెక్కుటయు. దానికి జంబుకంబు (   ) మృగేంద్రునకు లోనయ్యెనను వృత్తాంతంబు జెప్పుటయు, నన్ని చతుర్థతంత్రంబున లబ్ధ నాశంబయ్యె. నటమీద నసంప్రేక్ష్యకారిత్వంబుగల పంచమతంత్రంబున నొక బ్రాహ్మణుండు తన కులాంగనకు మంచి కుమారునిం బుట్టించెద ననుటయు, ఆసాధ్వి అనాగతచింత వలవదని విద్యాశర్మయను భూసురుని కథ చెప్పుటయు, అతండు భార్యవలన కుమారునిం గనుటయు, కులాంగన

పెనిమిటివద్ద కుమారుని నుంచి అలంబులకుం బోవుటయు, తిరుగవచ్చు లోగ వారు సాహసంబున నకులంబును గెడపుటయు, అతండు భార్యవలన నాపితుండు నిక్షేపార్థంబుజేసిన విధంబెరింగించుటయు నన్నది ఉభయ తంత్రంబులు సర్వంబును షష్ఠమాశ్వాసము"—

ప్రతివర కమ్మపై (౧౪౬) ఈ తాళపత్రప్రతి వ్రాసిన తిథివారాదులున్నవి. ంబి సంవత్సర మార్గశిర బహుళపంచమి గురువారమునాడు లోనాల అప్పన్న మారుడు వెంకటాద్రి యీ ప్రతిని వ్రాసికొన్నట్లు గలదు. ఇది 6-12-1838 టికి సరిపోవుచున్నది.

ఆడిగెడు దిక్కులేక తెలంగాణమందు పుట్టిన కృతు లిట్టి వెన్ని నశించి 'యినవో మరి యెన్ని మూలమూలల నడగియున్ననో తెలియరాదు నేటి లమున నీ రాతియాకుల గౌరవ మెరిగిన పట్టరాక వెట్టికి పుట్టిన బిడ్డవలె న్నది.

(ఉదయభాను, ఫిబ్రవరి 1982)

పరశురామపంతుల లింగమూర్తి

రెండు వేదాంత శతకములు

తెలుగు వాఙ్మయమున శతకములకున్న ప్రాముఖ్యమును వాని వైవిధ్యమును సాహిత్యజ్ఞు లెరుగుదురు. శతకవాఙ్మయమున వేదాంతశతకములకొక యుపశాఖ. ఇటీవల రెండు అముద్రిత వేదాంతశతకములు నా కంటబడినవి. ఇవి యిన్నాళ్లు మూలబడియుండుటకు కారణ మేమో నాకు తెలియరాదయ్యెను. రచయిత ఏ యనామకుడో యనుకొందమన్న నటులగారు. తెలుగు వేదాంతవాఙ్మయము ప్రసక్తి వచ్చినంతనే చేతులెత్తి మ్రొక్కవలసిన మహానుభావుడా రచయిత. మరి యీ శతకములకీ దుర్గతి యెట్లు పట్టెనో నావంటి యల్పజ్ఞుల కూహకందని విషయము. పరశురామపంతుల లింగమూర్తి గారి పేరు విననివారుండరు కదా! ఆయన రచించిన సీతారామాంజనేయమును గూర్చి తెలియని సాహిత్యజ్ఞులుండరు కదా! అంతటి మహాయోగి-కారణజన్ముడు-రచించిన ఈ శతకములు మూలబడి యుండుటేకాదు, వాని పేరులు కూడ సాహిత్యచరిత్రమున కెక్కలేదు. సీతారామాంజనేయమునకు పీఠికను సంతరించిన శ్రీ. శే. శేషాద్రిరమణకవులు పరశురామ పంతుల లింగమూర్తి గారి కృతులారింటిని పేర్కొన్నారు. ఆ యారింటిలో నీ శతకములు లేవు. ఈ ఆరింటిలో నొకటియగు మానసశతకమే శ్రీ. శే. వంగూరి సుబ్బారావుగారు పేర్కొన్న మనశ్శతకము. నా కంటబడిన ఈ రెండు శతకములు ఆత్మారామ, గోవింద శతకములు. నాకు అంత ఈ శతకములు లింగమూర్తి యోగి కరవలి రచనములని తోచుచున్నది.

పరశురామపంతుల, శ్యామపంతుల మున్నగు నియోగులు తొలుత మహారాష్ట్రులనియు, ఓరుగల్లు మండలమునకు వలస వచ్చి యట స్థిరపడి పోయిరనియు ప్రాతతరములవారు చెప్పగా వింటిని. పరశురామపంతుల

వారు అంటాల, ఈదులవాయి, నుట్టివారి మున్నగు ప్రాంతము లందున్నారు. లింగమూర్తి పదునెనిమిదవ శతాబ్దమున నున్నవారు. అతని సీతారామాంజనేయము క్రీ. శ. 1760 ప్రాంతములందు రచింపబడియుండునని శ్రీ. శే. శేషాద్రిరమణకవు లూహించియున్నారు. వారు లింగమూర్తి రచనములని పేర్కొన్న 1. రతిమన్మథ విలాసము 2. జీవన్ముక్తి ప్రకరణము 3. బ్రహ్మ నారద సంవాదము 4. తారకయోగము 5. మానస శతకము (శతకములు) 6. సీతారామాంజనేయము కాక తరువాత కాలమున బయలుపడి అచ్చైనది 'సిరిహెట'యను నద్భుతగేయ కావ్యమొకటి కలదు.[1] లింగమూర్తి గొప్ప వేదాంతవేత్త మరియు మహాభక్తుడు. పోతన్న గోపన్నలవంటి మహానుభావుల వెన్నుదన్ని పుట్టిన లింగమూర్తి భక్తివైరాగ్యముల కూడలి. అతని జన్మ చేతను, నివాసముచేతను పావనమైనది నుట్టివారి (ఓరుగల్లులో నొక భాగము). లింగమూర్తిగారి యిల్లు తద్వంశీయుల కిప్పటికిని వాసయోగ్యమై రసిక్కులచే గౌరవింపబడుచున్నది. ఈ పావనగృహమును ప్రభుత్వమువారును ప్రజలును మనదేశపు పుణ్యతీర్థములందొకటిగా భద్రపరుపవలసిన యొగత్య మెంతేని కలదు. పరశురామపంతులవారి వంగడము లింగమూర్తి ఆదిగా ఆధ్యాత్మికవిద్యల కాలవాలమైనది. ఎన్నియో భక్తివేదాంతగ్రంథములా వంశీయులచే వ్రాయబడినవి.[2] లింగమూర్తి రామమంత్రిరిమ్మమాంబల కుమారుడు. అతని జీవితవిశేషములు కవిచరిత్రముల కెక్కియుండుటచే వాని గూర్చి వ్రాయనక్కరలేదు. ప్రస్తుతను ఆత్మారామ గోవిందశతకములను పరిచయము చేయుటే నా కర్తవ్యము.

ఈ రెండు శతకములును, మరికొన్ని పంచరత్నములును రెండు తెల్లె రెవపుగల ౩౪ తాటియాకులపై వ్రాయబడి ఉస్మానియావిశ్వవిద్యాలయము సంస్కృత అకాడమిలో (నెం. 481) భద్రముగా నున్నవి.

---

1. చూడుడు: తెలుగు జానపదగేయ సాహిత్యము. 1958, పుటలు 368-382

2. చూడుడు: "సాహితి" మాసపత్రిక, ఏలూరు, సంపుటము 1సంచిక 3 జనవరి 1962 ఆంధ్రుల సంస్కృత సాహిత్యసేవ. పుటలు 13-17

ఆత్మారామశతకము ౧-౧౫ కమ్మలపైనను, గోవిందశతకము ౧౫-౨౯ కమ్మలపైనను, పంచరత్నములు వేరుగా ౫ కమ్మలపైనను వ్రాయబడి యున్నవి.

ఆత్మారామశతకమున మొత్తము ౧౦౬ కందపద్యములున్నవి. 100 పద్యముల తరువాత "శ్రీరామార్పణమస్తు" అని ముగించి తక్కిన ఆరు పద్యములలో గురుస్తుతి, కృతి ప్రశంస, ఫలశ్రుతి మున్నగునవి చెప్పబడినవి. ఈ శతకమున ప్రతిపాద్యమైన వేదాంతవిషయములును, శైలియు దెలియుటకునై స్థాలీపులాకన్యాయముగా అట నట కొన్ని పద్యము లుదాహరింతును.

క॥ నరనారాయణు(ల)ము మన
మిరువురము నవిద్యవలన నేకాత్ముల మ
క్షరపురుషపరమపురుషుల
మరయంగా విద్యవలన నాత్మారామా (2)

క॥ నిను గనియెదనను వాంఛన్
ఘనదేహేంద్రియమనముల కడ ద్రోచిన యం
తన నీవె నేనైతిని
యనుభవమిది యతివిచిత్ర మాత్మారామా. (8)

క॥ నిమ్నోన్నతములు గాని సు
షుమ్నామార్గమున నిన్ను జూచి జితప్ర
ద్యుమ్నులగు యోగిపుంగవు
లామ్నాయవిధిం దలంతు రాత్మారామా. (48)

క॥ శ్రద్ధాభక్తులు మొదలగు
బుద్ధివికారములు నన్ను బొందునె నేనా
బుద్ధ విశుద్ధ సమిద్ధమ
హర్ధిభాసకుడనగుట నాత్మారామా. (81)

క॥ జపములు తపములు వ్రతములు
చపలమనోనియమములు విచారింపగ నె
ల్లపు దమనన్యుడనగు నా
కవరారోపణము లేల ఆత్మారామా. (84)

క॥ నానా దేశములందును
నానాకాలములయందు నానాజగముల్
నేనై వెలుగుదుగాన న
దానందాబ్ధికుడ కేవలాత్మారామా. (100)

క॥ గురుడనగా శిష్యుడగు
స్థిరమతి శిష్యుండనంగ జీవాత్ముం డ
య్యిరువుర కైక్యస్థానం
బరయంగా పరమపదము సాత్మారామా. (101)

క॥ అని యివ్విధమున నామది
ననిశము విలసిల్లు శ్రీమహాదేవగురుం
డనవను (?) నీకివ్వడు నా
యనుభవ మెరిగించితిన్ మహాత్మారామా, (103)

క॥ ఇల పరశురామపంతుల
కులజ శ్రీ లింగమూర్తి గురుడవు నీవై
పలికితివి గాక నితరుల
కలవరునే యిట్లు బలుక సాత్మారామా. (106)

ఈ శతకాంతమున వ్రాయసకాడు తన్నుగూర్చియు తిథివారాదులగూర్చియు నీ విధముగా వ్రాసియున్నాడు.

"కాళయుక్తి నామ సంవత్సర వైశాఖ శు॥ ౧౨ శుక్రవారం అయిదు గడియల ప్రొద్దు యెక్కేవరకు రాపాకచంద్రయ, మామిళ్ళపల్లి వెంకటరాముడు, మా యింట్లో దక్షిణపు అరుగుమీద కూర్చుండగాను బ్రహ్మానంద స్వరూపులైన పరశురామపంతుల లింగమూర్తి అయ్యవార్లగారి పుస్తకంలో చూచి నకలు వరసంభట్లు వ్రాశినాడు."

వ్రాయసకాడు కోర్టులో ప్లీడరువలె దేశకాలములను సాక్షులను రుజువు పరచినట్లుగా నింత వివరముగా వ్రాయుట కొంత వింతగానే యున్నది. వ్రాయసకాడిచ్చిన తిథివారములు క్రీ. శ. 27-4-1798 నాటికి సరిపోవుచున్నవి.

పదునైదవ శతమ్ము రెండవదైపున 'గోవిందశతకము' ప్రారంభమైనది. ఈ శతకమున మొత్తము 111 పద్యములున్నవి. ఇందులో కూడ 100 పద్య

ముల తరువాత 'శ్రీరామా' అని ముగించి తక్కిన 11 పద్యములు వ్రాయబడినవి. ఆత్మారాము శతకమంతయు వేదాంతవిషయములతో నిండియున్నది. కాని గోవిందశతకమున భక్తివేదాంతములు రెండును ప్రతిపాద్యములు. గుణకీర్తనము గల పద్యముల సంఖ్య గోవిందశతకమున నధికము. దీనినుండి కూడ మచ్చుకుగా కొన్ని పద్యము లుట్టంకింతును.

క॥ శ్రీ లక్ష్మీనారాయణ
నీలాంబుదనిభశరీర నిగమాధారా
లీలావిహార నిర్మల
శీల చిదానందకంద శ్రీగోవిందా. (1)

క॥ యోగకర యోగవిద్వర
యోగాభ్యాసప్రవీణ యోగాధారా
యోగైశ్వర్యపరాయణ
యోగానందానుభూతియుత గోవిందా (13)

క॥ పరతత్త్వము నంటక న
పరపురుషుని మించి సర్వసాక్షి యనంగా
పురుషోత్తముడని వెలసిన
పరమాత్ముని నిను భజింతు పరగోవిందా. (48)

క॥ జ్ఞానికి మిక్కిలి ప్రియుడను
నే నతడును నాకు ప్రియుడు నిక్కముగా నా
జ్ఞానియె నేనని మును మీ
రానతి యిచ్చితిరి కాదె హరి గోవిందా. (61)

ఈ శతకమున ౮౮ వ పద్యమునుండి వివిధావతారముల స్తోత్ర మున్నది. పరశురామావతార స్తోత్ర మిట్లున్నది.

క॥ ధరణీసురవరద మహా
పరశుధర నృపాలజలధిబడబానల భా
సురసురతపోధన ఘనసుం
దర భార్గవరామ రూపధర గోవిందా (88).

లింగమూర్తి తనకృతిని గూర్చి చెప్పిన పద్యమిట్లున్నది.

క॥ ఈ స్తోత్ర రత్నరాజము
కౌస్తుభమణితుల్యముగను గని కానుకగా
హస్తాబ్జంబుల గైకొని
విస్తరముగ మై ధరింపవే గోవిందా. (110)

కవి తనను గూర్చి ఈ విధముగా వ్రాసికొన్నారు.

క॥ ఇల పరశురామ పంతుల
కులజ శ్రీ లింగమూర్తి గురుమూర్తి నము
జ్జ్వల గోవింద స్తోత్రము
నలరితమతి జేసె సిద్ధ శతకము చేతన్. (111)

ఈ పద్యము తరువాత "శ్రీ సీతారామ పరబ్రహ్మణే నమః, శ్రీ లింగమూర్తి పరబ్రహ్మణే నమః" అని ముగించి వ్రాయసకాడు తానొక పద్యమును వ్రాసినట్లున్నారు.

క॥ దయ నాదరింపు భక్తహృ
దయ నాఫణిశయన వికసితాంబుజనయనా
నయనామయ నామయ నా
భయనాశము చేసి నన్ను పాలింపు హరీ.

దీని తరువాత వ్రాయసకాడు నక్కా నరసంభట్లు తిథివారాదుల గూర్చి యిచ్చిన సాక్ష్య మీదిగా నున్నది.

"కాలయుక్తి సంవత్సర వైశాఖ శు॥ ౧౪ నృసింహజయంతినాడు నక్కా నరసంభట్లు జూపాకకు జానకిరాముడు భోజనానికి పిలిస్తే ఆ వూరికి పోయి గంపావారింట కూర్చుండి తూర్పు ముఖాన కూర్చుండి నక్కా నరసంభట్లు వ్రాసినాను" అంటు పేర్కొనబడిన తిథి మున్నగునవి క్రీ. శ. 28–4–17౯౮ నాటికి సరిపోవుచున్నవి. జూపాక ఓరుగల్లుకు సమీపమందున్న యొక గ్రామము. గంపావారు కోమటులై యుందురు. ఆ యింటి పేరుగల కోమట్లు మాయూర నున్నారు.

ఇంతటితో నీ రెండు శతకములు ముగిసినవి. ఈ తాళపత్రగ్రంథము రెండవ వైపునుండి పంచరత్నము ప్రారంభమైనవి. ఇవి ఆరుకమ్మలపై నున్నవి. మొదటి పంచరత్నములు సీసపద్యములు. పంచరత్నములని

వ్రాయబడియున్నను ఈ సీసపద్యము లారున్నవి. ఈ యారు సీసపద్యములకును మకుటముగానున్న ఎత్తుగీతి యొకటే. సీసపద్యములందు మొదటిది

సీ॥ మొదలు ప్రాణాపానములను తద్రేచకపూరకకుంభకంబులను నవి మె
లంగు నిడాపింగళాసుషుమ్నల హంసతత్వంబునే సాక్షి తానె తెలియు
వికచహృత్కమలకర్ణికయందు ఘోషించు ప్రణవనాదంబున్నేవధువుదెరుగు
భ్రూమధ్యమమును చూపులను నానావిధకళలను మనము నేపునుడుగాంచు

సతడె ప్రత్యగాత్మ తతడెపో పరమాత్మ
తతడె వాసుదేవు తతడె శివుడు
అతడె స్వప్రకాశుడైన శ్రీ మన్మహా
దేవ లింగమూర్తి దివ్యకీర్తి.

ఇట్టి నాలుగు సీసపద్యముల తరువాత ఐదవ సీసపద్యమునకు, సాంఖ్యమనియు, ఆరవ సీసపద్యమునకు అమనస్కమనియు శీర్షకములున్నవి.

ఈ పద్యముల తరువాత "శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే" ఇత్యాదిగా గల్గు పంచరత్న శ్లోకములున్నవి. ఆటు తరువాత నీ శ్లోకముల కాంధ్రానువాదములగు పంచరత్నములు గీత పద్యములున్నవి. వానిలో మొదటి పద్యము.

"శ్రీ మనోరమ శ్రీ రామ రామ రామ
యనుచు రమియించు రాముని యందు రామ
నామము వరానన సహస్రనామ తుల్య
మట్లుగావున దీని నీ వపఘరింపు".

ఈ సీస పద్యములును, గీతపద్యానువాదములును పరశురామపంతుల లింగమూర్తిగారి రచనములై యుండును. వ్రాయసకా డీ పద్యముల తరువాతకూడ తిథివారాదుల నిచ్చియున్నాడు.

"కాలయుక్తి నామసంవత్సర వైశాఖ శు॥ ౧౫ ఆదివారం నాడు బ్రహ్మానందస్వరూపులైన పరశురామపంతుల లింగన్న అయ్యవార్లగారి ప్రతిలో వున్న క్రమాన నక్కా నరసంభట్లు వ్రాసినాడు. క్షమ అపరాధం, రెండు ఘామల అప్పుడు మల్లెసాలలో మొగరానికివొరిగి ఉత్తరముఖాన కూర్చుండి వ్రాసినాను." ఈ తిథివారాదులు. క్రీ. శ. 29-4-1798 నాటికి సరిపోయినవి.

మరచిపోయిన "మల్లెసాల," "మొగరము" వంటి పల్లెటూరి మాటలు పట్టణవాసపు డ్రాయింగు రూములో పిల్లలకు చేరువగా కూర్చుండి వ్రాయుట కలవాటుపడిన నాకు మనస్సు కలుక్కు మనిపించినవి. వ్రాయస కాడిచ్చిన తిథివారాదుల ననుసరించి ఈ తాళపత్రగ్రంథము మన 'స్రవంతి' పుట్టిన ఏప్రిల్ మాసములోనే నూటయిరువది నాలుగేండ్లకు పూర్వము వరుసగా మూడు దినములలో వ్రాయబడినట్లు తెలుచున్నది.

ఈ నక్కానరసంభట్లు సాక్షాత్తుగా లింగమూర్తిగారు వ్రాసిన మాతృక నుండి ఎత్తి వ్రాసినాడు. ఈతడు లింగమూర్తిగారి శిష్యకోటిలోని వాడై యుండును. క్రీ. శ. 1798 నాటికా మహాయోగి సజీవుడై యుండును. లింగమూర్తిగారిని సేవించి తాను ధన్యుడై లింగమూర్తిగారి ఈ శతకములకు ప్రతిని వ్రాసి ఈ నాటికి మనకు దక్కించి మన కృతజ్ఞతలకు పాత్రుడైన ఈ నక్కానరసంభట్లు కుటుంబమువారిప్పుడెచ్చటనైన కలరో లేరో తెలియదు.

(స్రవంతి, ఏప్రిల్ 1962)

పాల్కురికి సోమనాథుని పండితారాధ్యోదాహరణము

మహాపండితుఁడును మహాకవియునగు పాల్కురికి సోమనాథుడు బసవపురాణము, పండితారాధ్య చరిత్రము, సోమనాథభాష్యము, రుద్రభాష్యము మున్నగు బృహద్గ్రంథములే కాక పెక్కు లఘుకృతులు రచించినాడు. ఆలఘుకృతులలోఁ గొన్నింటిని శ్రీ బండారు తమ్మయ్య గారొక సంపుటమున నిటీవల ప్రకటించియున్నారు. పిడుపర్తి సోమనాథుఁడు, పాల్కురికి సోమనాథుఁడు "ఉదాహరణ యుగ్మము" రచించినట్లు పేర్కొన్నాఁడు. సోమనాథుని బసవోదాహరణము తెలుగులోను సంస్కృతములోను లభించుటవలన ఇన్నాళ్ళు పండితలోకము ఉదాహరణయుగ్మ మనగా బసవోదాహరణయుగ్మమనియే భావించినది. కరీమునగరము మండలమున నా కొక తాళపత్రగ్రంథము లభించినది. దానిలో సోమనాథభాష్యముతోపాటు పాల్కురికి సోమనాథుడు రచించిన పెక్కులఘుకృతులున్నవి. వానిలో నీ పండితారాధ్యోదాహరణ మొకటి. ఈకృతి యున్నట్లు ఇంతవరకు ఆంధ్రసాహిత్య ప్రపంచమునకు తెలియదు. తమ్మయ్యగారి సంపుటములో నిది చేరలేదు. మొదటిసారిగా దీనిని ప్రకటించుభాగ్యము కలిగినందుకు మిక్కిలి సంతోషించుచున్నాను. వ్రాయసకాఁడు తాళపత్రగ్రంథము వ్రాసికొన్నది నందన సంవత్సర వైశాఖ బహుళ త్రయోదశీ శుక్రవారము. ఇది క్రీ. శ. ౬-౫-౧౮౯౨ తేదికి సరిపోవుచున్నది. ఇతరాంధ్ర ప్రాంతములందువలెఁ దెలంగాణమునఁ దాళపత్రగ్రంథములను సేకరించుట శ్రద్ధవహించుట జరుగలేదు. ప్రభుత్వమువారేమాత్ర మీవిషయమున శ్రద్ధగైకొనలేదు. చిన్నచిన్న సంస్థలవద్ద కొందఱు వ్యక్తులవద్ద కొన్ని తాళపత్రగ్రంథము లున్నవి. ఏయే మారుమూలలం దింకనెట్టి యనర్ఘ రత్నములు మాటుమణఁగి యున్నవో తెలియదు. ఇరుగు పొరుగు రాష్ట్రములందు ప్రాచ్యలిఖితకోశాలయములున్నవి. వేలకొలది తాళపత్రము లిప్పటికిని తెలంగాణ

మున లభించును. వాని నన్నింటిని ప్రోగుచేసి ఆంధ్రదేశ ప్రభుత్వము వారును మద్రాసు ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారమున పండితుని నొకటి స్థాపించి పరిశోధనలు చేయించినఁ దెలుఁగు సూర్యప్రభకును తెలుఁగు సాహిత్యమునకును మేలుచేసినవారగుదురు. అలక్ష్యము చేసినచో ఆతాళపత్ర గ్రంథము లెక్కడివక్కడ జీర్ణించిపోవును. అప్పుడు "నదీనాం సాగరో గతిః" అనెడి యుదాహరణమును తిలకింపవలెను.

శ్రీ మల్లికార్జున పండితోదాహరణము :

శ్లో. అద్వైతోద్ధత కుంభిరుంభరణసోద్యద్దోర్దర్పపంచాననో
గర్వోదంచితపాంచరాత్ర నివిడప్రాలేయ పంతద్యుతిః,
పాషండాబ్జవనాగజో విజయతే బౌద్ధాద్రిఘోరాశనిః
శ్రీమత్పండిత మల్లికార్జునగురు ర్విద్వత్సభాపూజితః. ౧

శ్లో. పండితారాధ్యనామేతి పంచాక్షరసముద్భవమ్
నక్త[ం] స్మరంతి యే భక్తా స్తేజనాః పుణ్యకారిణాః. ౨

మాలిని. శివశర శివసౌఖ్యా శిష్టభక్తైకసఖ్యా
వివిధపరమశీలా వేదశాస్త్రానుపాలా
ప్రవిమలవరబాహా పండితారాధ్య దేవా
తవిలి మిము భజింతున్ దద్దయుం బ్రస్తుతింతున్. ౩

శా. శ్రీమచ్ఛైవరమావరున్ [1]వినమిత శ్రీ చెన్నమల్లేశ్వరున్
ధీమంతున్ నిగమాగమ ప్రకటనులోద్ధితార్థవేత్తన్ బుధ
స్తోమున్నున్ బ్రభు సూర్యనేత్ర్యంగు నాథ్యున్ బండితారాధ్యులన్
గామింతున్ నుతియింతుఁగొల్తుఁ దలఁతున్ గామ్యార్థసంసిద్ధికిన్. ౪

—: ప్రథమా విభక్తి :—

శా. శ్రీమత్పండితమల్లికార్జునుడు వైశిష్ట్యల్లసచ్ఛయ్యఁడు
ద్దామప్రోద్ధతవీరశైవసరి నిత్యశ్లోకుఁడుద్యన్ముని
స్తోమస్తోత్రుఁడగణ్యపుణ్యుఁడలితాఘౌఘ సమ్యగ్దయా
ధాముం డీవుత మాకు భక్తియుఁ బ్రసాదార్థక్రియాసక్తియున్. ౫

1. నియమిత.

మధురగతిరగడ

కళిక :— [2]మతి శుద్ధ శైవమార్గమందనుఁడు
దుఃఖపడించు భవ । దుర్గభంజనుఁడు
చిరతరప్రణవ । సిద్ధమాంత్రికుఁడు
పరమశక్తిపిని । బద్ధతాంత్రికుఁడు
మునిగణ ప్రచయ । ముఖ్యవందితుఁడు
అనితరచిన్మయను । సౌఖ్యవందితుఁడు
అలఘునందితశి । వైక్యభావనుఁడు
ఎలమి సర్వజగ । దేకపావనుఁడు

ఉత్కళిక :— తన విభుత్వమును
ఘనమహత్త్వమును
ధరణి నింపుమని
హరుడు పంపఁగని
[4]వరసి చెన్నమర
నౌరలు గొన్న వర
ముముదయాతనుఁడు
దమితయాతనుఁడు.

—: ద్వితీయా విభక్తి :—

వా. ఆద్యుండై ప్రమథానుసారకలితుండై వీరమాహేశ్వరా
చార్యుండై పరభక్తిముక్తిసుమహాత్మ్యఖ్యప్రదుండై మహై
శ్వర్యుండై భవరోగ వైద్యుఁడయి ధాన్యన్మూర్తియై సద్గుణ
సైర్యుండై తను మల్లికార్జును యథాశక్తిన్ ప్రశంసించెదన్.

మధురగతిరగడ

కళిక :— మహియును భువనన । మాజస్తుత్యుని
తెలిసిన మహిమా । న్వితపాండిత్యుని
అతిశయనుతదా । హ్యాంతరశుద్ధుని

2. మహియు 3. వినిత 4. వరసెఁ

హరశివగణవిర । హరజినత్రాద్దుని
శివయోగసుఖ । శ్రీసాన్నిధ్యుని
సవిశేషాఖిల । జగదారాధ్యుని
సంచిత విమల । జ్ఞానసముద్రుని
సంచితసరస । ధర్మావృతరుద్రుని. ౯

ఉత్కళిక :— హరు నుపకరణము
లొరసిన చరణము
లలగల పెటిలిన
యలుగుల నటికిన
మన మహాదేవయ
మను కాళ్ళన్ దయఁ
బడసిన పీరుని
బరలా దూరుని. ౧౦

—: తృతీయా విభక్తి :—

శా. ఆజ్ఞారాధనహ్రసుచే విధినిషేధాదిక్రియానీతుచే
సజ్ఞానాద్విపహ్రసుచేఁ బరమయోగానందుచే భక్తిన
మ్యజ్ఞానాశ్రయణీయుచే ననఘుచే మా పండితారాధ్యుచే
నాజ్ఞాసిద్ధియుఁ జిత్తశుద్ధియు నమర్త్యశ్రీపిలిమైఁ బొందెదన్. ౧౧

ద్విరదగతి రగడ

కళిక:- మఱియు శవిజనరహిత । మహితైకకేలుచే
సురుపురారసగతో । ద్యుక్తవాగ్జాలుచే
ప్రకటితాష్టాదశపు । రాణనిర్ణేతచే
సకలశాస్త్రార్థవి । జ్ఞాన సంధాతచే
వేదాంతసిద్ధాంత । విషయప్రవర్తిచే
నాదిమార్గప్రతిష్ఠా । చార్యమూర్తిచే
శివతత్త్వభావనం । చితయోగమధనుచే
శివతత్త్వసారసం । చితపుణ్యకథనుచే. ౧

---

౧. జిన.

ఉత్కళిక :- గురునాథుఁ దల మోపి
యరసి భక్తులను జూచి
శివ ప్రసాదము గొనిన
భవము మఱితేరనిన
దని జగంబులఁ జాటి
మను ప్రసాదము సాటి
చేసిన ప్రసిద్ధుచే
నా శుభనముద్రుచే. ౧।

—: చతుర్థీ విభక్తి :—

౪. భక్తుం డీశ్వరుఁ డగ్రగణ్యుఁడు మహాభాగుండు భక్త్యార్థసం
యుక్తస్వాంతుఁడు దేశికోత్తముఁడు విభ్యోల్లాసవంతుండు ప్ర
వ్యక్తుండంచు గణించి జంగమసముద్యద్వార్దపద్మార్చనా
సక్తిన్ బేర్కొను మల్లికార్జునునకై సద్భక్తి నాఁటించెదన్. ౧

ద్విరదగతి రగడ

కళిక :- మఱియును బునర్భవన । మరణదూరునకునై
వేఱులు నవగరళయా । వరణ కరణునకునై
గహనాంగనంగరవి । కారదూరునకునై
సహజైకయోగప్రవ । చారధీరునకునై
కమనీయభక్తిశ్రీం । గార పాత్రునకునై
సమదిరాంచితశివా । చారపూర్ణునకునై
అతులసంవిత్ప్రభా । యత్తచిత్తునకునై
అవిచినిర్మలమహో । దాత్తవృత్తునకునై ౧:

ఉత్కళిక :- లింగార్చనావేళ
జంగమము వచ్చినఁ
(గడువడిని దనకడకు)
నెడతేర శివభూష
గొనిరక్తుఁడే లింగ

మని భజించిన జంగ
మ ప్రహాణపదునకై
విప్రసమ్మదునకై ౧౬

—: పంచమీ విభక్తి :—

శా. ఆఖ్యాతక్రమభానుకీర్తి వలనన్ స్వాత్మావబోధోల్లస
త్సౌ(ఖ్యోపా)యుఁడన ప్రకాశువలనన్ శంభుప్రసాదాగమ
⁶వ్యాఖ్యాతాచరణప్రవీణమతి భాస్వత్పండితారాధ్యనా
మాఖ్యాతాచితపుణ్యమూర్తివలనన్ మా కిష్టముల్ చేకురున్. ౧౭

ద్విరదగతి రగడ

కళిక:- మఱియు ననర్పళశివన । మయనముచితునివలన
గురుఁ డొనరుచున్ దనరు । గుణగణాయతువలన
శరణగణవరచరణ । నరసిరుహవశువలన
నరన [7] వరమునినికర । నరతనుతయశువలన
పరమవరవిమలతర । వరమసుఖకరువలన
నిరతిశయదురితచయ । నిఖిలభయహరువలన
శ్రుతినియతమతసహిత । సురచిరసహితువలన
విరతయమనియమనమ । విలసచ్చరితువలన ౧౮

ఉత్కళిక:- శివుని పంపున వచ్చి
దవిలి కనుగవ నిచ్చి
నమ్మాటికిని లదయ
నమ్మకున్నను దరయ
కెరల నిదురలగు కన్ను
లదరఁ బదసిన చెన్ను
నివుడు ధన్యునివలన
భువనమాన్యునివలన ౧౯

---

6. వ్యాఖ్యాయా 7. శర

—: షష్ఠీ విభక్తి :—

ఉ. పాపాత్మున్ వెలనాటిచోడనృపతిన్ భ్రామ్యత్పతంగాధమున్
గాపో(దేకవిజృంభితాగ్ని శిఖలన్ (అయ్యన్ వినాశంబుగాఁ
దాపోద్వేగఫలంబు నవ్వదె గనన్) ధన్యంబుగా నుగ్రుఁడై
యాపాదించిన మల్లికార్జునునకిన్ ట్రర్పింతు నా చిత్తమున్. ౨౦

తురగవల్గన రగడ

కళిక :— మతియు మెఱయఁ దెలుపనోపు • సుహితవిహితవృత్తమునకు
నెలవు నిరవుఁ జూపనోపు • నిత్యసత్యకీర్తనునకు
బ్రాపుదాపు దానయైన • భక్తియుక్తి కారణునకు
పావకోపరాగరోగ • భవనిచయనివారణునకు
సతతవిరతకర్మమర్మ • జాలమూలకృంతనునకు
నలిపిహితవిచారసార • సాంగలింగచింతనునకు
ఆద్యహృద్యరచితనిచిత • యతనకలనపండితునకు
గద్యపద్యసవ్యకావ్య • కథనమథన పండితునకు ౨౧

ఉత్కళిక :— ఇల నమస్తవారవేర
ముఁలఁ బ్రమాణజాలమూల
మున శివుండ మేటి పోటి
యని గుఱించి జ్ఞానహీన
సమయసమితిఁ ద్రుంచి మించి
యమితవిమలభక్తియుక్తిఁ
బరగు తత్త్వచేతనునకు
భరితభక్తికీలమునకు ౨౨

—: సప్తమీ విభక్తి :—

ఉ. లింగాత్ముం డా భవశేషునామయను బల్మిన్ జీరి మార్కొన్న గ
ర్వాంగద్రోహిని దానుగంటి యుదయచ్ఛాదిలుఁ దత్సంతతిన్
ద్రుంగంగా శపియించి మించి జగదుత్తుంగప్రతాపోదయా
కీనంగధ్వంసకు మల్లికార్జునునియం దానక్తిమైఁ గొల్చెదన్ ౨౪

8. దాంగి దారుఁడు

మధురగతి రగడ

కళిక :— మహిమను నద్దిన । మందరునందుఁ
గౌరుల బ్రవిస్తుతి । కుందరునందుఁ
దురితసముత్కర । దూరగునందుఁ
పరమపరాత్పర । పారగునందుఁ
నరనలగజ్జిన । నన్నుతునందుఁ
ఉరుతరకీర్తిన । మున్నుతునందుఁ
పరిమితసూన్నత । భాషణునందుఁ
స్ఫురితదయారస । భూషణునందుఁ ౨౪

ఉత్కళిక :— హరు కృపయాటల
కిరవగు రోటుల
కనువగు మాటల
వినుతుల తేటల
పదముల పాటల
ముదమగు నాటల
గల గురునందు(న్)
మలహరునందు(న్) ౨౫

—: సంబోధన :—

క. శాంతస్ఫూర్తిరనందినాథ భవహావైరనోగ్రాక సి
ద్ధాంతప్రౌఢరవాదగీతమయవిద్యాదిత భృంగీశరు
ద్రాంతోద్యద్బల వీరభద్ర నినునే ప్రార్థింతు విజ్ఞారవే
దాంతా। పండితమల్లికార్జున। శ్రీరికారాధ్య। రక్షింపుమా] ౨౬

తురగవల్గన రగడ

కళిక :— మఱియు నంయమీశ్వరోక్త । మార్గనంతతప్రచార
మెఱయు హృదయకమలమధ్య । మిళితశుద్ధతత్వపూర
దురితచరితజననమరణ । దుఃఖనంకటాదిదూర
హరసమయసుభార్థపద్ధ । నాధికల్పితప్రచార

ప్రకటతరభవాంధకార । పటలవిఘటనప్రదీప
సుకృతజనహితోపదేశ । సులభసద్గురుస్వరూప
విస్మయాబ్ధిజననహేతు । వీరభక్తియోగసాంద్ర
అస్మదీయ చెన్నమల్లి । కార్జునావతార ౨౭

ఉత్కళిక :— అమర తనువు సత్క్రియార
తము ధనము గాని వేర
నము మనము భక్తిభావ
నమున సమయలింగసావ
ధానలీన పరమయోగ
మానితానురాగభోగ
జనితనిర్వికల్పసౌఖ్య
వినుతనిఖిలశరణముఖ్య ౨౮

—: సార్వవిభక్తికము :—

౧. నీవార్యుండవు నిన్నుఁబెంచు జగముల్ నీచే భవంబెందు నీ
కై వచ్చిల్లు యశంబు నీవలన సౌఖ్యావాప్తి నీకుం బ్రసా
దావిస్ఫార నతోత్సవంబరరు నీయందావహింతున్ మదిన్
దేవా! పండితమల్లికార్జున! జగద్దీపప్రభావోదయా! ౨౯

౨. ఆరాధించితలింగజంగమ కృపాయత్తప్రసాదోదయా
పారోక్తిన్ జను నీయుదాహరణమున్ బాల్కురికి సోముండు లో
కారాధ్యుండగు మల్లికార్జునునకిట్లర్పించె సద్భక్తి నిం
దారంగాఁ బఠియించినన్ వినినఁ గామ్యార్థం బిలన్ జేకుఋన్. ౩౦

(ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక, డిసెంబరు 1962)

వేముల రామభట్టు - గౌరీ విలాసము

మహబూబునగరము మండలమున మానాజీపేట (మానవతీపురము) అను చిన్నజమీందారీ పట్టణము కలదు. దానికి "తూము" ఇంటి పేరుగల రెడ్లు అధిపతులు. ఆ జమీందారు లెందరో కవిపండితుల నాశ్రయమిచ్చి సంస్కృతాంధ్ర వాఙ్మయములకు చక్కని దోహద మొనర్చిరి. కవి పండితులను పోషించుటయేకాక తూము వంశపురెడ్లు తాము స్వయముగా కవులై పండితులై వాసికెక్కినారు. అట్టివారిలో తూము రామచంద్రావనీపాలు డొకడు. ఇతడు "అలమేలుమంగాపరిణయ" మను[1] కావ్యమును రచించెను. ఈ రామచంద్రావనీపాలుడు (రాజా చందూలాల్ సమకాలీనుడను ఆధారమును బట్టి) పందొమ్మిదవ శతాబ్దము ప్రథమపాదమున నుండినట్లు శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రిగారు నిశ్చయించినారు. రాజా చందూలాల్ (క్రీ. శ. 1766-1845) అసఫ్జాహీ వంశపు సుల్తానులలో మూడవవాడైన సికిందర్‌జా కాలమునను, నాల్గవవాడైన ఆసిఫుద్దౌలా కాలమునను ముఖ్యమంత్రిగా నుండినవారు[2] తూము రామచంద్రావనీపాలుని కాలమును కనుగొనుట కితరాధారములు నాకు వేరేమియు లభించలేదు. ఈ రామచంద్రారెడ్డి కుమారుడు పరశురామరెడ్డి. పరశురామరెడ్డి ప్రాపునుండి "గౌరీవిలాస" మను నాలాశ్వాసముల మహా ప్రబంధమును రచించినవాడు మన వేముల రామభట్టు. కనుక తూము రామచంద్రావనీపాలుని కుమారుడగు పరశురామరెడ్డియును, అతని ప్రాపకమును గాంచిన నీ కవివరేణ్యుడగు వేముల రామభట్టును (రామాభట్టని వ్రాతప్రతి) ౧౯వ శతాబ్దపు మధ్యభాగము—అనగా నిప్పటికి నూరేండ్లకు పూర్వ ముండిన వారని యూహింపవచ్చును.

---

1. ఈ కావ్యమును గ్రంథకర్తకు మునిమనుమడగు శ్రీ తూము రామకృష్ణారెడ్డిగారు శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రిగారిచే పరిష్కరింపించి ప్రకటించినారు, 1949.

2. Journal of Andhra Historical Reasearch Society 1961-62. Pages 90 – 100.

గౌరీవిలాసకావ్యము పూర్వకాలపు దేశవాళి కాగితములపై వ్రాయబడి హైదరాబాదు ఆంధ్ర సారస్వతపరిషత్తువారికడ నున్నది. ఇందులో మొదటి రెండు కాగితములు పోయినవి. వీనిలో ఇష్టదేవతా ప్రార్థనాపద్యములు, పూర్వకవి సంస్మరణము మున్నగు విషయములకు సంబంధించిన పద్యము లుండి యుండును. పోయిన కమ్మలు పోగా మూడవకమ్మ ఇట్లారంభమైనది.

'... ...దగిన మహదేవ చారిత్రం బెయ్యది యని విచారించుచున్న సమయంబున'—

దీనితరువాత కృతికై ప్రోత్సహించిన పరశురామరెడ్డి వర్ణనము, అతని వంశావతారవర్ణనము మొదలైనవి కలవు. ఇందులో కొన్ని పద్యములు.

సీ॥ తననిశితాసి (...) పం బరాతికాంతాబృందములకును హృత్తాపమిరగ
తనదానమహిమ చింతారత్నసంతాన సురధేనువులతోడ సరసమాడ
తనయశోగరిమ సుధాధామహిమకుధృత్ క్షీరవారాసుల నిగ్గులరప
తన రూపలావణ్యత వసంతరతికాంత నలరాజులను జూచి నగవుచుండ
బరగుచున్న పులాద్రి శంబరధరుండు
భూరిమేధావియుడు శివాచారపరుడు
సత్యసంకల్పు డతిధర్మ శాస్త్రములను
కోవిదుండు పరశురామ భూవిభుండు.

ఉ॥ సోమకులిత్రరాత్రముడు సంగర రంగధరాధిరాజగో
త్రామర రాజధర్మ సద్భాయుధహస్తుడు దిక్పతిగణో
ద్దామ సుమల్లికాకుసుమదామ యశఃప్రకటోజ్జ్వలుండు శ్రీ
రామజవజ్ఞైపరశురామధరారమణీశు డొప్పెడిన్.

శా॥ శ్రీ లక్ష్మీనరసింహ మంత్రఫల సంసిద్ధి ప్రకాశుండు స
చ్ఛీలుండాశ్రిత చందనుండు విలసత్ క్షేపాల గోత్రాంబుధి
ప్రాలేయాంశు డు(దు ప్ర)తాపరిపుక్షత్రోద్ధురుండు సత్కీర్తి (.)
(.)లాయుక్తుడు రామచంద్రధరణీపాలాత్మజుం డొక్కెడన్.

సీ॥ ఒకచెంత (సకల) కళాప్రఘటికు లొకదిక్కు నిఖిలశాస్త్రకచయంబు
నొకచెంత సకలంక సుకవీంద్రనికరంబు లొ(కట) సిద్ధాంతజాతక విధిజ్ఞ

లోకవంక మకరాంకసుకుమారధరణీశు లోకచేరువను పురాణకనమూహ
మొకపొంత ప్రకటగాయకజనప్రకరంబు నొకచోట సకలసైనికగణంబు

ప్రకటవ్యద్గుణ చాతురోపాయ విషయ
శక్తులను యుక్తులను మించు సర్వప్రధాన
వర్యులును గొల్వ కొల్వుండి వసుమతీశు
డాదికావ్య ప్రసంగంబులాడుచుండి.

శా॥ శ్రీకౌండిన్యసగోత్రసంభవుని దీక్షితున్ బుధారాధ్యు సు
శ్లోకున్ లక్ష్మినృసింహయార్యునకు సంశుద్ధాత్మ వెంకాంబకున్
తోకొప్పుత్రుని రామయాఖ్యుని ననున్ సొంపొప్ప పిల్పించి యా
భూకాంతరిపు డిట్టులం బలికె సంతోషోద్యద్గభీరంబుగన్.

క॥ వేపాలగోత్రజలధి ని
శాపతి సూతంత్రి రామచంద్ర కవీంద్ర
వ్యాపాలుం డలమేల్మం
గాపరిణయ మనగ విష్ణుకథ రచియించెన్.

క॥ ఆ వైష్ణవ కథవలెనే
శివాంక శైవప్రబంధ నిర్మాణంబున్
గావించి కీర్తి గనుమని
యా వెంటన్ భూధవుడు దయమ్మున బల్కెన్.

క॥ తేనియలు జిలుక నమృతపు
సోనలు గురియంగ బుధులు (...)త్వం
బౌ నౌరా రుచి యని గా
రానంద(...)గద్గద్ధల్పి యాశ్చర్యపరన్.

ఇటు తరువాతగల దీర్ఘవచనమున నేలత్యావ్యగుణములు వర్ణింపబడినవి. ఆపై పరశురామరెడ్డి వంశావతార వర్ణనము కలదు. ఈ వర్ణనమున రామభట్టు వసుచరిత్రాది పూర్వప్రబంధము లందలి పలుపోకల ననుకరించి చక్కని పద్యములు కూర్చినాడు. వీనిలో మొదటిపద్య మిట్లున్నది.

సీ॥ అచలేశ్వరులుగాని యచలేశ్వరులుగారు భూరిదర్పోద్యద్విభూతిగతుల
గోపసింహులుగాని గోపసింహులుగారు చటులబాహాబల శౌర్యగతుల
నరలిదౌజులుగాని నరలిదౌజులుగారు వినరాశిజయదశావిభవగతుల
రాజాంగజులుగాని రాజాంగజులుగారు తగ కళారూపసౌందర్యగతుల

ననుచు జనులెన్నగను మిన్నయగు యశస్సి
దనరి వహింప నవద్యయద్వీవభూప
మాన్యులగుదురుగాక సామాన్యనృపులె
భూమువంశంబునను బుట్టు భూమిపతులు.

రామభద్రుడీవిధముగా భూమువంశమువారి సందరిని వర్ణించినాడు. ఈ వర్ణనము ననుసరించి భూమువారి వంశక్రమ మీ విధముగానున్నది.

- అయ్యపురెడ్డి (భార్య : జానమ్మ)
  - బచ్చయ్య (భార్య : నాంచారమ్మ)
    - రామభూమీశుడు (భార్య: నంబమ్మ)
      - రామమ్మ
      - రామభూపాలుడు
      - రామచంద్రారెడ్డి (అలవేలుమంగాపరిణయకర్త) (భార్య : రంగమ్మ)
        - పరశురామరెడ్డి (గౌరీవిలాసకృతిప్రోత్సాహకుడు)
    - చినరామవిభుడు
    - సింగారెడ్డి
  - వెంకటాద్రీశ్వరుడు

ఈ వంశావతారమునకును అలవేలుమంగాపరిణయమం దీయబడిన వంశావతారమునకును కొలది వ్యత్యాసములున్నవి. అలవేలుమంగా పరిణయమున అయ్యపురెడ్డి కొడుకులందు జ్యేష్ఠుడుగా చెప్పబడిన వెంకటాద్రీశ్వరు

ఉండు కనిష్ఠుడుగాను మరియు చినరామిరెడ్డి నంజమ్మల సంతానముగా చెప్ప బడిన రామచంద్రావనీపాలుఁడుండు (పెద) రామిరెడ్డి సంజమ్మల సంతానముగను చెప్పబడినారు. గౌరీవిలాసకృతి రచనమునకు ప్రోత్సహించిన పరశురామరెడ్డి రామచంద్రావనీపాలుని జౌరసపుత్రుడు కాడనియు దత్తపుత్రుడనియు గౌరీవిలాసము వలన దెలియనగుచున్నది.

కృతికర్త పరశురామరెడ్డిచే ననుజ్ఞాతుడై గృహమునకుబోయి ఆరాత్రి నిదురింపగా స్వప్నమున పరమేశ్వరుడు సాక్షాత్కరించి కావ్యమును తన కంకితముగా రచింపుమని యాదేశించును. ఆ పట్టున పరమశివుని వర్ణన మీ తీరుగా నున్నది.

సీ॥ వలనొప్పనెమ్మేన సలదిన పలుటూడి గనుగొన చలువ చందనముగాగ
కుడిచెన జారంగవిడిచిన వల్ పాపగమి పైడిటీపె జందెములుగాగ
జీమూతవాల్ నాగబెత్తెము దమరుకమూ ముమ్మొనవాలు కైయాయుధములుగాగ
చలిమిరికొండ ముద్దులకూతు రెల్లపు తరమేన వరలని యతుకుగాగ
నొక్క తెలియాలటోతు బల్ ఆక్కినెక్కి
కసులపండువుగా నొర్ద గానలరుచు
తాలిమెయిక్క రౌదొయన రోచ లిలిచి
గట్టువిలుకాడు కలలోన నిట్టులనియె.

శివుని స్తోత్రముచేయు పద్యములును ఒక దండకమును గలవు. ఆటుపై కవి వంశావతారమిట్లుగలదు.

కోసయార్యుడు (కౌండిన్య గోత్రము)
(భార్య : కొండమాంబ)
|
రామయ్య
(భార్య : లక్ష్మమ్మ)
|
- పాపన్న (భార్య : పెదవెంకమ్మ)
- లక్ష్మీనృసింహుడు (భార్య : వెంకమ్మ)
  |
  రామభట్టు
  (కృతికర్త)

కృతికర్త తనతల్లి దాతతండ్రులను గూడ వర్ణించియున్నారు. ఇటుపై షష్ఠ్యంతములు చెప్పి కథాప్రారంభము చేసినాడు.

గౌరీవిలాసము ఆరాశ్వాసముల ప్రౌఢప్రబంధము. మొదటిఐదాశ్వాసము లందు శివపార్వతుల ప్రణయకలహము, శివు డలుకతో కైలాసమును విడిచి వచ్చి తాము రామచంద్రావనీపాలుడు కట్టించిన శివాలయమున నెలకొని యుండుట, పార్వతీవిరహము, ఆమె సఖులతో గూడి శివుని వెదకుచు మానవతీపుర (తమవారి రాజధాని) ప్రాంతారణ్యములకు వచ్చుట, శివుని విరహము, చిలుక రాయబారము, పార్వతీ శివుల పునస్సమాగమము, పరివార దేవతలతో వారు మానవతీపుర దేవాలయమున నెలకొనియుండుట ఆదిగాగల కథలు ప్రవచింపబడినవి. షష్ఠాశ్వాసమున రామచంద్రావనీపాలుడు రాజ్య భారమును పరశురామరెడ్డి కప్పగించి, యోగమార్గమున బ్రహ్మపదమలంక రించుట, పరశురామరెడ్డి పరిపాలనము, చెంచులపోరు, మృగయావిహారము, పరిపాలనావ్యవస్థ, తండ్రికట్టించిన శివకేశవాలయముల పునఃప్రతిష్ఠ మున్నగు విషయములు విపులముగా వర్ణింపబడినవి. మొదటి ఐదాశ్వాసముల కథా భాగమునకుగూడ విష్ణ్వాలయ శివాలయ నిర్మాణ సందర్భములందు శ్రీ రెడ్డి ప్రభువులకు ప్రవేశము కల్పించి ఈ గ్రంథకర్త యొక్క విలక్షణ మార్గము ననుసరించినాడు.

పోయిన కమ్మలందలి పద్యములు పోగా మిగిలిన గ్రంథమున మొత్తము ౬౩౫ గద్యపద్యములున్నవి. ఇతని యాశ్వాసాంత గద్యమిట్లున్నది.

"ఇది శ్రీమన్ మహాలక్ష్మీనృసింహవరప్రసాదవిశ్వరచిత సహజ పాండిత్య వేములవంశపయఃపారావారరాకాసుధాకర కౌండిన్యగోత్ర పవిత్ర లక్ష్మీనృసింహాయార్యపుత్ర సకలకవిమిత్ర రామభట్టాహ్వయ ప్రణీతంబైన శ్రీమద్గౌరీవిలాసంబను మహాకావ్యంబునందు షష్ఠాశ్వాసము".

గౌరీవిలాసమున పూర్వప్రబంధములలోని చక్కని పద్యములకు భావములకు అనుకరణము లధికముగా గనబడును. మిడుమిక్కిలి కవి తన సమకాలీన విషయములెన్నింటినో ఈ వర్ణనములందు చొప్పించియున్నారు. ఇతని కవిత్వాదికములు దెలియుటకై అటనట గల కొన్ని పద్యము లుట్టంకింతును.

మానవతీపుర హర్మ్యగోపురములందున్న హంసల వర్ణనము.

గీ॥ ఒంటిపాదమూని యొక్క చిత్తము నిల్పి
యూపి రదిమిపట్టి చూపు దాచి
గోపురములమీద కొన్నిరాయంచలు
తపముసేయు మునుల దాల్మిబూని (I-78)

తెలంగాణమున 'చకిలం మొకిలం' అనుమాట ప్రచారమందున్నది. ఇది (బోటటాదులకు) కూర్చుండు విధమునకు పేరు.
పీట వాయించు స్త్రీని వర్ణించుచు కవి యీ పదమును ప్రయోగించినాడు.

చ॥ కసులర మోడ్పు చేసియు చకల్ మొకులంబున గూరుచుండి తా
కనకవిపంచి బెండొడ దగన్ నిడి నాదము గాంచి తన్మనీ
య నఖములోటి మీటి సవహాసము మోమున జిల్కురాజా కాం
తిని గని పాటలాడె నొకతెన్ ప్రవిహాకియనంగ మేడలోన్. (I-80)

పురస్త్రీలను వర్ణించు సందర్భమున దశావతారములు వారియందారోపించిన విధము.

ఆ॥ ఝషకన్నేత్ర కమఠచరణాబ్జ గోలహ
రిద్ధిమధ్యబాల రామ రాజ
వదన కృష్ణవేణి వరబుద్ధి కల్కినా
తరుణు లలరిరి పది యవతారగతుల. (II-30)

శ్రీనాథుని శృంగార నైషధమునందలి "శేషచ్ఛచ్ఛాయ చెలువారు బిసమూల" (I-88) అను పద్యమును దలపించునట్టి దీ తటాకవర్ణన పద్యము.

సీ॥ అహిరాజపుచ్ఛ ప్రభాసలక్ష్మిసహా యంతరస్థాగ్రము వరంతములుగ
సంపుల్లసితపద్మ సత్రపతత్ యామినీహ స్తిరాగ్రమున రేఖాంకురములుగ(?)
ప్రతిఫలితోపాంతవితతతటాఖాతముల్ ధనిష్ఠ స్తనదుర్గధరములుగ
తమలిని మకరందకాంక్షాచలద్భృంగ జాలముల్ గరళాభిలలనుగ

లలితశైవాలజాలికా లతిక లరయ
ధీమలదలానలోద్భవధూమములుగ
క్షీరకలశధి బోలె గంభీరమైన
యత్తటాకంబు గాంచె దైవోత్తముండు. (II-94)

సఖులతో బయలుదేరి పార్వతి వనస్థలందు శివుని వెదకు సందర్భమున
చెలికత్తెల మాటలు.

సీ॥ ఘనసారమా శరద్ఘనసారవర్ణుని ఘనసారగంధిలోఁ గల్గు మనవె
మదనభూదారమా మదనాపకారు నీ మదనాగగతి వెతల్ మాన్పు మనవె
కాంచనదుగ్ధమా కాంచనాచలధన్వు కాంచనసాన రక్షించుమనవె
కాదంబమా భూతకాదంబపతి నీలి కాదంబికాదేవి గల్గుమనవె

కల్పభూజమ భక్తసంకల్ప దువిద
గల్పగదె మోహవారధి గల్పకయును
వేలికభూజమా సద్దయాలవాలు
నీ లతాంగిని దయతోడ నేలుమనవె. (III-28)

చంద్రోపాలంభనము సేయునప్పటి పద్యము.

చం॥ అరుదుగ కుంభభూతుడు మహార్ణవ పత్రమూర్తి నీరమున్
గరమునఁగూర్చి పుచ్చుకఁ రయమ్మున గ్రక్కున దేల్ప పొట్టలో (క్రేన్స?)
నరుగక ముద్దలో లె గళమందు వసించి కృశించి యూర్పునన్
మరలెగరమ్ము పేనినరి మంగళసూత్రములమ్ము నేమనన్. (IV-32)

మదనుడు పార్వతీపతికి సన్నద్ధుడై బయలుదేరి వెడలునప్పటి వర్ణనము సమ
కాలీవ యోధుల వర్ణనము కాలోలు.

సీ॥ విరజాజిమొగ్గ జల్తర రుమాల్ వడిజుట్టి గేదంగిరేకు సిమా దొరంగి
మంకెనపువ్వు తుమాన్ కెస్తుగా దూర్చి కదిమి కురువేర్ప దుకట్టుగట్టి
మేలైనచిగురాకు సాలువ పైగప్పి పాటలీదామంబు దాటజుట్టి

వచ్చికస్తురి బొట్టిడి వచ్చవింటి
పూలకోలలు సంధించి భుజమునుంచి
రేకు బూదాల్ మొగిల్ రేకు బాకుకత్తి
హత్తి మదనుండు కదన ప్రయాణమయ్యె. (IV-64)

మలయానిలుడు మన్మథుని కాయత్తపరచిన రథ మీ తీరుగా వర్ణింపబడినది.

సీ॥ కలువరేకులు బండికండ్లుగా సవరించి మెరుగైన బిసకాండ మిరుసొనర్చి
మొగిలిరేకులు రెండునొగలుగా నొనగూర్చి మల్లెమొగ్గయు కాడి ప్రమాడువేసి

మొల్లమొగ్గలుదరుల్ మెల్లగా నమకూర్చి తేటిగంటలు వేర్కతోడి గట్టి
నిండు నంపెగ పూలదండ తెండాత్త్యేరి గొజ్జంగివిరి గొల్కు కుతిర కిర్చి

హీను మొనలి నిరంబులు మీదికెత్తి
తమ్మిపూదేనె కన్నుల కందెనలిడి
శీతగంధవహుండను సూతుడొకడు
మదన రథమటని తేరు ఎదుటనిడియె. (IV-57)

మన్మథుని చైత్రయాత్రావర్ణన మిట్లున్నది.

సీ॥ వచ్చుపిట్ట పఠాన్‌సిపాయీల్ నవారి ఛేష్టాలాపు వహవా పసందనంగ
మొకముతెర్చుకొని శారికవంద మూగఁదుల్ బహువరాగ్ర్యోర ధరాళియనంగ
రథసంపునెమ్మి వీరభటాళి ఝుళిపించు టక్కుకత్తులను తళుక్కువంగ
శీతువుపిట్ట బంగ్రొరు తుపాకి చప్పుళ్ళు ఢెమిల్లు ఢెమిల్లు మనగ

అంచ తిరువంక చోపుదారై గదంగి
గరుగరుడు ఖబర్దార్ పరాబరి యనంగ
మారుతప్యేశ సనికై నవారివెరల
తనబలంబులతో శృంగారవనము జేరె. (IV-64)

వసుచరిత్రము పద్యముల కిందెన్నియో అనుకరణములున్నవి. అట్టివానిలో నొకటి. ఇది "మోహావదేశక మోముద్రితములైన" అను వసుచరిత్ర పద్యము (III-180) దలపించును.

సీ॥ ధవుమీది వ్యామోహ తమసంబు పైగప్పు మరితకందమ్ములు మోత్వేసేమొ
మదనానలంబులో బొరవ గామిని తనూకంధార మీచక్కగా గగేవేమొ
తచ్ఛమాంధకాళి తారకల్గని లేమ కుచచక్రవాకముల్ గుందెనేమొ
విభుని పైగలకూర్చి వృంతంబుదురమాగి యనురాగ మహాంత మూగెనేమొ

గాన హిమజలముల గనుల్ గదుగరాదు
వనితపై పల్లవపుటంబు లిడగరాదు (?)
చెలికనుల చంద్రఖండముల్ నిలువరాదు
ఈ చెలువపోక సివనల్ వినరారాదు (?) (IV-84)

షష్ఠాశ్వాసమున భూమువారి పరిపాలనాదులు సత్కార్యములు వర్ణింపఁబడినవి. పరశురామరెడ్డి నుద్దేశించి అతని పూర్వులిచ్చిన యగ్రహారాదుల ప్రసక్తి గావించు పద్యమిది.

చ॥ తమ పెదతండ్రి రామవసుధాపతి భక్తిని నల్పినట్టి శ్రీ
రమణుని యుర్వివాదులకు దాసిరులీనెడు శాసనాగ్రహా
రము నమకూర్చె దా నితరరాజులు మెచ్చగ ఛత్రచామరో
త్తమతురగంబు లందలము దా గొనె భీకుశలార్థ చిహ్నముల్. (VI-31)

రామరాజభూషణుడు ఆశ్వాసాద్యయమున కళేబరాధ్యవసాయముచేసి శివపార్వతుల వర్ణించిన పద్యమును (I-6) మనమునందుంచుకొని గౌరీవిలాసకర్త పరశురామరెడ్డికి స్వప్నమున దాక్షాయణీ సాక్షాత్కారమైన విధమును వర్ణించి యున్నాడు.

సీ॥ పరనీలకంధరస్ఫురదాభ లిరువక్క నిరువక్క కమలభాసుర కరంబు
ఘనపుండరీక శోభనచేల మిరువంక నిరువంక ననలబంధురదృశంబు
నవసుధాధరబింబనవిభవం బిరుతేవ నిరుతేవ నితపయోధర విభాతి
తారకాస్థిరనక్షత్రదామంబు లిరుదెస నిరుదెస నాహీనకాభరణకాంతి (?)

పలుకుభేదంబుగా బల్కు పలవరయును
పలచియిచ్చిన సతమేన గలసి శౌరి
తెలుపుదును దాను గలియుట తెలుపవచ్చి
కలను భూపాలకునిముందు నిలువబడియె. (VI-III)

పరశురామరెడ్డి స్వప్న వృత్తాంతమును వర్ణించుపట్ల నాతని మంత్రి యగు వల్లె పురుషోత్తమరాయడు కూడ వర్ణింపబడినాడు. పరశురామరెడ్డి తన స్వప్నమును వినిపించుటకై రంగాచార్యులను బిలిపించెను. ఆ యాచార్యుల వర్ణనమిది.

క॥ ఆశ్యమతేజుల నమురా
చార్యులనక్షచరణాక్షనంగీకృత శ్రీ
ధుర్యుల సుకృలరంగా
చార్యములాయాశీ బిల్వ దయ్యన బంచెన్. (VI-186)

ఇటులే సమకాలీన విషయములెన్నియో గౌరీవిలాస ప్రబంధమున గలవు. కొన్ని పద్యములందు ఫారసీ ఉర్దూ భాషాపదములు కూడ ప్రయోగింపబడినవి. విస్తరభీతిచే వానిని విడుచుచున్నాను. షష్ఠాశ్వాసాంతమునగల శివస్తోత్రముతో నీ పరిచయవ్యాసమును పరిసమాప్తము చేయుదును.

అమితాహికులేశ్వరహారధరా
హిమభానుజితాభసరేఖకరా
కమలాంబకచేతనగర్వహరా
విపులాద్రిధనుర్ధృతవిష్ణుశరా (VI–171)

(సాహితీ వాల్లభ్యము 1968)

కుందావఝ్ఝల గోపాలసూరి

సంపరణ చరిత్రము

గోలకొండ కవుల సంచికలో (1934), పూర్వకవి పరిచయములందు (పుట 398) కుందావఝ్ఝల గోపాలకృష్ణకవిని గూర్చి కొంత పరిచయమున్నది. ఈ కవి ములకనూరు (కరీంనగరం జిల్లా) వాస్తవ్యుడనియు, నూటయిరువదియేండ్లకు పూర్వముండినవా డనియు, బ్రహ్మవైవర్తమునందలి శ్రీకృష్ణజన్మఖండము (అముద్రితము) రచించెననియు, దాని ప్రతులు ఒకటి లక్ష్మణరాయ పరిశోధక మండలిలోను, మరొకటి మడికొండ గ్రామమందలి మోతుకూరు రామారావుగారి కడను ఉన్నట్లు అందలి సమాచారము. ఆ కవిని గూర్చి ఇంత కంటె మిక్కిలి లిఖితాధారములు మరెచ్చటను కానరావు.

ములకనూరు కరీంనగరం మండలములోనిదే యైనను హనుమకొండకు చేరువ. మడికొండ హనుమకొండకు మూడు మైళ్లు. అచట మోతుకూరివారింట నున్న శ్రీకృష్ణజన్మఖండమును నేను రెండు దశాబ్దముల క్రింద చూచితిని. మోతుకూరు కోదండరామారావుగారి జ్యేష్ఠపుత్రులు శ్రీ వేంకటేశ్వరరావుగారు (80 ఏండ్లు) తమ ప్రపితామహులు పండరినాథరావుగారు రచించిన పండరినాథ రామాయణముతోపాటు కుందావఝ్ఝల గోపాలసూరి రచించిన శ్రీకృష్ణజన్మఖండమును నాకు చూపించిరి. గోపాలసూరి పండరినాథరావుగారి సమకాలికు లగుట (19 శతాబ్ది ప్రారంభము) వారిరువురికి పరిచయముండి యుండును. అందువలననే శ్రీకృష్ణజన్మఖండము ప్రతి యొకటి మోతుకూరి వారి యింట చేరి యుండును. ఈ రెండును ప్రశస్తమైన కృతులగుటచేత వానిని పరిష్కరించి Ph.D. సిద్ధాంతవ్యాసములు వ్రాయుటకై మోతుకూరు హనుమంతరావు గోపాలకృష్ణరావులను ప్రోత్సహించితిని. హనుమంతరావు పండరినాథ రామాయణమును పరిష్కరించి (1975) ఇటీవల కీర్తిశేషుడైనాడు.

సిద్ధాంత వ్యాసము పూర్తికాకుండగనే అతడు కన్నుమూసెను. శ్రీకృష్ణజన్మ ఖండమును గూర్చిన పరిశోధనము ఏమయ్యెనో తెలియరాదు.

వారము దినములక్రింద నాకడ నున్న అముద్రితగ్రంథముల దుమ్ము దులుపుచుండగా కుందావజ్ఝల గోపాలసూరి రచించిన మరొక కృతిరత్నము నా కంట బడినది. దానిపేరు "సంవరణ చరిత్రము." తపతీ సంవరణులగాథను వర్ణించు కావ్యమది. అద్దంకి గంగాధర కవి తపతీసంవరణోపాఖ్యానము ప్రబంధయుగపు ప్రసిద్ధకృతి. గోపాలసూరి తపతీసంవరణుల గాథను సంపూర్ణముగా రచించెనో లేదో తెలియదు. నా వద్ద నున్నది ప్రథమాశ్వాసము మాత్రమే. ప్రథమాశ్వాసములో 283 గద్యపద్యము లున్నవి. ఆశ్వాసాంతగద్య మీ తీరుగా నున్నది.

"ఇది శ్రీమద్వేంకటేశ్వర వరప్రసాదలబ్ధోభయభాషాకవితాధార కౌండిన్యగోత్రాలంకార శ్రీ కుందావజ్ఝలాన్వయపారావారకైరవమిత్ర వాగీశాస్త్రి పౌత్ర వెంకటశాస్త్రిపుత్ర సకలవిద్వజ్జనకృపాసనాథ గోపాలసూరి ప్రణీతంబైన సంవరణచరిత్రంబను మహాప్రబంధంబునందు ప్రథమాశ్వాసము".

పైగద్యమున మహాప్రబంధమని యుండుటనుబట్టియు, లభించుచున్న ప్రథమాశ్వాసమున కథ కొంతవరకే సాగుటనుబట్టియు, గోపాలసూరి దీనినొక పెద్ద కావ్యముగా రచింపదలచెనని స్పష్టము. సమగ్రకృతి ముందుముందు ప్రాంతములందెచటనైన లభించునో లేదో! నా వద్దనున్న అసమగ్రగ్రంథము పాతకాలపు దళసరి కోరుట్ల కాగితములపై (16), రెండువైపుల మసిపెంకుతో వ్రాయబడినది. పుటకొక్కంటికి నగటున ఇరువది పంక్తులున్నవి.

ఈ ప్రథమాశ్వాసములో ఇష్టదేవతాప్రార్థనము, పూర్వకవిస్తుతి, సుకవిప్రార్థనము, కుకవినిరాకరణము, శ్రీవెంకటేశ్వరున కంకితముగా షష్ఠ్యంతములు, నైమిశారణ్యమున శౌనకాదిమునులకు సూతుడు సంవరణ చరిత్రము వినిపింప దొరకొనుట, హస్తినాపురము అచటి రాజువర్ణ్యము, చతురంగ బలము, పుష్పలావికాదుల వర్ణనము, హస్తినాపురాధీశ్వరుడైన సంవరణుని కీర్తిప్రాభవములు, సూర్యపుత్రియైన తపతిసౌందర్యముల వర్ణనము. సంవరణ చరిత్రమును స్వర్గమాగిరప్రబంధములందు విన్న తపతి అతనియందు మోహా గొనుట, తపతిమోహమును నారదుడు సంవరణునకు తెలుపుట, అది విన్న

సంవరణుని యనురాగము, సంవరణుడు మృగయావినోదమునకై అడవులు చేరుట, ఆఖేటము, మధ్యాహ్నతపాయాసాపనోదనమునకై సంవరణుడొక సరోవరము చేరుట, అదే సమయమున తపతి తన తల్లి ఛాయాదేవి సాన్నిధ్యమును త్యజించుట, అంతట నామె సఖురాలు కీరవాణి వచ్చి తాను భూలోకమున చూచిన వింతలు విశేషములు ఛాయాదేవికి వినిపించుట, ఆ విశేషములందు సంవరణుని మృగయావినోదము ఏకాంతవాసముల ప్రసక్తి వచ్చుట, అది విన్న తపతి విరహములో నిజమందిరమున కేగుట, ఆమె మోహావస్థలు, కీరవాణి తపతి చెంత కేగి ఆమె దీనావస్థకు కారణమడుగుట, తపతి తన యాశయమును తెలుపుట, కీరవాణి మంతలింపు, తపతి నిశ్చయము, కీరవాణి తపతితో సంవరణుని దెచ్చి నీకప్పగింతునని యూరడించుట. తపతి కృతజ్ఞతాప్రకటనము లాదిగా గల వృత్తాంతమున్నది. కనుక దక్కిన కథాభాగము తరువాతి యాశ్వాసములం దుండియుండునని భావించవచ్చును.

గోపాలసూరి కవిత్వవైదుష్యాదులు తెలియుటకై మచ్చునకుగా కొన్ని పద్యము లుదాహరింతును.

గ్రంథ ప్రారంభమున శ్రీమహావిష్ణువును స్తుతించు పద్యమిట్లున్నది.

శా॥ శ్రీ రంగిల్ల మనోజ్ఞశోభమున లక్ష్మీభూవధూటుల్ ప్రియో
దారస్యానురతానురాగ గరిమల్ తర్కింపగా గూఢసం
చారుండై చని భామివేపి సమునాత్తాంతంబులన్ జూచి శ్రీ
నాథిన్ చుంబనకేళి దేల్చు విభునిన్ భావింతు భావంబునన్. 1

శివపార్వతులను స్తుతించు పద్యములు :

సీ॥ ఎఱ్ఱకోఁ దెలమిన్న మెఱ్ఱగా విన మెన్న జడమూఁడపై పాలకడలి చెన్న
యురలు నిండ విభూతి యొదమఱిక్కున నాటి కరకంట నమృతంబు వెదలు రీతి
మెడను పాములతోడు మేటి గుబ్బల పిడు మొనసి కరంబున ముద్దు లేదు
ఎదను పసపుల చెన్ను సుదుటచిప్పల కన్ను సరిలేని కేశపుంజములు మిన్న
సకలదేశస్థు సకలయోగీంద్రహృదయ
[illegible]మధుపాయమానుండు శంకరుండు
భూరికారుణ్యరసపూరిపూర్ణదృష్టి
పెంచి మఱ్ఱాకువ్వ మరని పోషించుగాత. 2

చం॥ తొరలవయి స్నిగ్ధారయి తొరపువేర్కఁ మనంబు నిండ చ
స్ఫురుచు కుమారునాస్యమున కోమలనీలసజేమదంబులన్
కొదగని కప్పుకాటుకను బుద్ధి కరంబున మాటిమాటికిన్
దుదుము గిరీంద్రకన్య దయతోడుత పుత్త్రుని పెంపు జేయుతన్. 8

ఇతరకవుల సానుభూతి నపేక్షించుచు కవి యిట్లనుచున్నాడు :

ఆ॥ కడుపునిండ కాసు గన్నవానికి నోరు
కాసుమీద కరుణ గలిగినట్లు
తాను కావ్యకర్త యైనవా డితరుల
కావ్యమరసి ప్రోచు గాదె జగతి. 12

హస్తినాపురమందలి బ్రాహ్మణుల యిండ్ల వర్ణన మీ క్రింది పద్యము :

మ॥ ఉదయాస్తంనమయూర్భితాజ్యపుంఖభాగోల్లాన లీలాగర
త్రిదశ శ్రేణికిరీటకోటిసుమనోదివ్యస్మధుప్రీత ష
ట్పదహుంకారబహూకృతానవరతస్వాహానినాదంబులై
పొదలున్ తత్పుటభేదనాంతరవనద్బ్రాదేవతాగారముల్. 87

హస్తినాపురయువతు లరటి పువ్వులావికలతో నాడు నరసోక్తులు :

సీ॥ మొదలొక కుసుమంబు గదియగాగీలించి కుసుమంబుపైకొన్ని కుట్మలములు
కుట్మలంబులమీద గోమరొప్పగా పూవు పూవుపై కైరవపుష్పయుగము
కైరవయుగముపై కమనీయతరముగా సువరిలీనమీంద యార్ధమైన
అర్ధార్ధ మర్పించి యలరించి లీమాల్య మీనేర్పు బ్రహ్మకు నెరుగబోలు

దీని యర్థంబు జెప్పిన పూని నీదు
వాంఛితము దీర్తు నని పిన్నవయనువారు
పుష్పలావికలన మించు పువ్వుబోండ్ల
యానరము జూచి నరసోక్తులాడువారు. 81

క॥ ఇది బంధుజీవ కుసుమం
బిదుగో బలురమ్మ మొగ్గ లివి గొమ్మను న
మ్మదమగు రసికుల కను చె
న్నరగున్ సుమలావికాజనం బవ్వేటన్. 82

సంవరణునిపై ననురాగము గొన్న పాతాళలోకవాసి భోగినీమణుల పరిస్థితిని వర్ణించు పద్యము.

ఉ॥ భోగిజగంబులన్ వెలయు బోటులు సంవరణక్షితీశుపై
రాగము జెంద మన్మథశరంబులు మర్మము లుచ్చిపోవ పా
రాగమనంబు దప్పె చెవు లారయ నందియమయ్యె ఘోరతా
యోగములై వియోగమున నూర్పులు మోముల నుల్లసిల్లెడిన్. 63

తపతిపై మనసు గొన్న సంవరణుని వర్ణించుపద్యము :

సీ॥ ప్రణుతింప లోకేశ్వరత్వ మాత్రమె కాదు కమలాననత్వంబు గలిగియుండు
శ్రీ మోహనత్వ సంసిద్ధిమాత్రమె కాదు ఘనసంభవరశత్వ మెనయుచుండు
సరవి రాజావతంసత్వమాత్రమె కాదు ధవళదేహత్వంబు దనరుచుండు
కనుగొన జైవాతృకత్వమాత్రమె కాదు రామాతనుప్రీతి ప్రబలియుండు
సహహ రాజన్యవరుడు దున్సహవియోగ
ధారవతీభూరుడై బ్రహ్మ శౌరి శర్వ
కైరవాప్తుల కెనయయ్యె చారుశీల
ధూర్జటికి కంఠనైల్యంబు లొరవుగాదె. 101

మృగయావినోదమునకు వచ్చిన సంవరణునికి స్వాగతమిచ్చిన వనవర్ణనము.

చ॥ వికసితపుష్పవ త్త్రియయి విహ్వలభావగతానేత్రయై
యొకలతికాహిమాంశుముఖి యొక్క ధరారుహయౌవనాఢ్యు న
ల్లుకొని నృపాలమౌళి కటమ్ముందటగా గల వద్మ మిత్రపు
త్రిక పరిరంభకేళులను దెల్పె ప్రమోదవిధానదక్షయై. 119

సంవరణుడు బడలిక తీర్చుకొన్న సరోవర పరిసరవర్ణనము :

సీ॥ హేలావరటక్కారవాలాగరుద్వారతః ఖేలావతత్స్వానకీలితంబు
రారాజసుమవాతపూరానుగమితంద నారీతితారావ చారుతరము
వేలాతటీసంత వైళాలలోత్తాల తాలానువరకోకిలాలియుతము
కేళీగృహీభూతనాళీకసంభూత ఫాణీనమంచన్మరాళయుగము

కుంరావఝ్ఝల గోపాలసూరి 148

నిఖిలయువజనజనకలానిరతనరసి
జూతుగాదీర్ణసింహనారానుకారి
టక్కి నినదంబు తత్పరంపరినరంబు
ఆగధరీకుండు నూరి యుత్సవము నొందె. 152

ఈ నా దిట్ట కృతులను తద్రచయితలను ప్రోత్సహించుట యరుదైనను అకృతల పేర్లు, కవుల పేర్లు సాహిత్య చరిత్రలకైనను ఎక్కుట అవసరమని భావింతును.

(వివేచన, డిసెంబరు 1978)

శివరామలింగరాజు

వీరశైవాచార సంగ్రహము

నావద్ద ఉన్న అముద్రిత గ్రంథాలలో వీరశైవాచారసంగ్రహమనే పద్యకృతి ఒకటి. ఇది మూడాశ్వాసాల గ్రంథము. దీని రచన శాలివాహనశకం ౧౬౯౫ అనగా క్రీస్తుశకం 1773లో జరిగినది. కృతిభర్త పరమశివుడు. కృతికర్త శివరామరాజు లేదా శివరామలింగరాజు, క్షత్రియుడు, భారద్వాజస గోత్రం. తండ్రి పేరు హరిరాజు, తల్లి పేరు సీతమ్మ, గురువు గోకర్ణమఠాధీశ్వరుడైన సోమశేఖరుడు.

కాకతిసీమలో గాని చాళుక్యసీమలో గాని ఈనాడు క్షత్రియుల్లో వీరశైవులు లేరు. కాని రాయలసీమలో ఉన్నారు. చాళుక్యసీమలో నాలుగైదు గోత్రాల క్షత్రియులే ఉన్నారు. భారద్వాజులు లేరు. తెలంగాణంలోను రాయలసీమలోను భారద్వాజు లున్నారు. బహుశః ఈ రచయిత రాయలసీమ వారై యుంటారని ఊహిస్తున్నాను. రచయిత తన జన్మస్థలం గురించి ఏమీ చెప్పలేదు. ఇంటి పేరుకూడ చెప్పలేదు. కాని తన ఐదుతరాల పూర్వులనుగురించి మాత్రం చెప్పుతున్నాడు. ప్రథమాశ్వాసం 7-8 పద్యాల్లో వర్ణించబడిన ఈతని వంశక్రమం ఈవిధంగా ఉన్నది.

శంఖాన్వయుడు (లప్పరదేశాధిపుడు)
|
లింగరాజు
|
దోరరాశింగు (భార్య మేనకి)
|
రామచంద్రరాజు (భార్య ఉమ)
|
గోపీనాథరాజు (భార్య లక్ష్మి)
|
హరిరాజు (భార్య సీత)
|
శివరామరాజు (కృతికర్త)

ఈ వీరశైవాచారసంగ్రహం స్కాందపురాణంలోని శంకరసంహితకు తెలుగు అనువాదం. ఇది మతందృష్ట్యా ప్రాధాన్యం ఉన్న గ్రంథం చెప్పుకోదగిన సాహిత్యం ఇందులో లేదు. అతే రచయిత గొప్ప ధారాశుద్ధి గలవాడు; ఎంతగహనమైన తాత్త్వికవిషయాన్నైనా సరళంగా సులభంగా చెప్పగలవాడు. భాషాదృష్టితో పరిశీలిస్తే ఇందులో 16వ శతాబ్దంనాటికి కావ్యభాష ఎటువంటి పరిణామం పొందిందో తెలుస్తుంది. వీరశైవకవులు ప్రయోగించే కొన్నిపదాలు సమాసాలు ఇందులో ఉన్నవి.

ఉదాహరణకు కలుహారపుష్పము(కల్హారపుష్పం) అరహము(అర్హము), సుదరిసెన (సుదర్శన), పితురుతోషణము(పితృతోషణము), పితురులోకంబు (పితృలోకము), శ్రీరుద్రియము (శ్రీరుద్రీయము) వంటి మాటలూ, పుష్పాంజలొసర్చి, చిరజీవై, నేసేసొరు వంటి సంధులూ, చౌరాసిలక్షజంతురాసుల వంటి సమాసాలూ ఉన్నవి.

ప్రథమాశ్వాసారంభంలో సూతుడు నైమిశారణ్యంలో ఋషులకు ఈవీరశైవాచారసంగ్రహం వినిపించినట్లున్నది. ఇది పరమశివుడు తొలుత కుమారస్వామికి బోధించిన విషయమని సూతుడు వినిపిస్తాడు. ఒకనాడు కైలాసంలో శివపార్వతులను శ్రీమహావిష్ణువు,బ్రహ్మ,సమస్తదేవతలు కొలుస్తుండగా కుమారస్వామి వచ్చి పరమశివుని స్తోత్రంచేసి తన సంశయాలు తీర్చవలసిందని కోరితే పరమశివుడు భక్తివిధములు, లింగార్చన క్రమం, లింగధారణస్థానములు, పంచముద్రల నిర్ణయం, భస్మపుండ్రధారణ, రుద్రాక్షధారణం, మాహేశ్వరుల దివసచర్య, అర్చావిధానం, గంధాక్షతపుష్పపత్రభేదాలు, శివపూజ, మహేశ్వరులు చేయవలసిన పనులు చేయగూడని పనులు, శివపంచాక్షరి, త్రికాలపూజ అతిథిపూజ, భోజనవిధులు మొదలైనవి వివరిస్తారు.

ద్వితీయాశ్వాసంలో షట్స్థలనిర్ణయము, స్వధర్మముల క్రమము, షడ్విధభక్తిమార్గములు, త్రివిధోపాసనలు, నిర్వాణవైభవము, షడ్విధ లింగములు, స్నానము, మాహేశ్వరార్చనము, షడ్విధజ్ఞానలక్షణాచారము, మాహేశ్వరుల వర్తనము, తత్త్వవివేచనము, భక్తుల వర్తనము, ఈశ్వరపదనిర్ణయము ఆశ్రమధర్మములు మొదలైనవి ఉన్నవి.

తృతీయాశ్వాసంలో శివయోగులకు చేసే దానముల విశేషఫలము, గోప్యార్పణములు, శ్వేతుడు పింగళుడు అనే తండ్రికొడుకుల కథ, శ్రీశైల

మాహాత్మ్యము, ఆనందయోగి ఉపదేశం, కర్మవిమోచనము, అతిథిపూజ, మాహేశ్వరపూజ, గురుపూజ, శివపూజ, అన్యదైవతముల నిరాసము, స్వధర్మ నిష్ఠ, సూతకములు, తత్త్వమసి వాక్యార్థము, ఫలశ్రుతి చెప్పబడినవి.

గ్రంథ ప్రారంభపద్యం ఈవిధంగా ఉన్నది.

క॥ శ్రీపార్వతీపతిమాధవ
తాపసహృదయాబ్జభృంగ ధనదార్చిత వి
ద్యాపాయనిలయ నిర్మల
శ్రీపతిచింతాంతరంగ శ్రీగురులింగా।

ఈ గ్రంథప్రాముఖ్యాన్ని కవి ఈవిధంగా చెప్పినాడు.

సీ॥ వరవీరశైవసుస్థిరసుధాసారంబు వీరమాహేశ్వరాచారవృత్తి
స్వస్వరూపాలోకనదమలముకురంబు అజ్ఞానమేఘజంఝానిలంబు
విమలలింగాంగసంవిద్భృహన్మార్గంబు పాశదగ్ధోజ్జ్వలపావకంబు
అతులలక్ష్యార్థవాచ్యార్థనిర్ణయలక్ష్యమనగ వేదాంతసారార్థమైన

గీ॥ పరమశివతత్త్వశాస్త్ర మేర్పడి వెలుంగ
నరయగా స్కాందమను పురాణాంతరమున
ఘనులు శంకరసంహితాఖ్యానమనగ
నది తెలుంగున రచియింతు నతినవముగ.

వీరశైవులకు కులాల విచక్ష ఉండదు కనుక కవి తన వంశావతారం వర్ణించేముందు,

"క॥ వర్ణాశ్రమాన్వయంబుల
నిర్ణయములు కృతులయందు నిలుపుదురని నే
వర్ణింపదలచు నెడ నే
వర్ణంబని తోచదయ్యె వచనార్థములన్.

క॥ అంగత్రివిధవిలక్షణ
లింగాంగికి నొక్కకులము లేదని మదిలో
నంగాళిమాని కేర్పడ
పొంగుచు నెరిగింతు తమవు పుట్టిన కులమున్" అని చెప్పుకున్నాడు. వంశక్రమముగురించి తాతతండ్రులగురించి చెప్పిన తరువాత తన పేరు ఈవిధంగా చెప్పినాడు.

క॥ శివరామరాజు పేరన్
భువి బిల్వడు నన్ను సురగభాషణ నేడీ
శివశాస్త్ర మాంధ్రభాషను
వివరించెద వీరశైవవిధు లేర్పడగన్.

గ్రంథం ముగించే ముందు దీని ప్రాశస్త్యాన్ని మరల ఇట్లా చెప్పినారు.

సీ॥ ఫలకామ్యకర్మ సంపాద్య సంహిత గాదు విషయభోగముల దుర్వ్యాప్తి గాదు
వరకామినీ మానసరంగశాస్త్రము గాదు గానశాస్త్రంబుల కలిమి గాదు
గోత్రబాంధవమిత్రగురుమాంత్ర మిది గాదు కపటకర్మారంభకథయు గాదు
గారాపరంపరల్ సాధించుటయు గాదు విమలసమ్యగ్జ్ఞానవృద్ధికరము

గీ॥ బంధనిర్ముక్త మభిమానపాశదగ్ధ
మతులలింగైక్యనిష్ఠ లక్ష్యార్థసూక్తి
పరమకైవల్యమిది పరబ్రహ్మమయము
భీమనోక్తము లిదియు సాధింపవలయు.

దీని తరువాత గ్రంథరచనాకాలం చెప్పినారు.

సీ॥ చనినట్టి శాలివాహన శకాబ్దంబులు పాటింప వేయు నాఱున్నూటిపైన
నిరవందగా నేబదేను ప్రమాదీచ విమలవత్సరము నాశ్వయుజమందు
బహుళశుద్ధతిథియలో భానువాసరమున రచియించినట్టి నిర్ణయచరిత్ర
వీరశైవుల సదాచారసంగ్రహ మిది పరిపూర్ణమయ్యె ప్రబంధరీతి

గీ॥ సలలితాచారసమ్యలు సాధుజనులు
సంతరింద్రియలాహేంద్రియాదు లెల్ల
నాత్మలింగానుభావసాధ్యానుభవులు
శివసమర్చకులై యధ్యసింపరయ్య.

ఇందులోని తేది క్రీ. శ. 14-10-1733కు సరిపోతుంది.

కృతిసమర్పణం ఈవిధంగా జరిగింది.

గీ॥ కరణములు మూడింటిచే నా గని పిలిస్త
భావమున నిష్టలింగంబు ప్రాణలింగ

భావలింగంబులైయున్న బ్రహ్మమునకు
భక్తితోడుత కృతి సమర్పణము చేతు.

తృతీయాశ్వాసాంతగద్యం ఈవిధంగా ఉన్నది.

"ఇది శ్రీమదఖండ సచ్చిదానంద నిత్యపూర్ణ ఏకలింగైక్య నిష్ఠాపర వీరమాహేశ్వరసందోహ చరణకమలషండమకరందపానమత్తద్విరేఫమాన శ్రీమద్గోకర్ణమఠాధీశ్వర పంచవర్ణిగ యతిరాయపట్టభద్ర శ్రీసోమశేఖర దివ్యపాదారవిందబంధురుండైన శ్రీనందికేశ్వరకరదీక్షాగర్భోద్భవుండైన శ్రీశివరామలింగ ప్రణీతంబైన స్కాందపురాణాంతర శంకరసంహితాఖ్యానంబను వీరశైవాచారసంగ్రహంబునందు సర్వంబును తృతీయాశ్వాసము" —

ఈ తాళపత్రగ్రంథం ప్రతి వ్రాసినవారి వివరాలు చిట్టచివరన ఈ విధంగా ఉన్నవి.

"పరీధావి సంవత్సర ఆశ్వీజబహుళ దశమి శనివారం మూడు ఝాములవరకు వీరశైవాచారసంగ్రహం ప్రతిలో వున్నప్రకారం సున్నపు సోమయ్యకు పాటోజు బైరాగి వ్రాశి యిచ్చెను."

ఈ తేది క్రీ.శ. 6-11-1852కు సరిపోతుంది. వ్రాయసకాని వాక్యాలు గతశతాబ్దం తెలుగు వ్యావహారికభాషకూ లేఖనసంప్రదాయానికీ ఉదాహరణలు.

(వివేచన, డిసెంబరు 1979)

[illegible]

ఓరుగ

Aరా
రామవిహార
ఓర్గంటి లక్ష
ఈతని కాల
లభించలేదు
ఓర్గంటి య
ఈ
పుస్తకభాం
లైరు కల
మూలక్లోక
ఆన్నింటిక
ఈ
ప్రాచ్యలి
లోనే ఇం
ఈ రెంద
లయము
నందును
తములు
పుత్రుడ
మున

ఓరుగంటి లక్ష్మణ యజ్వ

గీర్వాణవాణి కాంధ్రులు కైసేసిన యమూల్యాభరణములందు సీతా రామవిహారకావ్య మొకటి. దీనికి కర్త ఓరుగంటి లక్ష్మణ యజ్వ. ఈతడు ఓరుగంటి లక్ష్మణసోమయాజి పౌత్రుడు; ఓరుగంటి శంకరసోమయాజి పుత్రుడు. ఈతని కాల మిదమిత్థముగా తెల్పి చెప్పుటకు తగిన యాధారము లింతవరకు లభించలేదు. అటులే ఈత డే ప్రాంతమునందుండినవాడో చెప్పుట కష్టము. ఓరుగంటి యను నింటిపే రీత డాంధ్రుడనుటకు సాక్ష్యము.

ఉస్మానియా విశ్వవిద్యాలయమందలి సంస్కృత అకాడమీవారి లిఖిత పుస్తకభాండాగారమున సీతారామవిహారకావ్యమునకు సంబంధించిన ప్రతు లైదు కలవు. వీనిలో రెండు భిన్నకర్తృకవ్యాఖ్యానములతోడను, తక్కినవి మూలశ్లోకములతోడను కలవు. ఈ ప్రతులన్నియు నసమగ్రములే యైనను అన్నింటిని కూర్చినచో సమగ్రమగు మూలగ్రంథము సిద్ధమగును.

ఈ యముద్రితగ్రంథప్రతి యొకటి సవ్యాఖ్యానముగా మద్రాసు ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారమున నున్నట్లు వర్ణింపబడినది[1]. మరియు లండను లోని ఇండియా ఆఫీసు లైబ్రరీ కేటలాగులో కూడ వర్ణింపబడినట్లున్నది[2]. ఈ రెండు గ్రంథాలయము లందలి ప్రతులకన్న ఉస్మానియా విశ్వవిద్యాలయము నందలి ప్రతులు విశిష్టమైనవి. మద్రాసు ప్రాచ్యపుస్తకభాండాగారము నందును ఇండియా ఆఫీసు లైబ్రరీలోనుగల ప్రతులు చంద్రికావ్యాఖ్యానమేతములు. పదార్థవ్యాఖ్యాత విశ్వం పండితుని పౌత్రుడును రామచంద్ర పండితుని పుత్రుడును నగు తర్పర్ వైద్యనాథపండితుడు. ఉస్మానియా విశ్వవిద్యాలయమున గల ప్రతులందు చంద్రికావ్యాఖ్యానముతోపాటు మరియొక వ్యాఖ్యా

(1) Triennial Catalogue of Mss. Vol. III Part I Sans. A. Page 3215 No. 2884

(2) Nos. 3918 and 3919

నముగల ప్రతియును గలదు. ఈ వ్యాఖ్యానమునకు తత్త్వప్రకాశిక యని పేరు. దీనికర్త హర్షదేవసూనుడగు అవసథి భగీరథుడు. చంద్రికావ్యాఖ్యానముతో కొన్ని సర్గలును, తత్త్వప్రకాశికావ్యాఖ్యతో కొన్ని సర్గలును, కేవల మూలశ్లోకములుగల కొన్ని సర్గలును కలిపినచో మొత్తము పండ్రెండు సర్గలు గల ఈ మహాకావ్యము సిద్ధమగును.

కృతికర్తయగు ఓర్గంటి లక్ష్మణయజ్వకాల మిదమిత్థముగా తెలియకున్నను వ్యాఖ్యాతకాలము కొంతవరకు తెలిసియున్నందున నితడు అంతకన్న పూర్వుడని భావింపవచ్చును. గోవింద ఠక్కురుని కావ్యప్రకాశప్రదీపముపై ప్రభయను వ్యాఖ్యానమును, కావ్యప్రకాశమందలి యుదాహరణపద్యములకు ఉదాహరణచంద్రికావ్యాఖ్యానమును, కువలయానందమునకు అలంకారచంద్రికావ్యాఖ్యానమును వ్రాసిన తత్సత్ వైద్యనాథసూరియే ఓర్గంటి లక్ష్మణాధ్వరివిరచిత సీతారామవిహారకావ్యమునకు చంద్రికావ్యాఖ్యానమును వ్రాసినవాడు. ఈ వైద్యనాథుడు క్రీ. శ. 1684లో ఉదాహరణచంద్రికను రచించినట్లు మహామహోపాధ్యాయ, డాక్టరు పి. వి. కాణే పండితుడును[3], డాక్టరు ఎస్. కె. దే పండితుడును[4], తెలిపియున్నారు. కనుక మన ఓరుగంటి లక్ష్మణయజ్వ అంతకన్న పూర్వుడుగా నుండవలెను. అనగా నాతడు పదునేడవ శతాబ్దము ప్రారంభముననో లేదా పదునారవ శతాబ్దము చివరనో ఉండియుండును. తత్సత్ వైద్యనాథ పండితుడు సర్గాంతములం దిట్లు చెప్పుకొన్నారు.

"ఇతి శ్రీమత్పదవాక్యప్రమాణాభిజ్ఞ ధర్మశాస్త్రధురీణ తత్సత్ రామభట్టాత్మజ వైద్యనాథసూరి విరచితయాం శ్రీ సీతారామవిహారకావ్యటీకాయాం చంద్రికాఖ్యాయాం ద్వాదశవర్గకిరణః సంపూర్ణః".

పై వాక్యమువలన మొత్తము వ్యాఖ్యానము పేరు చంద్రిక యనియు ఒక్కొక్కసర్గ వ్యాఖ్యానము పేరు కిరణమనియు తెలియుచున్నది.

ఉస్మానియా విశ్వవిద్యాలయమున సీతారామవిహారమునకు మరియొక

(3) History of Sanskrit Poetics; Page, 415,

(4) Sanskrit Poetics; Page, 170.

వ్యాఖ్య కలదని మనవి చేసితిని. దీనికర్త అవసథ్థి (అవనథ్య కాలోలు) భగీరథుడు తన్నుగూర్చి ఇట్లు చెప్పుకొన్నారు.

"ఇతి శ్రీ హూణ్నరేంద్రోద్ధరచంద్రాత్రేయ శ్రీ రుద్రచంద్రపురోహిత సోమపాయి లక్ష్మీధరపండిత గోత్రావతంస హర్షదేవసూను అవసథ్థి భగీరథకృతాయాం సీతారామవిహారటీకాయాం తత్త్వప్రకాశికాఖ్యాయాం పంచమ స్సర్గః"

ఈ భగీరథ పండితుడు కుమారసంభవ, మేఘసందేశ, రఘువంశ, శిశుపాలవధ, కిరాతార్జునీయ, నైషధీయ చరితములతో కాక కావ్యాదర్శము, దేవీమాహాత్మ్యము, మహిమ్నస్తోత్రములకు కూడ వ్యాఖ్యానములు రచించినట్లు తెలియుచున్నది. ఈతడు కూడ పదునేడవ శతాబ్దమునందున్న వాడట౫.

పై యిరువురు వ్యాఖ్యాతలును ఆంధ్రేతరులు. ఆంధ్ర దేశమున బుట్టిన కావ్యమాంధ్రేతర ప్రాంతములందు వ్యాప్తి గాంచుటకు శతాబ్దమో కనీసము అర్థశతాబ్దమో పట్టియుండును గదా! కనుకనే ఓరుగంటి లక్ష్మణార్యుని పదునారవ శతాబ్దము చివరనో లేదా పదునేడవ శతాబ్దము ప్రారంభముననో ఉండి యుండునని యూహించితిని. ఈ కావ్యవ్యాప్తిని గూర్చి మరియొక యూహ. పూర్వము భారతీయకవిపండితు లందరకును కాశీ, నవద్వీపముల వంటివి కూడలి పట్టులుగా నుండెడివి. అన్ని రాష్ట్రములవారును ఆ సరస్వతీ నిలయములందు కలిసికొనెడివారు. సీతారామవిహారకావ్య మిట్టి కూడలి పట్టునందైన పరరాష్ట్ర పండితుల నాకర్షించి యుండును.

సీతారామవిహారకావ్యము పన్నెండు సర్గల మహాకావ్యము. ఇందు శ్రీరామచంద్ర యౌవరాజ్యపట్టాభిషేకపర్యంతమున్న కథమాత్రము వర్ణింపబడినది. ఆయా సర్గలలోని యితివృత్తమును, వాని శ్లోక సంఖ్యయు ఈ పట్టిక వలన తెలియగలదు.

---

(౫) A Critical study of Naisadhiya charitram, by Dr. A. N. Jani Pages ౬౮ and ౩౪.

సర్గ	ఇతివృత్తము.	శ్లోకసంఖ్య.
I	అయోధ్యాపుర వర్ణనమ్	60
II	వర్షర్తు వర్ణనమ్	64
III	శరద్వర్ణనమ్	62
IV	శాంతకన్యా వివాహః	58
V	వారాణసీ వర్ణనమ్	71
VI	బిందుమాధవ సాక్షాత్కారవర్ణనమ్	51
VII	విశ్వామిత్ర యాగోద్ధరణమ్	69
VIII	సీతావర్ణనమ్	51
IX	సీతా వివాహమ్	79
X	సీతారామోద్యాన విహారః	61
XI	పుష్పావచయాదికమ్	68
XII	యౌవరాజ్యాభిషేకః	62
		706

కొన్ని ప్రతులందలి శ్లోకసంఖ్యలో ఒండు రెండు హెచ్చుతగ్గు లున్నవి. పైన పేర్కొనబడిన సర్గముల పేరులనుబట్టి ఈ కావ్యమందున్న కథ మిక్కిలి చిన్నదనియు, కేవల మిది వర్ణనాత్మకకావ్యమనియు మనము గ్రహింపగలము. V, VI సర్గములందలి విషయములు, అనగా వారణాసీ వర్ణనము మరియు బిందుమాధవసాక్షాత్కారవర్ణనములు కథానాయకుడగు శ్రీరామచంద్రుని కన్న మన జీవితమునకే ఎక్కుడు సంబంధించినవని యూహించుచున్నాను. ఈ కవి వారణసీప్రముఖక్షేత్రములు పుణ్యమునకో పురుషార్థమునకో (విద్యార్జనమునకు) సందర్శించియుండును. కనుకనే మిక్కిలి యభిమానముతో వానిని తన కావ్యమున చొప్పించి యుండునని యూహించుచున్నాను. ఒకవేళ ఈకృతి వారణాసీ పుణ్యస్థలమున రచింపబడి యుండను వచ్చును. కనుకనే ఆంధ్రేతరపండితులను ఆకర్షించుట జరిగి యుండును.

ఈ కావ్యములో బాటు ఓర్గంటి లక్ష్మణయజ్వ ఇంకను ఐదు కృతులు రచించినట్లు దీని సర్గాంత పద్యములు సాక్ష్యమిచ్చుచున్నవి.

1. ద్వితీయ సర్గాంతమున

"ఓర్గంటి లక్ష్మణాధ్వరికృత సీతారామశోభనవిహారే
కయ్యటవివరణ సోదరకావ్యే వ్యగమద్ద్వితీయ సర్గోయమ్"

2. తృతీయ సర్గాంతమున

"ఓర్గంటి లక్ష్మణాధ్వరికృత సీతారామశోభనవిహారే.
శ్రీ గీతరామ సోదరకావ్యే వ్యగమత్తృతీయ సర్గోయమ్"

3. చతుర్థ సర్గాంతమున

"ఓర్గంటి లక్ష్మణాధ్వరికృత సీతారామశోభనవిహారే
శ్రీ చమత్కారలహరీ సోదరకావ్యే చతుర్థసర్గో౽భూత్"

4 పంచమ సర్గాంతమున

"ఓర్గంటి లక్ష్మణాధ్వరికృత సీతారామశోభనవిహారే
గీతమహేశ్వర సోదరకావ్యే భవదత్రపంచమః సర్గః"

5. షష్ఠ సర్గాంతమున

"ఓర్గంటి లక్ష్మణాధ్వరికృత సీతారామశోభనవిహారే
సంగతి లక్ష్మణ సోదరకావ్యే భవదత్ర షష్ఠస్సర్గోయమ్"

అధోరేఖాంకితములగు ఉపర్యుక్తకృతులన్నియు మృగ్యములగుట మన దురదృష్టము. పై కృతులు ఓర్గంటి లక్ష్మణయజ్వ బహుముఖప్రతిభను, వివిధకృతినిర్మాణదక్షతను చెప్పక చెప్పుచున్నవి.

లక్ష్మణయజ్వ పూర్వసంస్కృతమహాకవుల రచనములనేకాక పూర్వాంధ్రకవుల రచనలనుగూడ బాగుగా జీర్ణముచేసికొన్నవాడు. పదునారవ శతాబ్దము వరకే పరాంకోటి నందుకొన్న మన ప్రబంధముల ప్రభావమీ కావ్యముపై స్పష్టముగా గనవచ్చుచున్నది. ఇంతియకాక ఆంధ్రదేశపు ప్రత్యేకతలుకొన్ని యీకావ్యమున ప్రవేశించినవి. ఆంధ్రేతరులగు వ్యాఖ్యాతలీ పట్టులందివి ఆంధ్రదేశమునకు సంబంధించినవని కంఠోక్తిగా చెప్పియున్నారు.

సీతారామవిహారమను కావ్యనామమే కొంత చిత్రముగా నున్నది. అటు సంస్కృతమందును ఇటు తెలుగులోను 'విలాసకావ్యము' లధికముగా

నున్న వేకాని 'విహారకావ్యము' అంతగా లేదు. జయదేవకృతమగు సీతా విహారమను కావ్యమొకటి సంస్కృతమున వినబడుచున్నది[6]. లక్ష్మణయజ్వ మేధాదక్షిణామూర్తి మంత్రోపాసకుడు. ఈ విషయము కావ్యారంభమునందలి మూడవ శ్లోకము వలనను ఆరవసర్గమందలి మేధాదక్షిణామూర్తిస్తోత్రము వలనను తెలియనగును.

సీతారామవిహారకావ్యమున గల ప్రథమ శ్లోకమిది.

"అస్తి ప్రశస్తాఖిలలోకభూషా విభూషితద్వాదశయోజనైషా
విశుద్ధశాఖైర్వినివిష్టమర్త్యా విరాజమానా విబుధై రయోధ్యా." I-1

అయోధ్యాపురవర్ణనము చేయబూనిన కవి తన వినయము నిట్లు చాటుకొన్నాడు:

"వ్యాస్థం న వేదా న్నచతుర్ముఖోహం న వా గురుర్నైవ ఫణాభృదీశః।
కథం త్వయోధ్యాపురవర్ణనాయ దక్షో భవిష్యామి తరం వినైవ" I-3

వినయసంపదతోపాటు ఆత్మాభిమానముగూడ దొడ్డగా గలవాడీ లక్ష్మణకవి. భవభూతివలె ఈతడుగూడ తన ప్రయత్నమునుగూర్చి ఇట్లు చెప్పుకొన్నాడు :

"వైషమ్యవైరస్యవిషాదదగ్ధబుద్ధీ నభాగ్యాన్ప్రతి నైష యత్నః।
జయంతు తే సత్కవయః కవిత్వరహస్యసర్వస్వవిదీవనా యే" I-4

అయోధ్యానగరము చుట్టున్న పరిఖావర్ణనసందర్భమున గల శ్లోకమిది ।

"యే మా ముపాశ్రిత్య వసంతి సర్వే జనా ఇహాముత్ర చ పాలనీయాః
ఇతీవబద్ధం పరిఖా ఛలేనపాదే యయా కంకణ మావిభాతి" I-12

ఈపాదకంకణ మాంధ్రుల గండపెండారము. వ్యాఖ్యాత లీసందర్భమున "పాదే బద్ధం కంకణ మావిభాతి శోభతే న చ కంకణం కరభూషణ మిత్య మరకోశాదివిరోధః. ఆంధ్రాం దేశవిశేషే పాదే కంకణబంధస్య విరుదత్వేన ప్రసిద్ధతయాదోషాభావాత్" అని చెప్పియున్నారు.

మణిఖచితములగు అయోధ్యాపుర సముత్తుంగ సౌధములందలి ముగ్ధల వర్ణించునప్పుడు కవి యాంధ్రదేశమునగల ఎసరన్నము వండు నాచారమును ప్రవేశపెట్టినాడు :

6. History of Classical Sanskrit Literature -M. Krishnamachari, Page 345 (1937)

"చిత్రం యత్ర ప్రముగ్ధా బహుతరఖదిరాంగారబుద్ధ్యా మణీనాం
సంఘం నిక్షిప్య మల్యాం తదుపరి కలశే చంద్రకాంతా వసర్ద్,
తోయం జాలాంతరాలస్థితశశికిరణై ర్వర్ధమానం హి రాత్రౌ
దృష్ట్వా పాకార్థ మేతత్ కలశగతజలే తండులాన్ ప్రక్షిపంతి." I-38

ఋష్యశృంగు నాకర్షించికొని తెచ్చుటకు పోయిన వేశ్య లావటువున కిడిన భక్ష్యముల నిట్లు వర్ణించినారు :

"వనితా వటవే దదు స్తదా వటకాపూపనమేత మోదకాన్,
వరలడ్డుక భూరిపూరికా మధురా నన్నరసా న్మనోహరాన్." IV-34

ఈ సందర్భమున వ్యాఖ్యాత "ఆంధ్రదేశ ప్రసిద్ధభక్ష్యవిశేషాన్ దదుః" అని వ్రాసినారు. వేశ్యలకును ఋష్యశృంగునకును జరిగిన సంభాషణమున హాస్యము బాగుగా పోషింపబడినది. ఇందు సులభపదఘటితములగు శ్లేష చమత్కారములును ప్రదర్శింపబడినవి.

"వయ మేక పదేన నిశ్చలాః సఖిపా ఊర్ధ్వతరా స్తపశ్చరాః,
చలపాదతటాశ్చదాహవస్త ఇమే సాముతపా స్తపోధనాః". IV-37

దశరథమహారాజు సీతాకల్యాణమహోత్సవమున కయోధ్యనుండి మిథిలకు తరలిపోవునప్పుడు వర్ణింపబడిన వేడుకలు వినోదములు మున్నగు వానిలో నాంధ్రదేశప్రసిద్ధతాళవతారాభినయములును, బొమ్మరివాంధ్ర ఆటలును ప్రవేశించినవి.

"మృదంగ వీణాపణవాదికోజ్జ్వలా తాళవతారాభినయే ధురంధరా,
ప్రతస్థిరే వేషధరైంద్రజాలికా గుణేచ వంశేచ వినర్తనక్షమాః" IX-43

ఈ విధముగా నాంధ్రతాముద్ర తెరనెర సీతారామవిహారకావ్య మంతటను గానవచ్చుచున్నవి. శరద్వర్ణనము చేయునప్పుడు చెప్పిన

"జలనిర్గమేన శరనిర్ఝరిణీ పులినం క్రమాత్ ప్రకటయం త్యమలం,
నవసంగమేన కులవధూ శ్శనకైః జఘనప్రదేశ మపరేవ బలా". III-6

అను శ్లోకము వాల్మీకి శరదృతువర్ణనమును జ్ఞప్తికి దెచ్చును. వస్తువర్ణన సందర్భమున చెప్పిన

"గాఢం ఘనాలింగితసర్వగాత్రా ప్రభాతసన్ధ్యావదనోదరా ...,
అధోంబరే లంబవిభక్తరాగా బభూవ సంధ్యా సురజన్మరేవ." II-2

అనుశ్లోకము కాళిదాసు (రఘువంశము XI–60) వర్ణనమును తలపింపజేయును.

సీతారామవిహారకావ్యమున నైదవసర్గము వారాణసీవర్ణనము. ఇది లక్ష్మణయజ్వకాలమునాటి కాశీపురమునకు దర్పణము. ఈ సర్గమున మణికర్ణికాష్టకము, గంగాష్టకము, తులసీషట్కము, భైరవాష్టకములు గలవు. వీనిలో ఒక్కొక్క కృతినుండి యొక్కొక్క శ్లోక ముదాహరింతును.

మణికర్ణికాష్టకమునుండి :

"కరుణాం కురు మ య్యనన్యనాథే తరణే పాతకజాలకర్దమస్య,
అరుణాంశుక వేష్టితాంగయష్టే శరణం త్వాం మణికర్ణికే ప్రపద్యే." V-10

గంగాష్టకమునుండి :

"త్వదుత్సంగే గంగే విహరణవిహంగే మయి మిలత్
కృపాపాంగే సంగే తవ కరతరంగేణ నతి మే,
కుతః పాపం తాపం అవ ముతు సమీపం వ్రజతు
వరం ద్వీపం దీపం తమ ఇవ దురాపం ప్రణతిహా". V-30

తులసీషట్కమునుండి :

"తులసీం తులశీంసిరఘ్నారా సుపరిప్లావితజటాకలాపధారామ్,
ప్రణమామి తపోవిధానదక్షాం నిజభర్తుర్విపాటనైకదీక్షామ్". V-41

భైరవాష్టకమునుండి :

"పరేతభూతజాతఖేలఖేలలోకవిశ్రుతం
కరాలహస్త తాలతాలరూపకేళిదుర్వ్రతమ్,
పటుం పటుం నటంత మాదిదేవ మావృతం సురైః
ముదా యదా కదాపి కాలభైరవం సమాశ్రయే". V-60

సీతారామవిహారకావ్యమున షష్ఠసర్గము బిందుమాధవసాక్షాత్కారవర్ణనము. దీనిలో మేధాదక్షిణామూర్తిస్తోత్రమును, విశ్వనాథాష్టకమును, బిందుమాధవ వర్ణనములును కలవు. ఓరుగంటి లక్ష్మణార్యుడు, మేధాదక్షిణామూర్తి మంత్రోపాసకుడని తెలియ మనవిచేసితిని. దక్షిణామూర్తి స్తవము శంకరుల శివానంద లహరిని దలపించుచున్నది.

"ఇమం సర్వం గర్వం కలయ మమ సర్వోత్తమ విభో
సదా పూర్వం శర్వం సురవినుత చార్వంఘ్రి కమలం
సకృ న్నత్వాపి త్వా మహ మగణయత్వాంతర మపి
స్థిరో భూత్వా ధృత్వా తవవర మతీత్వా చ విహరే." VI-8

విశ్వనాథాష్టకమునుండి :

"ఆత్మనామ ధామ ధీమ ధామ పాపహారిణం
శామ భీమ సోమ సోమ సీమ మామకాశ్రయమ్,
వామ వామ వామ వామ దేవ దేవ తామరం
విశ్వనాథ మే విశాననాథ మీశ మాశ్రయే". VI-15

నీలమేఘశ్యాముడగు బిందుమాధవుని వర్ణనమిది :

"నవ భాషణనాద పూరితాశః స్తనితాపూర్ణచతుర్దిగంతరాలః,
శ్రితి వేషు చతుర్భుజ ప్రసన్నః కృషితీవిష్వవ నీలనీలమేఘః". VI-42

ఓరుగంటి లక్ష్మణయజ్వ కవితాపాటవమును జూచుటకు సీతారామవిహార కావ్యము మొదటిమూడు సర్గలును చివరినాల్గు సర్గలును ప్రతిశ్లోకప్రమాణములు. ఈతని కవితాకళనుగూర్చి స్థలాంతరమున నివేదింతును. ఇది కేవల మాతని పరిచయమున కుద్దేశింపబడిన వ్యాసము. లక్ష్మణసోమయాజి బిందుమాధవుని స్తుతించిన శ్లోక మొకటి యుదాహరించి దీని నింతటితో ముగింతును :

"దేవ త్వదీయచరితం విచిత్రప్రమేయం
కిం వర్ణయిష్యతి తనో నవ జాతజన్మా,
వాచామగోచరమహో మనసాం చ విద్వాన్
ఆనంద మేత్య న బిభేతి కుతశ్చ నత్వామ్" VI-43

(అభినందన కావ్యమాల, 1961)

సారంగు తమ్మయ

వైజయంతీవిలాసము వైష్ణవప్రబంధమును రచించిన సారంగుతమ్మయ కాలమునుగూర్చి భిన్నాభిప్రాయములు గలవు. అతని కాలమును గూర్చి యూహించుటకు తోడ్పడు రెండుపద్యములు వైజయంతీవిలాసమున నున్నవి. వానిలో మొదటిది గురుస్తుతి సందర్భమున గల పద్యము

"వందారుదాసజనతా
మందారున్ వేదశాస్త్రసహితప్రజ్ఞా
బృందారకగురు మద్గురు
కందాళప్పలగురున్ జగద్ధితు గొలుతున్" (I–11)

రెండవది ప్రభుస్తుతిసందర్భమున గల పద్యము.

"ఇనసమతేజులౌ నృపులనెల్ల మహమ్మదుషాహి యేలు నీ
యెనుబదినాల్గుదుర్గముల నేలిన యేలిక గోలకొండ ర
త్ననగరస్థలిన్ గరణికం బొనరించెదు తమ్మమంత్రి యా
జనపతి తమ్ము బొమ్మన ప్రజల్ జయవెట్ట గృహస్థులౌననన్" (I–30)

ఈ పద్యము లాధారముగా కీ. శే. కందుకూరి వీరేశలింగం పంతులుగారు తమ్మయమంత్రి గోల్కొండరాజ్యము నేలిన కుతుబ్‌షాహీవంశమునం దైదవవా డగు మహమ్మద్‌ఖులీ ఖుతుబ్‌షాకాలమువా డనిరి.[1]

పైవానిలో మొదటిపద్యమున పేర్కొనబడిన తమ్మమంత్రిగురువగు కందాళఅప్పలాచార్యులను తెనాలిరామకృష్ణుని పాండురంగమాహాత్మ్యమునకు కృతిభర్త యగు విరూరివేదాద్రిమంత్రికి గురువగు కందాళఅప్పలాచార్యులును నభిన్నులనియు కాన తమ్మయమంత్రి తెనాలిరామకృష్ణునకు సమకాలీను డనియు వీరేశలింగంపంతులుగారి యభిప్రాయము. ఈ యభిప్రాయమునకు

1. ఆంధ్రకవులచరిత్రము – 2వ భాగము, పు. 204 (1940)

భిన్నముగా శ్రీ. శే. చాగంటి శేషయ్యగారు విరూరివేదాద్రిమంత్రికి గురువైన కందాళఅప్పలాచార్యుల తాత పురోత కందాళ అప్పలాచార్యులు సారంగు తమ్మయకు గురువనియు, రెండవపక్షమునగల మహమ్మదుషాహి కుతుబ్‌షాహి వంశమునందలి ఖులీకుతుబ్‌షా కాదనియు అతడు బహమనీసుల్తానులందు చివరివాడగు మహమ్మదుషా (1481–1518 క్రీ.) యనియు సోపపత్తికముగా వాదించి వైజయంతీవిలాసప్రబంధరచనము క్రీ.శ. 1510 ప్రాంతమునందు జరిగినట్లు సిద్ధాంతీకరించిరి.[2]

చాగంటివారు చూపిన యుపపత్తు లన్నియు సమంజసముగానే యున్నవి. కాని సుల్తాను సారంగతమ్మయను "తమ్ము హమ్మని" యాదరించెడివాడట. తమ్ముహమ్మనునంతటి యాదరమును జూపుట దూరస్థుడగు బహమనీ సుల్తానున కన్వయించుటకన్న సమీపస్థుడగు "కుతుబ్‌షాహి" సుల్తానున కన్వయించుట మే లగుముగా నుండును. మీదు మిక్కిలి చాగంటివారు చెప్పెడి బహమనీ సుల్తాను ఆవంశములో చివరివాడు. అతనికాలముననే బహమనీ రాజ్యమంతరించెను. కనుక నాతడు "ఎనుబదినాలుగుదుర్గముల నేలిన యేలిక" యగుట పొసగదు. కాని కందాళఅప్పలాచార్యులగూర్చి చాగంటివారు చూపిన యుపపత్తులే సమంజసముగా నున్నవి. చిత్రభారతమున పేర్కొనబడిన కందాళప్పగురువే వైజయంతీవిలాసమున పేర్కొనబడిన కందాళప్పగురువని యూహించుటకు ఓరుగల్లు, గోల్కొండ పట్టణముల సామీప్యమునుగూడ కొంతతోడ్పడుచున్నది. ఐనను ఈవిషయమింకను పరిశీలింపవలసియున్నది.

సారంగు తమ్మయ్య గోల్కొండనగరమునకు కరణ మను మాట సత్యము. కరణ మనగా సామాన్యగ్రామకరణము కాదు. నగరమునకు కరణ మనగా మంత్రిత్వమంతటి పని, నేటి 'మేయరు' పదవివంటి దానాటి నగర కరణీకము. కనుక సుల్తాన్ 'తమ్ము హమ్మ'ని యాదరించెడువాడు. ప్రజలాతని వైభవమునకు 'జయ' వెట్టుచుండిరి, గృహస్థులాసని మెచ్చుచుండిరి. అట్టి సారంగుతమ్మయ తెలుగుకవిగా మాత్రము మన కింతవఱకు పరిచితుడు. కాని యాతడు గీర్వాణవాణికిగూడ కైసేతలు చేసినవాడని తెలుపుటయే నాయుద్దేశము.

---

2. ఆంధ్రకవితరంగిణి. 8వ సంపుటము. పు 63–64, (1951)

సారంగుతమ్మయ విశిష్టాద్వైతమతానుయాయి యనియు "వరిచితభగవద్భాగవతకైంకర్యవిధాను"డనియు వైజయంతీవిలాసాశ్వాసాంతగద్యములు చాటుచున్నవి.[3] ఏవంవిధగుణవిశిష్టుడు గనుకనే సారంగుతమ్మయ నారదీయ పురాణాంతర్గతమగు హరిభక్తిసుధోదయమునకు సంస్కృతమున వ్యాఖ్యానము రచించెను. ఈ వ్యాఖ్యానమునకు, భక్తిసంజీవని యనిపేరు. ఇది యిరువది యధ్యాయముల గ్రంథము. అధ్యాయాంతమున గల గద్య ఈ క్రింది విధముగ నున్నది.

"ఇతి సారంగతమ్మప్రభుణా విరచితాయాం హరిభక్తిసుధోదయ టీకాయాంభక్తిసంజీవనీవ్యాఖ్యాయాంప్రథమోధ్యాయః." ఈగద్యమున సారంగు తమ్మయ్య తన్ను ప్రభువుగా జెప్పికొనినాడు. మంత్రికులమున బుట్టిన పెద్ద కరణము సుల్తానులు 'తమ్మప్రభు' యొసర్చిన యాదరమున దాను గూడ స్వయముగా ప్రభువైన పిమ్మట నీవ్యాఖ్యానమును వ్రాసియుండును. అనగా వైజయంతీవిలాసప్రబంధరచనము తరువాతనే 'భక్తిసంజీవని' రచన జరిగి యుండును. వైజయంతీవిలాసము శ్రీరామచంద్రునకంకితము. శ్రీరామచంద్రుడు సారంగు తమ్మయ కిలువేల్పు. ఆ శ్రీరామచంద్రప్రభువును తమ్మయ తన వ్యాఖ్యారంభమున నిట్లు స్తుతించినాడు.

"శ్రీరామచంద్ర స్స తనోతు లక్ష్మీం
శ్రీలక్ష్మణాలంకృతదివ్యమూర్తిః,
యద్దర్శనా ద్దుఃఖ ముపాస్య సర్వం
సద్యఃపరానంద ముపైతి లోకః"

దీని తరువాత మఱిరెండు శ్లోకము లున్నవి. వానిలో తమ్మయ తనను గూర్చియు, తనప్రయత్నమును గూర్చియు, తెలిపినాడు.

"యస్యోదారయశోవిశాలలయః సతతం కుర్వన్తి వానం దివి
స్వర్ధేనుప్రముఖావదాన్యమణయో వ్యర్థోపి నేహాగతా,
శ్లాఘ్యస్సాధుగుణాన్వితో బుధజనై ర్భాగీరథీవట్టణే
సోఽయం మంత్రిధురంధరో విజయతే సారంగుతమ్మప్రభుః."

---

3. కీ.శే. వీరేశలింగంపంతులుగారు సారంగతమ్మయ 'మాధ్వమతానుయాయి' యనిరి.

"తే నేయం క్రియతే టీకా హరిభక్తిసుధోదయే,
భక్తిసంజీవనీ నామ్నా విద్వత్సంతోషకారిణీ."

పైశ్లోకమువలన సారంగుతమ్మయ 'మంత్రిధురంధరుం' డనియు, 'ప్రభు' వనియు తెలియుటేగాక గోల్కొండ పట్టణమునకు 'భాగీరథీపట్టణ' మని మఱియొక పేరుగూడ ఉన్నట్లు తెలియుచున్నది.

హైదరాబాదునగరమునకు 'భాగ్యనగర'మని పేరుండినట్లును అది సుల్తాన్ మహమ్మద్ ఖులీకుతుబ్‌షా ప్రియురాలివలన నేర్పడిన దనియు నొక యైతిహ్య మున్నది. కొందరిది సత్యమనియు మఱికొందరిది కట్టుకథ యనియు వాకొనుచున్నారు.

సారంగుతమ్మయ మహమ్మద్‌ఖులీ కుతుబ్‌షాకన్న పూర్వుడని భావించినచో నిజమున కీకథకు తావు లేదని పైశ్లోకము రుజువు చేయుచున్నది. 'భాగీరథీపట్టణమే' భాగ్యనగరముగా మారెనని భావింపవలయును. ఒకవేళ సారంగుతమ్మయ ఖులీకుతుబ్‌షా కాలము (1580-1612) వాడే యని నిశ్చయమైనను నాతని ప్రియురాలు భాగామతి పేరుతో నేర్పడిన పట్టణము భాగీరథీపట్టణము కాజాలదు గదా! ఒకవేళ పూర్వము భాగీరథీనామముతో నుండిన పట్టణమే సుల్తాను భాగామతి పేరుతో భాగ్యనగరముగా మారెనో తెలియరాదు. భాగీరథినిగూర్చి మఱియొక విశేషము. సుల్తాను మహమ్మద్ ఖులీకుతుబ్‌షా భాగీరథియను హైందవస్త్రీవలన (1588) ఆన్మించినట్లొక ఐతిహ్యమున్నది.[4]

ఒకవేళ ఈ భాగీరథి యనుపేరుతోడనే భాగరథీపట్టణ మనుపేరు వచ్చినచో సారంగుతమ్మయ కాలము మఱికొంత ముందుకు పోవును. హరిభక్తిసుధోదయ వ్యాఖ్యానకారుడగు సారంగుతమ్మయ తన తండ్రితాతలనుగూర్చి యేమియు చెప్పకొనలేదు. వైజయంతీవిలాసప్రబంధకర్త తాత మఱియొక సారంగుతమ్మయ ఈవ్యాఖ్యానరచయిత కాగూడదా యన్నచో భాగీరథీపట్టణ వృత్తాంతము మఱికొంత ప్రాచీన మగును. తాతగా నట్టి గొప్పపురాణమునకు

---

4 'History of Golconda, by Abdul Majeed siddiqui- Page 88 (1956)

అందులో తమ మతమునకు సంబంధించినదానికి వ్యాఖ్య వ్రాసియుండగా వైజయంతీవిలాసకర్త దానిని స్మరింపకుండునా? కనుక సింగరయ్యగారు తమ్మయ లక్ష్మన్నలనియే భావింపవలయును. వీరు మిక్కిలి వైజయంతీవిలాసకర్తగాను 'పరిచితభగవద్భాగవతకైంకర్యవిధాను'డని కంఠోక్తిగా చెప్పుకొనుటచే హరిభక్తిసుధోదయమునకు [ప్రహ్లాదాదిభాగవతుల చరిత్రమునకు] భక్తిసంజీవనీటీకను గూర్చిన వా డతడే యని మన మనుకొనవలెను. ఈ యముద్రిత కృతికి తాళపత్రప్రతి యుస్మానియా విశ్వవిద్యాలయము సంస్కృత అకాడమిలో నున్నది. దీని వైశిష్ట్యమును గూర్చి కాలాంతరమున నివేదింతును.[*]

(భారతి, 1961)

పరశురామ పంతుల
అనంతరామ పండితుడు

గీర్వాణభాషాయోష కమూల్యాభరణము లనాదిగా సమర్పించుచున్నవా రాంధ్రులు. అట్టివారిలో పరశురామపంతుల అనంతరామపండితు డొకడు. ఈతడు సీతావిజయమను చంపూప్రబంధమును రచించెను. ఈ గ్రంథ మముద్రితము. దీని ప్రతి కాకినాడ ఆంధ్రసాహిత్యపరిషత్కార్యాలయమున గలదు.

పదునెనిమిదవ శతాబ్దము పూర్వార్ధమున తెలుగు గడ్డపై జన్మించిన మహానుభావుడు పరశురామపంతుల లింగమూర్తి. లింగమూర్తి రతిమన్మథ విలాసము, జీవన్ముక్తి ప్రకరణము, బ్రహ్మనారద సంవాదము, తారక యోగము, మానస శతకము, సీతారామాంజనేయ సంవాదము, సీసపాట, మున్నగు వానిని రచించెను. ఇంతవరకు లోకమునకు తెలియని మరి రెండు శతకములు లింగమూర్తి రచనలు ఉస్మానియా విశ్వవిద్యాలయము సంస్కృత అకాడమీ తాళపత్ర గ్రంథములందున్నవి. అవి. 1. ఆత్మారామ 2. గోవింద శతకములు. లింగమూర్తి కుమారుడు రామమూర్తికవి శుకచరిత్రమను వేదాంతగ్రంథ నిర్మాత. పరశురామపంతులవారి వంగడము లింగమూర్తి ఆదిగా ఆధ్యాత్మికవిద్య కాలవాలమై నేటికిని ఓరుగల్లునను తత్పరిసర గ్రామములందును వర్ధిల్లుచున్నది. లింగమూర్తి వసించిన గృహ మిప్పటికిని మట్టెవాడలో నున్నది. ప్రభుత్వమువారో ప్రజలో దీనిని స్వాధీనము చేసికొని ఆంధ్రులపాలిటి పుణ్యతీర్థమట్లు పరిరక్షింపవలసినదీ పవిత్రగృహము.

లింగమూర్తికవి కైదవ తరమువాడు అనంతరామ పండితుడు. సీతారామాంజనేయసంవాదమునకు టీక వ్రాసిన శేషాద్రి రమణకవు లిచ్చిన లింగమూర్తి వంశావళి యిట్లున్నది.

లింగమూర్తి
|
రామమూర్తి
|
లింగమూర్తి
|
రామకృష్ణసోమయాజి

అనంతరామయ్య	దశరథరామయ్య
|	
పట్టాభిరామయ్య	

ఈ పట్టికలో నైదవ తరమువాడగు అనంతరామయ్యయే సీతావిజయ చంపూ ప్రబంధ రచయిత. పైన పేర్కొనబడిన వంశక్రమమే సీతావిజయమందును అనంతరామపండితుని వరకును గలదు. కనుక నితడు 18 వ శతాబ్దము మధ్యభాగమున నుండియుండును. అంత్యగద్యవలన నితని తల్లి వేదాంబిక యనియు తెలియుచున్నది.

ప్రథమస్తబకాంతగద్య మిట్లున్నది.

"ఇతి శ్రీమత్సమస్తభువనప్రసిద్ధ మేధ్యనర భరద్వాజగోత్రాభరణాయమాన పరశురామాన్వయదుగ్ధాంబుధిసుధాదీధితినా, శ్రీ లక్ష్మీనారాయణపాదారవిందమకరందాస్వాదానంద తుందిలేందిందిరాయమాననిజస్వాంతేన, శ్రీ రామకృష్ణసోమయాజికుటుంబినీ వేదాంబికాశుక్తిముక్తాఫలాయితేన, అనంతరామపండితేన, ప్రణీతే శ్రీ సీతావిజయాభిధాన చంబూ ప్రబంధే ప్రథమస్తబకస్సమాప్తః."—

చంపూప్రబంధమును చంబూప్రబంధమనుట తెలుగుదేశమున కొలదిగానైనను వాడుకలో నుండినదనుటకు నిది మరియొక యుదాహరణము. ఈ గ్రంథమున రెండు మూడు స్థలముల చంబూప్రబంధమనియే కలదు. పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు తన జైమినిభారతమున నీ పదమును ప్రానస్థానమున ప్రయోగించుట సాహిత్యజ్ఞు లెరుగుదురు.

సీతావిజయమనగా శతకంఠ రామాయణము. ఆంధ్రేతర భాషలలో శతకంఠరామాయణకథ యున్నదో లేదో నే నెరుగనుగాని తెలుగులో

మాత్రము సీతావిజయము, శతకంఠ రామాయణము అను పేరులతో పద్య, గద్య, గేయ, యక్షగానాది వివిధప్రక్రియలం దనేకగ్రంథములు వెలసినవి. శతకంఠరామాయణకథ కాకరము వాసిష్ఠరామాయణమని డాక్టరు యస్వీ జోగారావుగా రనుచున్నారు.[1] శతకంఠరామాయణముల గూర్చి శ్రీ సాళ్వ కృష్ణమూర్తిగారు వ్రాసియున్నారు.[2]

ప్రకృత ముపలబ్ధమగుచున్న సీతావిజయ చంపూప్రబంధము సంపూర్ణముగా లేదు. కేవలము మూడు స్తబకములు మాత్రము దక్కినవి. ఇందులో గూడ కొన్ని కమ్మలు పోయినవి. కొన్ని శిథిలములైనవి. ఈ భాగము నాంధ్రలోకమునకు పరిచయ మొనర్తును.

సీతావిజయచంపూకావ్యము శ్రీ రామచంద్రస్తోత్రముతో నిర్లారంభ మైనది.

శ్రీరామం సురరాణ్ముఖామరవరై రారాధితాంఘ్రిద్వయం
రాకారాజముఖం సరోజనయనం రాజాధిరాజం ముదా,
శూరం సూరకులాంబురాశిశశినం దైత్యాంధకారారుణం
ధీరం వీరమరం (హం) స్మరామి సుఖదం స్వాంతే ససీతం సదా. 1-1

దీని తరువాత లక్ష్మీనారాయణుల స్తోత్రము, సరస్వతీ ప్రార్థనము, ఆంజనేయ స్తోత్రము, విఘ్నేశ్వరస్తుతియు వరుసగా నున్నవి. అటుతరువాత అనంతరామపండితుని గురు(వంశ) పరంపర కలదు.

శ్రీరామం సముపాస్య తామరమణం యోంటాలపుర్యాస్థితః (తం)
తస్మాత్ప్రాప వురూన్వరాన్గురువరో లేభే విశాలం యశః,
యో వేదాంతవిచార సుందరతరగ్రంథాన్విరచ్యాంజసా
తం వందే గురులింగమూర్తి మనిశం బ్రహ్మస్వరూపం పరమ్. 1-7

శివ ఇవ విలసన్యస్స్వోపరత్యా నితాంతం
విధిసుత సన్మోద క్తిభావేన రాంతమ్,

---

[1] ఆంధ్ర యక్షగాన వాఙ్మయచరిత్ర. పుట 476-484.

[2] విజ్ఞానసర్వస్వము. తెలుగు సంస్కృతి. పుట. 1040.

శుకమునిరివ సతో భూరివైరాగ్యతప్తం
మనసి గురువరేణ్యం చింతయే రామమూర్తిమ్. 1-8

ఇవి కిలిజమునీశో వీక్ష్య విజ్ఞానవంతం
రచయతి యతరోరోన తప్తం నారదోయమ్,
భవతి నమితవక్షో వ్యాసపుత్రో విరాగం
సదయహృదయమీశే లింగమూర్తిం గురుం తమ్. 1-9

కుర్వన్నిర్తరతి యో ముక్త్యై సనిశం ప్రత్యక్పరబ్రహ్మణి
చిత్తే భక్తజనాయ నైజచరణాబ్జాతే గతాయాం తులమ్,
తత్త్వం బోధయతి ప్రశాంత మమలం దాంతం దయాలోయధిం
తం వందే గురుసార్వభౌమ మనఘం శ్రీరామకృష్ణం గురుమ్. 1-10

పై శ్లోకములందు మొదటిదానిలో అంటాల ప్రసక్తి వచ్చినది. ఈ గ్రామము ఓరుగల్లు సమీపమున గలదు. ఈ గ్రామము కాకతి రుద్రాంబ పేరున నిర్మింపబడినది. పరశురామపంతులవారీ గ్రామమందున్నారు. (అంటాల శ్రీరామాంకితముగా సంస్కృతమున మరికొన్ని లఘుకృతులు గలవు. అట్టి వానిలో ఉద్దిమట్టి హెపయ్య విరచిత రాఘవాష్టక మొకటి. ఇదియు నముద్రితమే). గురుపరంపర తరువాత కాళిదాసాదిపూర్వకవుల యొక్కయు, నారదశుకశౌనకవాల్మీకివ్యాస సుతాది తాపసులయొక్కయు స్తుతి గలదు.

అటు తరువాత కథాప్రారంభమగును. శంకరుడు పార్వతికి చెప్పి నట్లుగా వ్యాసుడీ కథను నైమిశారణ్యమందలి మునులకు వినిపించును. ప్రథమ స్తబకమున మొత్తము 94 గద్యపద్యము లున్నవి. శ్రీరామాదుల జననమాదిగా రావణవధానంతరము శ్రీరామచంద్రు డయోధ్యానగరమునకు వచ్చి రామరాజ్యమును స్థాపించినకథ 20 శ్లోకములలో క్లుప్తముగా వర్ణింపబడి నది. రావణవధను విన్న అతని బంధువు శతకంఠుడు విజృంభించి ముల్లోక ములవారిని బాధించుటయు, శ్రీ మహావిష్ణు నాదేశమున నింద్రాది దేవతలును మహర్షులును అయోధ్యకు వచ్చి శతకంఠుని దౌష్ట్యమును, వాని బల పరాక్రమములను శ్రీరామున కెఱిగించుటయు, శ్రీరాముడు వారి కభయమిచ్చి వీడ్కొల్పుటయునను విషయము లీ ప్రథమ స్తబకమున వర్ణితములు.

శ్రీరాముని కీర్తి ప్రాభవములు వర్ణించు శ్లోకములందొకటి.

"శైత్యే సమ్మీక్ష్యతో మేరుర్గార్యవాన్ తుహినాచలః,
మందరాద్రిరపి భ్రాంతః కథంస్యుస్త్వేనతే సమాః" 1-74

దశముఖునకు కుంభకర్ణునివలె శతముఖునకు రక్తబిందుడనువా డొక డున్నాడని శ్రీరామునితో దేవతలిట్లు చెప్పిరి.

రక్తబిందురితి యామినీచరో, వర్తతేఽస్య నికటే మహాబలః,
కుంభకర్ణ ఇవ రావణాంతికే, కుంభిసీధరసమానవిగ్రహః. 1-91

శతకంఠ దశకంఠుల బలముల తారతమ్యము "సుమేరు సర్షపయోర్యావదం తరం తావదంతరం శతముఖ దశముఖయోః" అని చెప్పబడినది. వీరు మిక్కిలి శతముఖునకున్న కొన్ని విచిత్రశక్తులీ గద్యమున నిట్లు చెప్పబడినవి.

"అయి రఘువీర యస్య యామినీచరస్య విగ్రహాద్రుధిరం సర్షపమాత్రేణ యదా యుద్ధోర్వ్యాం పతిష్యతి తదైవ తత్ప్రబలవానన్యో దనుజో జాయతే తచ్ఛరీరాత్పతితాచ్ఛోణితబిందోస్తాదృశః పల లాంశః పునరపి జనిష్యతే, తదంగ ప్రపతిత రక్తబిందోర్యాన్యో నిశాచర స్తత్సమవిక్రమవాన్ భవత్యతి ప్రసంగే త్రైవమేవ రక్షఃప్రవరాః కోటిశో జనిష్యంతే" 1-92

ద్వితీయ స్తబకమున మొత్తము 65 గద్యపద్యములున్నవి. దీనిలో షడ్రుతువులును, చంద్రోపాలంభనాదులును, సీతారాముల వనజలకేళివిహారము లును వర్ణింపబడినవి. అనంతరామపండితుని రచనలో శబ్దాలంకారము లెక్కువ. గద్యములు తరచుగా ముక్తపదగ్రస్తములు. ద్వితీయ స్తబక ప్రారంభమున గల వసంతర్తువర్ణన మిది.

"శ్రీ మత్పల్లవవల్లజసముల్లసత్ప్రసూనసాయక సమిత్సముచితవాసంతి కాలతోరవసిత మహామంటపటలీవిలాసమానం, విభాసమానసాద్రుమన్మనో హారమరందబిందుసమురయాస్వాదానందతుందిల నదన్మత్తాళిముఖం, ఆళి ముఖాయమానసురభిరసాంకలికాప్రయోగ కృశీకృత ప్రియవియోగవద్యోషి దపేయుప మదనం, మదనపన్నగకర నికరనవన్సముదయసమయ సారసం, సారసరసికరజనిపుణసుపురసకలగణవరీత పాదపప్రకర మూలప్రదేశకాంతా రం, కాంతారచిరవిస్తీర్ణవల్లీ విలాసప్రేంఖోళికా ప్రకర ప్రేంఖద్బాలలలనా లీలం, లీలాహరిరంతసంతత ప్రసరత్ప్రసూన సౌరభం" (II-2)

ఈ గద్యమిటులే ముక్తపదగ్రస్తముగా మరి నాలుగింతలు సాగిపోయినది.

వర్షర్తువర్ణనాసందర్భమున గల కొన్ని శ్లోకములు.

"సమశీత దసమం దిగంగనానాం
ధృతపటతుల్యపయోముచాం దశస్స్వమ్,
సులలితనవనీపవృక్షరేఖా
పురుపటవాస మివాభిరామగంధమ్" II-22

ఆ సమయముననే ఇంద్రగోపములవర్ణన మిట్లున్నది.

"తదేంద్రగోపాః కాశ్యప్యాం, భువివింతా ఇవా బభుః,
మహేంద్రాయ బలం దాతుం, విన్యస్తా వర్షహేతవే." II-26

శరదృతువర్ణన సందర్భమున గల శ్లోకము.

"రామార్థం దేవతా యాత్రైర్హరిత్ర్యభ్రమయీ తదా,
శుభ్రాభ్రస్రగివాకాశే తతా శోభత శోభనా." II-34

హేమంతర్తువును వర్ణించు గద్యమున కొంతభాగ ముట్టంకింతును.

"సమాచరితహస్తద్వితీయ న్యస్తకలంధతయా తుహినాతంకశంకయా హృదయరాజీవమివ రక్షయంతం, సతతదంతవిపంచికావాదనేన కంపమానాధరోష్ఠతయా శీతవేదనాపనోదనాయ మంత్రజపం కుశలం కుర్వంతమివ స్థితం, నిబిడతరరోమాంచ సంచయకంచుకితకాయతయా సదయదైవదత్త తనూరుహబహులకంబలకృతదేహరక్షణమివ భిక్షాటంతం దరిద్రజననికురుంబం" II—37

అనంతరామపండితు డెక్కువగా శబ్దాలంకారములను ప్రయోగించినాడని తొలుత మనవి చేసితిని. అందుకొక యుదాహరణము.

"నీలతమాలకదంబవిలీనం. నీలతమాలకశోభనవక్త్రే
మానవతీమణి చేర్చ్వ సదాముం, మానవతీర్థభవేక్షణ తాంతే" II-42

మూడవ స్తబకమున 67 గద్యపద్యము లున్నవి. ఈ స్తబకమంతయు శ్రీ సీతారామచంద్రుల శృంగారజీవితమున కంకితమైనది. కొన్ని పట్టులందీ వర్ణనములు మితిమీరినట్లున్నవి. మూడవ స్తబక మధికభాగము శిథిలము,

చంద్రోదయవర్ణన సందర్భమున గల శ్లోకమిది.

"చకాస కౌముదీ కామం, కౌముదం తన్వతీ ద్విజాన్
ప్రాచీదిక్కామినీకాంత నాసాముక్తా రుచిర్యథా" III-31

మన్మథ సామ్రాజ్య ప్రాభవ వర్ణన మిది.

"సీత్కారాణి కరాఘాత, ధూననం చాపి యోషితాం,
నయనోర్ధనిమేషాస్తు, మన్మథస్యాస్త్రతాం యయుః" III-45

ఈ చంపూప్రబంధము సంపూర్ణముగా లభింపకుండుట విచారకరము. ఈ గ్రంథమున గల ఆంధ్రతాముద్ర మతియొకటి గలదు. సాధారణముగా సంస్కృతకావ్యములం దొక్కొక సర్గలో నొకేరీతి ఛందము వాడబడును. తెలుగు ప్రబంధములందువలెనే యనంతరామపండితుడీ సంస్కృతప్రబంధమున ప్రతి శ్లోకమున అనేకవిధములగు ఛందముల నుపయోగించినాడు.

(సాహితి, జనవరి 1962)

దిట్టకవి లక్ష్మణకవి

సంస్కృతసాహిత్యమునకు సేవచేసిన ఆంధ్రులందు దిట్టకవి లక్ష్మణకవి యొకడు. ఈతడు హనుమద్రామాయణమను నేకసర్గకావ్యమును రచించెను. లక్ష్మణకవి యేయూరివాడో యెప్పటివాడో యిదమిత్థముగా తెలియదు. దిట్టకవియను నింటిపేరుగల ఆంధ్రకవి - రంగరాయచరిత్ర కర్త - దిట్టకవి నారాయణకవి సాహిత్య చరిత్రమున కెక్కినాడు. ఈతడు పదునెనిమిదవ శతాబ్దముత్తరార్ధమున నుండినవాడు. సంస్కృతకవియగు నీ దిట్టకవి లక్ష్మణకవి నారాయణకవికి బంధువగునో కాదో తెలియదు. కాని కొంత పూర్వుడనిమాత్ర మూహింపవచ్చును. దిట్టకవియను ఇంటిపేరప్పుడప్పుడే స్థిరపడుచున్నప్పుడో లేదా తానే ఆ బిరుదమును సంపాదించుకొని గృహనామముగా నుంచుకొన్నప్పుడో యున్నవాడీ దిట్టకవి లక్ష్మణకవి. ఇట్లూహించుటకు కారణమేమన లక్ష్మణకవి దిట్టకవియనియేగాక మండలవేముల యను నుపపదమునుగూడ ఇంటిపేరుగా వాడియున్నాడు. తొలుత వీరి యింటిపేరు మండలవేములవారు. ఇది గ్రామనామమువలన నేర్పడిన గృహనామము. తరువాత పురుషకారమున సంపాదించుకొన్న దిట్టకవియను బిరుదము ఇంటిపేరుగా మారియుండును. తండ్రికాలమునాడు మండలవేముల యనునది గృహనామముగా నుండి తన కవితాచాతుర్యమున నార్జించుకొన్న దిట్టకవి బిరుదము తనకును తరువాతవారికిని గృహనామ మగుటచే దిట్టకవి వారి కోవలో నీతడు మొదటివాడని చెప్పనొప్పును. మండలవేముల యను (మండవేముల) గృహనామము వైదికులందు గలదు. మరి దిట్టకవి యింటిపేరు వైదికులందున్నదో లేదో. శ్రీవైష్ణవులందు గూడ దిట్టకవి వారున్నారు. ఒకే యింటిపేరు పెక్కుకులములవారి కుండుట మన మెరుగుదుము. దిట్టకవి లక్ష్మణకవిది కౌండిన్యసగోత్రము. దిట్టకవి నారాయణకవిది కూడ కౌండిన్యస గోత్రము. కనుక నీ దిట్టకవి లక్ష్మణకవికూడ నియోగియని భావించుచున్నాను.

హనుమద్రామాయణము వ్యాఖ్యాన సమేతము. కవియే వ్యాఖ్యాతయై యుండునని యూహించుచున్నాను. హనుమద్రామాయణము వలన కవిని గూర్చి తెలియనగు నంశము లరుదుగా నున్నవి.

ప్రారంభమున, "ఇహ ఖలు సంస్కృతాంధ్రభాషాకవనచాతుర్యధురీణో దిట్టకవి లక్ష్మణార్యః। కావ్యం యశసేఽర్థకృతే .... " అని యున్నది. దీనివలన దిట్టకవి లక్ష్మణకవి సంస్కృతాంధ్ర భాషాకవనచాతుర్యధుర్యుడని తెలియుచున్నది. ఈతని ఆంధ్రభాషాకావ్యము లేమైనవో తెలియరాదు.

కావ్యాంతమున కవినిగూర్చిన రెండు శ్లోకములీ తీరుగా నున్నవి.

1. "శ్రీమద్రామ వరప్రసాదకలనా సంప్రాప్తసారస్వత
శ్రీమద్దిట్ట కవీంద్ర లక్ష్మణసుధీవర్యేణ సంపూరితే,
షట్కాండేతిత యావదర్థకలితే సంక్షిప్త రామాయణే
శ్లోకైశ్శ్రీరఘునాథవహ్ని విరచితే సర్గోఽ ద్వితీయస్సదా" (121)

2. "మండలవేములకులజః కౌండిన్యసగోత్ర కృష్ణకవి పుత్రః,
లక్ష్మణ సుకవిః కృతవాన్ సర్గైకేన రఘుపతేశ్చరితమ్". (122)

మొదటి శ్లోకమువలన దిట్టకవి లక్ష్మణకవి శ్రీమద్రామవరప్రసాదకలనా సంప్రాప్త సారస్వత శ్రీమంతుడనియు, షట్కాండ రామాయణకథను సంక్షిప్త మొనర్చి ఏకసర్గమున సద్వితీయముగా వ్రాసినవాడనియు తెలియుచున్నది. ఈశ్లోకవ్యాఖ్యానమున నింటిపేరు ప్రసక్తి వచ్చినప్పుడు;

"దిట్టకవి ఇత్యత్ర కవిశబ్దస్య విశేషణీభూతాగ్రనామఘటితత్వే కథం సమానాధికరణసమాస ఇతి నశంకనీయం నహ్యస్మి విప్రతిపత్తిరితి వ్యవహారాత్ యద్వా దృష్టశ్చాసౌ కవిశ్చేతివా దృష్టం యథాతథా కవయతీతి వా సమ్యగుపపత్తేః" అని కలదు.

రెండవశ్లోకమువలన వీరి మొదటి యింటి పేరు మండలవేములవారనియు, వీరిది కౌండిన్యసగోత్రమనియు తెలియుచున్నది. కనుకనే దిట్టకవియను నింటిపేరు లక్ష్మణకవికాలమున నేర్పడి యుండుననని యూహించితిని. లక్ష్మణకవి తండ్రి కృష్ణకవియై యుండుననని యూహించితిని. 'కృ' అను నక్షరము తరువాత గ్రంథము శిథిలమైనది. కుండలీ కరణములందలి (ష్ణకవి పుత్రః) అను నక్షరములు నా కవిత్వము. ఈ నా కవిత్వము నిజమైనచో మన లక్ష్మణకవి యొక్క తండ్రి సిద్ధమగును తప్పైనచో కృష్ణకవి పుత్రుడే లక్ష్మణకవి యన్న పాఠము నా కంటుకొనును. ఈ యుక్కశ్లోకము నకు వ్యాఖ్యానము లేదు. ఇదియే ఉద్ధరించిన శ్లోకము. కవిని గూర్చిన విశేషము లింతకన్న నెక్కుడు తెలియవు.

ఇక కవికాలమును గూర్చి కొంత విచారింతము. ఈ హనుమద్రామాయణము ప్రతి మరియొకప్రతికి పుత్రికయని నిశ్చయముగా తెలియుచున్నది. దీని మాతృకకు సంబంధించిన ఒకటి రెండు కమ్మలీ ప్రతిలో మిక్కిలి శిథిలావస్థలో నున్నవి. ఐనను పుత్రికలో శిథిలమైన చోటులు కనుగొనుట కివి నాకు మిక్కిలి తోడ్పడినవి. పుత్రికను వ్రాసికొన్నవాడు తేదినిచ్చియున్నాడు. కాని సంవత్సరము వ్రాయబడిన భాగము విరిగిపోయి అందులో చివరియక్షర మొక్కటిమాత్రము కానయాపిరితో నిల్చి పరిశోధకుల పాలిటి పెంటారమైనది. అది యిట్లున్నది. (.... రినామ సంవత్సర ఆశ్వీజ శు॥ ౧౫ భాను వారంవరకు హనుమద్రామాయణం సమాప్తం" కలువలపల్లెరా (నా?) రఘప్ప గారి ... ...)

సంవత్సరము పేరులో చివరియక్షరము 'రి' యని యుండుటచే అది సర్వధారి, వికారి, శార్వరి, రుధిరోద్గారి సంవత్సరములలో నేదో నొకటియై యుండును. 'రి' అంతముగా గల్గిన ఈ నాల్గు సంవత్సరములలో ఆశ్వయుజ శుద్ధపౌర్ణమి భానువారము కలసిన రెండు మూడు నూరేండ్లలో నెప్పుడు వచ్చునాయని వెదకితిని. సర్వధారి, వికారి సంవత్సరములలో రానేలేదు. ఇక మిగిలినవి శార్వరి, రుధిరోద్గారి సంవత్సరములు శార్వరి సంవత్సరమున రెండుమారులు అనగా క్రీ.శ. 11-10-1840 మరియు క్రీ.శ. 12-10-1600 తేదీల సరిపడుచున్నవి. రుధిరోద్గారిలో క్రీ.శ. 28-9-1623 తేది సరిపడుచున్నది. ఈ మూడింటిలో రెండు పదునేడవశతాబ్దము ప్రారంభమునకును ఒకటి పందొమ్మిదవ శతాబ్దము మధ్యభాగమునకును చెందినవి. నాకు జార ఈ ప్రతి మూడునూరులేండ్ల మునుపటి గానట్లున్నది. అవస్థమాత్రము శిథిలముగా నుండుటచే మూడు నూరేండ్లనిపించినను ఈ ప్రతి శార్వరి (క్రీ.శ. 11-10-1840) సంవత్సరమున వ్రాయబడిన దనుకొందును. దీని మాతృక ఇంతకన్న పూర్వపుదనుట నిశ్చయము. ఆ మాతృకకు చెందిన రెండు కమ్మలీ ప్రతిలో మిక్కిలి దీనావస్థలోనున్నవి. ఈవిధముగా మాతృక క్రీ.శ. 1900 ప్రాంతమునకో మరికొంత వెనుకకో పోవును. కవి యింతకన్న పూర్వుడనుట యిందలి సారాంశము. ఒకవేళ ఈ ప్రతియే క్రీ.శ. 12-10-1600 లేదా క్రీ.శ. 28-9-1623 తేదీ లందొకదానికి సంబంధించినదైనచో దిట్టకవి లక్ష్మణకవి కనీసము పదునారవ శతాబ్దము వాడగును. ఇంతకన్న నెక్కుడుగా కవి కాలమునుగూర్చి చెప్పుటకు నాకాధారములు లభించలేదు.

ఈ హనుమద్రామాయణము ప్రతి (నెం. 1567) కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్పుస్తక భాండాగారమున గలదు. ఇది ౮౯ తమ్మెలపై వ్రాయబడినది. దీనిలో మొత్తము 122 శ్లోకములు గలవు. మొదటి రెండు శ్లోకములు ఇష్టదేవతాప్రార్థనాదికములు. చివరి రెండుశ్లోకములు కవి చరిత్రమునకు సంబంధించినవి. ఈ నాలుగు శ్లోకములు పోగా మిగిలిన 118 శ్లోకములందు ఆరుకాండముల రామాయణకథ హనుమద్రామాయణముగా నిబద్ధమైనది. అందులో మొదటి 115 మంజుభాషిణీ వృత్తములు; తరువాతి 7 శ్లోకములు మాలినీ, శాలినీ, స్రగ్ధరా, ఉపజాతి, ద్రుతవిలంబిత, శార్దూల, ఆర్యావృత్తములు.

దిట్టకవి లక్ష్మణకవియే తన గ్రంథమునకు వ్యాఖ్యానము వ్రాసికొని యుండును. వ్యాఖ్యాతృనామము వేఱుగా చెప్పబడక పోవుటచే కవియే వ్యాఖ్యాతయునై యుండునని యూహించుచున్నాను. లక్ష్మణకవి నిజముగా దిట్టకవి. ఈతడు రామాయణ మంతటిని 118 శ్లోకములందిమిడ్చి మంజుభాషిణీ వృత్తము లన్నింటిని అనుప్రాస యుక్తముగా నడిపించి చక్కని ధారాశుద్ధిగల కవిత్వమును రచించినాడు.

ప్రారంభమున గల ఇష్టదేవతాస్తోత్రాదిక శ్లోకము లిట్లున్నవి.

1. "వరదం భజామి శరదంబుదప్రభం ద్విరదం ముఖే శుభదదం తనౌ నరమ్
గణనాథ మాత్మగణనా పరేష్టదం శశిఖండ మండిత శిఖండ మీశ్వరమ్."

2. ప్రమితాక్షరోక్తి ముదితానురాంతకం స్మితభూషణం వితతభానుతేజసమ్,
కలయామి చాపవలయాన్వితం ముదా శరధారిణం దశరథాత్మజంప్రభుమ్."

గ్రంథమున గల శ్లోకము లన్నింటికిని సాధారణమైన వ్యాఖ్యానము గలదు. కాని ఒక్క ప్రథమశ్లోకవ్యాఖ్యానము మాత్రము కొంత దీర్ఘముగా నున్నది. వ్యాఖ్యానమున ఉపలక్షకముగా నెందు ఇదారు పూర్వగ్రంథము లుదాహరింపబడినవి. కనుక ప్రథమశ్లోక వ్యాఖ్యానము నంతటిని ఉదాహరించుట యప్రస్తుతమైనను మంచిదనుకొందును.

"వరదమితి వరం దదాతీతి వరదః తం, శరదంబుదస్య శరత్కాల మేఘస్య ప్రభేవప్రభా యస్య తం తథోక్తం, ముఖే ఆననే, ద్విరదం గజరూపం, తనౌ శరీరే, నరం మనుజరూపం, శోభనో రదో యస్య తం శుభ

ధరం. ఏకదంతమిత్యర్థః, ఆత్మనః స్వస్య, గణానాం సంఖ్యానం, సైవ పరం ప్రధానం, ఏషాం తేషామయమేవ అద్యః పూజ్య ఇతి న్యాయమేవ గణయగా మిత్యర్థః, ఇష్టదం వాంఛితార్థదం, శశిఖండేన చంద్రశకలేన, మండితః అలం కృతః శిఖండః కాకపక్షో యస్య తం, గణనాథస్య వటుత్వాత్ శిఖండమండిత మిత్యుక్తం, యద్వా శిఖండశబ్దస్య మౌళి మాత్ర పరత్వే శశిఖండమండితమౌళి మాత్రపరత్వే శశిఖండమండిత మౌళిమితివా ద్రష్టవ్యం, యథోక్త ముపమన్యు స్తవే: "శశిఖండ శిఖండ మండనం, శరణం యామి శరణ్య మీశ్వర మితి ఈశ్వర మణిమాద్యైశ్వర్యయుక్తం, గణనాథం భజామీత్యన్వయః ఏతేన శ్వేతార్క గణపతి ధ్యానం సూచితం, తదుక్తం మంత్ర మహార్ణవే:-"కుందేందు చందనపయశ్చరదభ్రగౌరం, పాశాంకుశ స్వరదనాభయ పాణిపద్మమ్, ధ్యాయేత్కుమారగురు మిందుకళావతంసం, శ్వేతార్కరూప మిభరాజముఖం గణేశ"మితి. శరదంబుదప్రభత్వ చంద్రశేఖరత్వ గణపతిత్వేశ్వరత్వాది విశేషణైః పరశివస్యాపి భజనం సూచితం. ఆత్మాబద్ధావైపుత్రనామాసి (1) నటీప్రతతే। నను ముఖే ద్విరద మిత్యత్రైవ ద్వౌ రదౌ యస్యేస। ద్విరద ఇతి యౌగికార్థస్య సిద్ధత్వా చ్చతురదమితి పునర్విశేషణే పౌనరుక్త్యాపత్తిరితిచేత్ నైవం."దంతీ దంతావళో హస్తి ద్విరదో నేకపో ద్విప"ఇతి నామాను శాసనాత్ ద్విరదశబ్దో గజసామాన్య వాచకః అన్యథా యోగిశక్తే :— "హేరదపి దుర ఆంతేహ (హేరదమవలంబేహ ?) మేకదంతం పిచండిలమ్, విఘ్నేశ కాననదాత్రం. వరదం ద్విరదం ముఖే"— ఇతి కవి సార్వభౌమాది ప్రయోగే ష్వద్విరంతస్య ఏకదంతత్వం కథం నవిరుధ్యేత అతః 'రూఢిర్యోగ మపహర' తీతి న్యాయేన ద్విరదాది శబ్దానాం రూఢార్థ స్యైవ వక్తవ్యత్వాన్న పౌనరుక్త్యం. అస్మిన్ సర్గే మంజుభాషిణీ వృత్తం లక్షణంతు, 'కవితా సమ్మతా నజౌ సర్గ సంయుతైరచిరా (1) గతైస్సవత మంజుభాషిణీ" ఆదౌ నగణప్రయోగస్య కవికంఠపాశే, పక్ష్మాయుతే పవమానే వహ్నిర్భయం। శుభమతో స్త్ర్యళ్ళేదతి, కవిగజాంకుశే చ. "నగణస్సర్వ సౌభాగ్యదాయక .... స్సర్వదా భవేత్, కర్తుః కారయితుశ్చైవ నగణో నపురోయ" దితి. వాసుదేవతాకస్య నగణస్య వహ్నిదేవతాక రగణస్య (జఘన్యగ) త్యా ద్దాహచ్చృథ్విపదాయకత్వం యుజ్యతే. యద్వా "దేవతావాచకాశబ్దా, యే చ భద్రాదివాచకాః, తే సర్వే నైవ నింద్యాస్యుర్లిపితో గణతోపి వేత్యాదస్య

పదదశబ్దస్య దేవతావాచకత్వేన తస్యైవ రుద్రవాచక పదశబ్దఘటితత్వేన చ, అద్యక్షరస్య (వ) కారస్య అమృతబీజత్వాత్ విచారో నాత్రకర్తవ్యః. అత ఏవ నగణస్య నిర్దుష్టత్వ సుసంగమ్య రత్నాకరే లక్షణకారేణ అతిజగతి నామ్ని త్రయోదశ ఛందసి మంజుభాషిణీవృత్తం ప్రస్తార్య వినిర్మితమితి సర్వమపి సమంజసం. అత్ర పాదచతుష్టయేపి ఏకస్మాదక్షరాత్పరస్థితస్య వర్ణద్వయస్య తదనంతర వర్ణ చతుష్టయాత్పరస్థితేన సజాతీయ వర్ణద్వయేన సహనియమేన ప్రాసస్య అనుగతత్వాదనుప్రాసస్య జాతీయశబ్దాలంకార యో స్సంసృష్టిః" ...

ఈ వ్యాఖ్యానమున వ్రాయసగాని తప్పులు కుప్పలుగా నున్నవి.[1] ఇందులో ఉపమన్యుస్తవము, మంత్రమహార్ణవము, కవి కంఠపాశము,[2] కవి గజాంకుశము, రత్నాకరము (వృత్త రత్నాకరము) మున్నగు పూర్వలాక్షణికుల గ్రంథములేకాక కవిసార్వభౌముడు మొదలగు వారి ప్రయోగములును ఉట్టంకింపబడినవి. ఈ కవిసార్వభౌముడెవరో తెలియదు.

రెండవ శ్లోకమునుండి గల వ్యాఖ్యానము లన్నియు లఘురూపమున నున్నవి. రెండవ శ్లోకమున లక్ష్మణకవికి ఉపాస్యదైవతమగు శ్రీరామచంద్ర మూర్తి ధ్యానమున్నది. ఇది కోదండరామమూర్తి ధ్యానమని వ్యాఖ్యానమున నిట్లున్నది :— "ఏతేన కోదండరామమూర్తి ధ్యానం సూచితం, నిర్ణ (యదీపి) కాయాం, వామేన పాణినా చాపం, దక్షిణేన శరం దధత్, దక్షిణ్యాదివిధో దక్షో, ధ్యేయో రామో మహాద్యుతిః" ఇతి. పై నుదాహరింపబడిన గ్రంథము నిర్ణయదీపిక యగునో కాదో, 'ని' యను నక్షరము సంపూర్ణముగను 'ణ' యను నక్షరము సగమును మాత్రము కలవు. 'ణ' తరువాత వలపల గిలక ఉండియుండునని భావించి 'నిర్ణ' యని వ్రాసి కుండలీకరణములందున్న (యదీపి) యను నక్షరములు పూరించుకొన్నాను. నాయూహ తప్పైనచో క్షంతవ్యుడను.

---

1. అస్మద్గురుపాదులు శ్రీమదాచార్య రఘునాథచక్రవర్తిగారి స్ఖాలిత్యములను సవరించుటలో నాకు సాయము చేసినారు.

2. చూడుడు. 'పుష్పాంజలి' మానపల్లి రామకృష్ణ కవిగారు, భారతి, అక్టోబరు 1927. పుటలు 34-42.

తరువాతి శ్లోకముల వ్యాఖ్యానములందు తరచుగా నమరకోశమును, వ్యాకరణ విషయములకై అష్టాధ్యాయియు, అదవదదవ యాదవనిఘంటువును, సర్వలక్షణము, (నిఘంటువు ?) ను, అమరరత్నమాలిక యును, ఒకచోట 'శోకప్రీతివశోరసారణవటు' వను భట్టమురారి ప్రయోగమును, మరియొక చోట "మందానిలా పూర్వకృతం దధానో" యను మాఘ ప్రయోగమును, "తస్యాలయో నిఖిలలోక" అను శ్లోకభాగము నిచ్చి దీపికా యనియును పూర్వోదాహరణము లిచ్చియున్నాడు.

లక్ష్మణకవి శైలి తెలియుటకై కొన్ని శ్లోకము లుదాహరింతును. కథా ప్రారంభపు శ్లోకము లివి.

"దశకంధరేణ భృశకంపితైస్సురై రభియాచితో దిశ భియా సమన్వితైః।
మిహిరాన్వయే ఉజని హ రామనామతః కమలావతిస్ప విమలాంబుజేక్షణః" (౩)

"వినయేన గాధితనయే సమాగతే కృతపూజనో విగతపూర్వకల్మషః,
అజనందనోపి నిజనందనం దదౌ యతయే సురారిహతయే సలక్షణమ్". (౪)

"కుశికోద్భవేన రసికో ప్రజన్ తథా పథి తాటకాం ప్రమథితామరాం సహ
రఘునందనోపి లఘు సందదర్శరం సుమహాశ్రకార శమనాలయాతిథిమ్" (౫)

"నవనావనాయ పవనాస్త్రమోజసా దధతా సుబాహురథ తాటకాసుతః,
జ్వలనాశుగం చ బలనాశనేన తౌ కృతతాం గతౌ దశరథాంగసూనునా" (౬)

తక్కిన శ్లోకములన్నియు నిటులే యనుప్రాసయుక్తములై రామాయణకథను క్లుప్తముగా చెప్పును.

వాలివధానంతరము సుగ్రీవుడు సుఖముగా రాజ్యమును పాలించుచున్న సందర్భమున వర్షాశరదృతులను ఒకే శ్లోకమున వర్ణించి కవి తన ప్రతిభను చాటుకొన్నారు.

సతతానవగ్రహ తతాభ్రమండలా భృతనీలకంఠ కృతనృత్తగా జగత్,
స్వకులాయయుక్తగకులాథ వార్షుకీనమయాత్ప్రదోషనమయోయథోద్గతిః" (౭౧)

దిట్టకవి లక్ష్మణకవి తన ప్రయోగములందప్పుడప్పుడుకొంత వైలక్షణ్యమును కనబరచినారు. ఉదాహరణమునకు :

"శరభంగకావ్యసుర భంజకోచితో యతి మండలం సద్వృతిమండలోర్వ్యయన్,
తమగస్త్య సన్ముని మగణ్యపై ఠవం ప్రణనామ పుణ్యగుణనామకీర్తనమ్." (91)

పై శ్లోకమున ముని మండలమనుటకు యతిమండల మనినాడు. వ్యాఖ్యానమున 'మునిసమూహం' అని యర్థము కలదు.

లక్ష్మణు డింద్రజిత్తును సంహరించునప్పటి వర్ణన మిట్లున్నది.

"అథ లక్ష్మణో వితథలక్ష్మ సంధర ద్విజయ శ్రియ స్వభుజయష్టి నిస్సృతః,
సుర మాగ్రహేంద్రజిత మాచ్ఛినత్సృద్వైర్వసుజాధిపస్య మనుజాధిపానుజః" (95)

ఈ శ్లోకమున అగ్రహశబ్దము తెలుగుదేశమున ప్రచారమందున్నట్లు కోపమను నర్థమున వాడబడినది. వ్యాఖ్యానమున "సక్రోధస్సన్నిత్యర్థః" అని కలదు.

వ్యాఖ్యానమున అటనట "తెలుగు సంస్కృతము" తొంగి చూచుచుండును; పీఠమిక్కలి కొన్ని శబ్దముల కర్థము వ్రాయునప్పుడు కొంత అశ్రద్ధ చేసినట్లు కూడ కాన్పించును. ఉదాహరణమునకు :

"విలసన్మహాస్త్రబలసంప్లుతో ద్విష ద్గణభేదసోగ్ర రణభేరికారవః
మణిభూషణాశిష్ఫృణిభూషితాంతరోసిరగాత్సురాత్రప్సురగాత్రసౌష్ఠవః" (98)

దీని వ్యాఖ్యానములో గాత్రసౌష్ఠవశబ్దమునకు శరీరశోభ యను అర్థమున్నది.

"అథరావణం విబుధరావణం రణాభిముఖం తదా దశముఖం సమాగతమ్,
అతరోత్తరా లఘుకరో వలోకయన్, ధృశరంహసానసశరం శరాసనమ్" (99)

దీని వ్యాఖ్యలో లఘుకరః అనగా 'క్షిప్రహస్తస్సన్' అని కలదు. ఇటులే

"త్రిదివేశవైరి హృది వేగవత్పరాన్, గ్రథితాంశ్చకార మథితామరాహితః,
రవివంశజోపి పవివద్దురాసదాన్, పురుషోత్తమోథ వపుషోపలోపమే" (103)

దీని వ్యాఖ్యానమున దురాసదాన్ అనగా దుస్సహాన్ అని కలదు.

(సాహితి - ఏప్రిల్ 1962)

దేవులపల్లి అన్నపూర్ణేశ్వరశర్మ

కాల మిదమిత్థముగా తెలియని సంస్కృతకవులందు దేవులపల్లి అన్నపూర్ణేశ్వర శర్మ యొకడు. ఈతడు నరసింహవిజయవ్యాయోగమునకు కర్త. ఈ (No. 4698) తాళపత్రగ్రంథములో మూడువంతుల కమ్మలు పోయినవి. ఉండవలసిన ౧౫ కమ్మలలో ఆరుకమ్మలు మాత్రము మిగిలినవి. ప్రారంభపు రెండు కమ్మలును అటు తరువాత ౪, ౭, ౮, ౯, ౧౨, ౧౩, ౧౪ కమ్మలును పోయినవి. ఇక మిగిలిన కమ్మలాధారముగా కవిని గూర్చియు, అతని కవిత్వమును గూర్చియు పరిచయము చేయుదును.

గ్రంథము మూడవ కమ్మతో ప్రారంభమైనది. ఇందులో ప్రస్తావనయందలి చివరిభాగము కొంత దక్కియుండుటచే కవి వంశావతారము తెలియనగుచున్నది. నటీసూత్రధారుల సంభాషణమున సూత్రధారుడు నటితో నిట్లనును.

"సూత్రధార: :— ఆ! జ్ఞాతం.

శ్రీమద్దేవులపల్లి వంశతిలక: కౌండిన్యగోత్రోద్భవ:
సంగన్నస్య సుతో హి వేంకటసుధీస్తత్కృష్ణనామా తత:
ఆత్రేయస్తనయశ్చ ధూర్తకలుష: శ్రీశీత(నా)ద్రీశ్వర:
సుబ్బారాయసుధీస్తతోస్య తనయోన్నాభ్యాదవత్సత్కవి:

నృసింహ విజయంనామ నూతనం వ్యాతనోత్కృతిం,
వ్యాయోగం సుధియాం ప్రీత్యై నహి గంభీరయా గిరా.

తదభినయేన ఏతత్పారిషదజనమనోనురాగముత్పాదయ"

దీనినిబట్టి నృసింహవిజయవ్యాయోగకర్తయగు అన్నపూర్ణేశ్వర శర్మ వంశావతార మిట్లుండును.

సంగయ్య
|
వెంకటసుధి
|
కృష్ణ (శాస్త్రి)
|
1 2 3 గోపన్నార్య
|
సుబ్బారాయ సుధి
|
అన్నపూర్ణేశ్వరశర్మ
(కృతికర్త)

పిట్టవివరన (18 వ శతమ్ము) గర్భ పీఠికగా నున్నది.

"ఇతి శ్రీమత్త్రిభువనపవిత్ర కౌండిన్యగోత్రపయఃపారావారరాకాసుధాకరస్య నరహరిపాదారవిందనిష్యందమకరందపానమిళిందాయమానమానసస్య సుబ్బారాయాభిధేయస్య సూనునా అన్నపూర్ణేశ్వరశర్మణా విరచితో నృసింహవిజయో నామ వ్యాయోగస్సమాప్తః"

కవి యెప్పటివాడో పీనివలన నిసుమంతయు తెలియరాదు. కవి నివాసస్థానము గోపనాచల ప్రాంతమని (నూజివీడు సంస్థానము) ఊహింపవచ్చును. దేవులపల్లివారి కొందరికి నరసింహస్వామి, మరికొందరికి శ్రీరామచంద్రుడును ఉపాస్యదైవతములని తెలియుచున్నది.

ప్రయోగార్హత్వము నిందు నీ ప్రస్తావనకూడ పూర్తిగా లేదు. నటీసూత్రధారు లిట్లు స్వగతాషణముచేయుచుండగనే ముఖ్యపాత్రప్రవేశమును సూచించుటకు ముందు నేపథ్యమునుండి యొక శ్లోకమిట్లు వినవచ్చును.

"శంభో శంభోస్తుతే ధీః కమలజ విమలాస్యాదరంతే దురంగా
ధీరా మే తే విరోధః సుఖమిహ శిఖినో దండినో మందనం స్యాత్,
చేతః ప్రాచేతసస్యాద్విమలతరమలం యమనో మారుతి ధీః
వాయో శ్రేయోస్తు తే ష్యే సకలదివిషదాం రాజతాం రామరాజః"

ఇది శ్రీ మహావిష్ణువు సకలదేవతలకును అష్టదిక్పాలకులకును అభయ మిచ్చుచు (నేపథ్యమునుండి) పఠించు శ్లోకము. ఇందులో దండి, ప్రాచేతస, రాజరాజ వంటి పదములు కేవలము యమ, వరుణ, కుబేరాదులను సూచించు నట్టివేనా లేక పూర్వకవి స్మరణమిందేమైన సూచితమా? ఈ రాజరాజ కేవలము కుబేరుడేనా? చాళుక్య రాజరాజున కేమైన సూచనగలదా? చాళుక్య రాజరాజని యూహించుటకు నాకు ధైర్యము కలిగించిన దింకొక విషయమిందే గలదు.

తరవకమ్మలో శ్రీహరికిని గురువు(సురాచార్య)నకును జరిగిన సంభాషణ మున్నది. గురుడు హిరణ్యకశిపునివలని బాధలచే ఆయా దిక్పాలకులును, దేవతలును, సూర్యచంద్రాదులును, ఎట్లు భంగపడినది నివేదించుచుండును.

చంద్రునకు 'గ్లా' నమాఖ్య హిరణ్యకశిపు భంగపాటుచే నెట్లు కలిగి నదో బృహస్పతి తన వాక్చాతుర్యముచే నిట్లు వర్ణించి చెప్పును.

"దితిసుతపతికోపానుగ్రహాభ్యాం శశాంకః
క్షయముపచయ మావస్నుర్వృపై స్తద్వదౌషైః,
అనక్పదపి నితాంతం గ్లాపితః క్లాంతకాంతిః
తదవధి గదితో సౌ గ్లౌస్సమాఖ్యస్త్రిలోక్యామ్"

సురగురుని వాక్చాతుర్యమును మెచ్చుకొనుచు శ్రీహరి యిట్లనును.

"హరిః : అహోభవానేవ గురుర్గిరాం. యత ఏతచ్చాళుక్య వాక్యాని ప్రయుక్తే.
అపి కథమేతన్న స్మృశంసినన్య ఏతాదృశానద్భుత పరాక్రమ న్సం
జాతః తదపివద సురగురో."

పైన పేర్కొనబడిన వాక్యములందలి చాళుక్యపదమున కర్థమేమి? మొదటి 'రాజ రాజ' పదమును, ఈ 'చాళుక్య' పదమును అత్యాశగల నన్ను ఒకప్రక్కన పరుసొకందప శబ్దమున కీడ్చుకొని పోవుచున్నవి. అంత ప్రాచీనకృతి లభించుటనునది ఆంధ్రుల భాగ్యమున నుండునా యను నిరాశ మరియొకప్రక్కన పిక్కిలి బాధించుచునే యున్నది.

దేవులపల్లి అన్నపూర్ణేశ్వరశర్మ దేశకాలాదుల సంగతి యెట్లున్నను అతను తెలుగువారు సగర్వముగా చెప్పుకొనతగినంతటి గీర్వాణధురంధరుడు.

శ్రీమహావిష్ణువు సురగురుని వాక్చాతుర్యమును మెచ్చుచు "అహో భవానేవ గురుర్గిరాం" అన్నమాటలు అన్నపూర్ణేశ్వరశర్మకును చెల్లును.

లుప్తమైన భాగములందలి వృత్తాంతమును అందు వచ్చు పాత్రములును తెలియరావు. మిగిలిన ఆరు కమ్మలలో - మొదట నటీసూత్రధారులును ౩వ కమ్మలో హరిగురులును, ౮వ కమ్మలో రంగధాన, వసంత, వసంత కుసుమాకరులును, ౧౦-౧౧ కమ్మలలో శచీ, ఇంద్ర, నారద, జయంత, ప్రహ్లాద హిరణ్యకశిపు - పాత్రములును గలవు. నటీ, శచీ, సంభాషణములు ప్రాకృతములో నున్నవి. ఒక్కచో తక్క, తక్కినచోటులందు ప్రాకృత వాక్యములకు సంస్కృతచ్ఛాయలు కలవు.

అన్నపూర్ణేశ్వరశర్మ కవిత్వము తెలియుటకై అటనటగల కొన్ని శ్లోకము లుదాహరింతును.

సురాచార్యుడు శ్రీమహావిష్ణువునకు ఆయా దేవతలు హిరణ్యకశిపుచే పొందిన భంగపాటులను వినుపించు సందర్భమున గం శ్లోకము లందొకటి. ఇది సూర్యభగవానునకు పట్టిన దుర్గతిని చెప్పును.

దైత్యేంద్రోన్నంత కుంతద్విరదపరశు లుత్తర్క్యంత భూర్యస్సహస్రై
ర్దంభోదాహ్నః ప్రకర్షం ముహురతి లఘిమ కృత్తిలిన్తోజ్ఝి మూర్యన్,
అంభోర్ద్యంతస్సు వర్య్యోత్తర తనూరన కృత్రాప్తె సంజ్ఞస్త్రిలోక్యామ్
అద్యాపి వైకర్తనీం తాం తరను సముగముత్తర్దయా హేత్రగాత్రః.

కోరన్నాద్రి పుణ్యక్షేత్రమును వర్ణించుచు రంగదాస వసంతులకు జరిగిన సంభాషణమునుండి యొకశ్లోకము. ఇది వసంతుడు పలికినది.

"హేలాకోజ్జ్వల పీఠికాక్పురవరం భూరాదిన ప్రవరీ
హారాత్రామిర నవ్తలోక నికరం నిత్యాంతరాలిప్పికమ్,
విరగోపురముల్లాన భువనప్రోతీ తనోరీతు
లోకానాం ప్రకటీకరిష్యదివ తద్విశ్వస్వరూపం మహత్.

ఇదే సందర్భమున గం మరియొక శ్లోకము. గరుడవాహనమును వర్ణించు నీ శ్లోకము వసంతకు (సుమా) కరుని నోట వెలువడినది.

ఏనం కృతీక్పుర పురందర మద్రిభారమ్
క్రద్రూప్రజా విషదవానల భానుధేయమ్,

వక్షఃప్రభంజన చలితకృతపద్మజాండమ్
వక్షేంద్ర మీక్షణయుగక్షణ మీక్షయామః.

కఠినమేరువై యున్న ఇంద్రునకు నారదుడు నృసింహావతార ప్రాదుర్భావమును వర్ణించి చెప్పునప్పటి శ్లోకము.

“శర్వారా స్తంభతోంబోధరనికరసముజ్జృంభ గంభీరరావ
శుంభద్బ్రహ్మాండభిత్తిద్విషద్విదర దశనమిశద్దంభ దంభోళిశేఖి,
పిశాదూక్షస్ఫులింగస్ఫురిత దిశిసురాధ్యక్షసూతేన్నమక్షమ్
దక్షామీక్షన్వ్యశక్షద్యుతి వితతిన్నృహర్యక్ష రూపీక్షరో నః.

హిరణ్యకశిపుడు శ్రీ నరసింహస్వామి పైకెత్తిపోవుటకు సూదుని రథము దెమ్మని చెప్పినప్పటి శ్లోకము. ఇదికూడ నారదుడు దేవేంద్రునకు వినుపించినదై యుండవలెను.

మాయా విస్మృతపుణ్యరాం విదురభిద్దేత్యాని హత్యద్విషం
జోషం చేపిత మాతనోమి సుమనోగుంభాఖిలోజృంభకమ్,
సూతాశ్వానయ సాశ్వ విశ్వకరణం జాంబూనదం స్యందనం
శో మేగ్రే నిపతేదసహ్య బలినః ఫాలాక్షతుల్యోపి సః.

వ్యాయోగాంతభాగమున గల గద్యభాగము.

“శరను మనుజగజరిపువపుర్ధర శ్రీధర!, సురపరిషది హాటకశిపు సుతమభిగాంతమభిం మభిమద్వరిష్ఠమిష్టదృష్టినావ్యష్టత్య దేవరిపుభూవాల్లభ్యం విధాయ విధాతృప్రముఖ మఖభుజస్సుభుజః సభుజగరిపువాహనః ఘృణీంద్రా లోకనే నా కలయ్య నాకలోకగమనాయ యాచితో వరాహనరస్తిరే శోభనాచలే నరలలోకపరిపాలనాయ వసామీత్యభిధాయ యథాయథం గంతుం తేషాం అనుజ్ఞాం దత్వాంత్రాదాసీ ద్దృష్టాచల ఇతి (నిష్క్రాంతాస్సర్వే).”

ఇంత చక్కని రచనచేసిన దేవులపల్లి అన్నపూర్ణేశ్వరశర్మ దేశకాలాదు లిదమిత్థముగా తెలియకపోయినను కనీసము గ్రంథమంతయునైనను లభింప దాయెను. ఇట్టి యుత్కృష్టకృతు లెన్ని కాలగర్భమున గలసిపోయినవో కదా!

నరసింహవిజయవ్యాయోగము వ్రాయబడియున్న ఆరు తాటియాకులకు అటునిటు కన్నాకులుగానున్న కమ్మలపై కొన్ని విశేషములు కలవు. ఇవి

వాగ్యోగమునకు గాని తద్గ్రంథకర్తకు గాని కనీన మా వ్రాయసకానికిగాని సంబంధించినవి కావు. ఈ పుస్తకపు యజమాని యెవరో వ్రాసికొన్న వ్రాతలై యుండును. గ్రంథము వ్రాయబడిన లిపికిని కన్నాకులపైనున్న లిపికిని భేదము గలదు. ప్రారంభపు కన్నాకునకు లోపలి భాగమున నీ శ్లోకము గలదు.

> శ్రీశౌరిప్రియభక్తరక్త విబుధేష్వాసక్తసర్వార్థద
> శ్లాఘ్యం సర్వజ్ఞమహం మహత్సుకృతదం విజ్ఞాపనం జ్ఞాపయే,
> యద్వేల్పూరి పురస్థితైస్సుకృతిభిర్దత్తం నివేశస్థలం
> తన్నస్రాణ కులాబ్జ తిర్మలధరా దేవేంద్ర హాయాన్మమ.

ఇందులో పేర్కొనబడిన వేల్పూరెచ్చట నున్నదో తెలియదు. ఈ నస్రాణ (మొసలికంటి) తిర్మల ధరాదేవేంద్రు డెప్పటివాడో అంతకన్న తెలియదు. ఏ సుకృతు లేపారునకు వేల్పూరులో నివేశస్థలమిచ్చిరో దానిని లాగికొని 'కాశిలో గోహత్య చేసిన పాపం' ఎవరు ఒడిగట్టిరో తెలియదు. మొసలికంటివారిని గీర్వాణీకరించి నస్రాణులను జేసి ఈ శ్లోకమును 'కట్టిన' వారెవరో తెలియదు.

రెండవ ప్రక్కనగల కన్నాకుమీద లోపలిభాగమున ఉబ్బనపుదగ్గునకు "బుద్ధిచాతు ఆలోచించిన ఔషధయోగ ప్రకారము"ను కొన్ని తూకముల, మాపకముల వివరములును గలవు. ఈ ఆకుపైననే వెలుపలి భాగమున తూకములును మాపకముల కొలతలును చెప్పు పద్యములు రెండున్నవి. ప్రాతకాలపు కొలతలను మరచిపోవుచున్న మనకివి కొంత వినోదమునైన కలిగించును.

1 క॥ ధర పరమా నిష్క మనస్
బరగున్ కర్షకము డబ్బు పలమన గిద్దన్
ధరటిన్ కుడుపము సోలగు
బరువడి వీస్తంబు మాని కలరున్ కృష్ణా.

2. క॥ అధకమున్న కుంచంబును
ప్రౌఢిం ద్రోణం బనంగ బరగున్ భూమ్రై
దృఢతర గోనెయు వాహము
బాఢంబగు కావడిలను భారంబనగన్.

(సాహితి, మే 1962)

అయ్యవారు శాస్త్రి

పదునేడవ శతాబ్దము మధ్యభాగమున కందనోలు (నేటి కర్నూలు)లో నుండినవాడీ అయ్యవారు శాస్త్రి. ఈతడు 'సభారంజన'మను ఏకాంక రూపకమునకు కర్త. దీని తాటియాకులప్రతి యొక్కటిమాత్రము (నెం. 2302) కాకినాడ ఆంధ్రసాహిత్యపరిషత్పుస్తకభాండాగారమున గలదు. అది యిరువది తొమ్మిది కమ్మలపై వ్రాయబడి యున్నది. మొదటి యైదుకమ్మలు పోవుటచే కవినిగూర్చిన విశేషములును, అతని పోషించిన ప్రభువును గూర్చిన విశేషములును పోయినవి. ఇంకొకప్రతి లభించిననేగాని ఆ విషయములు తెలియరావు. గ్రంథాంతమందలి యొక్క శ్లోకము మరియు గద్యవలనను కవి మరియు నాతని ప్రభువు దేశనామాదులు తెలియనగుచున్నవి. ముందుగా కవి దేశకాలాదులగూర్చి నాయూహలు ప్రకటించి తరువాత 'సభారంజన'మునందలి విషయములు నివేదింతును.

చిట్టచివరనగల శ్లోకమును గద్యమును ఈతీరుగా నున్నవి.

శ్లో॥ శ్రీనిత్యానందరాయ ప్రభువరసకలశ్రేయసాం కల్పవల్ల్యై
శృంగారాంభోధిపీపీనిచయరసకళాభాసితాశానుభూత్యై,
శ్రీకాలిన్యై భవాన్యై కలితభువనిరాట్సంతతానందచర్యం
భూమావాచంద్రతారం జయతు శుభకరం శ్రీ సభారంజనాఖ్యమ్.

గద్య :- ఇతి శ్రీమదుభయభాషారచనాచతురస్ఫూర్తినా రాజశ్రీ కందనోలు దేశాయ్యానందరాయాస్థానకవినా అయ్యవారు శాస్త్రిణా నిరూపితం రూపకం సభారంజనం నామ సర్వమేకాంకమ్॥—

వీనివలన అయ్యవారుశాస్త్రి ఆనందరాయాస్థానకవి యని తెలియుచున్నది. శ్లోకములలో నిత్యానందరాయడనియు గద్యమున నానందరాయడనియు పేర్కొనబడిన నీ ప్రభువు కందనోలు దేశాయియట. దేశాయి, నరదేశాయి,

దేశపాండ్య, దేశముఖ్ మున్నగు బిరుదములు మహారాష్ట్రుల పాలనమున వెలసినవి. ఒకప్పుడు కర్నూలు బిజాపుర రాజ్యాంతర్భాగముగా నుండినది. అప్పుడచ్చట మహారాష్ట్రులు ప్రభుత్వము నెరపిరి. అట్టి వారిలో నీయానందరావొక్కడై యుండును.

Kurnool District Manual పుట29లో నిట్లు కలదు.

"In 1674 while Kurnool was under Bijapur, the district was visited by Sivaji the founder of the Maharatta dominions, on his way to the South He crossed the Kistna, at Nivartisangam, and after exacting three lakhs of rupees from Ananda Row, Desamukhi of Kurnool, he despatched his army to Hande Anantapur, and proceeded himself to the holy shrine at Srisailam."

శివాజీకి కప్పము కట్టిన ఆనందరావును, అయ్యవారు శాస్త్రిని పోషించిన ఆనందరావును ఒక్కరేయని యూహించుచున్నాను. అదే వంశమునకు చెందిన మరియొక ఆనందరావు కాగూడదా యన్నచో కావచ్చును కాకపోవచ్చును. ఆధారములు లభించువరకు నీ యిరువురభిన్నులనుకొనుట తప్పు. ఈ విధముగా అయ్యవారు శాస్త్రి పదునేడవశతాబ్ది మధ్యభాగమునకు చెందినవాడగును. ప్రారంభపుకమ్మలు పోవుటవలన కవినిగూర్చిగాని యాతని పోషకుని గూర్చిగాని ఇంతకన్న నెక్కుడు తెలియరాదు.

జటప్రోలు సంస్థానమున, నా సంస్థానమున కొకప్పుడు రాజధానిగా నుండిన పెంట్లవెల్లికి సమీపమున అయ్యవారుపల్లెయను గ్రామమున్నది. అది యిప్పటికిని ప్రసిద్ధకవివంశీయుల కాటపట్టు. ఈపల్లెకును మన అయ్యవారు శాస్త్రికిని ఏమైన సంబంధముండెనో తెలియదు. ఈ పల్లె మన అయ్యవారు శాస్త్రికి జటప్రోలు రాజులిచ్చిన అగ్రహారమేమో యని నాయూహ. కర్నూలుకు సమీపమున నీ జటప్రోలు సంస్థానముండుటచే నిట్లూహించుటకు సాహసించితిని. నా యూహలు తప్పైనచో క్షంతవ్యుడను.

ఇక సభారంజన రూపకమును గూర్చి మనవి చేయుదును. పోయిన కమ్మలందిది యేజాతి రూపకమో కవి సూచించియుండును. వివరన మాత్రమీ విషయమై యేమియు చెప్పబడలేదు. రికోపశ్లేషక మెచ్చట జరిగినదో యెటుల

జరిగినదో తెలియరాకుండెను. ముఖమే లేనప్పుడు ముఖసంధి యెట్లుండును? తల లేని మొండెమును పట్టుకొని వ్యక్తి నిర్ణయము చేయుట కష్టముగదా! ఇక నిర్వహణ సంధినిబట్టి యూహింత మన్నచో నదియును లేదు. ఫలాగమ మేమిటో తెలియదు. కేవలము వర్ణన ప్రధానముగా నడచిన రూపకమిది. గ్రంథాంత ర్భాగమున నీ సభారంజనమునకు మరియొక పేరేదియు లేదుకాని తాళపత్ర గ్రంథపు కన్యాకులపై సభారంజనమునియు హితకారీ యనియు నుండుటచే హితకారీ యనునది దీనికి మరియొక పేరైయుండునని తలంచుచున్నాను.

సభారంజనమున నిరువురు ప్రధానపాత్రలు గలరు. ఇందిరామందిర పట్టణాధి పతియగు రసికావతంసుడను ప్రభువు మొదటివాడు; ఆ ప్రభువునకు సఖుడైన హితకారి యనువాడు (అమాత్యపుత్రుడు) రెండవవాడు. వీరి సంభాషణలు రూపకమంతటను వ్యాపించియున్నవి. పోయినకమ్మలు పోగా మిగిలినదానిలో మొదట ప్రత్యక్షమగువాడు దౌవారికుడు. రాజాజ్ఞననుసరించి హితకారిని ప్రవేశపెట్టి దౌవారికుడు వెడలిపోవును. వానిపని యంతటితోసరి. రసికావ తంసుడును హితకారియును వనవిహారము చేయుచుండగా ప్రవేశించి కొలది సంభాషణము చేయువారు వనపాలురు మరియు రాజానుచరుడు. వీరే ఇందలి పాత్రములు.

సభారంజనమున కందనోలు పట్టణమే ఇందిరామందిర పట్టణమై ఆనందరాయ ప్రభువే రసికావతంసుడై, అయ్యవారు శాస్త్రియే హితకారియై వెలసినా రనుకొనుచున్నాను. రాజసభాస్థానమునుండి రసికావతంస ప్రభువును హితకారియును కలసి వనవిహారమున కేగి మరల యాస్థానమును ప్రవేశించు ఒకదినపు (పగలు) కార్యక్రమ మిందలి యితివృత్తము. ఈ వ్యవధిలో వారి కంటబడిన ప్రతివస్తువు, వారి యూహకందిన ప్రతివిషయము సభారంజనమున స్థానము కల్పించుకొన్నది.

అయ్యవారుశాస్త్రి పండితకవి. వైశేషికము మొదలు వైద్యశాస్త్రము వరకు సమయానుకూలముగా సభారంజనమున ప్రవేశించినవి. రసికావతం సుడును హితకారియును వనవిహారమునకు పోవుటకు సన్నద్ధులగుసప్పటినుండి యీ వర్ణనము లారంభమైనవి. రాజాగా రలంకరించుకొనుట కద్దమును చూచు కొందురు, కనుక మొదట వర్ణింపబడినది అద్దము. అది యిట్లున్నది.

"ఆదర్శః నభవతో దర్పణతోంతః ప్రవేశయతి సర్వాన్,
యస్య ముఖ శ్రీర్లోకే తస్య వశే సర్వలోకా స్యుః".

అద్దములో ముఖమును చూచికొని రాజుగారు తన చెవిపోగులోని ముత్యమును వర్ణించుకొన్న పద్యము.

"ముక్తాఫల మభోల్లాసకరో రా (జ్ఞాం) శ్రవోగ్రగః,
సువృత్తశ్చరుచాకారో న కః ప్రభుహితో భవేత్."

వనవిహారమునకై ఇందిరామందిర పట్టణమునుండి బయలుదేరుచున్న సమయమున హితకారి యానగరమును మత్తప్రవరగ్రస్తమగు నొక దీర్ఘ వచనమున వర్ణించును. ఆటుతరువాత నీ శ్లోకములో ముగించును.

"శ్రీమత్సర్వపురీరమా విజయలక్ష్మీలక్ష్మణప్రాభవా
సీమంతాయిత సూర్యసోమసరణిశృంగాగరంగస్మ్రభా,
సత్ప్రాకారనితంబబింబరశనా కల్పాయితస్వర్ధునీ
మేధ్యాసౌ నకథం హి సర్వవిబుధశ్రీమందిరేయం పురీ"

వనప్రవేశ మొనర్చినతరువాత ఇరువురును వారివారి కంటబడిన ప్రతి వృక్షమును వర్ణింతురు. ఆ వర్ణనములందొకప్పుడు శ్లేషచమత్కారములకు సంబంధించిన విషయములును ప్రవేశించినవి. ఈ తీరుగా అశ్వత్థ, బిల్వ, ప్లక్ష, ఉదుంబర, చూత, తాళ, శాల్మలీ, ఖర్జూర, భల్లాతకీ, అభయ, వృక్షాదులు వర్ణింపబడినవి.

ఇది యశ్వత్థవర్ణనము :

"చలదళసంతత చంచలదళవానసి కుంజరోర్థ భీరికా,
పూర్వం కుంజరరక్షా భవతా నారాయణేన సత్కృతా కిమ్."

వృక్షములతరువాత మాధవీ, కురవక సుమలతాదుల వర్ణనమున్నది. ఆ తరువాత సింహ, శార్దూల, వనవరాహ, కురంగ, చమరీమృగాదుల వర్ణనము గలదు.

ఇంతలో మధ్యాహ్నమగును. రసికావతంసుని కులదేవతయగు భవానీ మందిర మా వనమున నుండును. అచటనే పూజోపకరణములు సిద్ధముగా నుండును. అప్పుడు హితకారి బుట్టను.

"మహారాజ ఇతో నిరూపయ. తరుణారుణకిరణప్రభాపరిధానసరస సారసముకుళకుచచూచుకాయితో భృంగీసంగీతద్విగుణిత హంసాస్వదపదారుణ కంజాతా, జాతరూపసరూపకింజల్కాభరణప్రభాత, కాళాంబురాదంతర సైకతశ్రోణితటా, తటవిటపిసటత్కలాపి కలాపవేణీ వేణీబాహు రంగత్త రంగ హస్తసంజ్ఞయా మహారాజ(మాహ్వయంతీవ) పురస్థితా."

ఈ సందర్భమున, సరోవర, కమల, షట్పద, హంస, కుముద, మత్స్య, చాతక, నీలకంఠ, చకోర, చంద్ర, చక్రవాకముల వర్ణనమున్నది. వీనిలో చకోవర్ణన మీలరుగా నున్నది.

"చకోర తారకోదార యోగోర్యస్తో నిరంతరం,
సహిచే చంద్రికాపానం కథం ఖేచరముద్రయా."

ఇంతలో నేపథ్యమున కోలాహలము వినబడును. రసికావతంసుడు "కోయం విచార్యతా" మనును. అప్పుడు హితకారి "మహారాజ నికిమప్యస్మదనుచరేణాహూతై। ఫలకుసుమభారనమ్రైః। మహారాజదిదృక్షయాగతై। వనపాలైర్భవితవ్య" మనును. ఈ సందర్భమున రాజానుచరునకును వనపాలకునకును జరిగిన మోటుహాస్యపు సంభాషణ మొకించుక గలదు.

అటుతరువాత వనపాలుడు తెచ్చిన వివిధఫలకుసుమముల వర్ణన మున్నది. ఖర్జూర, జంబీర, ద్రాక్ష, మాతులుంగ, దాడిమీ, పనస, రంభా, నారికేళ, కపిత్థ, రసాల, బదరీ, జంబూ, కళింగ, ఉర్వారుక, బింబఫలము లీసందర్భమున వర్ణింపబడినవి. వీనిలో పనసవర్ణన మిట్లున్నది.

"పనస విహారమేవ బృహత్కుక్షిత్వం న యది కుత్ర వర్తంతే,
అభ్యంతరాణి తస్మాత్ కంటకిఫలతా తు సఫలతా భవతః"

ఫలముల తరువాత పుష్పములు వర్ణింపబడినవి. ఇచట మల్లికా, గంధఫలీ, కేతకీ వర్ణనలు గలవు.

ఒకవైపు మధ్యాహ్నపు టెండ తీవ్రముగా నుండగా మరియొకవైపు గాలి యాడకుండును. దీనిని పురస్కరించుకొని వ్యజనము వర్ణింపబడినది.

"వ్యజనమేవ వరోపకృతౌ కృతీ నహి పరః పరితోऽపి విచార్యతాం,
నను పరిభ్రమతాం చ స్వజామహో స్వహితకార్యపరాన్మరుతామపి".

వ్యజనమునకు కట్టబడియున్న బర్హమును పురస్కరించుకొని బర్హి వర్ణనము, శరీరవర్ణనము, బంధురవర్ణనము లున్నవి.

ఇంతలో స్నానసమయమగును. ఆ సందర్భమున పీఠము, చెంబు, విభూతి, శ్రీ ఫలము, స్థాలి, ఉద్ధరిణి మున్నగువాని వర్ణనములున్నవి. ఇది యుద్ధరిణి వర్ణనము.

"ఉద్ధరిణి ! సర్వవిదుషా ముద్ధరణే జీవనస్య తే సృష్టిః,
నోచేత్సర్వాత్రస్థితిమత్స్వర్ణః కస్య తాదృశం భాగ్యమ్"

చండికాయతనమున పురోహితు లెదురుచూచుచుండగా రసికావతంసుడును హితకారియును దేవ్యాలయము ప్రవేశించి పూజాదికము లొనర్తురు. ఈ యదనున దేవిని స్తుతించిన శ్లోకము లిట్లున్నవి.

"అంబ ! జగతోవలంబన మంబా త్వైవ విహితమిహ భూయః,
అవలంబయ మాం కృపయేత్యుక్తిః పునరుక్తమిరి మయా నోక్తా".

"చండి ! తవచంద్రకానన మండలగమనాదిరార్యమవనిధుర్యం,
చండాదిదైత్యఖండన ఖండన చాతుర్యకార్య కలవిస్తార్యమ్".

"వందేహం జగదంబాం వందితసురసుందరీ కృపాలంబాం,
సుందరముఖాబ్జ కచరోలంబా ముంబరవిలాసి సునితంబాం."

"వాణీం వీణాయత్తామాణవ మర్యాంశుశోల్లసత్పాణీం
వేణీ విహితలతాంతశ్రేణీ మేణీదృశం చ సుశ్రోణీం."

"భ్రమరామలకభ్రమరాం భ్రమరాహిత్య ప్రదావహృద్యభ్రమరాం,
అమరీకృతమకరిహరా మధరీ మధురి రుచీం పతిరావ్యాం."

దేవీప్రసాదమును స్వీకరించిన తరువాత భోజనమునకు సిద్ధమగుదురు. ఇక కావలసిన దేమున్నది ! వర్ణభోజనము మొదలు పెసపాత్రము వరకును పులును మొదలు పంచభక్ష్యపరమాన్నములును వర్ణింపబడినవి. శాకములన్నియు వర్ణింపబడినవి, మధుర శాకం, రాజగిరి, మెంతి, ఉపోదకి మొదలగునవి. కూరగాయలందు కూష్మాండము, వార్తాకము, కారవల్లి, పటోలము, కోశాతకి అలాబు, సూరణము మొదలగునవి చేరినవి. అటుతరువాత హింగు, సిద్ధార్థము

మరీచము, భక్ష్యములు, పరమాన్నము, హయ్యంగవీనము, సైంధవము, తింత్రిణీఫలము వర్ణింపబడినవి. వీనిలో కొన్నింటివర్ణనము లుదాహరింతును.

పటోల (పొట్లకాయ) వర్ణనమిట్లున్నది.

"పటోల దీర్ఘాకృత్యాపి లాఘవకేన సాధితం,
పాషాణవహనాదిభ్యః సాధనేభ్యః కిమర్థితమ్"

కూష్మాండ (గుమ్మడికాయ) వర్ణనమిట్లున్నది.

"కూష్మాండ సర్వమధురోవ్యలాదుర్వేద్యః సాధువృత్తోసి,
బాల్యే సర్వాపథ్యం భవదాచరణం కిమేత దుపపన్నమ్"

ఇంతవరకు చెప్పబడిన విషయమంతయు 24 తాళపత్రములందున్నది. 26వ పత్రము పోయినది. కనుక భోజనానంతర మేమిజరిగినదో అది 25వ కమ్మలో పోయినది. బహుశః భుక్తాయాన వర్ణనముండియుండును. 26 కమ్మలో మరల రాజుగారు పురమునకు తిరిగిపోవుటకు సిద్ధముగా నుందురు.

పురప్రవేశ సందర్భమున పౌరాంగనల వర్ణనము, అటుతరువాత సభా వర్ణనము, సింహాసనవర్ణనము, వితానవర్ణనము, ఉపబర్హణ, కాకితపత్ర, సులోచన, లేఖినీ, దీపస్తంభ, ధూపకళికా, ఛురికా, పీఠాదుల వర్ణనమున్నది. వీనిలో కాగితము వర్ణనమిది.

"కాకితపత్రే! కస్యహి కాచస్యాప్యనసేహి మాలిన్యం,
తదపరిమితమపితాళం నహి తాదృశ మత్రగామితా తస్మాత్."

ఇటుల కొంతసేపు కడచిన తరువాత హితకారి "మహారాజా! నకలకళా ప్రవీణ కళావత్యాఃపహ సరససంభోగశృంగార మనుభవితు మయమేవావసరః" అనును. దీనినిబట్టి రసికావతంసుని భార్య కళావతియని తెలియుచున్నది. వయస్యుని మాట దాటరానిదని రాజుగారందురు. అప్పుడు హితకారి యిట్లా శీర్వదించును.

శ్లో॥ "రాజన్ సామ్రాజ్యలక్ష్మీ విభవవిలసితః సర్వదిక్కుంభికుంభ
ప్రోద్యన్ముక్తాఫలశ్రీ సహచర యశసా ఖ్యాత విద్వద్గణశ్రీః,
త్వం పుత్రైః పౌత్రవర్గైర్లలిముదితమనాశ్చాయురారోగ్యభాగ్యః
కృత్వా సంపూర్ణకామో భవ భవగృహిణీ పూజయా చంద్రతారమ్॥"

అటుతరువాత రసికావతంసు డొక శ్లోకమిట్లు వర్ణించును.

"జయంతి బహుధా సుధామధురబంధురాబంధుర
ప్రబంధరచనా చమత్కృతి కృతార్థనద్వైభవాః,
ప్రసూనచయసౌరభైః ప్రనవధేనుదుగ్ధాంచితై
ర్వచోభిరభితన్వతాం ప్రభవ ఏవ సంభావితుమ్."

అటుతరువాత హితకారి "మహారాజ భవత్ప్రసాదేనానుభూత సదానందవార్ధి కల్లోల మాలికా కేళికావైభవః మహారాజ స్యాజ్ఞాపూర్వకం మామ కాగమాపేక్షామీక్షితుం కృపావతీం మత్ప్రియాం ప్రతిగచ్ఛామి" యని నిష్క్రమించును. అందరును నిష్క్రమింతురు. ఈ చివర వాక్యములవలన హితకారి భార్య కృపావతియని తెలియుచున్నది. పైన పేర్కొనబడిన ఒండురెండు శ్లోకములందు నిర్వహణసంధి సమాప్తి యెట్లు కలిగినదో నాయూహ కందుట లేదు. 'సదానంద వార్ధికల్లోల' ఇత్యాది వాక్యమున కందనోలి దేశాయి యగు ఆనందరావు స్ఫురించుచున్నారు. పోయిన కమ్మలు పోగా మిగిలిన శిథిల భాగములను పూరించుకొని అయ్యవారు శాస్త్రి సంస్కృత సాహిత్యసేవను నాయోపినంత ప్రదర్శించితిని. +

\+ వ్రాతప్రతులను సవరించుకొనుటయందును, శిథిలములు పూరించుకొనుటయందును నాకు తోడ్పడినవారు మద్గురుపాదులు శ్రీమదాచార్య రఘునాథ చక్రవర్తిగారు, కర్నూల్ మాన్యువల్ సంప్రదించుటకు మార్గదర్శకులు, డాక్టరు నేలటూరు వెంకటరమణయ్యగారు. ఈ యిరువురకును కృతజ్ఞుడను.

(సాహితి, జూలై 1962)

పింగళ ముత్తాజీ మంత్రి

కాల మిదమిత్థముగా తెలియరాని సంస్కృత కవులందు పింగళ (?) ముత్తాజీమంత్రి యొకడు. ఇతని కృతి సాంబోదయము చంపూప్రబంధము. దీని యసమగ్రప్రతి యొక్కటి మాత్రము (నెం. 3663) కాకినాడ–ఆంధ్ర సాహిత్యపరిషత్పుస్తకభాండాగారమున గలదు. ఈ యసమగ్రచంపూకావ్యము మొత్తము 88 తాటాకులపై నున్నది. ప్రథమాశ్వాసమున 67 గద్య పద్యములును ద్వితీయాశ్వాసమున 45 గద్యపద్యములును సవ్యాఖ్యానముగా నున్నవి. సాంబోదయమందలి ఇతివృత్తము శ్రీకృష్ణునకు జాంబవతియందు సాంబుడుదయించుట. ఉపలబ్ధభాగమున నున్న కథనుబట్టి నష్టమైన భాగమే యధికమని తెలియుచున్నది.

గ్రంథకర్తయును, వ్యాఖ్యాతయును గొప్ప పండితులు. ఈగ్రంథమును వ్రాసికొన్న వారెవరోకాని ప్రతిపంక్తియందును వ్రాత తప్పులున్నవి.* గ్రంథావతారిక వలనను, ఆశ్వాసాంతగద్యలవలనను తెలియనగు గ్రంథకర్త, మరియు వ్యాఖ్యాతలగూర్చిన విశేషములు మొదట నివేదింతును.

గ్రంథావతారికయందలి మొదటి మూడు శ్లోకములలో, వినాయక, త్రిభువనేశ్వరీ, శివుల స్తోత్రములున్నవి. తరువాత రెండు శ్లోకములందు మాతాపితృవందన మీరీతిగా నున్నది.

"శ్రీకాంతా చపలా (నగేంద్రతనయా) చండీ కునాప్ని మహీ
జల్పాకీ చతురాననస్య వనితా భాగీరథీ శంగభాక్,
కావాస్యా స్వర్ణశో భవంతి సుదృశో ధీరాస్తువంతీతి యాం
తాం మే మాతరమానమామి శిరసా తిమ్మాంబికా మన్వహమ్.

* మద్గురుపాదులు శ్రీ మదాచార్య రఘునాథ చక్రవర్తిగారి సాయము లేకున్నచో వ్రాత తప్పులతోనున్న ఈ గ్రంథము నాకర్థమయ్యెడిదే కాదు.

"ఆగర్భాభ్యుదయో భువీహ కమలోల్లాసాయ యస్యద్విజాం
శ్రుత్రాఖ్యాంశ్చ సుధీః ప్రమోదయతి యో దూరం తమో నిఘ్నన్,
సోయం మజ్జనకో నమజ్జనదయాశీలీ దివాకీవలన్
తేజో భానుబుధోత్తమో విజయతాం శశ్వత్తరాం (శ్రేయ)సా".

ఈ శ్లోకములవలన కవి తల్లిపేరు తిమ్మాయుంబయనియు తండ్రి భానుబుధోత్తముఁడనియు తెలియుచున్నది. ప్రథమాశ్వాసాంతగద్యమున కవిని గూర్చిన వివరములింతకన్న నధికముగా గలవు.

"ఇతి శ్రీమత్సకలలోక విఖ్యాతపవిత్ర భారద్వాజగోత్రతిలక పింగళాన్వయ పయోధిరాకాసుధాకరేణ, ఆశ్వలాయనసూత్రాచార ప్రవర్తకేన, శ్రుతిస్మృతిఇతిహాస పురాణాధ్యయనతో దారాచరణ ప్రచారణధురీణేన, ఆశ్రితవిద్వద్బృందాభీష్టప్రదాన సంతన్యమాన యశోవితానవ్యాప్త దిగంతరాళేన, త్రిభువనేశ్వరీపాదారవిందమకరందాస్వాదానందతుందిలేందిందిరాయమాణ నిజాంతరంగేణ, అద్వైతరాద్ధాంతనిష్ఠాగరిష్ఠేన, భానుజీప్రధానతిమ్మాంబికా గర్భశుక్తిముక్తాఫలేన, శ్రీమతా ముత్రాజీమంత్రిశిఖామణినా ప్రణీతే సాంబోదయాభిధాన చంపూప్రబంధే ప్రథమాశ్వాసః"

ఈగద్యమువలన పింగళముత్రాజీ మంత్రి భారద్వాజగోత్రుఁడని తెలియుచున్నది. కళాపూర్ణోదయ కృతికర్త పింగళి సూరనార్యుఁడును, ఆధునికులగు ఆచార్య శ్రీ పింగళి లక్ష్మీకాంతముగారును గౌతమగోత్రులు. తెలంగాణమున ఓరుగల్లు, కరీంనగరం, హైదరాబాదు మండలములందు పింగళివారున్నారు. వీరు భారద్వాజ గోత్రులు. కనుక ముత్రాజీ మంత్రికూడ తెలంగాణమువాఁడై యుండునని యూహించుచున్నాను. తానాషా కాలమందుండిన సుప్రసిద్ధ సోదరులు అక్కన్నమాదన్నలుకూడ పింగళివారు మరియు భారద్వాజ గోత్రులు. తెలంగాణమందలి ఈ పింగళివా రొకప్పుడు మహారాష్ట్రులను వాద మొకటి కలదు. కాని దీనికి చారిత్రకాధారములు లేవని విజ్ఞులందురు. అనను భానూజీ, ముత్రాజీ వంటి పేరులు కొంత మహారాష్ట్రవాసన గలవిగానే కన్పట్టుచున్నవి. అక్కన్న మాదన్నల తండ్రిపేరుకూడ భానూజీమంత్రి. సాంబోదయ కృతికర్తయగు మన పింగళి ముత్రాజీమంత్రి తండ్రిపేరు కూడ భానుజీ ప్రధాని. గోత్రము, తండ్రిపేరు ఒకటిగా నుండుట చూచి మాదన్నకే

ముత్తాజీ యను మరియొక పేరుండి యుండినని కొంత ఆర్వాచీనులొక యూహ చేసిరిగాని చారిత్రకులు అక్కన్న మాదన్నల తల్లిపేరు భాగ్యమ్మ యని నారు. ముత్తాజీ తల్లిపేరు తిమ్మాంబ యగుటచే నాయూహ సరిపడుటలేదు.

ఈగద్యమువలన ముత్తాజీమంత్రి త్రిభువనేశ్వరీమంత్రోపాసకుడనియు తెలియుచున్నది. చంపూకావ్యమును చంపూప్రబంధమనుట పిల్లలమఱ్ఱి పిన వీరభద్రుని నాటినుండియే తెలుగునాట పరిపాటియని విజ్ఞులెరిగిన విషయమే. ముత్తాజీమంత్రి తెలుగువాడు కావున (తెలుగు ప్రబంధములందువలె) తన సంస్కృతచంపూకావ్యమునగూడ తెలుగు మర్యాదను ప్రవేశపెట్టి ఆశ్వాసములుగా విభజించినట్లీ గద్యము సాక్ష్యము.

ఇక వ్యాఖ్యాతృపీఠిక సారమరయుదము. ఈ పీఠికలో మొదటిశ్లోక మిట్లున్నది.

"ధ్యాత్వా సత్యమసీమ మీశమనిశం న్యగ్రోధమూలాలయం
కృత్వా చేతసి దేవకేంద్రచరణం సర్వాభిలాషప్రదమ్,
జ్ఞా (త్వా)లంకృతదివ్యకావ్యపదవీం వ్యాఖ్యాతి కృష్ణస్సుధీః
మత్వా ప్రాజ్ఞహితం గభీరహృదయం సాంబోదయం సోదయమ్."

వ్యాఖ్యాతయగు కృష్ణపండితుడు దక్షిణామూర్త్యుపాసకుడని దీనివలన తెలియుచున్నది. తెలుగు పద్యములందువలె శ్లోకమున ప్రాసనియమము పాటింపబడుట గమనింపదగిన విషయము. రెండవ శ్లోకమున వినాయక స్తుతియు, మూడవ శ్లోకమున సరస్వతీ స్తోత్రమును, నాల్గవ శ్లోకమున కృతికర్త ప్రశంసయు కలవు. ఐదవశ్లోక మీవిధముగా నున్నది.

"సోఽపర్యమూదామణి ధన్యకాన్య
వ్యాఖ్యాసమాఖ్యాపిత గూఢభావా (వమ్)
నావ్యేతి (త్రి) విశ్వేశ్వరపండితేంద్రో
వ్యక్తీపయత్సుందరపూర్వ గోష్ఠ్యామ్ "

ఈ విశ్వేశ్వరపండితుడెవరో తెలియదు, కృష్ణపండితునికంటె పూర్వము ఈతడు కూడ సాంబోదయమునకు వ్యాఖ్యానము రచించినవాడై యుండును. కృష్ణపండితుడు తన వ్యాఖ్యానమునకు కృష్ణకౌతూహలమను పేరు పెట్టినట్లు చెప్పుకొన్నారు.

"సాంతోదయాఖ్య సత్కావ్య వ్యాఖ్యా విఖ్యాతలక్షణా
కృష్ణకౌతూహలాఖ్యా మే ప్రఖ్యాతిం భజతాం చిరమ్"

వ్యాఖ్యాత రచించిన ఆశ్వాసాంతగద్యమీరీతిగా నున్నది.

"ఇతి సర్వమంగళాలింగిత దివ్యమంగళ విగ్రహపరిగ్రహశాలి శ్రీ రక్షామూర్తి దేవతాసార్వభౌమ మహామంత్రనిరంతరచింతన సంపత్సంపాదితనిరవద్యహృద్య విద్యావైశద్యస్య నిఖిలపతివ్రతాశిఖామణి శ్రీరాయమాంబా...నందితాఖండలనక్షత్రీ నంతతసంతన్యమాన సంఖ్యావత్పుండరీక మండల చండాంశో: శ్రీమద్రాఘవదైవజ్ఞాన్వయ పయఃపారావారతారాధిపస్య శ్రీకృష్ణనందితమణేః కృతాయాం సాంతోదయవ్యాఖ్యాయాం కృష్ణ కుతూహల సమాఖ్యాయాం ప్రథమాశ్వాసః"—

ఈగద్యమునగల రాయమాంబ ఎవ్వరో తెలియదు. ఆమె పేరు తరువాత రెండు మూడక్షరములకు చాలినంత స్థలమూరక వదలబడియున్నది. ఆమె ఏ సంస్థానమునకు ప్రభ్వియో? ఆ యాస్థానమున రాఘవదైవజ్ఞాన్వయుడైన ఈ కృష్ణనందితు డుండెను కాబోలు. జాతకసారసంగ్రహకర్త రాఘవభట్టును ఈ రాఘవదైవజ్ఞుడును ఒక్కరగుదురో కారో తెలియదు. ఈ గ్రంథ మాధారముగా కవి మరియు వ్యాఖ్యాతలగూర్చిన విశేషము లింతకన్న నెక్కుడు తెలియరావు.

ఇక సాంతోదయ చంపూప్రబంధము సారస్యము.

ద్వారకాపుర వర్ణనముతో నీకావ్య మారంభమైనది. దీనిలో ప్రథమ శ్లోక మీవిధముగా నున్నది.

"అస్తి ప్రశస్తరవస్తుభిరుల్లసంతీ పూర్వాకరా జగతి సుందరమందిరాఢ్యా,
తర్కోపమనుస్ఫురతి మానసమానసత్క్ష్మా యస్యాన్నుదేంద్ర నగరీ నగరీయసీతి"

ఆటుతరువాత చాతుర్వర్ణ్యము, చతురంగబలము, ప్రాకారము, సౌధపంక్తి, ఉపవనాదుల వర్ణనములు మన తెలుగు ప్రబంధములందువలె వరుసగా నున్నవి. శ్లేషచమత్కారములతో శబ్దార్థాలంకారములతో అభేదాధ్యవసాయములతో నీ వర్ణనలు ముత్రాజీమంత్రి ప్రౌఢకవితా సంపదను అడుగడుగునను చాటుచున్నవి. ఉదాహరణమునకై వీనినుండి కొన్ని గద్యపద్యములనుట్టంకించుదును,

రాజమండలవర్ణన మిట్లున్నది.

"సౌధోదయేన కుముదం కళావతా, నిత్యవిష్ణుపదరాజ్యోదంచయత్,
రాజమండల మిహ ప్రకాశతే, పాలయద్విజకులం తమోపహమ్."

ఇది ప్రాకార వర్ణనము.

"అష్టాపదేష్టకచితో వరణః ప్రభాలి, తస్యామహానవది శైల ఇవ ద్వితీయః,
యత్కూటకోటిగణనాం రచయన్నివాస్తే, భానుః కరైర్దశశతైరుపకంఠభాగే"

సౌధముల వర్ణన మిట్లున్నది.

"సౌధాస్సారాస్సైంధవీకేళిశైలా, రాజంతే౽స్యాం వైజయంతం జయంతః,
సంక్రాంతా యస్మాన్నీలాశ్మభాసా, స్వర్గంగాలేఖ్యంచితే వార్యకల్పా"

అటుతరువాత నొక ప్రౌఢగద్య మీ తీరుగానున్నది.

"అపిచ వినీలతమాలకాననాభిః వృధుల కుచభాసమానాభిః, కమనీయ రసాల దంతచ్ఛదరమణీయాభిః, కాంచన కర్ణికార రచితశోభాభిః, శుకపిక మధురస్వరలలితాభిః స్త్రీలాసినీభిః; వికసత్కమలముఖరాజంతీభిః, అనవరత లాలితాళిస్వనాభిః కమలినీభిః; లతాంతసుపత్రతరంగరచనాచతురైః రత్నకైరాఙ్య యత్నైర్గంధవహైశ్చ; ధర్మశాస్త్ర కలాలంకర్మకైః ప్రత్యర్థిదానసముచితభూరి కాండైః శూరైరుదారైశ్చ; గదోత్క్షేపప్రవీణతరైః వైద్యవల్లభైర్యోధవరైశ్చ దీవ్యమానా ద్యౌరివ దివ్యత్కవిబుధగురుసద్గణా, సురపురీవ సురుచిరాప్సరోవర విహారమాణ బృందారకరాజి ర్వసంతశ్రీరివ సురభిసుమనోభరితా, పుండరీకాక్షవక్షస్థలీవ వైజయంతీ లక్ష్మీవిరాజమానా, వామదేవతనురివ నిరంతరార్యాశ్రితా, సరసిజభవపరిషదివ క్రతుదక్షవసిష్ఠబ్రహ్మనమార్యాసితాపి రాజవంశాకీర్ణాపి నాన్యోన్యవిమర్దసంతాప తాపా పరిశీలితకృష్ణపక్షాపి పూరితపూర్ణ తమో జాతా, ధర్మేతరసర్వతోముఖవాహినీసమాశ్రిత ప్రతోశరవ్యపేతజల సంసర్గా సాధులోకసమాక్రాంతాపి పుణ్యజనదరపీయనీ ద్విజిహ్వానాం వసతిం భోగవతీంచ కింపురుషనికరాకీర్ణామలకాం చ న్యక్కుర్వతీ విశాలాపి చ కల్యాణీ మధురా యోధ్యానటీ బహునగరమయాప రాజతే సేయం రాజధానీ"—

ఈ విధముగా ద్వారకాపురమును వర్ణించి ఆ పురమందుండునట్టి శ్రీ కృష్ణభగవానుని వివిధగద్యపద్యచూర్ణికాదులందు విపులముగా వర్ణించినాడు.

శ్రీ కృష్ణుని కీర్తిప్రతాపముల వర్ణనమిది.

"కీర్తిప్రతాపౌ కిలదంపతీవ, త్రైలోక్యసౌధే లసతస్స్మ తస్య,
శంకే శశాంకద్యుమణీ తనూజౌ తయోరిమౌ పాండురచండరూపౌ."

శ్రీ కృష్ణుని దానశౌర్యముల యుగపద్వర్ణన మిది.

"ధర్మం గృహీత్వాపి గుణప్రవిష్టం నమార్గణవ్రాతమహో ముమోచ,
తథాపి రాజాంతమిమం సమిత్యాం ప్రత్యర్థిదానప్రవణం వదంతి."

అతని సౌందర్యమునకు దర్పణ మీ శ్లోకము.

"నిలింపశంపానయనాంతరంగ, ప్రకంపనసంపాదకమస్య రూపమ్,
కింవర్ణయామ్యస్య లతాంతధన్వా లావణ్యభూర్యస్య యతః కుమారః."

ఆపైన రుక్మిణీకృష్ణుల వివాహ మొక్క శ్లోకమున వర్ణింపబడినది. అటుతరువాత జాంబవతీవివాహవృత్తాంత మారంభమైనది. ఇది ప్రథమాశ్వాస మందలి 34-37 గద్యపద్యములందును లభించినంతవరకున్న ద్వితీయాశ్వాసపు 45 గద్యపద్యములందును సాగినను వివాహము జరుగకపూర్వమే గ్రంథము లుప్తమైపోయినది.

సత్రాజిత్తు వర్ణనము, అతడు సూర్యునారాధించి శమంతకమణిని సంపాదించుకొని పురము ప్రవేశించుట, పౌరులా మణిప్రభావమున వెలుగు సత్రాజిత్తును సూర్యుడని భ్రాంతిపడి శ్రీకృష్ణునకు నివేదించుట, సత్రాజిత్తు దినచర్య, శమంతకమణిని ధరించి ప్రసేనుడు వేటాడబోవుట, మృగయా విహారము, సింహము ప్రసేనుని చంపుట, జాంబవంతుడా సింహమును చంపి శమంతకమణిం గొంపోయి తన కూతునకు లీలా కందుకముగా నిచ్చుటలు 34 నుండి 60 వరకు గల గద్య పద్యములందు చెప్పబడినవి.

ఇంతవరకు జరిగిన కథలో హరివంశమునకుగాని భాగవతమునకుగాని భిన్నమైన కల్పనలెట్టివి లేవు. ఇది చంపూకావ్యము గనుక ప్రారంభమందలి పుర వర్ణనాదు లతిదీర్ఘముగా సాగినవి. కాని ఇప్పటినుండి కొలది మార్పులు కథలో కానవచ్చుచున్నవి. తెలుగు హరివంశములో జాంబవంతుడు శమంతక మణిని తన కుమారునకు కేళీకందుకముగా నిచ్చినట్లున్నది. తెలుగు భాగవత ములో "నొక్కబాలిక చెరువ దరిసియ కేళీకందుకంబుగా వ్రేలంగట్టబడి"

నట్లున్నది. ఈ బాలిక జాంబవతియో లేక యామె చెలియలో తెలియదు గాని సాంబోదయచంపూకావ్యమున జాంబవంతుడు జాంబవతి కిచ్చినట్లున్నది.

"జాంబవాన్ మణిమాదాయ, దాయాదాయ దదే ముదే,
లీలాకందుకయామాస, బాలాకృతి రసావపి."

ముత్తాజీమంత్రి తన కావ్యప్రబంధమునకు కావలసిన కథాకల్పన మిచ్చటి నుండి ప్రారంభించినాడు. హరివంశము భాగవతము మున్నగువానిలో నీ సందర్భమున శమంతకమణిని వెదకుచు శ్రీకృష్ణుడు వచ్చుట జాంబవంతునితో పోరాడుట లాదిగాగల కథయుండును. సాంబోదయకావ్యమున శ్రీకృష్ణాగమన మిప్పుడులేదు. ఈ పట్టున నిచ్చట నారదాగమనము గలదు. నారదాగమన మొక చిన్న చూర్ణికయందీ విధముగా వర్ణింపబడినది.

"అథ కదాచన యదృచ్ఛయా సంచరమాణః సస్వరమాణ వీణాపాణి ర్వాణీజానిసూను ర్గాంగలో గాంగతోయధ్యాయశాయ ప్రవాలనికాయైరశదిశా యామవతన్య చందనలేపమాపాదయన్ మోదయన్నేదిసించ పాదన్యాసైరుత్కే. తనం నికేతనం జాంబవతో విడంబితాంబర రత్నకంబరం విభ్రాజదంబర రత్నస్థగితం నిగనిగద్భూరిపటలజటిలసభాభవనం ప్రవివేశ"—

ఇట్లు ప్రవేశించిన నారదుని జాంబవంతుడు యథోచితముగా పూజించును. ఈ యిరువురు కూర్చొనియుండగా జాంబవతి ప్రవేశించి తండ్రి యంకతల మున గూర్చుండును. ఈ పట్టున జాంబవతీ వర్ణనము అష్టశ్లోక కులకమున గలదు.

"సంఫుల్లమల్లికాగర్భ కబరీభారబంధురా,
ద్వైరివేందుకరాంకూర విశల్లలరభాసురా"

"ఆకర్ణాంతసటభ్రాంతశ్లోచనాభ్యాం మనోహరా,
మీనాభ్యాం సంచరిష్ణుభ్యామివ లావణ్యసాగరే"

"న్యస్తకస్తూరికాక్లుప్తచిత్రకప్రోల్లసన్ముఖీ,
కళంకాంకురసంకాశశశాంకేవ విభావరీ"

"సౌవర్ణకర్ణికోదీర్ణ సూర్యరత్నప్రభాయుజా,
గండమండలభాగేన జితదర్పకదర్పణా"

"మౌక్తికం బిభ్రతీ శుభ్రమచ్ఛం నాసికాపుటే,
మంజుపుంజీభవన్మందహాసభ్రమద విభ్రమమ్"

"చంచత్కాంచనవేదంచత్కాంచీలబ్ధకటీతటీ,
నదన్మరాళపాళీకపులినేవ తరంగిణీ"

"చేతేన విలసన్ముక్తాతారకామాలధారిణీ,
ధ్వాన్వరా శశిరేఖేవ సాంధ్యరాగేణ శోభితా"

"రుచిరా కుచయుగ్మేన సద్యోహృద్యం సముద్యతా
సరసీవ మహాపద్మకోశద్వంద్వేన మంజులా"

అటుతరువాత జాంబవంతుడు తనకూతుచే నారదునకు ప్రణామము చేయించును. నారదుడామెను పురుషోత్తముని వరుడుగా పడయుమని దీవించును. జాంబవంతుడు తన కూతునకు తగిన వరునిగూర్చి నారదునడుగును. నారదుడు శ్రీకృష్ణుడు తగినవాడని యాతని రూపగుణాదులను, అతిలోకశక్తులను విపులముగా వర్ణించును. నారదుడు శ్రీకృష్ణుని వర్ణించిన సందర్భమందున్న కొన్ని శ్లోకములు మనకు శ్రీకృష్ణకర్ణామృతమును దలపించును. అట్టివానిలో నొక్కశ్లోకము :

"మందాకినీ కోకనదావళీషు, మందారభూమీరుహ పల్లవేషు
తత్పాదపీఠీ సుషమానమృద్ధిం, విలోకయామో వయమాదరేణ"

శ్రీకృష్ణుని రూపగుణానుకీర్తనమును విన్న జాంబవతి మనస్సు అతని యందు లగ్నమగును. ఆమె తదేకాసక్తచిత్తయగును. నారదుడు వెడలిపోవును. ఇంతటితో ప్రథమాశ్వాసము ముగిసినది.

వసంతవర్ణనముతో ద్వితీయాశ్వాస మారంభమగును. మధుమాస వర్ణనము చేయు ప్రౌఢదీర్ఘగద్యమొకటి గలదు. అటుతరువాత జాంబవతి విరహ మతివేలముగా వర్ణింపబడినది. ఈపట్టునగల రెండు మందాక్రాంత వృత్తముల నుదాహరింతును.

"చిత్రేచిత్రే రచితమసకృద్రూపధేయం మురారే
ర్దర్శం దర్శం నిమిషరహితైః కేవలైరీక్షణైర్యా,
కన్యా సద్యః పరవశతయా చిత్రమస్మిన్నిదాయ
ప్రాప్తా హంత స్థిరతరతనుః సాకమప్యేతసిద్ధమ్"

"ఆలింగత్యాశ్చరితహరిణీలోచనాయా ముకుందం
చేతోవృత్త్యా వపుషి కలికాబృందతుల్యాం లతాం చ
స్ఫీతం జాతం విపులపులకవ్రాతమస్యాః ప్రకామం
మారోదారప్రహరణధియా నిర్మితం వర్మ శంకే."

జాంబవతి పొందిన దశావస్థలు విపులముగా వర్ణింపబడినవి. జాంబవతి చెలికత్తెలామెకు శిశిరోపచారములు చేయుదురు. ఆమెను పలువిధములుగా నూరడించి వనవిహారమునకు గొంపోదురు. వనమందలి వివిధవృక్షలతాదులు, కోకిలారావములు జాంబవతికింకను మన్మథోద్దీపకములగును. ఆమె తన చెలికత్తెలకు తన బాధనెరిగించును. ఈ నివేదనము సుమారు పదుమూడు శ్లోకములందున్నది. వానిలో నొకటి రెండు శ్లోకములు.

"స్మరాయుధోత్తా వనతేజనార్థ, మంగారపుంజం మధులోహకారః ।
ప్రవాళరాశిం వనితా । యమూనా, భస్త్రానిలైః ప్రజ్వలయత్యుదారమ్"
"నానాగమఖ్యాతమ నీతమూలం వాసంతికేవ ప్రమదాః । కదాహమ్
స్ఫురత్ప్రసూనస్తబకస్తనీ రం, పరిష్వజేయ ప్రియమాదరేణ."

విరహక్లిన్నయగు జాంబవతిని వర్ణించు చివర గద్యమిది.

"ఇతి బుద్ధివాణా నిలవేణీ సా పునః పుష్పితకస్వరేణ పికస్వరేణ చ ప్రసర మున్మురతా చంచరీకసంచయఝుంకారేణ వృక్షంగుర తరంగితయా రాజకీర కూజిత మధురాయా చ నిరవధిప్రసరతా చందనాచల మందిరతుంద పరిమృజగంధవహ కందళేన చ ప్రత్యగ్రజాగ్రతా కుసుమవిసర విలసనేన చ పంచాననగళరవప్రపంచేన కలభీవ, దుర్జయవర్షస్వగర్జితేన మరాళీవ, శిఖావలముఖావలత్ కేకయా భుజంగీవ, దిగంత విసృమర దవదహనోష్మణా కురంగీవ, శరదవసర విసరత్కౌముదీపూరేణ పద్మినీవ, వివర్ణా విధురా కంపమానా ప్రతప్తా పరిమ్లానా చ బభూవ"—

ఈ గద్య వ్యాఖ్యానములో గ్రంథమాగిపోయినది. దీనివలన లభించిన గ్రంథభాగమునకంటె లుప్తమైన భాగమే యధికమని తెలియుచున్నది.

సంస్కృతకావ్యమర్యాద ననుసరించి కాక పింగళిముత్రాజి మంత్రి సాంబోదయ కావ్యమున ఒకే యాశ్వాసమున వివిధవృత్తములు తెలుగు ప్రబంధములందు వలె అడుగడుగునను వాడెను. గ్రంథము సమగ్రముగా లభింపకపోవుట విచారకరము.

(సాహితి, సెప్టెంబరు 1962)

చంద్రభట్టు ఈశ్వరప్ప

పార్వతీపరమేశ్వరుల పరిణయగాథ ఎందరో మహాకవులకు కావ్యవస్తువైనది. కవికులగురువు కాళిదాసు కాలమునుండి నేటివరకును అటు సంస్కృతమందును ఇటు దేశభాషలందును రచయితలీ వస్తువును గ్రహించి తమ తమ యభిరుచుల కనుకూలముగా మలచుకొనుచున్నారు. అట్టివారిలో చంద్రభట్ట ఈశరప్ప యొకడు. ఈతని కృతి పార్వతీపరిణయచంపూకావ్యము.

పార్వతీపరిణయచంపూకావ్యములు వ్రాసినవారింకను ఇద్దరు సంస్కృతకవులున్నారు. ఒకరు ఈశ్వరసుమతి[1]; రెండవవారు కందుకూరి రామేశ్వరుడు[2] వామనభట్టబాణుడు మున్నగువారు రచించినవి ఈ పేరుతో నున్న నాటకములు. చంద్రభట్టఈశ్వరప్పకృత పార్వతీపరిణయచంపూకావ్యము (నెం. 876) కాకినాడ ఆంధ్రసాహిత్యపరిషత్తులో గలదు. ఇది [illegible] తాళపత్రములపైనున్నది. వ్రాత చక్కగానే యున్నను వ్రాయసకాని పొరపాటులు మిక్కిలి దొరలినవి.

చంద్రభట్ట (చంద్రాభట్ల) ఈశ్వరప్ప ఏకాలమువాడో ఏయూరివాడో ఇదమిత్థముగా తెలియదు. కాని వ్రాయసకాడిచ్చిన తేదినిబట్టి కొంత యూహింపవచ్చును. [illegible] కమ్మపైన కవి వ్రాసికొన్న ఆశ్వాసాంతగద్య మున్నది.

"ఇతిశ్రీమదీశ్వరప్పాభిధానబుధవిరచిత పార్వతీపరిణయ నామధేయ చంపూప్రబంధే పంచమాశ్వాసః."

దీని తరువాత,

---

1. తంజావూరు కేటలాగు 6వ సంపుటము నెంబరు 3894, పుటలు 2569-2571.
2. History of classical Sanskrit literature M. Krishnamachariar Page 519 Para 544.

"శార్వరినామసంవత్సర భాద్రపద బ. ౭. గురువారంనటికి పార్వతీ పరిణయం సంపూర్ణంగాను చంద్రభట్ట సుబ్బన్న వ్రాయడమైనది." యని యున్నది. దీనిలో తిథి మొదట ౫ గా వ్రాసి తరువాత ౭ గా దిద్దినట్లున్నది. తదియ యగుచో ఈ తేది క్రీ. శ. 16-9-1619 కి సరిపోవును. పంచమి యగుచో క్రీ. శ. 18-9-1799 కి సరిపోవును. ఇది తదియ యనియే నా యూహ. గ్రంథమును ఎత్తి వ్రాసికొన్న తేదియే 16-9-1619 A. D యగుచో గ్రంథకర్త ఇంతకు పూర్వుడనుటలో సందేహము లేదు. చంద్రభట్ట ఈశ్వరప్ప కనీసము పదునారవ శతాబ్దము వాడగును. ఈ గ్రంథమును వ్రాసిన వ్రాయసకాడు కూడ చంద్రభట్ట వంశమువాడే। ఇతడు గ్రంథకర్తకు కొడుకో, మనుమడో, మునిమనుమడో కావలయును. ఇంతకు మిక్కిలి గ్రంథకర్త దేశకాలములు తెలియరావు.

గ్రంథావతారికలో మొదటి యైదుశ్లోకములు ఇష్టదేవతాస్తోత్రాదికములు, వినాయక, శివ, సరస్వతీ, బాలకృష్ణ, గురుస్తోత్రము లీ శ్లోకములందు గలవు గురుస్తుతి చేయు శ్లోకమిట్లున్నది.

"సదాశివగురుం భజే సకలధీరనిత్యస్తుతం
ద్విజాధిపతిసేవితం వివిధవేదవక్త్రాంబుజమ్,
స్ఫుటస్ఫటికమాలికాస్ఫురితకంబుకంఠం సదా
శ్రితప్రకరవాంఛితప్రబల దివ్యవస్తుప్రదమ్." ౫

అటుతరువాత ౬ నుండి ౪౩ వరకున్న శ్లోకములలో తన వంశావతారమును వర్ణించుకొన్నాడు. చంద్రభట్టవారి వంశక్రమ మీ తీరుగానున్నది.

శాండిల్య మౌని
- 1. చంద్రభట్టు
  - 2. పెదయ
    - 3. సదాశివుడు (భార్య : గౌరి)
    - నారాయణభట్టు
    - లింగభట్టు
    - కేశవభట్టు
  - రామయ

4. విశ్వపతి
(భార్య : సుభద్ర)

సదాశివుడు (భార్య : హనూమాంబ) — 5. రామేశ్వరుడు (భార్య : లచ్చమ్మ)

విశ్వేశ్వర, సదాశివ, సుబ్రహ్మణ్య, సర్వేశ్వర, వేంకట, 6. ఈశ్వరప్ప (కృతికర్త), రామనాథ

ఈశ్వరప్ప తన యన్నలలో మూడవవాడగు సుబ్రహ్మణ్యుని గీర్వాణాంధ్ర కవితాధౌరంధర్యము నిట్లుగడించినాడు.

"గీర్వాణాంధ్రకవిత్వయుక్తిచతుర స్తస్యానుజాగ్రేసర
(స్సు)(బ్రహ్మణ్యబుధో విధుస్థల సమానీతామితాలంకృతిః,
పత్రైకప్రవహోర్జిత ద్వికరకస్వంగీత భిక్షాప్రద
స్స్వాభాన్యాసుష వేషపోషణపటుశ్శేషో యథా శోభతే" 39

ఈ యవతారికాభాగమందే ఈశ్వరప్ప తన రచనోద్యోగము నిట్లు సవినయముగా చాటుకొన్నారు.

"ప్రాచ్యాం రోహితవట్టకందుకరుచిం బిభ్రా నిశానాయకే
జాతే వంచితహేమమంజులరుచౌ జంభీరసచ్ఛాయయా,
బాలః స్వల్పధియా యథా నిజకరాదానే ధృతామస్తదా
చంపూం సంప్రతి పార్వతీపరిణయప్రఖ్యాం కరిష్యే ముదా" 8

పార్వతీపరిణయచంపూకావ్యమున నైదు నశ్వాసములు కలవు. ఈ యైదు నశ్వాసములందున్న గద్యపద్యముల సంఖ్య 223. అవతారికలోనున్న గద్యపద్య సంఖ్య 44. ఈ విధముగా మొత్తము 267 గద్యపద్యము లీ కావ్యమున గలవు.

కథాప్రారంభము హిమాద్రి వర్ణనముతో మొదలైనది.

"శ్రీమానస్తి సమస్తపర్వతపతిర్నామ్నా హిమాద్రిర్మహాన్
కీర్త్యాధిక్యపతేర్హి ప్రకటయన్నాత్మీయ విస్తారతామ్,

పార్వత్యా ముదయా స్తవర్పతయుగం ధ్యాత్వాం నిజాఖ్యాం గిరి
స్వామిత్వేనవితోదయన్నిప సురైస్సాకం మఖాంగాదనః" I-1

హిమవంతుడు మేనకను పెండ్లియాడుట, మైనాకజననము, పార్వతీ జననము, నఖశిఖపర్యంతము పార్వతీవర్ణనము (12—28) ప్రథమసన్నాహమున గలవు.

ద్వితీయసన్నాహమున నారదాగమనము. నారదుడు పార్వతిని దీవించి వెడలుట, సూర్యాస్తమయ నిశా, తారకా, చంద్రోదయ, చంద్రాతప, సూర్యోదయ, వర్ణనములును, పార్వతి తన చెలికత్తెలతో నాడుకొనుట, హిమవంతుడామెను చూడవచ్చుట, పార్వతి తండ్రికి మొక్కుట, అతడు పార్వతిని నీకేమి కావలయునో కోరుకొమ్మనుట, పార్వతి తనకేమియు వలదని చెలికత్తెలతో నాడుకొందు ననుట, హిమవంతుడు వెడలిపోవుట యను వృత్తాంతములును గలవు. తపము సేయుటకై శివుడు హిమాద్రి కరుదెంచుట, భద్రతీర్థమను తపోవన వర్ణనము, శివుని తపస్సు, అది తెలిసిన పార్వతి తల్లిని భద్రతీర్థాశ్రమముని సేవకై యనుజ్ఞ వేడుట, పార్వతి భద్రతీర్థాశ్రమమున కేగి శివుని సేవించుట, దేవత లింద్రునికి తారకాసురుని దుశ్చేష్టితము లెరిగించుట, ఇంద్రుడు దేవతలతో బయలుదేరి బ్రహ్మలోకమున కేగి బ్రహ్మకు తారకాసురుని బాధ లెరిగించుట, బ్రహ్మ శివుని తపమును దేవతల కెరిగించి పార్వతీశివుల పరిణయమైనచో కుమారుడు జన్మించి తారకాసురుని పరిమార్చునని చెప్పుట, ఇంద్రుడు సకలదేవతలతో మన్మథుని కడ కేతెంచి శివతపోభంగమునకై పురికొల్పుట, రతీదేవి మన్మథుని వారించుట, మన్మథుడు రతీదేవి వెంటరా చైత్రునితో కలసి భద్రతీర్థమున ప్రవేశించుటలను కథలు గలది తృతీయ సన్నాహము. చతుర్థసన్నాహమున మన్మథుడు శివతపోభంగము చేయ ప్రయత్నించి భస్మసాత్కృతుడగుట, రతివిలాపము, శివుని వరము, పరిభూత యగు పార్వతి స్వగృహమున కేగి తలిదండ్రులను తపము చేతునని యనుజ్ఞ వేడుట, పార్వతీదేవి తపము, శివుడు కపటవటురూపమున పార్వతి కడకు వచ్చి సంభాషించుట, శివుడు సాక్షాత్కరించి పార్వతికి తన కోరిక నెరింగించుట, ఎవరి నివాసములకు వారు వెడలిపోవుటలను వృత్తాంతములు గలవు.

శివప్రేరణమున సప్తర్షులరుంధతీసమేతులై హిమాలయమునకు వచ్చుట, పెండ్లిముచ్చటలు, ఋషులు సఫలమనోరథులై తిరిగిపోవుట, శివుని పెండ్లి

సన్నాహము, బ్రహ్మవిష్ణ్వాదినమస్తదేవతలు శివుని వివాహమునకు తరలి వచ్చుట, పార్వతీశివుల పరిణయము, వధూవరులు క్రీడాతల్పమును చేరుకొనుటలను, కథలు గలది పంచమసన్నాహము.

ఈశ్వరప్ప కాళిదాసవిరచితకుమారసంభవము నాదర్శముగా నిడుకొని పార్వతీ పరిణయచంపువును రచించినట్లున్నాడు. కాని కథలో నొకచోట చిన్న మార్పొకటి కలదు. కుమారసంభవములో ఇంద్రుడు తన మనమున మన్మథుని స్మరించినంతనే యాతడింద్రుని సన్నిధికి వచ్చినట్లుండ పార్వతీ పరిణయమున దేవేంద్రుడు స్వయముగా మన్మథనివాసమునకు పోయినట్లు కలదు.

ఈ చంపూకావ్యము కొంత ప్రాచీనమైనది కనుకను తరతరములుగా వ్రాయసకాండ్రు చేసిన పొరపాటు లిందు చాల గలవు. కొన్నిచోట్ల పాణినీయ వ్యాకరణవిరుద్ధప్రయోగములు కూడ కలవు. ఇవి వ్రాయసకాండ్రవలన నేర్పడినవో స్వయముగా కవికృతములో తెలియదు. "విపరాభ్యాం జేః" యను సూత్రమునకు విరుద్ధముగా 'విజయతి' యను పరస్మైపదరూపమును రెండుమూడు చోట్ల ప్రయోగించినాడు. రెండు మూడుచోట్ల యతిభంగము లున్నవి. అవతారికలో తన వంశావతారమును వర్ణించుకొనునప్పుడు తన తాతగారి భార్య సుభద్రనుగూర్చి యిట్లు చెప్పినాడు.

"తస్య విశ్వపతేర్భార్యా దేవీ కృష్ణార్పితాంతరా,
సుభద్రాఖ్యా సుభద్రేవ నామ్నైవార్థేపి సా" 23

నీలాచలస్వామి యగు జగన్నాథునికి నీరాజన మిచ్చునప్పుడు "సుభద్రాప్రాణనాథాయ" యందురనియు సుభద్ర (భద్రకారు) శ్రీకృష్ణుని ప్రియురాలనియు, ఈ విషయమున నేదో పొరపాటున్నదనియు పూర్వమొకప్పు డేదో పత్రికలో ఆ యపహాసమును తొలగించి శ్లోకమును సవరించి ఎవరో వ్రాసినట్లు చదివితిని. కాని ఈశ్వరప్పవంటి పదునారవ శతాబ్దపు సంస్కృత కవి కూడ సుభద్ర కృష్ణార్పితాంతర యనుట ఈ సంప్రదాయ మెంత ప్రాచీనమైనదో తెలియుచున్నది. ఈతప్పు క్రొత్తగా దొరలినది కాదన్నమాట.

ఈశ్వరప్ప కవిత్వము తెలియుటకై పార్వతీపరిణయమునుండి కొన్ని శ్లోకము లుదాహరింతును.

పార్వతీదేవి పెదవులు వర్ణించునప్పటి శ్లోక మిట్లున్నది.

"రాత్రౌ సుధాంశురిపురేత్య విజృంభణం మే
హంతీతి పద్మనిలయం ప్రతి సాధు మత్వా
పద్మం తదీయచరణావతరం ప్రపద్య
తత్పంక్తయా విజయతే కిము నిత్యజృంభమ్" I-18

ఆమె యూరువులను వర్ణించు గద్యమిది.

"తత స్తదీయ సుందరతరోరుయుగళ మిథకరరంభాస్తంభప్రముఖో ష్యభంతకందూలత్వ పలాశకాండ ద్రోణామూం విశ్లేషాది దోషానాపాద్య న్యసైవ (న్యతవివ?) పరస్పరసాదృశ్య మలభత." I-19

పై గద్యమునకును పనుచరిత్రమునందలి "నతి యూరుద్యుతిం జెందం బూని" యను పద్యమునకును (II-37) గల పోలిక గమనింపదగినది.

దాగిన, ముత్యాలసరము లున్నగు భూషణముల నలంకృతమైన పార్వతీదేవి కేశపాశమును, ఆమె ముఖమును వర్ణించు శ్లోకములో ప్రథమ సన్నాహము ముగిసినది.

"త్రివాలపాశ్యాంచిత మధ్యదేశో ముక్తాసరాలంకృతకేశపాశః,
తస్యాశ్చరాకే కిల పూర్ణచంద్ర మధ్యం వియత్తారకవేష్టితం వా" I-28

శుక్రోదయమును వర్ణించు శ్లోక మీ తీరుగా నున్నది.

"చంద్రప్రియో విశతి సంగమకాంక్షయేతి
రాత్రిస్త్రియా గగనసద్మగృహే ప్రదృప్తః,
అన్యోన్యగాత్రపరిలేపనగంధపూర్ణః
శుక్రాభిధానచషకో విరరాజ శుక్లః" II-20

మన్మథుడు తన ఇంటికి వచ్చిన ఇంద్రునిజూచి సంతోషముతో నిట్లనును.

"రాజన్నీరజనుద్భ్రైవ వికచే దాదిత్యవీక్షావశా
ద్వర్షాత్రస్యవిలోకనాద్భుజ(గ)భుగ్గాత్రం యథా గోత్రభిత్,
తద్వన్మాననమద్య మామకమపి త్వద్దర్శనాద్వల్లభా
చ్ఛక్త్రోత్రమహం న కర్తుమధునా నంక్రందనాఖండల" III-37

పార్వతీదేవి తపము చేయనిశ్చయించినప్పు డామె తలిదండ్రు లిట్లు మందలింతురు.

పంచాగ్ని మధ్యారితపః ప్రయత్నః సంచారణం చ క్వ వనప్రదేశే,
కించ క్వలాలే తరుణప్రసూనచంచన్మృదుత్వం తవగాత్రమత్ర." IV-20

పార్వతి తపమును పరీక్షింపవచ్చిన పరమశివుడు కుహనావటురూపమున శివునుపాలంభించును. పార్వతికి వైముఖ్యము గలిగించుటకై యీక దిట్లనును.

"జానామి జానామి తవానుభావం
జాగర్తి జాగర్తి తదష్టమూర్తౌ,
భావస్తదాపి ప్రమదాన్ గుణాం స్తాం
తత్సన్నివిష్టాన్వికృతాన్ ప్రవక్ష్యే." IV-34

"కాలకూటాశనో వాయుభుగ్భూషణః
క్రూరశుండాలచర్మాంశుకో యాచకః,
ప్రేతకాంతారసంచారణే తత్పరః
కిం వృతస్స త్వయా భిక్షుకశ్శ్రేష్ఠయా." IV-35

"మాలికారూపకాపాలికాశేఖర
శ్శ్మశనే ముఖ్య దుష్ప్రేతకాభిష్టుతః
అంగరాగీభవద్భూతిక శ్శూలికః
కిం వృతస్స త్వయా భిక్షుకశ్శ్రేష్ఠయా. IV-38

పెండ్లికొడుకైన శివుని వర్ణన మిట్లున్నది.

"జటాజూటాగ్రంబోన్నతి హరితోక్షిప్తపవనం
సుధాంశుం స్వర్ణత్యా ప్రకటిత మహాభాసికమపి,
గలాలంబా ముక్తావళియురగరాజాన్వహ మహో
కరాదిన్పా న్సర్పా కటకముఖభూషామహితః." V-32

ఈ కావ్యము చివరిదగు శ్లోకమున పార్వతీపరమేశ్వరుల దాంపత్య వర్ణింపబడినది.

"కల్యాణప్రదయోస్తయోస్త్రిజగతామత్యద్భుతామూర్తి
తాంబూలాదివరార్థయోః కృతదిహ్వాలకృద్వాయో[illegible]యోః,
పర్యాయాత్కుసుమేషు వశ్యమనసా [illegible]
తద్భిన్నార్తక (మధ్యాక్షర) [illegible]" V-61

(సాహితి, నవంబరు 1962)

భారద్వాజ రామాచార్యుల

భద్రగిరి చంపూ

శ్రీరామచంద్రుడు తెలుగు ప్రజానీకానికి బాగా మనసుకెక్కిన దైవం. తెలుగువారిలో చాలామంది శ్రీరామచంద్రుణ్ణో లేక అతని భక్తుడైన ఆంజనేయుణ్ణో కొలిచేవారున్నారు. రామాయణేతివృత్తం గల కావ్యాల సంఖ్య కూడా తెలుగు సాహిత్యంలో ఎక్కువపాలే పంచుకొన్నది. శిష్టులేకాక జానపదులు పాడుకొనే పాటలుకూడా రామాయణానికి సంబంధించినవి నూర్లకొలది ఉన్నవి. త్యాగరాజు, గోపరాజుల వంటి శ్రీరామ భక్తుల మూలంగా కర్ణాటక సంగీతంకూడా పునీతమైంది. గీర్వాణభాషలో రచన చేయగల్గిన తెలుగువాళ్ళు దాదాపు 80 రామాయణాలు సంస్కృతంలో వ్రాసినారు. వీటిలో చాలాభాగం అముద్రితం.

తెలుగు దేశంలో ఉన్న శ్రీరామక్షేత్రాలలో భద్రాచలం గొప్పది. సీతారామలక్ష్మణులు అరణ్యవాసం చేసినప్పుడు గోదావరీతీరాన ఈ పుణ్యభూమిలోనే సంచరించినారని మనవాళ్ళ నమ్మకం. తెలుగులోను, సంస్కృతంలోను భద్రాచల మాహాత్మ్యాన్ని తెలిపే గ్రంథాలున్నాయి. రామదాసు అనే బిరుదు పొందిన కంచెర్ల గోపరాజుగారి కీర్తనలు హరిదాసుల పుణ్యాన తెలుగుదేశం నాలుగుమూలలా వ్యాపించినాయి. ఈ భద్రాచల శ్రీరామచంద్రుని మీద సంస్కృతంలో కూడా అనేకకావ్యాలు చమ్పూకావ్యాలు స్తోత్రాలు ఉన్నవి. అతే ఇందులో అధికభాగం తాళపత్రాల్లో మూలుగుతున్నవి. వీటిని వెలుగులోనికి తేవటానికి మళ్ళీ ఏ రామదాసో బందిఖానా బాధలు పడవలె కాబోలు. ఈ ప్రసంగ శ్రీరామనవమి సందర్భంగా భద్రాచల స్వామి పేర ఉన్న భద్రగిరి చమ్పూకావ్యాన్ని ఆంధ్రలోకానికి పరిచయం చేయటమే ప్రకృతం నా కర్తవ్యం.

భద్రాచల క్షేత్రమహిమనూ, అక్కడ జరిగే చైత్రోత్సవాన్నీ విపులంగా వర్ణించటానికి పుట్టింది కావ్యం. దీని రచయిత రామాచార్యులు, రచయిత తండ్రిపేరు వేంకటాచార్యులు, తాతపేరు రామాచార్యులు. ఈయన ఏ ఊరివాడో, ఏ కాలంవాడో ఖచ్చితంగా చెప్పటానికి వీలులేదు. ఇంటిపేరు కూడా తెలియదు. బహుశః ఈయన 17–18 శతాబ్దాల వాడై ఉంటాడనీ, ఆ ప్రాంతానికి పాలకులు పాల్వంచ జమీందారులైన అశ్వారావుల ఆస్థానానికి సంబంధించినవాడై ఉంటారని ఊహిస్తున్నాను. కావ్యాంతంలో కవి తన తండ్రి తాతలను గూర్చి, తనను గూర్చి ఇట్లా చెప్పుకున్నారు.

"భారద్వాజ కులార్ణవామృతకర శ్రీరామవర్యస్య యః
పౌత్రో వేంకట (దేశికస్య మహతః) పుత్రశ్చ తేనాదరాత్,
రామాఖ్యేన మనీషిణా విరచితే చంపూ ప్రబంధే మహాన్)
(భద్రాద్రీశ) మహోత్సవామృతయుతే భాగోఽద్వితీయోఽభవత్."

రచయితను గూర్చిన వివరాలు ఇంతకంటె ఎక్కువ ఏమీ తెలియవు.

ఈ చంపువు రెండు భాగాలుగా ఉన్నది. మొదటి భాగానికి ధ్వజారోహణ వర్ణనమని పేరు. రెండవ భాగానికి ఏ పేరుందేదో? చివరి గద్యమున్న కమ్మ విరిగి పోయింది కనుక ఆ పేరు తెలువదు.

ఈ కావ్య ప్రారంభశ్లోకం ఇట్లా ఉన్నది :

శ్రీమద్భద్రనగాధిరాజ విలసత్ సౌధాగ్ర భాగోజ్జ్వల
జ్జ్వాలాభీల మహత్ర విక్రమ మహం చక్రేశ్వరం సత్వరమ్,
చేతుం ఖండ మలింధనాగ్ని శమనం దుర్వారగర్వాధిక
క్రవ్యాద క్షరితా క్షతక్షతదహై న్స్వః ప్రశస్యం స్తువే.

మొదటి భాగములో భద్రాచల మాహాత్మ్యం అక్కడి ఉత్సవాలు మొదలైనవి వర్ణించబడ్డాయి. సాయంకాలం జరిగే ధ్వజారోహణ వర్ణనంతో ఈ భాగం సమాప్తమౌతుంది. రెండో భాగం మరునాడు ఉదయం అక్కడ జరిగే తిరునాళ్ళు, వీధులు, యాత్రికులు, ఉత్సవాలను వర్ణించటానికి ఉద్దేశించింది. దీనిలో చంపూకావ్యం లక్షణాలు వీథీ లక్షణాలూ కలసి ఉన్నాయి. ఇందులో ప్రధాన పాత్రలు ఇద్దరు. శ్రీరంగంనుండి భద్రాచలంలో జరిగే ఉత్సవాలు

చూడటానికి వచ్చిన పద్మాక్షుడు అతని ప్రియురాలు లీలోత్పలవతి. వర్ణనలు చాలా భాగం పద్మాక్షుని నోటినుండి వస్తవి. మధ్యమధ్యన సంభాషణలు కూడా ఉన్నవి. ఈ రెండుపాత్రల గూర్చి ప్రారంభంలో ఈ శ్లోకం ఉన్నది.

"చైత్రోత్సవం దాశరథే ర్విలోకితుం
భద్రాద్రి ధామ్న స్తరుణీసమాగతా,
పద్మా(క్ష) లీలోత్పలవతీ సమాఖ్యయా
ప్రభాం గతౌ కౌచన రంగవాసినౌ"

ఈ కావ్యం కాకతీయులనాటి ఓరుగల్లును వర్ణించే క్రీడాభిరామాన్ని తలపిస్తుంది.

పద్మాక్షుడు తన ప్రియురాలు లీలోత్పలవతితో కలిసి స్నానంచేసి ఆలయంవైపు నడుస్తాడు. ఆలయ గోపురాలకు దూరం నుండే ఇట్లా నమస్కరిస్తాడు.

కనకకలశరాజ శ్రీవరీణాం విధాతుం
విపులగగనశాఖోల్లేఖనే నోన్నతేభ్యః,
నరతరతినహానాం సాధుపారావతానాం
విహరణశరణేభ్యో గోపురేభ్యో నమోస్తు.

అక్కడినుంచి కొంచెం ముందుకు నడువగానే గోదావరి కనబడుతుంది.

ఆ ఉభయులూ గోదావరికి నమస్కరించి వర్ణిస్తారు. గోదావరీ వర్ణనం చేసే శ్లోకాల్లో ఒకటి.

పులినజఘనరమ్యా చక్రవాకస్తనీయం
తరళతర తరంగ ప్రోచ్చలన్మధ్యరేఖా,
సరిదిహ చపలాక్షీ స్వచ్ఛ డిండీరహాసా
విహగకులనినాదైర్నో నుతం వ్యచ్చరీవ.

భద్రగిరిని వర్ణించే శ్లోకాల్లో ఒకటి

శ్రీ భద్రశైలం సుకృతైకమూలం,
భజేను వేలం అలఘౌఘనీలం,

శ్రీయోగిశాలం విలసద్రసాలం
(శ్రీ)రానుకూలం శ్రితదేవజాలం.

ముఖమంటపానికివచ్చిన తర్వాత పద్మాక్షుడు శ్రీరామచంద్రమూర్తిని ఇట్లా స్తుతిస్తాడు.

నమో స్వసుర వైరిణే అనఘ మనోహారిణే
హృదంతరవిహారిణే మతిమతాం సుధాహారిణే,
శ్రితావనవిచారిణే శ్రుతివనాం(త సంచా)రిణే
సదా సుకృతకారిణే దశరథాత్మజా కారిణే,

ఆటుతరువాత అక్కడకి వచ్చిన దేవతలు వారు జరిపే పూజా విధానాలు అన్నీ విపులంగా వర్ణించబడ్డాయి.

మొదటిభాగం చివరిశ్లోకం ఇట్లా ఉన్నది:

శ్రీకాంతః కమలాననశ్చ భగవాన్ పృథ్వీనలో దేవతే
శక్రశ్చ ప్రముహర్షయ స్సురగురుర్వ్యాసశ్చ కళానాం నిధిః,
నక్షత్రాణి కులాచలాశ్చ సకలా ఆశాశ్చ దిక్పాలకై
స్సాకం భూమి సురావతేః స్థిరతరం కంసంత్విమే మంగళమ్.

ఆటుతరువాత దిల్ప్రకవతితో పద్మాక్షుడు తన విడిదికి వెళ్ళిపోతాడు.

మరునాటి ఉదయవర్ణనంతో రెండవభాగం ప్రారంభం అవుతుంది. ఇద్దరూ కలిసి విపణివీథులు తిరుగుతారు ఒక విపణిలో కస్తూరి కొనవచ్చిన ఒక స్త్రీ, అమ్మే బేహారి ఇద్దరూ (తుమ్మెదమూలంగా) ఏ విధంగా భ్రమ పడుతారో వర్ణించే చక్కని శ్లోకం ఒకటి ఉంది.

కస్తూరీమోదలోభా దధిగతమవలం నిస్తులాయాం తులాయాం
కస్తూరీ(తి) ద్విరేఫం (వ)ణిగభిరుచయన్ ప్రస్తుతానాం క్రయాయ,
ఆస్తోకం పాణిపద్మే నగరమృగదృశాం న్యస్తవాన్ తేన వణ్
వి స్రస్తోర్ధ్వీన మార్గా త్తరను పురజ(నా) హ స్తతాళం వత్ర(త)త్రుః.

ఇట్లా వీథుల్లో తిరుగుతుంటే పద్మాక్షునికి తన గ్రామంవారు ఎన్నో వింధ్యక్రిందట ఉత్తరదేశానికి ధనమూ కీర్తి ఆర్జించటానికి వెళ్ళిపోయినవారు

విశ్వేశ్వరభట్టు అనే పాతస్నేహితుడు కనిపిస్తారు. ఉత్తరదేశమంతా దిగ్విజయం చేసివస్తున్న ఆవిశ్వేశ్వరభట్టు తాను విన్నవీ కన్నవీ తానుచేసిన ఘనకార్యాలు మిత్రునికి చెప్తారు.

సీతారాములను కల్యాణానికి ముందు అలంకరించే ఘట్టం చాలా విపులంగా సాగింది.

సీతమ్మవారి అలంకారం ఇట్లా ప్రారంభమైంది.

"కలశజలధికన్యాం సర్వలోకైకమాన్యాం
జనకయజనజన్యాం వాంఛితానాం వదాన్యాం,
హృతసత జనదైన్యాం రాఘవేంద్రోరసన్యా
మలమకురుత ధన్యా మాతృవర్గోఘకూన్యామ్.

"కాంచీగుణేన కలకింకిణికేన సింధు
కాంతీ సుతా కటితటీ గ్రథితా కయాచిత్,
పంచాస్త్రకార్ముకగుణ ప్రవరేణ రామ
వంచానసస్య విజయోద్యమశాలి సేవ"

ఆటుతరువాత సీతారాముల కల్యాణం వర్ణింపబడింది. ఆ కల్యాణానికి నానాదేశాల ప్రజలూ పాలకులూ వస్తారు. అందులో పాల్వంచ జమీందారులైన అశ్వారావుల వర్ణనం ప్రత్యేకంగా సాగింది. కనుకనే ఈ కవి అశ్వారావుల ఆస్థానిసై ఉంటారని ఊహిస్తున్నాను.

"శ్రీమత్పిత్రన్సుభిన్నరా సుమనసా మానందసంధాయకో
దుస్వన్ పంకజసంగమం ప్రతిదినం క్షేత్రాదివర్గశ్రియామ్,
నిత్యం సత్పథసంచరః కువలయోల్లాసాధివాసోదయ
(స్సో సో)వశ్యమహీశ్వరో విజయతే వశ్యాయ తానుర్యథా."

"ఆశ్వినేయోల్బలో హయశ్వరాయ ప్రభు
శాశ్వతీం సంపదం విశ్వతః పృష్ఠతః,
అశ్వవాహం తదా విశ్వసన్ భూసుతా
దీశ్వరం చామరం శశ్వదా ధూనతే."

"శ్వేతం ఛత్రం త్వశ్వభూపాసుతేన
స్ఫీతం దధ్రే రాఘవస్యోపరిష్టాత్,
ధూతం రాకా రాజబింబేన ముక్తా
స్యూతం తారారాజి సంవేష్టితేన"

సీతారాములు తలంబ్రాలు పోసుకొనే ఘట్టం ఇది:

"సువర్ణశోభనాక్షతానిమౌ నభేల మహాలా-
కరాంబుజద్వయేన తౌ నరాశ్రితావన్యోన్నతౌ,
వధూవరౌ ప్రవర్షత స్తదాముదా సమర్షత।
పరస్పరస్య మూర్ధని ప్రసూనగంధవర్షిని"

"ముక్తా విదేహతనయాంజలి శుక్తికాంత
ర్ముక్తా రఘుక్షితివరస్య సదుత్తమాంగే,
నక్షాన్సమస్త తనుషు ప్రబభుర్యకాసౌ
ద్యుక్తా। ప్రసూననికరా ఇవ పారిజాతే"

అటుతరువాత రథోత్సవాదులు కూడ విపులంగా వర్ణింపబడినవి. రాత్రి కాగానే సీతారామలక్ష్మణులు ఆలయప్రవేశం చేస్తారు.

"దక్షిణ, పరమపాయ శిక్షణే
లక్ష్మణశ్చ నృపలక్షణాన్విత
పక్షివాహనవతో న్యదక్షిణం
పక్షమావ్య మురితో రరక్ష నః"

తెల్లవారి లేచి మళ్ళా ఆ ముగ్గురు పురావలోకనానికి వెళ్లారు. ఆ భద్రపురి వర్ణనం యిది.

"విచిత్ర రమ్యోచ్చ పతాకమాలినీం
సుధావిధౌతోన్నత సౌధశాలినీం,
దృశాం ముదం భద్రపురీం విరాయినీం
దదర్శ తాం (సౌర) పురాతిశాయినీం"

సీతారాముల రథోత్సవాన్ని చూడవచ్చిన వర్ణిజనం వర్ణనమిది.

"అంతశ్చంచలపీవర స్తనయుగం ర్వ్యానాభిజద్గొల్లల
మ్యూఢార్పానా హృది సంధితాంజలిపుటా స్సిపాదిభూషావహా,

స్యందారూఢశిశుప్రజాః పథుసమా గ్రామ్యశ్చ భాషాలాప
స్సేవంతే విధు మారరాత్రరమిమా పల్లీవధూటీజనాః"

రథోత్సవవర్ణనంలో కొన్నిచోట్ల ఉపయుక్తమైన వివిధవృత్తాలపేర్లు కూడా పేర్కొన్నారు కవి.

"సోయం రాఘవనందనో ఖిలజనా నానందయన్ స్యందనే
భక్తైర్భాగవతైర్విశేషితతను, ర్భ్రాజానుజాభ్యాం యుతః,
ఆస్తే నిస్తుల నూత్నరత్న రుచిర శ్రీమాలికాం దోలికాం
యశ్చక్రే సమరే పురాసురమృగాన్ శార్దూల విక్రీడితం."

"అనుపమమణిభూషణాంచితా భా
న్మనుకులనాథవధూరథోపరిస్థా,
దనుజరిపుసుతాను తావకశ్చ
న్తనురరకల్పలతేవ పుష్పితాగ్రా.

ఈ విధంగా ఐదు దినాలు జరిగే సీతారాముల కళ్యాణోత్సవాలు కవి విపులంగా వర్ణించినాడు.

నేనుమాత్రం ఇంతవరకూ ఆ భద్రాచల సీతారాముల కల్యాణోత్సవాలు చూడలేదు. అవి ఇప్పటికీ ఇట్లాగే జరుగుతున్నాయో లేదో తెలువదు. ఈ రామాచార్యుల భద్రగిరి చమ్పూప్రబంధం చదివి భద్రాచలంలో జరిగే ఉత్సవాలను మనోదర్పణంలో దర్శిస్తున్నాను. ఆ రామచంద్రమూర్తి తలుచుకుంటే ఈ రామాచార్యుల కావ్యం వెలుగులోనికి రాదా? అక్కడికి పోలేని నావంటి వారు మరికొందరైనా దీన్ని చదివి ఆనందిస్తారు కదా।

(ఆంధ్రజనత 19-4-1967)

'బాలసరస్వతి' తిరుమలబుక్కపట్టణం శ్రీనివాసాచార్యులు

శ్రీశైలపూర్ణు లాదిగా తిరుమలబుక్కపట్టణం వారి వంశము కవనవైశద్యమునకును, పాండిత్యప్రకర్షకును, పేరెన్నికగన్నది. ఈ వంశమువారి ముద్రితాముద్రిత గ్రంథములు బండ్లకెత్తవచ్చును. వీరి వంశవృక్ష మీవిధముగా నున్నది.

- శ్రీశైలపూర్ణులు
  - అణ్ణయాచార్యులు-I
    - శ్రీనివాసతాతాచార్యులు-I
      - వెంకటదీక్షితాచార్యులు
      - అణ్ణయాచార్యులు-II
        - శ్రీనివాసతాతాచార్యులు II
          - వెంకటాచార్యులు
          - అణ్ణయాచార్యులు-III
            - శ్రీనివాసతాతాచార్యులు-III
            - కిరీడి వెంకటాచార్యులు
            - బుచ్చివెంకటాచార్యులు
          - శ్రీనివాసాచార్యులు-I
            - |
        - నృసింహతాతాచార్యులు

- శ్రీనివాసాచార్యులు-I
  - వెంకట రాఘవాచార్యులు
  - వెంకట రాఘవాచార్యులు
  - కస్తూరి రాఘవాచార్యులు
  - శ్రీనివాసాచార్యులు-IV
    - రంగనాథాచార్యులు
      - శ్రీనివాసాచార్యులు-II
        - బుచ్చివెంకటాచార్యులు
          - "బాలసరస్వతి" శ్రీనివాసాచార్యులు
          - రంగనాథాచార్యులు
        - రంగనాథాచార్యులు

పైవంశవృక్షమున కట్టకడపట పేర్కొనబడిన బాలసరస్వతి శ్రీనివాసాచార్యులవారి సాహిత్యసేవయే ప్రకృతము నా యుద్దేశము. తిరుమలబుక్కపట్టణంవారి తొలినివాసము కడపమండలమందలి బుక్కపట్టణము. రెండవ శ్రీనివాసాచార్యుల ద్వితీయపుత్రులైన మూడవ అణ్ణయాచార్యులవారును, తృతీయపుత్రులైన శ్రీనివాసాచార్యులవారును సురపురము సంస్థానాధీశ్వరులైన సామినాయకుని [1752—1778] ఆహ్వానమును పురస్కరించుకొని రాజగురువులై సురపురమున స్థిరపడిరి.[1] ఆ యిరువురు సోదరుల చరిత్ర యొక యద్భుతగ్రంథము. వారి రచనములు పరశ్శతములు.[2] ఈ అణ్ణయాచార్యులవారి కుమారులు, వారి సోదరులైన శ్రీనివాసాచార్యులవారి శిష్యులు నైన కిరీటి

1. Surapuram Chiefs & Sanskrit Writers : Prof V. Raghavan, Journal of the Andhra Historical Research Society, Vol. XIII April 1941.
2. గోలకొండ కవుల సంచిక, పుట 884.

వెంకటాచార్యులవారి సాహిత్య జీవితము మరియును అద్భుతావహము. శ్రీనాథకవి సార్వభౌముని సాహిత్య జైత్రయాత్రలట్లు కిరీటి వెంకటాచార్యులవారి సాహిత్య జైత్రయాత్రలు కవిపండితులకు గగుర్పాటు కలిగించునవి.[8] కిరీటి వెంకటాచార్యులవారి చిన్నాయనగారైన శ్రీనివాసాచార్యులవారు నిగమాంతదేశికుల యవతారమందురు. వారి మనుమని మునిమనుమలే బాలసరస్వతి, తర్కతీర్థ, ఘంటాశతశ్లోకకవి బిరుద విభూషి శ్రీనివాసాచార్యులవారు [1882—1920]. వీరు శేషమాంబా బుచ్చివెంకటాచార్యులను పుణ్యదంపతులకు పాలమూరు మండలమందలి ఆత్మకూరు సంస్థానమున జన్మించిరి. సురపురమున స్థిరపడిననాటి నుండియు ఈ వంశమువారికి గద్వాల, వనపర్తి ఆత్మకూరు, జటప్రోలు సంస్థానములు విహారభూములైనవి. ఆటుతరువాత క్రమముగా వీరిలో కొందరు ఆత్మకూరు సంస్థానమున స్థిరపడిరి.

పూవు పుట్టగనే పరిమళించునట్లు శైశవమునుండియే శ్రీనివాసాచార్యుల ప్రతిభావిలాసములు గుబాళించినవి.

ఏకాదశవర్షప్రాయము వరకే శ్రీనివాసాచార్యులు తమతండ్రిగారికడ సాహిత్యము, అలంకారగ్రంథములు ముగించిరి. ఆనాటికే సంస్కృతాంధ్రము లందు కవిత్వ మల్లుట ప్రారంభించిరి. పదునారవయేట తర్కశాస్త్ర మభ్యసించుటకై మైసూరుకు పోయిరి. మైసూరు ఆస్థానకవిపండితులకీ బాలకవి ప్రతిభ యబ్బుర మనిపించినది. మైసూరు మహారాజులైన చామరాజేంద్రులు శ్రీనివాసాచార్యులకు 'బాల సరస్వతి' బిరుద మిచ్చి సత్కరించిరి. పరకాల మఠాధీశ్వరులును రాజగురువులును నైన శ్రీరంగనాథబ్రహ్మతంత్ర పరకాల స్వామివారికడ శ్రీనివాసాచార్యులవారు తర్కవేదాంతము లభ్యసించిరి. సజ్జియం తాతాచార్యులవారికడ వివిధప్రాకృతములు నేర్చిరి. చామరాజేంద్రులవారీతని ప్రతిభాపాండిత్యముల కలరి కాశీ నవద్వీపములం దున్నతవిద్య గడించుటకై యుపకారవేతన మిచ్చిరి. శ్రీనివాసాచార్యులవారు కాశిలో అద్వైత వేదాంతమును స్వామిశాస్త్రిగారి యొద్దను, న్యాయశాస్త్ర కోవిదులును, జగదీశ కైలాసచంద్రశిరోమణి భట్టాచార్యులవారియొద్దను చదివిరి. ఆటుతరువాత నవద్వీపమునకు పోయి మీమాంసా శాస్త్రము నాపోశనము పట్టిరి. నవద్వీపపండిత మండలివారాయనకు 1898లో 'తర్కతీర్థ' బిరుద మిచ్చిరి. ఈ విధముగా

8. శారదామంజీరము, పుట 87, సికింద్రాబాదు 1971.

సమస్తశాస్త్రములు నేర్చి, కవిత్వపటుత్వమునను శాస్త్రసిద్ధాంతరాద్ధాంతములందును తనకు సాటివారు లేరనిపించుకొని తనమాతృదేశమునకు బయలుదేరిన శ్రీనివాసాచార్యులవారు మార్గమున దగిలిన ఉత్తరాది సంస్థానములు చూచి యచటి పండితులతో వాదములందు గెలిచి సహస్రధారగ సాహిత్య క్షేత్రయాత్ర చేసిరి. దర్భంగా, జోధపూర్, బుంధిరత్తియా, గ్వాలియర్, కోటాంబరీ, ఇందూరు, ధారానగర్, జమ్మూకాశ్మీరభూపతులు లా సరస్వతీ యుపనామమునకు వెలకని కానుక లిచ్చి తమ పేరోలగమునందు సముశిరస్కులై యభినందించి యభిమానించిరి.

శ్రీనివాసాచార్యులవారు గంటకు నూరుశ్లోకము లవలీలగా చెప్పెడువారు. అందుచే వారికి 'ఘంటా శతశ్లోకకవి' యను సార్థకమైన బిరుదము లభించినది. వారి యవధానములు సమకాలికపండితులను, విద్యావేత్తలను, ఉన్నతాధికారులను, సంస్థానాధీశ్వరులను ఆశ్చర్యసాగరమున నోలలాడించినవి. వారు బళ్ళారి, కడప, పెనుగొండ, తాడిపత్రి, మద్రాసు[4] బనగానపల్లి మొదలైన చోట్ల అనేకావధానము లొనర్చి కీర్తితో పాటు ధనకనకవస్తువాహనములు పుష్కలముగా సంపాదించుకొనిరి. ఈ విధముగా శ్రీనివాసాచార్యులవారు దేశమంతయు తిరిగి తమసాహిత్య క్షేత్రయాత్రలు ముగించుకొని జన్మస్థలమైన ఆత్మకూరులో స్థిరముగా నుండిపోయిరి. ఆత్మకూరు సంస్థానాధీశ్వరులు ఆచార్యులవారిని తమ ఆస్థానమునందు ప్రధానవిద్వాంసులుగా నుంచుకొని అనేకాగ్రహారము లిచ్చిరి. శ్రీనివాసాచార్యులవారు కవిపండితులుగా తాము సన్మానము నందుటతో తృప్తి పడలేదు. బ్రహ్మామృతవర్షిణి యను నొకసంస్థను నెలకొల్పి ప్రతివత్సరము వేదపండితుల నాహ్వానించి తమ సొంతధనముతో సన్మానించుచుండిరి.

ఒకప్పుడు తిరుపతివేంకటకవులు ఆత్మకూరు సంస్థానమునకు పోయి తదాస్థానవిద్వాంసులును ధర్మాధికారులు నైన శ్రీనివాసాచార్యులతో తలపడి శాస్త్రవాదమున నోడిపోయిరి. తిరుపతి వేంకటకవులు తెలుగులో గొప్పకవులే యైనను సంస్కృతమున నాటకకవిత్వము చెప్పుటయందును, సమస్త శాస్త్రవైదుష్యమునను శ్రీనివాసాచార్యులవారే మిన్నలు. ఆ వాస్తవ మెరుగనివారు

4. 31-3-1908 నాటి "రాజహంస" పత్రికలోను, 8-4-1908 నాటి 'మద్రాస్‌మెయిల్' పత్రికలోను ఈయవధాన కార్యక్రమము విపులముగా ప్రకటితమైనది.

కొందరు ఇటీవల పత్రికలందును గ్రంథములందును శ్రీనివాసాచార్యులవారే పరాభూతులైనట్లు వ్రాయుట సత్యదూరము. నాటి విశేషము లెరిగినవారు కొందరిప్పటికిని తెలంగాణమున గలరు. బాలసరస్వతుల మనుమలు శ్రీమాన్ కవి తార్కికసింహాచార్యులవారివలనను, తిరుపతి వేంకటకవులకు గద్వాలలో నాతిథ్యమొసగిన మహాపండితులు శ్రీగుంటేరావుహర్కారేగారివలనను జిజ్ఞాసువులైనవారు సత్య మరయవచ్చును.

బాలసరస్వతి శ్రీనివాసాచార్యులవారి ముద్రితాముద్రిత గ్రంథములు పెక్కు లున్నవి. 1. నంజరాజయశః, 2. దుర్మదనిర్మథనమ్, 3. జాంబవతీ పరిణయమ్, 4. తత్త్వమార్తాండ ప్రభామండలమ్, 5. రాజశేఖరచరితమ్, 6 సురపుర వేంకటగురు చరితమ్ 7. శతఘంటావధానమ్, 8. శ్రీనివాస విలాసః 9. వీరశైవశిరస్తాడనమ్, 10. దుష్టగ్రహనిగ్రహమ్, 11. తిరుతి వెంకటాచార్య విజయవైజయన్తీ, 12. రాజవంశరత్నావళీ, 13. లక్ష్మీసరస్వతీ దండకమ్. 14 విష్ణుస్తుతివ్యాఖ్యా, 15. రహస్యత్రయసారార్థః, 16. గంగాస్తుతిః, 17. ఆంగ్లేయ జర్మనీ యుద్ధవివరణమ్, 18. ప్రపత్తిపదవీ, 19. హయగ్రీవవందారకత్, 20. నరకేసరిస్తుతిః, 21. రఘువరాదరస్తోత్రమ్, 22. విజయదశమీనిర్ణయః మొదలైనవి వారి సంస్కృతరచనములు.

పై కృతులలో నేడవదైన శతఘంటావధానమ్ అనునది శ్రీనివాసాచార్యులవారు కడప, ప్రొద్దుటూరు, బళ్ళారి, మద్రాసు నగరములం దవధానములు చేసినప్పుడు చెప్పిన శ్లోకములు గల చిన్న సంకలనము. దీనిని సుప్రసిద్ధ ఆయుర్వేదవైద్యులు పండిత డి. గోపాలాచార్యులుగారు ప్రకటించిరి.[5] అవధాన పద్యములతోపాటు ఏడవ ఎడ్వర్డు పట్టాభిషేక సందర్భమున చెప్పిన 23 శ్లోకములును, భవానీసంగమేశ్వరస్తుతియు దీనిలో నున్నవి. శ్రీనివాసాచార్యులవారు విశిష్టాద్వైతులైనను, శైవభక్తులు కొందరు శివునిపై స్తోత్రరూపమైన శ్లోకములు చెప్పవలసినదిగా కోరినపుడు వా రీభవానీసంగమేశ్వరస్తుతిని చెప్పిరి. ఇది వారి సహృదయతకు తార్కాణము. ఈ స్తుతినుండి మచ్చునకుగా మూడు పద్యములు

'ప్రసవస్త్రీమాభ్యాం కలయితనిశాన్తం కిమపి త
త్ప్రశాన్తం జ్యోతిర్నః ప్రథయతు శశాంకార్ధమకుటమ్,

5. ఆనందముద్రణాలయము. మద్రాసు. 1903.

నిదానం లోకానాం నిరవధివిధానన్దలహరీం
దధానం భక్తానాం శమధనహృదానందనచణమ్.'

'సురాసురశిర స్తటీముకుటమృష్టపాదామ్బుజం
చరాచరకుటుమ్బినం శమధనాశయాలమ్బనమ్,
ధరాధరకుమారికా స్మరవిలాసలోలాశయం
జనాస్తుహినభాస్వరం భజత సంగమాధీశ్వరమ్.'

'ఆరాశచలకు న్తలం పరమురాశయనాఞ్చితం
ప్రవాళమృదులాధరం సితశరాభికాస్యప్రథమ్,
స్మరామి పురవైరిణః కమపి నిత్యనేత్రోత్సవమ్.'

మద్రాసు అవధానసందర్భమున శ్రీనివాసాచార్యులవారు వివిధప్రాకృత ములలో నాశువుగా చెప్పిన పద్యములును ఇందులో కలవు. ఇంతకుపూర్వము పేర్కొన్న వారిరచనములందు 19, 20 సంఖ్యలు గల హయగ్రీవపంచాశత్, నరకేసరిస్తుతిః అనునవి కూడ ప్రాకృతమున రచించినవే.

శ్రీనివాసాచార్యులవారి రచనములందు పదునొకండవదిగా పేర్కొన్న "కిరీటి వెంకటాచార్య విజయవైజయన్తి" నాటక మముద్రితము. దీనిప్రతి యొకటి నాచెంత నున్నది. ఇది యైదంకముల నాటకము. దీనిలో మూడవ ఆణ్డయాచార్యులవారి కుమారులును, సురపుర సంస్థానాధీశ్వరులైన వెంకటప్ప నాయకుని [1778-1802] యాస్థానకవులు రాజగురువులునైన కిరీటి వెంకటా చార్యులవారి సాహిత్యజీవితము చిత్రితమైనది. దానితోపాటు గద్వాల, ఔకు, సురపురము, పూనా సంస్థాన వైభవములును సమకాలీన విద్యావైదుష్యముల చరిత్రములును చిత్రితములైనవి. దీనిని తిరుమల శ్రీనివాసుని బ్రహ్మోత్సవ సందర్భమున ప్రయోగించుటకై శ్రీనివాసాచార్యులవారు వ్రాసినట్లు ప్రస్తావనలో నున్నది.

ప్రారంభమందలి నాందీపద్య మీవిధముగా కలదు :

"కారుణ్యేన కిరీటినే ప్రవితరన్నధ్యాత్మవిద్యామృతం
ద్వారాసేన నికోడినో విదళయన్ శాస్త్రేషు సాధీయసా,
తస్మై తస్య యశశ్శశాంకధవళం తన్వన్ ధరామండలే
శ్రీమాన్ శ్రీనిధి రచ్యుతః ప్రదిశతు శ్రేయాంసి భూయాంసి నః",

సూత్రధారుడు నాటకకర్తను తత్కృతిని ఈవిధముగా పరిచయ మొనర్చినాడు:

"ఆసర్వం స్మృత మద్య మారిష సఖే యత్తర్క తీర్థాదిభి
శ్రీమాన్ బాలసరస్వతీ బిరుదభాక్సంభావితా మగ్రణీః,
నిశ్శంకం ఘటికాశతం కవయితా నిస్తంద్రకీర్తిప్రభు
శ్రీనివాసార్యమహాకవి ర్విజయతే భూమండలీభూషణమ్."

"యో బ్రహ్మమృతవర్షిణం నిరుపమాం నిర్మాయ దివ్యాం సభాం
తస్యాం పండితమండలీః ప్రతిసభం దిగ్దేశతో మేలయన్,
తద్వాదానవకర్తృః తర్కసుభగాన్ సమ్మానయిత్వాదరాత్
కౌశేయైః కలధౌతభాజనచయైః కాశ్మీరజైః రాంకవైః".

"స్వేతచ్ఛత్రధ్వాయా గుంటితాంగప్రస్మేరాభ్యాం విజితగ్ర్యామరాభ్యామ్,
యోధిష్ఠాయాందోళికాం హేమచిత్రాం దేశే దేశే సంచర త్యంచితశ్రీః."

'యః కిల శఠమర్షణాన్వయ సుధార్ణవపూర్ణిమేందుస్సకలకలావిలాసిసి విదగ్ధిట్ప్రకవిలోకనైకలోలుపమానసః, భగవద్రామానుజముని పరమాచార్య భూత శ్రీమన్నాథమునివంశావతంసః, పంక్తిపావనః, స్వయమాచార్యపురుషశ్చ, ఏతేన కృతమస్తి వేంకటార్యవిజయప్రజయన్తీనామకం నాటకం సామాజికోద్దిష్ట సకలగుణవిశిష్టం తేన సర్వాంశ్చేమా ననురంజయిష్యే.'

ఈనాటకమందలి యితివృత్తము సంగ్రహముగా నిట్లుండును:

ప్రథమాంకమున తిరుమల బుక్కపట్టణమువారి వంశావతారము, అణ్ణయా చార్యులు వారిసోదరులు శ్రీనివాసాచార్యులు బుక్కపట్టణమునుండి సురపురము నకు వచ్చి రాజగురువులుగా స్థిరపడుట, శ్రీనివాసాచార్యులవారి శుశ్రూష యొనర్చిన కిరీటి వెంకటాచార్యులు మరియు నితరసహాధ్యాయుల విద్యాభ్యాస విశేషములు, అహోబలమఠాధీశ్వరులైన శ్రీనివాసయతీంద్రులు గద్వాలకు వచ్చి శ్రీనివాసాచార్యులవారిని సురపురమున చూడగోరుట, శ్రీనివాసాచార్యులవారి యాకస్మికమరణవార్త విని యతీంద్రులు చింతించి వారి వైదుష్యమును, వా రొనర్చిన ఘనకార్యములను కొనియాడుట కలదు.

ద్వితీయాంకమున సురపురమున శ్రీనివాస యతీంద్రులు కిరీటి వెంకటా చార్యుల వైదుష్యమును పరీక్షించుటకై వారితో వాదింతురు. యతీంద్రులవారు విశిష్టాద్వైత పక్షమున, కిరీటి వెంకటాచార్యులవారు అద్వైతపక్షమున వాదించుట యందలి విచిత్రము.

తృతీయాంకమున ఈవాదమే విపులముగా ప్రదర్శితమైనది. ఈయిరువురు పండితులు 15 దినములు వాదించుకొందురు. వాదమున గెలువలేక యతీంద్రులు వెంకటాచార్యుల నోడించుటకై నృసింహు నుపాసింతురు. హయగ్రీవోపాసనముతో వెంకటాచార్యులవారు ప్రతిక్రియ యొనర్తురు. వెంకటాచార్యులవారి పాండిత్యమునకు వాదనైపుణ్యమునకు, కవితాధారకు మెచ్చి యతీంద్రులవారు వాదమునుండి విరమించుకొని వెంకటాచార్యులవారికి విజయపత్రిక నొసంగి సన్మానింతురు. ఈయంకమున వెంకటాచార్యుల కవితాచాతుర్యమును ప్రదర్శించు చిన్నచిన్నస్తోత్రములు- దశావతారస్తోత్రము, భావశతకము మొదలైనవి కలవు.

చతుర్థాంకమున సురపురసంస్థానాధీశ్వరులును, వారి రాణియు వెంకటాచార్యులవారిని గూర్చియు వారి పూర్వులను గూర్చియు సంభాషించుకొనుచుందురు. ఇంతలో నొకదూత వచ్చి వెంకటాచార్యులుగారు అలుకతో సురపురము విడిచి పోవుచున్నారని చెప్పును. రాజుగారు వెంటనే వెంకటాచార్యులవారికడకు పోయి విచారించగా సంస్థానోద్యోగుల యనౌచిత్యప్రవర్తనము వారి యలుకకు కారణ మని తెలియును. రాజుగారుద్యోగులను మందలించి ఆచార్యులవారిని ప్రార్థించి మరలించుకొనివచ్చి సన్మానము నొనరింతురు.

పంచమాంకమున కిరీటివెంకటాచార్యులవారు పూనాస్థానవిద్వాంసుల గెలుచుటకై ప్రస్థానింతురు. నానాఫడ్నవీస్ మంత్రిగా పేష్వామాధవరావు పాలించు దినము లవి. మాధవరావుపేష్వా మరాఠీభాషలో నడిగిన ప్రశ్నలకు వెంకటాచార్యులవారు ఆమాటలే ప్రయోగించుచు సంస్కృతమున సమాధానము లిచ్చు విచిత్రసన్నివేశ మిందు గలదు.

షష్ఠాంకమున వెంకటాచార్యులవారు పూనా సంస్థాన పండితులతో ద్వైతాద్వైత విషయమున వాదించి విజయ మందుదురు. పూనా ధర్మాధికారులు వెంకటాచార్యులవారు నవద్వీపపండితుల నోడించిన విషయమును గూడ నిందులోనే ప్రస్తావింతురు. పేష్వా మాధవరావుగారు ఆచార్యులవారికి వేయినూట పదారు లిచ్చి సన్మానము చేయుదురు.

సప్తమాంకముకూడ వెంకటాచార్యులవారి శాస్త్రార్థముల కంకితమైనది. వెంకటాచార్యులవారి నెదిరింపలేని పూనాసంస్థాన పండితులు ఈర్ష్యాళువులై ఆచార్యులవారి నోడించుటకు పురుషోత్తమశాస్త్రి యను నౌత్తరాహుని రావింతురు. వివాదము 17 దినములు సాగినది. ఆచార్యులవారిని వాదమున గెలుచుట

యసంవత్సరమున 17 వనాటిరాత్రి పురుషోత్తమశాస్త్రి ఆచార్యులవారి నంతమొందింపుటకు బగళాప్రయోగ మొనర్తురు. కాని హయగ్రీవానుగ్రహమున ఆచార్యులవారాగండము తప్పించుకొందురు. మంత్రప్రయోగ మొనర్చిన పురుషోత్తమశాస్త్రియే బగళాశక్తి కెర యగుదురు. ఆచార్యులవారు విజయు లగుదురు.

అష్టమాంకమున వెంకటాచార్యులవారు తిరుమలకు శ్రీనివాసదర్శనమునకై పోదురు. వారు తిరుమల చేరునప్పటికే కాలాతీత మైనందున అర్చకులు స్వామివారి మందిరద్వారములు మూయుదురు. ఆచార్యులవా రెంత బతిమాలినను అర్చకులు తలుపులు తీయరు. అప్పుడు కుపితులై వెంకటాచార్యులవారు వెంకటేశ్వరస్వామినే యిట్లుపాలంభింతురు :

"ఐశ్వర్యమదమత్తోఽసి, మాం న జానాసి కేశవ,
పరైః పరిభవే ప్రాప్తే, మదధీనా తవ స్థితిః"

వెంటనే ద్వారములు తెరచుకొనును. అర్చక పూజారులు పండితులు ఆశ్చర్యపడి ఆచార్యులవారిని బతిమాలి సన్మానింతురు. తిరుమల తిరుపతి ధర్మాధికారియైన మహంతు హత్తిరాంబాబా వెంకటాచార్యులవారి గురువులును పితృవ్యులును నగు శ్రీనివాసదేశికుల మహత్త్వమును స్వయముగా నెరిగినవా రగుట ఆచార్యులవారిని సత్కరించి ఘనముగా సన్మానింతురు. దీనితో నాటకకథ ముగియును చిట్టచివరన భరతవాక్య మిట్లున్నది.

"నిర్దోషనిత్యమధురాణి నిరామయాని
శాస్త్రాణి నిత్యసుభగాని జయంతు లోకే,
నిత్యాదృతా నృపతిభి స్సహృదాం సదా శ్రీ
మహేశ్వరీ చ సుభగా సతతం కవీనామ్."

నేను కూడ నిర్దోషనిత్యమధురములు నిరామయములు నిత్యసుభగములు నైన శాస్త్రములు జయించుగాక అనియే కోరుచున్నాను. కీర్తిశేషులగురించిన సత్యాసత్యములు తెలియక, తెలిసికొన ప్రయత్నించక సాహసోక్తులకు ఆధునికులు పూనుకొనరాదని స్పష్టముగా కోరుచు ఈ విజయవైజయంతికానాటకము ప్రభుత్వమువారో ప్రజాసంస్థలవారో ప్రకటింపవలెనని వేడుచున్నాను.

(అక్షరార్చన, 1972)

ఆలూరి సూర్యనారాయణ వాజపేయయాజి

తెలుగువారికి ఆశుచిత్రకవిత్వాల మీద అభిమానం కొంచెం ఎక్కువ. ప్రాచీనకాలంనుండి ఈనాటివరకు మన తెలుగు కవులు ఇటువంటి కసరత్తులు చేస్తూనే ఉన్నారు. దీనికి కారణం మన సాహిత్యం చాలావరకు రాజాశ్రితం కావటమే అనుకుంటాను. రాజులకూ మంత్రులకూ వారి నాశ్రయించుకొన్న మంత్రిదండనాథులకూ సాహిత్యవినోదం కల్పించటానికి మన పూర్వకవుల్లో కొందరు ఈ ప్రక్రియలను బాగా సాధన చేసిఉంటారు. వీళ్ళ సాధనలు కేవలం తెలుగు కవిత్వానికే పరిమితం కాలేదు. సంస్కృతరచనలు చేసిన తెలుగువాళ్ళు కూడా తమ పాండితీప్రతిభలకు తార్కాణంగా ఈ వినోదాలు ప్రదర్శించినవారున్నారు. అటువంటివారిలో ఏకదినప్రబంధకర్త ఆలూరి సూర్యనారాయణ వాజపేయయాజి ఒకరు

రెండవ వెంకటపతిరాయలు విజయనగరసామ్రాజ్యం పాలిస్తున్న (1586-1614) కాలంలో రాయవేలూరును లింగమనాయకుడనే సామంతుడు ఏలుతుండేవాడు. అతని తండ్రి చినబొమ్మనృపాలుడు (1649-1579) కవి పండితపోషకుడేకాక స్వయంగా గొప్ప గాయకుడు కవి. జయదేవుని గీతగోవిందం వలె అతడు రామాయణం ఆరుకాండలు వివిధరాగతాళాలలో గేయాలు, మధ్యమధ్యన శ్లోకాలు కూర్చి సంగీతరాఘవమనే కృతిని నంతరించినాడు. అప్పయదీక్షితులవారిని చాలాకాలం పోషించినాడు. చినబొమ్మనాయకుని కొడుకు లింగయనాయకుడు కూడా మేటి పరాక్రమశాలి; కవిపండితులపాలిటి కల్పతరువు. శిథిలమైపోయిన విజయనగరసామ్రాజ్యాన్ని మళ్ళా ఒక కొలికికి తెచ్చిన ప్రతాపశాలి రెండవ వెంకటపతిరాయలు. అంతటి రాయలనే ఎదిరించి యుద్ధమిచ్చినవాడు లింగమనాయకుడు. వేలూరుకోట

విజయనగర సైన్యాలకు కొరుకుడు పడకపోతే, రామెర్ల కటిచెన్నానాయకుడనే విజయనగరసామంత సైనికాధికారి మోసం చేసి ఆ కోటను పట్టుకుంటారు. అంతటిలో ఈ నాయకుల పాలనం వేలూరులో అంతరించిపోయింది.

లింగయనాయకుని ఆస్థానంలో కవులు పండితులు గాయకులు నర్తకులు అప్పరప్పుడు విద్యాగోష్ఠులు జరిపేవారు. అట్టివారిలో ఆలూరి సూర్యనారాయణ యజ్వ కొలికిపూస. ఒకనాటి విద్యాగోష్ఠిలో మాటమీద మాట వచ్చి కవిపండితులు పంతాలాడుకుంటారు. ప్రభువు సమక్షంలో ఆస్థానసభ్యులిచ్చిన ఇతివృత్తం స్వీకరించి సూర్యనారాయణయజ్వ ఒక్కనాడే ఒక ప్రబంధం సంస్కృతంలో వ్రాస్తానని శపథం చేస్తారు. చేసిన శపథం మేరకు అనువుగా సమ్మానటముపై శ్లోకాలతో నాలుగుసర్గల కావ్యం ఏకధాటిగా చెప్పుతారు. ఈ కావ్యంలోని ఇతివృత్తం అర్జునుడు ద్రౌపదీవిషయమైన సమయం భంగం చేసినందుకు తీర్థయాత్రలకై పోయి ఉలూచీచిత్రాంగదాసుభద్రలను వివాహం చేసుకొని రావటం. కవి మాత్రం దీనికి ఏకదినప్రబంధమని పేరు పెట్టుకున్నారు. ఇది అముద్రితం.

ఆలూరివారి కుటుంబం వైదికకర్మలకూ పాండిత్యానికి కాణాచి. సూర్యనారాయణ వాజపేయం చేసినవారు. అతని తలిదండ్రులు జ్ఞానాంబాయజ్ఞేశ్వర మహాగ్నిచిత్తులు. ఆ మహాగ్నిచిత్తు మహోపాధ్యాయబిరుదాంచితుడు. కూడా. ఈ విషయాలన్నీ కవి తన ఆశ్వాసాంతపద్యాల్లోను గద్యల్లోను చెప్పుకున్నారు.

ప్రథమసర్గలో ఇంద్రప్రస్థవర్ణనం, ధర్మరాజు కీర్తిప్రాభవాలూ, పరిపాలనం, అర్జునుడు సమయభంగం చేసినందుకు తీర్థయాత్రలకై బయలుదేరటం, గంగనుండి పాతాళానికి పోవటం, ఉలూచివలన బభ్రువాహనుడు జన్మించటం, అక్కడినుండి కావేరీతీరం రావటం, పాండ్యదేశవర్ణనం, పాండ్యరాజు కూతురు చిత్రాంగదతో ప్రణయం, పంచప్సరసేవనం, ద్వారకాగమనం ఉన్నవి.

రెండవసర్గలో అర్జునుడు సుభద్రపిది కాంక్షతో ద్వారకబయట ఒక వటవృక్షం క్రింద ఉండి శ్రీకృష్ణుని స్మరించటం, సత్యభామాకేళీలోలుడైన కృష్ణుడు విజయుని స్మరణం గ్రహించి మందహాసం చేయటం, సత్యభామ అనుమానపడి నవ్వుకు కారణం అడగటం, కృష్ణుడు యథార్థం చెప్పటం, కృష్ణుడు అర్జునుని దగ్గరకిపోయి సుభద్రాపరిణయానికై ఒక పన్నాగం

చెప్పటం, అర్జునుడు కుహనాపరివ్రాజకుడుగా రైవతకాద్రిచెంత ఉండటం, వసంతావిర్భావం, అర్జునుని విరహం, బలరామకృష్ణులు రైవతకాద్రికి పోవటం, కుహనాయతి దర్శనం, చాతుర్మాస్యాలకు ఆ పరివ్రాజకుని తమ అంతఃపురానికి ఆహ్వానించటం, అంతఃపురోద్యానంలో ఉంచి సుభద్రను పరిచర్యలకై నియోగించటం, వారి వర్ణనలు, అర్జునుని విరహం, సుభద్రకు విజయునిమీది ప్రేమ, పరివ్రాజకుడు సుభద్రకు సాముద్రికం చెప్పటం, ఆమె కోరికపై అర్జునుని రూపపరాక్రమాలు వర్ణించటం ఉన్నవి.

మూడవసర్గలో సుభద్ర చెలికత్తె కుహనాయతికి సుభద్ర విరహం వర్ణించి చెప్పుతుంది. యతి సుభద్రతో అర్జునుడు ఆమెకోసం పడే విరహం వర్ణించి చెప్పుతాడు. సుభద్ర అతనివద్ద సెలవు తీసుకొని సౌధానికి పోతుంది. వర్షావర్ణనం, వర్షామేఘాలవలన ఆమె విరహం మరింత వృద్ధికావటం, కుహనాయతి పట్టలేక సుభద్రతో తన గుట్టు చెప్పుకోవటం, వాళ్ళ రహఃక్రీడలు వర్ణింపబడినవి.

నాల్గవసర్గలో మాయాపరివ్రాజకుడు మన్మథమంత్రం ఆపిస్తూ బాడు బలరామకృష్ణులాతనికి నమస్కరించి సెలవు తీసుకొని సముద్రద్వీపంలో జరిగే శివుని ఉత్సవాలకు పోతారు. సముద్రవర్ణనం, జలక్రీడలు, శివపూజలు జరుగుతవి. కృష్ణుడు బలరామునికి తెలియకుండా ద్వారక చేరుకున సుభద్రార్జునుల పెండ్లిప్రయత్నం చేస్తాడు. ఇంద్రుడు, శచీదేవి, బృహస్పతి వచ్చి పెండ్లి జరిపిస్తారు. బలరాము డిది తెలిసి కోపానికి వస్తే కృష్ణుడు శాంతింపజేస్తాడు. సుభద్రార్జునులు ఇంద్రప్రస్థానికి బయలుదేరుతారు. సాయంకాల వర్ణనం, చంద్రోదయ వర్ణనం, మార్గమధ్యంలో నూత్నవధూవరుల విశ్రాంతి, శృంగారం, ప్రభాతం, మరల ప్రయాణం, ఇంద్రప్రస్థం చేరుకోవటం, ద్రౌపది సుభద్రను ఆశీర్వదించటం, ధర్మరాజు శ్రీకృష్ణాదియాదవులను రావించి సుభద్రార్జునుల వివాహోత్సవం చేయుటం, వధూవరుల ఊరేగింపు పౌరకాంతలుచూడటం, అందరూ తిరిగి రాచనగరు చేరుకోవటంతో ఈ కావ్యం ముగుస్తుంది. ఈ కావ్యంలో ఉలూపీచిత్రాంగదాసుభద్రల ముగ్గురి ప్రణయవృత్తాంతం ఉన్నా, సుభద్రార్జునుల ప్రణయానికే ఇందులో ప్రాధాన్యం ఎక్కువ. ఇంత ఆశువుగా కూర్చిన కావ్యమైనా సాహిత్యసంపదకు సరసరావాలకు అలంకారాలకు వర్ణనలకూ ఇందులో లోటు లేదు.

ఈ క్రింది ప్రార్థనతో ఏకదినప్రబంధం ప్రారంభమౌతుంది.

స్ఫురతు మే గురుగంభీరఘనప్రభాదితసంతనుసే హృదయాంతరే,
అధికథా కరకంకణకుండలీ కృతితశంకితశంకరసంస్తుతః.

భవతు భూపనతా విదుషాం పురః పరతః కృతిమేకదినే మమ,
కుశలదాయి శివే తవ వీక్షణం కుశలమున్మిషతేన జగత్కృతా.

ఆ తరువాత ఈ క్రింది ఇంద్రప్రస్థవర్ణనలో కథ ప్రారంభిస్తారు.

కురుకులోద్భవరాజయశస్సుధా రసపరిప్లుత మహిమయదర్పణే,
సురపురప్రతిబింబవిలోలితం విజయతే పురమింద్రపదాంకితమ్. I-౪

ధర్మరాజు పరాక్రమప్రాభవాలు వర్ణించే ఈ పద్యం ఎంత సొగసుగా ఉన్నదో గమనించండి.

పుమభిలాషపదైః స్ఫురతమా త్రిభిః స్వరసనృణాం చ దిశాం విజయైరివ,
న హి చతుర్భిరపోషి నహోదరైర్హరిరివోచ్చభుజైరభిధన్న హైః. I-౪.

పుమభిలాషపదంతో చతుర్విధపురుషార్థాలను చెప్పటమేకాక నలుగురు తమ్ములతోడి యుధిష్ఠిరుణ్ణి చతుర్భుజుడైన హరితో పోల్చటం గొప్పగా ఉన్నది.

పాండ్యరాజు కూతురు చిత్రాంగదను వర్ణించే శ్లోకాల్లో ఒకటి.

ముఖరుచిప్రసవల్లహరి స్తనతటధరప్రతిహారవివర్తితా,
ధ్రుకుటయుగీ వరితస్ఫురతి ధ్రువం భుజయుగీతి భుజంగశిశుభ్రువః. I-౬౭

ఇది అల్లసానివారి భ్రుకుటీభుజంగయుగళి అనే మాటను జ్ఞాపకం చేస్తుంది. ఆ చిత్రాంగదను చూచినప్పటి విజయుని వర్ణించేది ఈ క్రింది శ్లోకం. దీనిలోని అలంకారౌచిత్యం రమణీయం.

దృశినిధేరపి వీక్ష్య స్వపాత్మజాం విలులితం హృదయం విజయస్య తాం
అపి శిలో త్రమమిందుమణిం కళా ద్రవయతే నవనీతవదైందవీ. I-౪౪

అర్జునుడు దైవతకాద్రిచెంత ఉన్నప్పుడు వసంతం వస్తుంది. అందలి కింశుకాలు సహకారాలు పూసినవి. విరహంతో బాధపడేవారికి అవి ఎంతో అపకారం చేస్తవి. వాటి పేర్లను కవి ఏ విధంగా చమత్కరించినాడో గమనించండి.

వియోగిహృద్రక్తనిపీత శేషలేశారుణాస్యే కిల కిరసంఘే,
చంచ్వాగుణాద్యం శుకనామయోగ్యే లేభ్రే క్రమేణానికింశుకాఖ్యా II-37

స్మరప్రతాపైరివ పల్లవౌఘైరంగారసంపాదనభైరవాఢ్యః,
పాంథాన్ విసృజ్య సహస్మరేణ హతా యథార్థం సహకారనామ. II-38

ఈ వసంతాగమంలో విజయునికి సుభద్రావిరహం భరింపరానిదౌతుంది. ఆపట్టున వనంలో పాలంభనం చేసే ఈ క్రింది శ్లోకం పండితరాజు "జాత్యా విహీనో న వివేకమీష్టే" అనే మాటలను తలంపుకు తెస్తుంది. మీరుమిక్కిలి శ్లేషరామణీయకం కూడ దొర్లది.

స్వకామభాత్మారభవబద్ధసఖ్యః మధ్వర్థసం హంతి ముహుర్వసంతః,
పలాశవర్గస్య వికాశహేతోః క్వ జాతిహీనస్య భవేద్వివేకః. II-47

సుభద్రావిరహవ్యథను ఆమె చెలికత్తె కుహనాయతికి దీర్ఘంగా వర్ణించి చెప్పుతుంది. ఇంత ఆశువుగా చెప్పిన కావ్యంలో పదాలపొందిక, నాదసౌందర్యం, అలంకారౌచిత్యం ఎట్లాపాటించినారో గమనించండి.

స్పందనమానతరుబృందమంజరీ స్యందమానమకరందబిందుభిః,
చందనాగరసైరివాప్లుతం మందవాతమసకృద్ధునోత్యసౌ. III-13

కంఠసీమని కరోత్యసౌ ముహుర్బిసరజఃబద్ధమాలికాం,
విభ్రమద్భ్రమరకైతవశరత్ స్వేదబిందుమివ కాళభోగినీమ్. III-14

చిత్తభూశరగరుస్మరుస్నిభశ్వాసవీచిభిరలిప్రకంపితమ్,
సా బిభర్తి రతికాపునర్భృతం కందుకద్వయమివ స్తనద్వయమ్. III-15

ధ్యానసన్నవరసానుచస్థలే వీక్ష్య బింబితమియం నిజాననం,
హంత హంతుమయమంతికాగతశ్చంద్రమా ఇతి భయేన మూర్ఛతి. III-17

వర్షాకాలవర్ణనం దీర్ఘంగా సాగింది. కవి మనస్సులో ఏ రాజకీయానుభవాలు మెదలినవో కాని ఈ వర్షావర్ణనం గమనించండి.

యత్ర సైకతమభూత్పురా హ్రదః తత్ర యత్ర న చ తత్ర సైకతమ్,
వ్యత్యయం వ్యతనుతైష వారిదో నూతనప్రభురివాధికారిషు. III-54

కుహనాయతి తన రహస్యం సుభద్రతో ఎంత గడుసుగా చెప్పుకుంటాడో చూడండి.

కేవలం హరిత వైరి నుం ప్రియే సత్యయా చ సహ భీష్మకన్యయా,
వేష ఏష కలవిప్రలిప్సయా కల్పితః కమలలోచనేన మే. III-78

ఇత్యుద్భటబలవిప్రలిప్సయా అంటే బలరామవిప్రలంభేచ్ఛయా అని అర్థం. సుభద్రార్జునుల రహఃక్రీడలను వర్ణించే సరసమధురమైన ఈ పద్యం గమనించండి.

దైవతైర్ద్విజనిపీడితా సుధా వాసుదేవసహజాధరే కృతా,
తత్ర చ ద్విజనిపీడితైవ సా కర్మ నశ్యతి న దేశభేదతః. III-92

ఇందులో ద్విజశబ్దంపైన శ్లేష ఉన్నది.

ద్వారకనుండి ఇంద్రప్రస్థానికి బయలుదేరిన సుభద్రార్జునులు మార్గమధ్యంలో ఒక రాత్రి విశ్రమించి తెల్లవారగానే లేస్తారు. అప్పటి సుభద్రా వర్ణనం శ్లోకాలు చూడండి.

వాతాహృతనవాంభోజ సౌరభ్యేన సహార్జునః,
సుభద్రాముఖసౌగంధ్య తారతమ్యం పరీక్షతే. IV-91

లాక్షా లక్ష్మీం దదౌ పాదే కుంతలే కుంకుమశ్రియం,
బాలాతపః సుభద్రాయాః కర్ణే కమలపూరతామ్. IV-92

కావ్యాంతంలో కవి తన తలిదండ్రుల గూర్చి, తన ప్రభువు సభలో చేసిన ప్రతిజ్ఞ గూర్చి తనకావ్యరచన గురించి ఇట్లా చెప్పుకున్నారు.

శ్రీ యజ్ఞేశ్వరయజ్వన స్సితకరాదాలూరివంశాంబుధే
ర్జానాంబా సుషువే యమధ్వరివరం శ్రీసూర్యనారాయణం,
తస్య శ్రీమలి. లింగయప్రభుసభామధ్యే ప్రతిజ్ఞాకృత
శ్రీ మానేకదినప్రబంధసుకృతౌ సర్గశ్చతుర్థోఽజని IV-115

సాక్షీభిర్దివసస్య నవ్యమచిరాదవ్యాహతోహన్నతైః,
శబ్దార్థైః ప్రథునర్మనమ్రకథావృత్త క్రమై ర్యంత్రితం,
యత్కావ్యం నిరమాయి సంప్రతి మయా తస్మిన్ హఠాత్కారతః
ప్రాప్తం దోషముపేక్ష్య కేవలగుణగ్రాహీ బుధస్తుష్యతు. IV-116

స్వస్యగుణావిష్కరణ ప్రయోజనాత్సగౌరవాదపి వా,
త్రింశద్ఘటికనిబంధన సాహసతో వా సతాం ముదేస్తు మే కావ్యమ్. IV-117

ఈ కావ్యాంత గద్యం ఇట్లా ఉన్నది.

ఇతి శ్రీమహోపాధ్యాయ శ్రీమదాలూరి యజ్ఞేశ్వర మహాగ్నిచిత్పుత్రేణ జానాంబా గర్భశుక్తిముక్తామణినా శ్రీ సూర్యనారాయణ వాజపేయయాజినా విరచితాయా మేకదినప్రబంధకృతౌ చతుర్థస్సర్గః.

తెలుగువారి అముద్రితసంస్కృతకృతు లెన్నో ప్రాచ్యపుస్తక భాండాగారాల్లో మూలుగుతున్నవి. వాటికి సూర్యాలోకన మెప్పుడో!

(వివేచన, డిసెంబరు 1977)

పిల్లలమఱ్ఱి వెంకటపతిసూరి

నావద్ద ఇంకా మిగిలిన తాళపత్రాలు తిరుగవేస్తుంటే రాజేశ్వరవిలాస మహాకావ్యానికి సంబంధించిన 12 కమ్మలు కంటపడినవి. ఈ కావ్యం ఎన్ని ప్రకరణముల గ్రంథమో ఎంత గ్రంథమో సరిగా తెలియదు. లభించిన 12 కమ్మల్లో కృతికర్త రాజేశ్వర భూపాలుని వంశావళీప్రకరణం కొంత, అలంకార ప్రకరణం కొంత, నాయకప్రకరణం కొంత ఉన్నవి. ఈ కమ్మల్లోనే దాదాపు ఇన్నూరు శ్లోకా లున్నవి. మహాకావ్యమనే పేరునుబట్టి ఎవరైనా ఇదొకకావ్యం అనుకోవచ్చు, కాని ఇదొక సాహిత్యశాస్త్రగ్రంథం. విద్యానాథ కవి ప్రతాపరుద్రచక్రవర్తిపేరుతో వెలయించిన ప్రతాపరుద్రీయంవలె పిల్లలమఱ్ఱి వెంకటపతి సూరి రాజేశ్వరభూపాలుని పేరుతో వెలయించిన సాహిత్య గ్రంథం ఇది.

కృతికర్త కౌశికసగోత్రుడూ, పిల్లలమఱ్ఱి నాగలింగసోమయాజి పుత్రుడూ ఐన వెంకటపతిసూరి. ఇతని నివాసం ఏదో, కాలం ఏదో ఇదమిత్థంగా తెలియదు. కృతిభర్త మహాజని నాగాంబాలక్ష్మీనారాయణులనే బ్రాహ్మణదంపతులకు వేములవాడ రాజరాజేశ్వరస్వామి వరప్రసాదంగా పుట్టినవాడు; భాగాపుర నివాసి. కృతిభర్త పూర్వులచరిత్ర చాలాగొప్పది. వీళ్ళది గౌతమగోత్రం. మూలపురుషుడైన కీర్తిమన్నృపాలుడు బదరికాశ్రమంలో లక్ష్మీనారాయణుని సేవించి తత్ప్రసాదంగా సంతానం పొందినవాడు. ఆయన మునిమనుమడు నరసింహభూపతి ఆసాకేతము ఆకాశి పాలించినవాడు. ఈయనకు ఆరవతరం లోనివారైన కాశీనాథ, జగన్నాథ, ఉమానాథులనే సోదరత్రయం సాకేతము పాలిస్తూ నిజాముల్కుతో యుద్ధముచేసి గెల్చినవారు. ఉమానాథుని మనుమడు లక్ష్మీనారాయణ ఢిల్లీశ్వరునిచేత బెంగాల్ సుబేదారుగా నియుక్తుడైనాడు. ఈయన మనుమడు చంద్రచూడుడు పంఢరిపురి విఠలేశుని వరప్రసాదంగా విఠల, కృష్ణ, ధోండారాములనే ముగ్గురు కొడుకులను కన్నారు. వీరికి ఢిల్లీశ్వరుడు మహాజనీ, దేశముఖీ ఇచ్చినాడు. బహుశః ఆనాటినుండి ఈ దేశ

ముఖులకు మహాకవి అనిపేరైనది. పితలుని మునిమనుమడు గోపాలరాయుడు మచ్చాపురి (మచిలీబందరు) పాలకుడు. ఆయనకు ఎనమండుగురు సంతానం. అందులో రెండవవారైన లక్ష్మీనారాయణ స్తంభాద్రి (ఖమ్మంమెట్టు) దేశం ఏలించినారు. ఈ లక్ష్మీనారాయణకు నాగాంబ, వెంకమాంబ అనే ఇద్దరు భార్యలూ, రాజేశ్వరుడనే కొడుకూ వున్నారు. ఈ రాజేశ్వరభూపుడు వేములవాడ రాజరాజేశ్వరస్వామి ప్రసాదం. ఇతని పేరుమీదనే ఈ రాజేశ్వరవిలాస మహాకావ్యం వెలసినది. రాజేశ్వరభూపాలుడు భాగాపుర (భాగ్యనగరం—హైదరాబాదు) నివాసి. ఇతనికి రత్నమ్మ, లలితమ్మ అని ఇద్దరు భార్యలు. ఇతని కాలం కూడ ఖచ్చితంగా తెలియదు గాని మన రాజధానీనగరం హైదరాబాదుకు భాగాపురమనే పేరున్నట్లైతే క్రీ.శ. 16వ శతాబ్దంవాడై యుంటాడని ఊహించవచ్చు (గ్రంథకర్త పిల్లలమర్రి వెంకటపతిసూరి కూడ ఆతని సమకాలికుడై ఉంటాడు). ప్రకరణాంత గద్యం ఈ విధంగా ఉన్నది.

"బాలసరస్వతీ [illegible] (సు[illegible]) [illegible](రా)ంకః
సంపూర్ణ [illegible] విద్యామరంద్యః
నాగార్య [illegible] మూర్తిః పితాలసీ
దేవం శ్రీ వేంకట[illegible] (రా) సాదుకాదుర్వరాదః.

ఇతి [illegible] సుర(కవి) శ్రీనాలింగ సోమ్మ[illegible]శ్రీవేంకటపతిసూరివిరచితే రాజేశ్వరవిలాసే మహాకావ్యే వంశావళీప్రకరణం నామ ప్రథమోల్లాసః."

గ్రంథకర్త రాజేశ్వరవిలాసమును మహాకావ్యమన్నారు. వంశావళీప్రకరణాన్ని మొదటి [illegible] నాటకంలోవలె ప్రథమోల్లాసః అన్నారు; మరి రెండు ప్రకరణములను సాహిత్యశాస్త్రగ్రంథంలోవలె నాయక ప్రకరణమని, అలంకారప్రకరణమని పేర్కొన్నారు.

ప్రథమప్రకరణం వివరణ వ్రాయనకాదు.

"భారద్వాజ మునీంద్ర గోత్ర (విమల) శ్రీరాడ్ధి రాజాన్వితే
శ్రీకృష్ణార్య పితా సురామ వియుతః శ్రీరాజమూ(ంబా[illegible])నుః
శ్రీరాజేశ్వరభూపచంద్ర సువిలా సాద్యం ;వరంధం లిఖన్"

అని చెప్పుకున్నారు. ఈశ్లోకంలో మూడవపాదం ఎగిరిపోయినది. ఇక అసమగ్రంగా లభించిన ఈ మూడు ప్రకరణాలనుండి అచ్చటచ్చటి కొన్ని శ్లోకాలు ఉదాహరిస్తాను.

మూలపురుషుడైన కీర్తినృపాలుని వర్ణించే శ్లోకాలు-

తదక్షపద్మోత్ర సుధాపయోధౌ జాత స్సుధాధామవదుజ్జ్వలాంగః
శ్రీకీర్తినామా మనుపాలవర్య స్త్వస్వర్ణకోటీరా ద్యశ సైవ సూనమ్. (98)

రామక్ష్మీ (ంద్ర) స్సుగుణజలధిస్సోఽపి సత్పుత్రకా మో
లక్ష్మీనారాయణవరసరోజాతయుగ్మం హృదిస్థే,
ధ్యాయన్ తస్య స్ఫురితబదరీశాస్త్రమే తాపసేంద్రైః
స్థిత్వా సాకం మనుమపి జపన్ భాతి సాక్షాదివాజః॥ (99)

నిజాముల్కు సేవించిన సాకేతపాలకులైన సోదరత్రయం గూర్చి చెప్పిన శ్లోకాలు-

శూరా స్సాహసికా స్త్రయ స్సమధిక ప్రావీణ్యవంతో ధను
ర్విద్యాయాం గజవాజిరాజిరథ సంపత్తి ప్రసేనాశతాః,
సాకేతే నగరే వి(శో) దనకజాలాః పై ర్నిశాంచూవనం
కుర్వంతః పరిపాలయంతి విషయానర్థ్యాదితేయద్రుమాః. (144)

(త)దంతరే తన్నృపవీరదేశానాక్రమ్య దోర్దండజితారివర్గాః,
మ్లేచ్ఛాన్నిజాముల్కుముఖాప్రసైన్యయుగాలబంధుర్న్నగరంచ తేషామ్. (145)

ఈ వంశంవారికి ఢిల్లీశ్వరుడిచ్చిన దేశముఖీని గురించి చెప్పినశ్లోకం-

నృపా స్త్రయస్తే బహుభాగ్యవంతః అనేకమాతంగరథాశ్వవంతః,
తత్రైవ ఢిల్లీనగరాధిశాభాత్ మహాజనీ దేశముఖత్వ మాపుః. (211)

మచిలీబందరు పాలకుడైన గోపాలరాయుని వర్ణించే శ్లోకం-

శ్రీ గోపాల మహీ(ప)తిః కులకరోదాంత స్తపస్వీ పరం
ధర్మాత్మాఽమితవిక్రమో ద్విజకులాలంకారరూపోఽపి సః,
శ్రీమన్ మత్స్యపురే వరే చ నివసన్ తద్రాజ్యకార్యాన్యపై
తత్రస్థాన్ విషయా న్వశాద్రఘు(పతి)రమ్యాని వా పాలయత్. (216)

ఈ గోపాలరాయుని కొడుకూ, కృతిభర్తయైన లక్ష్మీనారాయణుని వర్ణనం ఈ విధంగా ఉన్నది.

రాజా౽సౌ కులశేఖరం కిల తత శ్రీరాజమాంబా సతి
గర్భప్రోజ్జ్వలశుక్తిమౌక్తికమణిం రాజేశ్వరాఖ్యం సుతమ్,
(లేభే పే)ములవాడ పూర్ణివసన శ్రీరాజరాజేశ్వరో
మానాథస్య వరాన్మహేంద్రపదిమాం యో భూమి మధ్యావతి. (234)

సో౽యం రాజేశ్వరనృపవరో రాజమాంబా సుసాధ్వీ
లక్ష్మీనారాయణ నరపయోశ్శౌరవే మాతృపిత్రోః,
క్రీడాలాపై స్సకలనినదైర్గోపికానందయో స్సం
తోషం కుర్వ న్నివ మురరిపు స్సన్ దదాతు ప్రకామమ్. (235)

తయా మహిష్యాంబికయా౽జ్ఞసుఖ్యా సామ్రాజ్యదీక్షాకలిత స్స రాజా
భాగాపురే పాలితవాన్ స్వరాజ్య మాసాగరా త్ప్రపస న్నయేన. (243)

ఇక అలంకారప్రకరణమునుండి కొన్నిశ్లోకాలు ఉదాహరిస్తాను.

ఉపమాలంకారమునకు_

శ్రీరాజేశ్వర భూపతికంఠీరవమంగజోపమాత్మానమ్,
సంరక్షితభూపాలం రక్షతు లక్ష్మీపతిః పరఘ్నం తమ్. (1)

సాదృశ్యలక్ష్మీ రుభయో ర్వ్యధాయి యతోపమా సా గదితా కవీంద్రైః,
రాజేశ్వరేంద్రక్షితిపాలకీర్తి ర్జ్యోత్స్నేవ గౌరీ దివ మారురోహ (2)

ద్వయోర్యత్ర వర్ణ్యయత స్సామ్యమాస్తే, మతా సోపమేయోపమేతి ప్రసిద్ధా
ప్రియా రాజరాజక్ష్మాపాలమౌళేర్ధరిత్ర్యంభతే చంద్రవ త్తద్వదిందుః. (3)

రూపకాలంకారమునకు_

త్రేధా రూపక మిర్యతే తదభిధా తద్రూపతా౽రంజనం
స్యా ద్వర్ణ్యస్య నియంత్రితం విషయిణా యత్రాధికల్యోక్తితః,
న్యూనత్వానుభయోక్తితః సమధికో రాజేశ్వరేంద్రప్రభుః
సాక్షా(త్) జిష్ణు రలంకృతా నమభవ ద్గౌ ర్యేన సాకల్యతః (10)

రాజేశ్వరేంద్రవసుధావరచక్రవర్తీ దేవాధిపః (సద) శచీప్రియతాంవినాపి,
ఆనందయన్న నుదినం విబుధాన్ ప్రకామం జిష్ణుః
సమాద్భుతబలాతిశయ శ్చకాస్తి. (11)

అపహ్నుతికి_

శుద్ధాపహ్నుతి రన్యారోపార్థో ధర్మనిహ్నవో యత్ర,
నామీ నురాజనృపతే స్సుగుణాః కిం తర్హి రత్నజాలాని. (12)

"నయుక్తికోయత్ర కాదర్శనిహ్నవోబుధా స్తమాహుఃకిల హేత్వపహ్నవమ్
అయం న చేందుః కమలాను మోదకో హరి
ర్న సౌమ్య స్సహి చక్రపాలకః." (20)

ఫలోత్ప్రేక్షకు-

కమలభవకులానా మంశుమాలీ ఫలానం
న్వయ ముదయ ముదారం యాతి నూనం విధాతుమ్,
అహ మయమితి మన్యే లోకబంధోః స్వభావః
ప్రమితికరణ మస్మిన్ (వచ్మి)రాజేశ్వరేంద్రమ్. (30)

సంబంధాతిశయోక్తి-

శ్రీనిలోత్సవ రాజరాజనృపతి ర్దానోత్సవే ష్వర్థినాం
మేరుం వా విరతిష్యతీతి కణవత్ క్ర్రేతేన చిత్యేన వా,
ఆలోక్య సహస్రపాదమపి చ జ్ఞాత్వా జగద్భూషణం
ప్రారబ్ధవ్యవిధేః సురాః స్వవనతి ప్రాజ్ఞే రవిం మేనిరే. (35)

శబ్దార్థవృత్తి దీపమునకు—

శ్రీరాజరాజస్య కథాః ప్రతీతాః సతాం ప్రణామం జనయంతి హర్షమ్,
ప్రతీవ భూపాలక దుర్విధానాం మనోరథానాం (జన).(48)

ఈ ప్రకరణం ఇంతటితో తెగిపోయినది.

నాయకప్రకరణం ఈవిధంగా ప్రారంభమైనది.

శ్రీలక్ష్మీనారాయణాజ్ఞా విధాయకః,
రాజరాజేశ్వర మహినాయకః ప్రతీవనది.

అపారిజాతో౽పి సపారిజాతోవనీపకాపేక్షితపూరణేన,
అమందరాగో౽పి సమందరాగః ప్రతీ (క్ష) వర్ణే (షు) న ధైర్యవృత్త్యా.

అటుతరువాత ధీరోదాత్తనాయక లక్షణ లక్ష్యములు చెప్పే శ్లోకాలున్నవి. అవి బాగా శిథిలమైనవి. ఈ ప్రకరణంలో తొమ్మిది శ్లోకాలు ఒక దీర్ఘగద్యం మాత్రం మిగిలినవి. ఈ గ్రంథం సమగ్రవరిమరెక్కడైనా దొరికితే తెలుగు అమ్మింరాజుల చరిత్రకూ వారి సంస్కృతసాహిత్యపోషణకూ క్రొంగ్రొత్త సమాచారం లభిస్తుంది. వేములవాడ రాజరాజేశ్వరస్వామివారికి అరకొరలేని నివేదనంకూడ కాగలదు. అందులోని కుండలీకరణముల్లోని శిథిలపూరణాలు నావి.

(వేములవాడ రాజరాజేశ్వరస్వామి సంస్కృతకళాశాల వార్షిక సంచిక
1981-1982)

రచయిత :- బిరుదురాజు రామరాజు

జననం :- శా. శ. ౧౮౪౭ క్రోధన, చైత్ర బహుళ సప్తమి, గురువారం, ఉత్తరాషాఢ (16-4-1925, 4-40 A. M.) దేవనూరు, వరంగల్ తాలూకా, పెరిగినది మడికొండ.

తల్లిదండ్రులు :- బిరుదురాజు లక్ష్మిదేవి, నారాయణరాజు

పెండినవారు :- బిరుదురాజు లలితమ్మ, రామవరాజు

విద్య :- దేవనూరులో వీధిబడి, మడికొండలో ప్రైమరీ హనుమకొండలో ఇంటరు వీడియేటువరకు. హైదరాబాదులో బి.ఏ. నిజాం కళాశాల (1949); ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. తెలుగు (1951) పిహెచ్.డి (1956) ఎం.ఏ. సంస్కృతం (1960) P. G. Diploma In Linguistics (1968)

ఉద్యోగము :- 1951 నుండి లెక్చరర్, 1957 నుండి రీడర్, 1968 నుండి ప్రొఫెసర్, తెలుగు శాఖాధ్యక్షత 1978-1984; 1967-1974 వరంగల్ స్నాతకోత్తర కేంద్రంలో, తక్కిన కాలం విశ్వవిద్యాలయ కళాశాలలో.

రచనలు :- తెలుగువీరులు 1952, వీర గాథలు 1954, తెలుగు జానపద గేయ సాహిత్యము 1958, మరుగుపడిన మాణిక్యాలు 1981, ఉర్దూ తెలుగు నిఘంటువు 1962, Folktales of A. P. 1974, Folklore of A.P. 1978, శ్రీ సత్య సాయి విజ్ఞాపనములు 1981, South Indian Folksongs 1984, నూరు పరిశోధనాత్మక వ్యాసములు.

సంపాదనము :- తెలంగాణా పల్లెపాటలు 1960, త్రివేణి 1960, కుతుబ్షాహి సుల్తానులు- ఆంధ్ర సంస్కృతి 1962, కథాసప్తతి 1978.

అముద్రిత గ్రంథపరిష్కరణము :- (తెలుగు) ప్రసన్నరాఘవనాట్య ప్రబంధము 1952, రామాభ్యుదయము 1955, శివరాత్రి మాహాత్మ్యము 1968, సకలజీవ సంజీవనము 1954, (సంస్కృతము) వసుచరిత్రమ్ 1966, రాజశేఖర చరిత్రమ్ 1969, శృంగార శేఖరభాణమ్ 1969, రామాయణ సార సంగ్రహః 1972.

అనువాదములు :- గురుగోవిందసింగు చరిత్ర 1966, ప్రేమ్‌చంద్ 1971, [illegible] 1984.

[illegible] :- Contribution of Andhra to Sanskrit Literature, [illegible] తెలంగాణా పల్లెపాటలు, [illegible] ప్రాచీన
[illegible]